36198

32/3

పోతన

భాగవతము

తృతీయ స్కంధము I

Q22;223
35N92.3
36198

పోతన భాగవతము

సరళ గద్యానువాదసహితము

తృతీయస్కంధము — I

అనువాదకుడు:
ఆశావాది ప్రకాశరావు, ఎం.ఏ.

ప్రధానసంపాదకుడు:
డాక్టర్ జంధ్యాల పాపయ్య శాస్త్రి
"కరుణశ్రీ"

ప్రచురణ
శ్రీ ఎం.వి.ఎస్. ప్రసాద్, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

1992

PLACED ON THE SHELF
Date

POTANA BHAGAVATAMU, Tritiya Skandhamu
with Sarala Gadyanuvada (Part I)

Author: Potana Mahakavi

Author of the Anuvada: Sri Asavadi Prakasa Rao, M.A.

Editor: Dr. Jandhyala Papaiah Sastri "Karuna Sri"

T.T.D. Religious Publications Series No.214

Editions: 1986, 1992

Copies: 10,000

Q22:223
35N92.3

Published by

Sri M.V.S. Prasad, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

SRI VENKATESWARA
CENTRAL LIB
RESEARCH CENTRE
Acc. No 36198
Date

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

సంపాదకమండలి :

డాక్టర్ కరుణశ్రీ (ప్రధాన సంపాదకుడు)
డాక్టర్ విద్వాన్ విశ్వం
డాక్టర్ ఎస్. బి. రఘునాథాచార్య
డాక్టర్ రావుల సూర్యనారాయణమూర్తి
శ్రీ కె. సుబ్బారావు

ముందుమాట

విష్ణుస్వరూపుడు శ్రీ వేదవ్యాసమహర్షి. ఈయన రాశీభూతమైవున్న వేదవాఙ్మయాన్ని నాల్గు భాగాలుగా విభజించి లోకానికి మహోపకారం చేసిన మహామనీషి. పురాణాలు మిత్ర సమ్మితాలు. అంటే మిత్రు డెలా దగ్గరచేరి మంచిమాటలు మంచిగా చెప్పి మంచిమార్గానికి మరలిస్తాడో అలా పురాణాలుకూడా 'రామాదుల వలె ప్రవర్తించు; రావణాదులవలె మెలగ వద్దు' అని సత్య ధర్మాలను సుఖంగా సుగమంగా కథలద్వారా బోధిస్తాయి. అలాంటి పద్దెనిమిది పురాణాలనూ, అన్నే ఉపపురాణాలనూ కూడ రచించి సంస్కృత భాషకు పుష్టినీ, రసజ్ఞులకు తుష్టినీ కలిగించిన అనన్య ప్రతిభావిభాసి వ్యాసులవారు.

వ్యాసకృతపురాణాలలో శ్రీమద్భాగవతం మిక్కలి ప్రశస్తి వహించిన మహోత్తమగ్రంథం. ఈ గ్రంథరచనవల్లనే ఆ మహర్షికి మనశ్శాంతి చేకూరిందట! భక్తి రసప్రధానమై భగవంతుని అనంత కళ్యాణ గుణ గణాలను కీర్తించడంవల్ల ఈ పురాణానికి ఎంతో ప్రచారం లభించింది.

సహజ పాండిత్యసంశోభితుడూ, పరమభాగవత శిఖామణీ అయిన బమ్మెర పోతనామాత్యుడు సంస్కృత భాగవతాన్ని తెనిగించడం ఆంధ్రుల అదృష్ట విశేషం. తెలుగుదేశంలో పోతనగారి భాగవతానికి వున్న ప్రచారం అంతకు పూర్వమే ఆంధ్ర భాషలో విరచితాలైన భారత రామాయణాదులకు కూడా లేదంటే అతిశయోక్తి కాదు.

రుక్మిణీ కల్యాణం, గజేంద్ర మోక్షం, ప్రహ్లాదచరిత్ర ఇత్యాది భాగవత కథా ఘట్టాలలోని పద్యాలు ఆబాల గోపాలానికి నోటికివచ్చి ఉండడమే అందుకు నిదర్శనం.

కష్టాలలో సతమతమైపోయే మానవుడు "లావొక్కింతయు లేదు" అనే పద్యాన్ని అప్రయత్నంగానే చదువుతాడు. వివాహాపేక్షగల యువతులు రుక్మిణీకల్యాణం పఠించి ఫలసిద్ధి గాంచడం అనుభవదూరమైన విషయం కాదు.

ప్రతి నిత్యం వేకువను గజేంద్రమోక్షం చదువు కుంటూ కష్టాలనుంచి కడతేరి మనశ్శాంతిని పొందినవారు కో కొల్లలు.

పోతనగారు విష్ణుని కథలూ, విష్ణుభక్తుల కథలూ వీనుల విందుగా వర్ణించి తనకే కాకుండా పఠితలకూ, శ్రోతలకూ ధన్యత చేకూర్చారు. ఈయన కవిత్వం మందార మకరంద మాధుర్యాన్ని పుణికి పుచ్చుకుని, శబ్దాలంకారాలకు నిలయమై శ్రుతిసుభగమై అటు పాడుకోడానికి, ఇటు చదుపుకోడానికి, అనువుగా ఉంటుంది. ఆయన ఏ కాలం వాడైనా, ఏనాటి వాడైనా ఆయన రచన నిత్యనవీనం; అజరామరం.

ఇలా భాషలో ప్రముఖ స్థానాన్ని అలంకరించిన ఆంధ్ర మహాభాగవతం అందరికీ అందుబాటులోకి తేవడం అవశ్యకర్తవ్యం. అందుకని తిరుమల తిరుపతి దేవస్థానంవారు భాగవతంలోని ప్రతి పద్యానికీ, గద్యానికీ ప్రముఖ విద్వాంసులచేత సులభశైలిలో తాత్పర్యాలు వ్రాయించి మూలగ్రంథంతో ముద్రించి పాఠకులకు అందజేసే పథకం ప్రవేశ పెట్టారు. ఇప్పటికే ప్రథమ ద్వితీయస్కంధాలు ప్రకటించబడి విశేషంగా ప్రజాదరణ పొందాయి. ఇది తృతీయ స్కంధంలో మొదటి సంపుటం. ఇందులో విదురుని తీర్థయాత్ర, అతడు ఉద్ధవుని చూచి కృష్ణార్జునుల వృత్తాంత మడగటం, శ్రీయజ్ఞవరాహావతార వర్ణనం, మైత్రేయ మహాముని విదురునకు హిరణ్యాక్ష హిరణ్యకశిపుల వృత్తాంతం చెప్పడం అనే కథాంశా లున్నాయి. డాక్టరు జంధ్యాల పాపయ్య శాస్త్రి (కరుణశ్రీ) గారి సంపాదకత్వాన శ్రీ ఆశావాది ప్రకాశరావుగారి సరళ వ్యాఖ్యతో ప్రచురితమవుతున్న ఈ తృతీయస్కంధ ప్రథమ భాగం బహుళ ప్రజాదరణకు పాత్రం అయినదని మా విశ్వాసం. ఈ తృతీయ స్కంధ ప్రథమ భాగము శ్రీ ఎస్. లక్ష్మీనారాయణగారి కాలంలో ప్రథమ ముద్రణనంది ఇప్పుడు ద్వితీయ ముద్రణగా వెలువడుతుంది.

ఎమ్.వి.యస్. ప్రసాద్,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

తిరుపతి,
22-8-1992.

ప్రవేశిక

"ఎండిన మ్రోడులే కిసలయించెనొ ! ఏకశిలాపురమ్ములో
బండలు పుల్కరించెనొ ! అపారముదమ్మున తెల్గు తల్లికిన్
గుండెలు పొంగిపోయి కనుగొల్కులు నిండెనొ ; వచ్చిపైరులే
పండెనొ ! జాలువారిన భవత్కవితామృత వర్షధారలన్!!"

అవును. పోతన్నగారి లేఖిని నుంచి అమృతవర్షం కురిసింది. ఆయన కవితాసుధారసధారలు అనంతశక్తిసంపన్నమైనవి. ఆయన రచనా రామణీయకాలు అంతటి మహిమాన్వితమైనవి. వాల్మీకి వ్యాస కృతాలైన రామాయణ, భారత, భాగవతాలు భారతీయ సంస్కృతికి మూలకందాలు. ఈ త్రయీసంపద ఆంధ్రభాషలో సంతరించుకొన్నంత సర్వతోముఖసమృద్ధి మరే భాషలోనూ అందుకోలేదనటంలో అతిశయోక్తి లేదు.

మీ సాహిత్యంలో గొప్పగ్రంథాలు ఏమిటని ఒక తమిళ సోదరుణ్ణి ప్రశ్నిస్తే "కంబ రామాయణం" అని చటుక్కున సమాధానం చెబుతాడు. అదే ప్రశ్న ఒక కన్నడ సోదరుడికి వేస్తే వెంటనే "పంప భారతం" అంటాడు. అలాగే ఒక హిందీ సోదరుణ్ణి అడిగితే "తులసీ రామాయణం" అని జవాబు వస్తుంది. ఇక ఒక తెలుగువాణ్ణి "మీ భాషలో గొప్ప గ్రంథాలు ఏవి ?" అని అడిగితే వాడు ఏ మాత్రం తడుముకోకుండా "కవి త్రయంవారి భారతం, బమ్మెర పోతన్నగారి భాగవతం, బుద్ధారెడ్డి రంగ నాథరామాయణం" అని చకచకా చెప్పేస్తాడు.

భారతం ఒక మహేతిహాసం. భాగవతం ఒక మహాపురాణం. రామాయణం ఒక మహాకావ్యం. ఇంతటి సంస్కృతి సంపన్నమైన సాహితీ సమృద్ధి, సారస్వత సంపద తెలుగు భాషలోతప్ప మరే ప్రాంతీయ భాషలోనూ కనిపించదు. ఆంధ్రభాషలో అనూదితాలైన భారత, భాగ వత, రామాయణాలలో విశేషప్రచారం సంపాదించుకున్నది బమ్మెరవారి భాగవతం అనటంలో సందేహం లేదు.

తమిళం, మళయాళం, కన్నడం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, ఒరియా, అస్సామీ, పంజాబీ మొదలైన ప్రాంతీయ భాషలలో ఆ యా కవులచేత భాగవతం అనువదింపబడినప్పటికి ఆ అనువాదాలు సమగ్రంగా

కాక విశదేశంగానో, సంగ్రహంగానో కనిపిస్తాయి. కొన్ని స్కంధాలు మాత్రమే కొందరు, కొన్ని ఘట్టాలు మాత్రమే కొందరు అనువాదం చేశారు. హిందీలో సూరదాసు రచించిన "సూరసాగర్" అనే మహా గ్రంథం భాగవతంలోని దశమస్కంధానికే అత్యంత ప్రాధాన్యమిచ్చి తక్కిన స్కంధాలలోని కథ చాలా సంక్షిప్తంగా వర్ణించింది. అందువల్ల అది వ్యాసుని భాగవతానికి సరియైన అనువాదం అని చెప్పటానికి అవకాశం లేదు.

సర్వాంగసుందరంగా రసభావబంధురంగా భక్తి శృంగార సంగమంగా సహృదయహృదయంగమంగా సంస్కృత భాగవతాన్ని అనువదించిన అదృష్టం పోతన్నగారికే దక్కింది. అటువంటి అవకాశం తెలుగు భాషకే చిక్కింది.

పోతన భాగవతం ఆంధ్రజాతికి ఆబాలగోపాలానికి ఆరాధ్య గ్రంథమైనది. ఒక్క తెలుగుదేశంలోనే కాదు ఛత్రపతి శివాజీకి గురుదేవుడైన సమర్థ రామదాసస్వామి పోతన భాగవతం చదివి పోతన భక్తిప్రపత్తులను "దాసబోధ" అనే గ్రంథంలో బహుధా ప్రశంసించాడు. ఆధునిక తమిళ సాహిత్య యుగప్రవక్త సుబ్రహ్మణ్యభారతి "సిల కవియరశర్" అనే వ్యాసంలో బమ్మెరవారిని అనేక విధాలుగా కొనియాడాడు. నారద మహర్షి అవతారంగానూ, నాదబ్రహ్మోపాసకుడుగానూ, వాగ్గేయకారక శిరోమణిగానూ ప్రసిద్ధిగాంచిన త్యాగరాజస్వామి బమ్మెరవారి భాగవతాన్ని ప్రతిదినమూ భక్తిపూర్వకంగా పారాయణం చేసేవాడని చెబుతారు. అది యిప్పటికీ తిరువయ్యారులో త్యాగయ్య గృహంలో దేవతార్చన పేటికయందు పదిలపరచబడి ఉన్నదని ఆర్యుల అభిభాషణ. సంగీత సాహిత్య సరస్వతియై అష్టభాషా పండితుడై హరికథాపితామహుడైన ఆదిభట్ల నారాయణదాసుగారు తన బాల్యంలోనే పోతన భాగవతంలోని పద్యాలన్నీ అప్పగించేవారని అందుకని ఆయన అయిదవయేట ఆంధ్ర మహాభాగవతంతోనే ఆయనకు అక్షరాభ్యాసం చేశారనీ పెద్ద లంటారు.

పోతన్నగారికంటె తరువాతివారైన వల్లభాచార్యులు, చైతన్య ప్రభువు పోతన భాగవతంవల్ల ప్రభావితులైనారన్న ఆచార్య నిడుదవోలు వేంకటరావుగారి అభిప్రాయం గమనింపదగింది. వల్లభాచార్యులు

తెలుగువాడే అయినందువల్ల చైతన్య ప్రభువు తెలుగుదేశంలో సంచరించా డనటానికి తగిన ఆధారాలు ఉన్నందువల్ల నిడుదవోలువారి అభిప్రాయం సమంజసంగానే తోస్తున్నది.

భాగవతం పన్నెండు స్కంధాల గ్రంథం. దశమస్కంధంలో శ్రీకృష్ణుని చరిత్రం సర్వాంగసుందరంగా అభివర్ణింపబడింది. చిత్రమే మంటే ప్రథమ స్కంధంలో శ్రీకృష్ణ నిర్యాణం చెప్పబడింది. ఇది పైకి చూడటానికి కొంచెం విరుద్ధంగానే కనబడుతుంది. అందుకు కారణం లేక పోలేదు.

భాగవత మహాగ్రంథానికి వక్త శుక మహర్షి. శ్రోత పరీక్షిన్మహా రాజు. పరీక్షిత్తును రంగంమీదకు రప్పించటానికి శ్రీకృష్ణ నిర్యాణగాథ ఆవశ్యక మయింది.

అర్జునుడు ద్వారక నుంచి వచ్చి ధర్మరాజుకు కృష్ణనిర్యాణ వార్త వినిపిస్తాడు. ధర్మరాజు ఆ వార్త విని విషాదంతో విరక్తుడై అభిమన్యు నందనుడైన పరీక్షిత్తును పట్టాభిషిక్తుణ్ణి చేసి తమ్ములతో ద్రౌపదితో మహా ప్రస్థానానికి వెళ్ళుతాడు. మహారాజైన పరీక్షిత్తు వేటకోసం వెళ్ళి దాహా ర్తుడై శమీక మహర్షి మెడలో చచ్చిన పామును వేసి తిరిగి రాజధానికి చేరుకుంటాడు. మహర్షి కుమారుడైన శృంగి మహారాజును ఘోరంగా శపిస్తాడు. ఏడు దినాలలో తనకు మృత్యువు తప్పదని తెలుసుకున్న పరీక్షిత్తు పవిత్ర గంగాతీరంలో ప్రాయోపవిష్టు డవుతాడు. భగవాను డైన శుకమహర్షి పరీక్షిత్తు దగ్గరకు వస్తాడు. మహారాజు మహర్షికి సాష్టాంగనమస్కారం చేసి ఏడు దినాలలో మోక్షం సాక్షాత్కరించే ఉపాయం చెప్పమని ప్రార్థిస్తాడు. ఈ విధంగా ప్రథమ స్కంధం ముగుస్తుంది.

ఇక ద్వితీయ స్కంధం. శ్రీశుకుడు రెండు గడియలలో కైవల్యాన్ని సంపాదించిన ఖట్వాంగుని వృత్తాంతం చెప్పి '"నీకు ఏడుదినాలు గడువు వుందికదా! తప్పకుండా మోక్షపదాన్ని అందుకుంటావు" అనిపరీక్షిత్తుకు ధైర్యం చెబుతాడు. భక్తిమార్గమే ప్రధానమని పలికి భాగవతతత్త్వాన్ని ఉపదేశిస్తాడు.' శ్రీమన్నారాయణుని లీలావతారాల అభివర్ణనం ఈ

స్కంధంలో ప్రధానమైన విషయం. భాగవత స్వరూపం శ్రీమన్నారాయణునివల్ల బ్రహ్మదేవునికి, బ్రహ్మవల్ల నారదునికి, నారదునివల్ల వ్యాస మహర్షికి, వ్యాసమహర్షివల్ల శ్రీశుకునికి సంప్రాప్తమయింది. ఆ భాగవత తత్త్వాన్ని శ్రీశుకులు పరీక్షిన్మహారాజుకు వివరిస్తాడు.

ఇప్పుడు తృతీయ స్కంధంలోకి వచ్చాము. ఇందులో విదుర మైత్రేయ సంవాదం, హిరణ్యాక్ష హిరణ్యకశిపుల వృత్తాంతం, జగత్కంటకుడైన హిరణ్యాక్షుని శ్రీమహావిష్ణువు యజ్ఞవరాహావతారం ధరించి సంహరించటం, దేవహూతి కర్దముల దాంపత్యం, కపిల దేవహూతి సంవాదం మొదలైనవి ప్రధాన ఘట్టాలు.

తెలుగు భాగవతానికి ఇంతటి దీప్తి, వ్యాప్తి రావటానికి సహజ పాండిత్యుని సహజసుకుమారమైన శయ్యా సౌభాగ్యం, భావావేశం, భక్తి పారవశ్యం ప్రధాన హేతువులు. అర్థగాంభీర్యమూ, శబ్దసౌందర్యమూ బాలరసాల సాల నవపల్లవ కోమలమైన పోతన్నగారి కావ్యకన్యకకు పెట్టని సొమ్ములు. వాగర్థాలు పార్వతీ పరమేశ్వరులవలె బమ్మెరవారి కవిత్వంలో కలిసి మెలిసి ఉంటాయి.

అర్థ గాంభీర్యము :

కౌరవసభలో ధృతరాష్ట్ర మహారాజు హితబోధ చేస్తున్న విదురుని పలుకులు గమనించండి.

> అట్టి జగన్నివాసుఁడు మురాసురభేది పరాపరుండు చే
> పట్టి సఖుండు వియ్యమును బాంధవుఁడున్ గురుఁడున్ విభుండునై
> యిట్టలమైన ప్రేమమున నెప్పుడుఁ దోడ్పడుచుండు వారలన్
> జుట్టన వ్రేల నెవ్వరికిఁ జూపఁగవచ్చును బార్థివోత్తమా ! (3-31)

ఈ సందర్భంలోనిదే మరొక పద్యం—

> ధరణీనాయక ! పాండు భూవిభుఁడు నీ తమ్ముండు దత్పుత్త్రులన్
> బరిరక్షించిన ధర్మముం దగవునుం బాటిల్లు, వంశంబు సు
> స్థిర సౌఖ్యోన్నతిఁజెందు, శత్రుజయమున్ జేకూరు, గోపాల శే
> ఖరు చిత్తంబును వచ్చునట్లగుట యో కౌరవ్య వంశాగ్రణీ ! (3-24)

వైకుంఠంలోని వాసుదేవుని వర్ణనం ఈ పద్యంలో చిత్తగించండి.

వరవైకుంఠము సారనాకరము; దివ్యస్వర్ణ శాలాంక గో
పుర హర్మ్యావృత మైన తద్భవన మంభోజంబు; తన్మందిరాం
తరవిభ్రాజిత భోగి కర్ణిక; తదుద్యద్భోగ పర్యంకమం
దిరవొందరన్ వసియించు మాధవుఁడు దా నేపారు భృంగాకృతిన్.
(3-509)

లోకకంటకుడైన హిరణ్యాక్షుని సంహరించటంకోసం అవతరించి అవార్యశౌర్యంతో మారులేని విహారం చేస్తున్న ఆదివరాహమూర్తిని పోతన్న గారు ఈ క్రింది సీసపద్యంలో సహజసుందరంగా అభివర్ణించారు.

తుద మొదళ్లకుఁ జిక్క తునిసి పాఱఁగ మోరఁ
గులశైలములఁ జిమ్ముఁ గొంత తడవు
బ్రహ్మాండఖాండంబు వగిలి చిల్లులు వోవఁ
గొమ్ములఁ దాటించుఁ గొంత తడవు
జలధు లేడును బంకసంకులంబై యింక
ఖురముల మట్టాడుఁ గొంత తడవు
నుడురాజు సూర్యుండు నొక్కమూలకుఁ బోవఁ
గుఱుచవాలముఁ ద్రిప్పుఁ గొంత తడవు

గునియుఁ గుప్పించు లంఘించు గొప్పరించు
నెగయు ధరఁ ద్రవ్వుఁ బొఱియఁగా నేపు మిగిలి.
దానవేంద్రుని గుండెలు దల్లడిల్లఁ
బంది మెల్లన రణ పరిస్పంది యగుచు. [3.632]

శబ్ద సౌందర్యము :

అర్థ గాంభీర్యముతో కూడిన శబ్ద సౌందర్యము సుమనో మనోజ్ఞంగా ఉంటుంది. పోతన్న గారికి అంత్యానుప్రాసలతో పద్యాన్ని హృద్యంగా నడపటం వెన్నతో పెట్టిన విద్య. శ్రీహరి పాదాలను ఈ క్రింది చంపకమాలతో అలంకరించాడు. వైకుంఠంలో సనక సనంద నాదులు గోవిందుని సందర్శించిన సందర్భ మిది.

సునిశిత భక్తిఁ దన్ముఖముఁ జూచిన చూడ్కులు ద్రిప్పలేకయుం
గనుఁగొని రెట్టకేలకు నకల్మష భక్త విధూత ఖేదముల్,
మునిజన చిత్త మోదములు, ముక్తినివాస కవాట ఖేదముల్,
వినుత వినూత్న నూపురిత వేదము, లమ్మహనీయు పాదముల్.
[3.537]

రణరంగంలో హిరణ్యాక్షుడు వరాహమూర్తికి లొంగిపోవటం ఈ క్రింది కందంలో అందంగా వర్ణింపబడింది.

దిట చెడి లోఁబడె దైత్యుఁడు
సటికిన్, దంష్ట్రా విభిన్న శత్రుమహోర
స్తటికిన్, ఖరఖుర పుటికిన్,
గటి తట హత కమల జాండ ఘటికిన్, గిటికిన్. [3.692]

మైత్రేయ మహర్షి తీర్థ యాత్రలు చేస్తూ శ్రీకృష్ణుని దర్శించిన సందర్భంలోనిది యీ పద్యం.

కనియెం దాపసపుంగవుం డఖిలలోకఖ్యాత వర్ధిష్ణు, శో
భనభాస్వత్పరి పూర్ణ యౌవన కళాభ్రాజిష్ణు, యోగీంద్రహృ
ద్వనజాతైకచరిష్ణుఁ, గౌస్తుభముఖోద్యద్భూషణాలంకరి
ష్ణు, నిలింపాహితజిష్ణు, విష్ణుఁ, బ్రభవిష్ణుం, గృష్ణు, రోచిష్ణునిన్.
[3.148]

సీసాలలో అంత్యప్రాస విలాస విన్యాసాలు పోతన్న గారికి ఎంతో ఇష్టం.

దళ దరవింద సుందర పత్ర రుచిరాక్షు
    సలలిత శ్రీవత్స కలిత వక్షు
నీలనీరద నీలనీలోత్పల శ్యాము
    నలికులాకుల మాలికాభిరాముఁ
గౌస్తుభకలిత ముక్తాహారయుత కంఠు
    యోగిమానస పంకజోపకంఠు
సతత ప్రసన్న సస్మితవదనాంభోజు
    దినకర కోటి సందీప్త తేజు

మరొక విధమైన అనుప్రాసవిన్యాసం కల ఈ సీసాన్ని చిత్త గించండి.

కంజాత కింజల్క పుంజరంజిత పీత
కౌశేయవాసు జగన్నివాసు
శత్రు భీకర చక్ర శంఖ గదా పద్మ
విహిత చతుర్బాహు విగతమోహు [3.915]

ఈ క్రింది ప్రాసముక్తాయింపులు కూర్చటంలో పోతన్న గారిది అందె వేసిన చేయి.

భక్త పరితోషణ భూషణ! పాపశోషణా! [3.115]
కలుష గహనగమునన్ యమునన్. [3.170]
పుండరీకాక్ష! సంతత భువన రక్ష! [3.309]
కృపాగుణ భూషణ: పాపశోషణా! [3.544]
సుధీజనతావన! విశ్వభావనా! [3.566]
జగత్పరిపాలన! నిత్యఖేలనా! [3.568]
రిపుమాన విమర్దను నా జనార్దనున్. [3.660]
వివేక విశాలుని పుణ్యశీలునిన్. [3.701]

ఈ విధంగా బమ్మెరవారి భాగవతం అర్థగాంభీర్యానికి, శబ్ద సౌందర్యానికి, భక్తిపరవశత్వానికి, మహత్త్వకవిత్వ పటుత్వానికి అలవాలమై అలరారు తున్నది.

ఇటువంటి పోతన భాగవతం అక్షరాస్యులందరికి అందుబాటులో ఉండే విధంగా సరళ గద్యానువాద సహితంగా ప్రకటించాలనే సంకల్పం తిరుమల తిరుపతి దేవస్థానాల వారికి కలగటం అభినందించ వలసిన విషయం. ఈ సదుద్దేశంతోనే పోతన భాగవతం ప్రాజెక్టు ప్రారంభింప బడింది. ఈ మహాకార్యంలో నాకు అవకాశం కల్పించిన కార్యనిర్వహణాధికారి శ్రీ ఎస్. లక్ష్మీనారాయణ, ఐ.ఏ.ఎస్., గారికి నా హృదయపూర్వక నమస్సుమనస్సులు సమర్పిస్తున్నాను.

ఈ సందర్భంలో నన్ను ఆహ్వానించి అనువాద భాగా లన్నింటినీ పరిశీలించి పరిష్కరించి ఏకసూత్రతను కల్పించేభారం నామీద ఉంచిన డాక్టర్ రావుల సూర్యనారాయణమూర్తి, పి. ఆర్. ఓ., గారికి నా అభి వందన మందారాలు అందిస్తున్నాను.

ప్రేమ పెన్నిధి అయిన శ్రీనివాసుని సన్నిధిలో ఎంతో సంతోషంతో నేను నా విధిని నిర్వర్తించటానికి సహకరిస్తున్న శ్రీ కె. సుబ్బారావు, ఎడిటర్ గారికి నా హార్దిక అభివాదాలు.

తమ కరకమలాలను అలంకరించి ఉన్న గ్రంథం పోతన భాగవతం తృతీయ స్కంధం. ఈ స్కంధాన్ని సరళగద్యంలో అనువాదం చేసిన వారు శ్రీ ఆశావాది ప్రకాశరావు, ఎం.ఏ., గారు. వీరు చిత్తూరుజిల్లా, నగరి డిగ్రీ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులు. అష్టావధానకళలో ఆరి తేరిన వారు. వినయ భూషణులు. మధురభాషణులు.

ఆశావాది వారి అనువాదం సరసంగా సరళంగా సాగింది. ఈ తృతీయ స్కంధాన్ని ఇంత ముచ్చటగా ముద్రించిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ విజయకుమార్‌రెడ్డి గారికి, వారి సిబ్బందికి నా సాధువాదాలు. అక్షరదోషాలు దొరలకుండా సహస్రాక్షులై ప్రూఫులు సరిదిద్దిన పూజ్య మిత్రులు శ్రీ ముదివర్తి కొండమాచార్యుల వారికి, శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి గారికి నా ధన్యవాదాలు. ముద్రణకు తగునట్లు ప్రెస్ కాపీ సిద్ధంచేసి ఇచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, ఎం.ఏ., ఎం.ఫిల్., కు నా శుభాశీస్సులు.

మిగిలిన భాగవత సంపుటాలు కూడా వీలైనంత తొందరలో పాఠకుల హస్తాలను అలంకరించగలవని మనవి చేస్తున్నాను.

భవదీయుడు
కరుణశ్రీ
ప్రధాన సంపాదకుడు
పోతన భాగవతం

తిరుపతి,
10-2-88.

అనుక్రమణిక

ముందుమాట	V
ప్రవేశిక	VII
విదురుండు తీర్థయాత్ర సేయుట	1
విదురుం డుద్ధవుం గని కృష్ణాదుల వృత్తాంతం బడుగుట	15
విదురమైత్రేయ సంవాదము	67
స్వాయంభువ మనువు ప్రజావృద్ధి సేయుట	176
శ్రీ యజ్ఞ వరాహావతార వర్ణనము	182
శ్రీ యజ్ఞ వరాహమూర్తిని బ్రహ్మాదులు స్తుతియించుట	188
మైత్రేయ మహాముని విదురునకు హిరణ్యాక్ష హిరణ్యకశిపుల వృత్తాంతం బెఱింగించుట	200

పోతన భాగవతము

తృతీయ స్కంధము

శ్రీమహిత వినుత దివిజ
స్తోమ! యశస్సోమ! రాజసోమ! సుమేరు
స్థేమ! వినిర్జిత భార్గవ
రామ! దశానన విరామ! రఘుకులరామా! 1

* రామా! రఘువంశలలామా! నీవు అత్యంత శోభావంతమై, దిగంతవిశ్రాంతమై, దేవతలు సంకీర్తించే కీర్తివైభవంకలవాడవు. నరేంద్రులలో చంద్రుడవు! మేరు ధీరుడవు! పరశురాముని భంగపరచిన వీరుడవు. పదితలల రావణుని తుదముట్టించిన శూరుడవు. అవధరించు!

వ. మహనీయగుణగరిష్ఠులగు నమ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండైన సూతుం డిట్లనియె. అట్లు ప్రాయోపవిష్టుండైన పరీక్షిన్నరేంద్రునకు శుక యోగీంద్రుం డిట్లనియె. 2

* సమస్త పురాణాలను చక్కగా వివరించటంలో మిక్కిలి నేర్పుగల సూతమహర్షి ఉత్తమ గుణసంపన్నులైన శౌనకాది మునిసత్తములతో ఇట్లా అన్నాడు —

ఆ విధంగా ప్రాయోపవేశ దీక్షలో ఉన్న పరీక్షిన్నరేంద్రుణ్ణి వీక్షించి శుకయోగీంద్రుడు ఈ విధంగా పలికాడు —

విదురుండు తీర్థయాత్ర సేయుట

ఉ. పాండునృపాల నందనులు బాహుబలంబున ధార్తరాష్ట్రులన్
భండనభూమిలో గెలిచి పాండుర శారద చంద్ర చంద్రికా

ఖండయశః ప్రసూన కలికావళిఁ గౌరవ రాజ్యలక్ష్మి నొం
డొండ యలంకరింపుచు జయోన్నతి రాజ్యముసేయుచుండఁగన్. 3

* పాండురాజకుమారులైన ధర్మరాజాదులు బాహువిక్రమంతో ధృతరాష్ట్రుని కొడుకులైన దుర్యోధనాదులను రణరంగంలో జయించారు. స్వచ్ఛమైన శరత్కాలపు పండు వెన్నెలలాంటి అఖండకీర్తిని ఆర్జించారు. అటువంటి యశస్సు అనే పూలమొగ్గలతో కౌరవరాజ్యలక్ష్మిని అలంకరించారు. ఈ విధంగా వారు విజయోల్లాసంతో రాజ్యపాలనం సాగించారు.

క. మనుజేంద్ర! విదురుఁ డంతకు
మును, వనమున కేఁగి యచట మునిజనగేయున్,
వినుత తపో ధౌరేయున్,
ఘను, ననుపమ గుణవిధేయుఁ గనె మైత్రేయున్. 4

* ఓ పరీక్షిన్మహారాజా! అంతకుముందే – అనగా మహాభారత యుద్ధం జరగటానికి ముందుగానే విదురుడు అడవులకు వెళ్ళాడు. అక్కడ మునులచే కీర్తింపబడేవాడూ, ప్రశస్తమైన తపస్సులో పేరెన్నికగన్నవాడూ, సాటిలేని మేటిగుణాలుగలిగి సంస్తవనీయుడూ అయిన మైత్రేయుణ్ణి సందర్శించాడు.

క. కనుఁగొని తత్పాదంబులు
దన ఫాలము సోఁక మ్రొక్కి తగ నిట్లనియెన్
మునివర! సకల జగత్పా
వనచరితుఁడు కృష్ణుఁ డఖిల వంద్యుం డెలమిన్. 5

* అలా దర్శించి ఆ మహాముని పాదాలపై తన నుదురు సోకేటట్లు నమస్కారం చేసి విదురుడు ఇట్లా అన్నాడు. మునీంద్రా! సమస్త లోకాల్ని పవిత్రమొనర్చగల చరిత్రగలవాడైన శ్రీకృష్ణుడు అందరికీ వందనీయుడు.

క. మండిత తేజోనిధి యై
పాండవ హితమతిని దూతభావంబున వే
దండపురి కేగి కురుకుల
మండనుఁ డగు ధార్తరాష్ట్రు మందిరమునకున్. 6

* దేదీప్యమానమైన తేజస్సు, తనకు పరివేషభూషణంగా వెలుగొందే ఆ గోవిందుడు పాండవుల మేలు కోరి, రాయబారిగా హస్తినాపురానికి వచ్చాడు. అలా విచ్చేసిన శ్రీకృష్ణుడు కౌరవకుల వతంసుడైన దుర్యోధనుని సౌధానికి వెళ్ళలేదు.

తే. చనఁగ నొల్లక మద్గృహంబునకు భక్త
వత్సలుం డగు కృష్ణుండు వచ్చు టేమి
కతము? నాకది యెఱిఁగింపు కరుణతోడ
ననుచు విదురుండు మైత్రేయు నడిగె ననిన. 7

* అట్లా వెళ్ళకుండా, ఆ భక్తవత్సలుడు ప్రత్యేకంగా నా యింటికి దయచేశాడు. ఇట్లా రావడానికి కారణం ఏమిటి? దయచేసి ఇందులో ఉన్న రహస్యం నాకు విప్పి చెప్పు అని విదురుడు మైత్రేయుణ్ణి అడిగాడు.

క. విని వెఱఁగంది పరీక్షి
న్మనుజవరేణ్యుండు విమలమతి నిస్తంద్రున్
మునికుల జలనిధి చంద్రున్
సునిశిత హరిభక్తిసాంద్రు శుకయోగీంద్రున్. 8

* ఇట్లా చెబుతున్న మహర్షిమాటలు విని పరీక్షిన్మహారాజు ఆశ్చర్యపడి పరిశుద్ధమైన మనస్సుగలవాడూ, స్థిరసంకల్పుడూ, మునిజనమనే సముద్రానికి చంద్రునివంటివాడూ, తిరుగులేని హరిభక్తిచే గుండె పండినవాడూ — అయిన శుకమహర్షివైపు చూచాడు.

క. కని యిట్లనె మైత్రేయుని
ననఘుండగు విదురుఁ డే రహస్యము లడిగెన్?
ముని యేమి చెప్పె? నే పగి
దిని దీర్థము లాడె? నెచటఁ దిరుగుచు నుండెన్? 9

* అట్లా చూస్తూ ఇట్లా అన్నాడు. పుణ్యుడైన విదురుడు మాన్యుడైన మైత్రేయుని ఏ యే రహస్యాలు అడిగాడు? అందుకు ఆ మహాముని ఏమేమి సమాధానాలు చెప్పాడు? విదురుడు ఏ యే తీర్థాలలో ఏ విధంగా స్నానం చేశాడు? ఎక్కడెక్కడ ఏ విధంగా సంచరించాడు?

తే. ఇన్ని దెలియంగ నానతి యిచ్చి నన్ను
నర్థి రక్షింపవే విమలాంతరంగ!
ఘన దయాపాంగ! హరిపాద కమలభృంగ!
మహిత గుణసంగ! పాపతమః పతంగ! 10

* మహర్షి! నీవు స్వచ్ఛమైన హృదయం గలవాడవు! కరుణతో నిండిన కడగంటి చూపులుగలవాడవు! విష్ణుపాదాలనే పద్మాలకు తుమ్మెద లాంటివాడవు! నీవు ఉత్తమ గుణ సంపన్నుడవు. పాపమనే చీకటిని పటాపంచలుచేసే సూర్యభగవానుడవు. దయచేసి ఇవన్నీ వివరించి ఆపన్నుడనైన నన్ను రక్షించు

చ. అనవుడు బాదరాయణి ధరాధిపుతో ననుఁ బూరువంశ వ
ర్ధన! విను కష్టుఁడైన ధృతరాష్ట్ర నృపాలుఁడు పెంపుతోసుయో
ధన ముఖ పుత్రులంగడు ముదంబునఁ బెంపుచుఁబాండురాజుఁద
ప్పినపిదపన్ దదాత్మజులు పెల్కుటి తన్నని చేర వచ్చినన్. 11

* అనగా శుకుడు పరీక్షిత్తుతో ఇట్లా అన్నాడు. పురువంశ వర్ధనా! విను. దుష్టుడైన ధృతరాష్ట్రుడు, తన కుమారులైన దుర్యోధనాదుల్ని ఎక్కువ గారాబంగా పెంచాడు. తండ్రి పాండురాజు పరమపదించగానే ఆయన కుమారులు పాండవులు భయంతో కంపించి అతని అండచేరినారు.

వ. ఇట్లు వచ్చిన పాండవుల యెడ నసూయా నిమగ్నులై సుయోధనాదులు. 12

క. పెట్టిరి విషాన్నః మంటం
గట్టిరి ఘనపాశములనుః గంగానదిలో
నెట్టిరిః రాజ్యము వెడలం
గొట్టిరిః ధర్మంబు విడిచి కుటిలాత్మకులై 13

* ఈ విధంగా వచ్చిన పాండవులను చూచి దుర్యోధనాదులు అసూయాగ్రస్తులైనారు.

ధర్మదూరులు, కుటిల బుద్ధులు అయిన కౌరవులు వారికి విషం కలిపిన అన్నం పెట్టారు. పెద్ద పెద్ద తాళ్లతో కట్టారు. గంగా నదిలో నెట్టారు. రాజ్యంనుండి కూడా వెళ్లగొట్టారు.

క. క్రూరాత్ము లగుచు లాక్షా
గారంబున వారు నిద్ర గైకొని యుండన్
దారుణ శిఖి దరికొలిపిరి
మారణ కర్మముల క్రమమత్తులు నగుచున్. 14

* లక్క ఇంట్లో మైమరచి పాండవులు నిద్రపోతూ ఉండగా క్రూరహృదయులైన కౌరవులు ఇంటికి నిప్పంటించారు. వారిని రూపు మాపటానికి ఏమరుపాటు లేకుండా ఎన్నో పన్నాగాలు పన్నారు.

తే. సూరిజనగేయ మగు రాజసూయ యజ్ఞ
విలస దవభృథస్నాన పవిత్రమైన
ద్రౌపదీ చారు వేణీభరంబు పట్టి
కొలువు లోపల నీడ్చిరి కుత్సితమున. 15

* పండితవరేణ్యుల ప్రశంస లందుకొన్న రాజసూయ మహా యజ్ఞంలో పూజనీయమైన అవభృథస్నానంతో పరమ పవిత్రమై ఒప్పారు

తున్న పాంచాలి కొప్పు పట్టుకొని నీచాతినీచంగా నిండుకొలువు లోపలికి ఈడ్చారు.

క. కావున వారల కపటకృతిఁ
గావింపని దొక దినంబు గలుగదు. తమ జ
న్మావధి నిజ నందనులను
వావిరి న య్యంధనృపతి వలదనఁ డయ్యెన్. 16

* ఇట్లు కౌరవులు పాండవులకు ఆజన్మాంతం అపకారం చెయ్యని దినమే లేదు. ఆ గ్రుడ్డిరాజు కొడుకులకు అడ్డు చెప్పలేకపోయాడు.

తే. మాయాజూదంబు వన్ని దుర్మార్గవృత్తిఁ
బుడమిఁ గొని యడవులకుఁబో నడువ నచటఁ
దిరిగి వారలు సమయంబు దీర్చి యేఁగు
దెంచి తమ యంశ మడిగినఁ బంచి యిడక. 17

* అనంతరం మాయ జూదంలో కౌరవులు అన్యాయంగా పాండవుల రాజ్యాన్ని లాక్కొన్నారు. వారిని అడవులకు వెడలగొట్టారు. పాండవులు ఒడంబడిక ప్రకారం గడువు ముగిశాక తిరిగివచ్చి తమకు రావలసిన రాజ్యభాగాన్ని అడిగితే కౌరవులు ఇయ్యలేదు.

వ. ఉన్న యెడ. 18

చ. సకలనియంత యైన హరి సర్వశరణ్యుఁడు మాధవుండు సే
వక నవ కల్పకంబు భగవంతుఁ డనంతుఁ డనంతశక్తి నం
దకధరుఁ డబ్జలోచనుఁడు ధర్మతనూభవుచే నియుక్తుఁడై
యకుటిల భక్తి యోగమహితాత్మకుఁడై ధృతరాష్ట్రుపాలికిన్. 19

* ఇలా ఉండగా నిఖిల సృష్టికి నియంత అయినవాడూ, అఖిల లోక శరణ్యుడూ, ఆశ్రితజన పారిజాతమూ, అంతం లేనివాడూ, ఎంతో శక్తి సంపన్నుడూ, నందకం అనే ఖడ్గాన్ని ధరించినవాడూ, కమల

దళాలవంటి కన్నులుగలవాడూ అయిన శ్రీకృష్ణుడు నిష్కళంకమైన భక్తి యోగానికి అంకితమైన మనస్సు కలవాడై ధర్మరాజు నియోగం ప్రకారం రాయబారం నడపటానికి ధృతరాష్ట్రుని దగ్గరకు వేళ్లాడు.

క. చని యచట భీష్మ గురు త
త్తనయ కృపాచార్య నిఖిల ధాత్రీపతులున్
విని యనుమోదింపఁగ ని
ట్లనియెన్ ధృతరాష్ట్రుతోడ నవనీనాథా! 20

* భూపాలా! అలా వెళ్ళిన గోపాలుడు అక్కడ భీష్ముడూ, ద్రోణుడూ, అశ్వత్థామా, కృపుడూ, సకల రాజన్యులూ అంతా విని సంతోషించేటట్లు ధృతరాష్ట్రునితో ఇట్లా అన్నాడు.

క. కౌరవ పాండవు లిరువురు
నారయ నీ కొక్క సమము యవనీవర! నీ
వే రీతి నైన బాండు కు
మారుల పాలొసఁగి తేని మను నుభయంబున్. 21

* మహారాజా! కౌరవులూ, పాండవులూ ఇద్దరూ నీకు ఒక్కటే. నీవు ఏ విధంగానైనా సరే పాండవులకు రావలసిన రాజ్యభాగం ఇచ్చినట్లైతే, ఉభయులూ క్షేమంగా ఉంటారు.

క. అని ధర్మబోధమునఁ బలి
కిన మాటలు చెవుల నిడమి గృష్ణుఁడు విదురున్
ఘన నీతిమంతుఁ బిలువం
బనిచినఁ జనుదెంచెఁ గురుసభాస్థలమునకున్. 22

* అంటూ కృష్ణుడు ధర్మప్రబోధం చేశాడు. ఆ మాటలు వారి చెవికెక్కలేదు. అప్పుడు శ్రీకృష్ణుడు విశేష నీతివిదుడైన విదురుణ్ణి పిలవనంపాడు. విదురుడు కౌరవుల కొలువుకూటానికి వచ్చాడు.

వ. చనుదెంచి యచటి జనంబులచేత నుపస్థితంబైన కార్యంబు దెలుపఁబడినవాఁడై ధృతరాష్ట్రు నుద్దేశించి యిట్లనియె. 23

* విదురుడు అక్కడి వారివల్ల జరుగుతూవున్న వ్యవహారమంతా తెలుసుకున్నాడు. ధృతరాష్ట్రునితో ఇట్లా అన్నాడు.

మ. ధరణీనాయక! పాండుభూవిభుఁడు నీ తమ్ముండు; తత్పుత్త్రులన్
బరిరక్షించిన ధర్మముం దగవునుం బాటిల్లు; వంశంబు సు
స్థిర సౌఖ్యోన్నతిఁ జెందు; శత్రుజయమున్ జేకూరు; గోపాల శే
ఖరు చిత్తంబును వచ్చు నట్లగుట యౌఁ గౌరవ్యవంశాగ్రణీ! 24

* మహారాజా! పాండురాజు నీ తమ్ముడు. ఆయన కుమారుల్ని సంరక్షించడం ధర్మమూ, న్యాయమూ. అందువల్ల మీ వంశం శాశ్వత సుఖసంపదలతో వర్ధిల్లుతుంది. మీకు శత్రు విజయం సంప్రాప్తమౌతుంది. కురుకులచూడామణీ! మీరు ఈ విధంగా ఆచరిస్తే గోపాలశిరోమణి అయిన కృష్ణుని మనస్సుకూ ప్రియం కలిగించిన ట్లవుతుంది.

ఆ. వారి తండ్రి పాలు వారికి నొసఁగి, నీ
పాలు సుతుల కెల్లఁ బంచియిచ్చి
చలము విడిచి ధర్మ మలవడ నీ బుద్ధిఁ
జొనుపవయ్య! కులము నునుపవయ్య! 25

* మహారాజా! వారి తండ్రిభాగం వారి కివ్వు. నీ భాగం కొడుకులకు పంచి ఇవ్వు. ఈర్ష్య వదలిపెట్టు. ధర్మమార్గంలో మనస్సు ప్రవేశ పెట్టు. వంశాన్ని నిలబెట్టు.

చ. వినుము నృపాల! నా పలుకు; వేయును నేల సమీరసూతి నీ
తనయుల పేరు విన్నఁ బదతాడిత దుష్టభుజంగమంబు చా
డ్పునఁ గనలొందు; నింతయును మున్నునుఁ జెప్పితిఁగాదె వానిచే
తన భవదీయపుత్త్రులకుఁ దప్పదు మృత్యు వదెన్ని భంగులన్. 26

* రాజా! నా మాట పాటించు. నీ కొడుకుల దుడుకుతనం విన్నప్పుడల్లా ఆ భీమసేనుడు కాలు తగిలిన కాలసర్పంలాగా మండిపడతాడు. ఇదంతా నీకు ముందే చెప్పానుగదా! ఏ విధంగా అయినా సరే ఆ వాయుకుమారుని చేతిలో నీ కుమారులకు చావు తప్పదు.

వ. అదియునుం గాక. 27

క. నీపుత్త్రుల శౌర్యంబును
చాపాచార్యాపగాత్మజాత కృపభుజా
టోపంబును గర్ణు దురా
లాపంబును నిజముగాఁ దలంతె మనమునన్. 28

* అంతేకాదు రాజా! నీ కన్న కొడుకుల ప్రతాపాలూ, ద్రోణాచార్య, భీష్మాచార్య, కృపాచార్యుల పటాటోపాలూ, అంగరాజు అసందర్భ ప్రలాపాలూ - ఇవన్నీ నిజమే అని నీ మనస్సులో నమ్ముతున్నావా!

వ. అట్లేని వినుము. 29

ఉ. ఏ పరమేశుచే జగము లీ సచరాచరకోటితో సము
ద్దీపిత మయ్యెః నే విభుని దివ్యకళాంశజు లబ్జగర్భ గౌ
రీపతి ముఖ్యదేవ ముని బృందములెవ్వఁడనంతుఁడచ్యుతుం
డా పురుషోత్తముండు కరుణాంబుధి గృష్ణుఁడు వో నరేశ్వరా! 30

* అయితే – విను. ఓ రాజా! ఏ పరమేశ్వరుని అనుగ్రహం వల్ల ఈ ప్రపంచం చరాచర జంతుజాలంతో ప్రకాశిస్తూ ఉంటున్నదో, బ్రహ్మదేవుడు, మహాదేవుడు మొదలైన దేవతలూ, మునిగణమూ అంతా ఏ దేవుని దివ్యకళాంశలనుండి జన్మించారో, ఎవ్వడు అనంతుడో, ఎవ్వడు అచ్యుతుడో ఆ పురుషోత్తముడే దయాపయోనిధి అయిన ఈ శ్రీకృష్ణుడు.

ఉ. అట్టి జగన్నివాసుఁడు మురాసురభేది పరాపరుండు చే
పట్టిసఖుండు వియ్యమునుబాంధవుఁడున్గురుఁడున్విభుండునై
యిట్టుల మైన ప్రేమమున నెప్పుడుఁ దోడ్పడుచుండు వారలన్
జుట్టన వేల నెవ్వరికిఁ జూపఁగ వచ్చును పార్థివోత్తమా! 31

* మహారాజా! అన్ని లోకాలనూ తనలో అట్టిపెట్టినవాడూ, మురుడు అనే రాక్షసుణ్ణి మట్టుపెట్టినవాడూ, సర్వశ్రేష్ఠుడూ అయిన శ్రీకృష్ణుడు చెలికాడై, వియ్యంకుడై, చుట్టమై, ప్రబోధకుడై, ప్రభువై అతిశయించిన అనురాగంతో ఎల్లప్పుడూ పాండవులకు తోడ్పడుతుంటాడు. అలాంటి వారిని ప్రేలెత్తి చూపడానికి ఎవరికైనా సాధ్యం అవుతుందా?

ఉ. కావునఁ బాండునందనులఁ గాఱియ పెట్టక రాజ్యభాగమున్
వావిరి నిచ్చి రాజ్యమును వంశముఁ బుత్త్రుల బంధువర్గమున్
గావుము; కాక లోభియగు కష్ట సుయోధను మాట వింటివే
భూవర! నీ యుపేక్ష నగుఁబో కులనాశము బంధునాశమున్. 32

* అందుకని నా మాటవిని పాండవుల్ని బాధపెట్టకుండా వారి రాజ్యభాగాన్ని వారికి ఇచ్చి, దేశాన్నీ, వంశాన్నీ, పుత్రుల్నీ, బంధువుల్నీ కాపాడు. అలాకాక లోభావిష్టుడూ, దుష్టుడూ అయిన దుర్యోధనుని మాటలు విన్నావా నీ నిర్లక్ష్యం కారణంగా కులనాశం, బంధునాశం జరిగి తీరుతుంది.

తే. ఒకనికై యిట్లు కుల మెల్ల నుక్కడంప
నెత్తుకొనఁ జూచె దిది నీతియే నృపాల!
వినుము నామాట: నీ సుయోధనుని విడిచి
కులము రాజ్యంబుఁ దేజంబు నిలుపవయ్య. 33

* ఒక్కడి కోసం వంశమంతా ధ్వంసం చేసుకోటానికి ప్రయత్నిస్తున్నావు. ఇదెక్కడి రాజనీతి? మహారాజా! నా మాట విను. ఈ దుర్యోధనుణ్ణి విడనాడు. వంశమర్యాదనూ, ప్రభుత్వాన్నీ, ప్రతాపాన్నీ కాపాడు!

క. అని యిట్లు దఱిమి చెప్పిన
విని దుర్యోధనుఁడు రోషవివశుండై తా
నినతనయు శకుని దుశ్శా
సనుల నిరీక్షించి తామసంబునఁ బలికెన్. 34

* అని ఈ విధంగా విదురుడు నొక్కి చెప్పాడు. ఆ మాటలు విని దుర్యోధనుడు రోషావేశంతో వశం తప్పిపోయాడు. మిత్రుడైన కర్ణుణ్ణీ, మేనమామ శకునినీ, తమ్ముడైన దుశ్శాసనుణ్ణీ చూచి అహంకారంతో ఇట్లా అన్నాడు.

క. దాసీపుత్త్రుని మీర లు
దాసీనుం జేయ కిటకుఁ దగునె పిలువఁగా ?
నాసీనుండై ప్రేలెడు
గాసిలి చెడిపోవ వెడలఁగా నడువుఁ డిఁకన్. 35

* దాసీపుత్త్రుణ్ణి తీసుకొని ఆసనం ఇచ్చి కూర్చోపెట్టారు. ఇటువంటి వాళ్లను ఈ సభకు ఎందుకు పిలిపించారు. కుదురుగా కూర్చొని అధికప్రసంగాలు చేస్తూ ఉన్నాడు. వెంటనే ఈ తుంటరిని మెడబట్టి గెంటి వెయ్యండి. తిక్క కుదురుతుంది.

వ. అని యిట్లు దుర్యోధనుం డాడిన దురాలాపంబులు దనకు మనస్తాపంబు సేయం గార్యంబు విచారించి ధైర్యం బవలంబించి యొండు వలుక నొల్లక శరశరాసనంబులు విడిచి క్రోధంబునడఁచి వనంబునకుం జని యందు. 36

* ఈ విధంగా దుర్యోధనుడు పలికిన దుడుకు మాటలకు విదురుని మనస్సు తుకతుక ఉడికిపోయింది. అప్పుడు విదురుడు కర్తవ్యం గుర్తుకు తెచ్చుకొని, గుండె నిబ్బరించుకొని, మరేమీ మారుమాట పలుకకుండా, ధనుర్బాణాలు విడిచిపెట్టి, ఆగ్రహాన్ని అడచిపెట్టి అరణ్యానికి వెళ్ళిపోయాడు.

సీ. విష్ణుస్వయంవ్యక్త విమలభూములను బ
విత్రంబులగు హరిక్షేత్రములను
నెలకొని దేవతానిర్మితహరిదివ్య
భూముల గంగాది పుణ్యనదుల

సిద్ధపురాణప్రసిద్ధ పుణ్యాశ్రమ
స్థలముల నుపవనస్థలములందు
గంధమాదన ముఖక్ష్మాభృత్తటంబుల
మంజులగిరి కుంజ పుంజములను

తే. వికచకైరవ పద్మ హల్లక మరంద
పాన పరవశ మధుకర గాన బుద్ధ
రాజహంస విలాస విరాజమాన
మగుచుఁ జెలువొందు పంకేరుహాకరముల. 37

* ఆ విధంగా వెళ్ళిన విదురుడు విష్ణుదేవుడు స్వయంగా వెలసిన పావనప్రదేశాలనూ, పరమపవిత్రాలైన వైష్ణవక్షేత్రాలనూ, దేవతలు నిర్మించిన దివ్యస్థలాలనూ, గంగ మొదలైన పుణ్యనదులనూ, పురాణాలలో ప్రసిద్ధాలైన సిద్ధాశ్రమాలనూ, తపోవనాలనూ దర్శించాడు. గంధమాదనం మొదలైన కొండచరియలనూ, అక్కడి చక్కని చిక్కని పొదరిండ్లనూ, వికసించిన రకరకాల కలువలలో, కమలాలలో మకరందం త్రాగి మైమరచిన తుమ్మెదల కమ్మని గానానికి మేలుకొన్న రాజహంసల విలాస విహారాలతో విరాజిల్లుతున్న సరోవరాలనూ విలోకించాడు.

క. మఱియును ఋష్యాశ్రమ వన
సరి దుపవన నద పుళింద జనపద గిరి గ
హ్వర గోష్ఠ యజ్ఞశాలా
పుర దేవాయతన పుణ్యభూముల యందున్. 38

* మునుల వనాలలో, నదీనదాలలో, ఉపవనాలలో, బోయపల్లెలలో, కొండగుహలలో, గోశాలలలో, యాగశాలలలో, పట్టణాలలో, దేవాలయాలలో, తీర్థస్థలాలలో తిరిగాడు.

క. కూరలుఁ గాయలు నీళ్ళా
హారముగాఁ గొనుచు నియమ మలవడఁగ నసం
స్కారశరీరుం డగుచు ను
దారత నవధూతవేషధరుఁడై వరుసన్. 39

* ఆ యా స్థలాలలో ఆకులు, దుంపలు, కూరగాయలు, నీళ్లు మాత్రమే ఆహారంగా తీసుకొంటూ నియమ సహితుడై, శరీరసంస్కార రహితుడై, ఔదార్యమహితుడైన విదురుడు పరివ్రాజకవేషధారియై సంచారం చేశాడు.

క. హర్షము గదురఁగ భారత
వర్షమునం గలుగు పుణ్యవరతీర్థములు
తత్కర్షం జూచుచు విగతా
మర్షుండై సంచరించె మనుజవరేణ్యా! 40

వ. ఇట్లు సంచరించుచుఁ బ్రభాస తీర్థమ్మునకు వచ్చునపుడు 41

* ఈ విధంగా భారత దేశంలోగల ఉత్తమ పుణ్యతీర్థాలన్నింటినీ సంతోషాతిశయంతో సందర్శిస్తూ, రాగద్వేషాలు విడిచిన విదురుడు క్రమంగా ప్రభాసతీర్థం చేరాడు.

చ. అరుగుచు దైత్యభేదన దయాపరిలబ్ధ సమస్త మేదినీ
భరణధురంధరుం డగుచుఁ బాండుసుతాగ్రజుఁ డొప్పుచుండ న
త్తఱి విదురుండుఁ దత్సరి దుదంచిత సాల రసాల మాధవీ
కురవక మాలతీ వకుళ కుంజ లసత్తట మందు నున్నెడన్. 42

* సరిగా అదే సమయంలో శ్రీకృష్ణభగవానుని అనుగ్రహం వల్ల సంప్రాప్తమైన సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు ధర్మరాజు. ఆ విధంగా పాండవాగ్రజుడు సమస్త మహీమండలభారాన్ని వహిస్తున్న సమయంలో విదురుడు ఆ ప్రాంతానికి వచ్చాడు. అక్కడి మద్దిచెట్లూ, మామిడిచెట్లూ, గురివెంద, ఎర్రగోరింట, మాలతి, పొగడ మొదలైన తరులతాదులతోకూడివున్న నదీ తీరంలో విదురుడు నివసించాడు.

చ. నరవర వేణుజానలవినష్ట మహాటవి మాడ్కిఁ బాండు భూ
వర ధృతరాష్ట్ర సూను లనివార్య నిరూఢ విరోధ మెత్తి యొం
డొరుల జయింపఁ గోరి కదనోర్విఁ గురుక్షితిపాలముఖ్యు లం
దఱు మృతు లౌటయున్ విని ఘనంబుగ శోకనిమగ్నచిత్తుఁడై. 43

* పరీక్షిన్మహారాజా! అప్పుడు అతడికి కురుక్షేత్రసంగ్రామం సంగతి తెలిసింది. కౌరవులూ, పాండవులూ వారింపరాని వైరం పెంచుకొని ఘోరంగా పోరాడుకున్నారనీ, పరస్పర విజయోత్కంఠతో జరిగిన ఆ కురుక్షేత్రమహాసంగ్రామంలో వెదురుపొదలలో ఉద్భవించిన దావాగ్నిలో దగ్ధమైన అరణ్యంలాగా దుర్యోధనాది కురుకుమార సమూహమంతా నశించారనీ విని విదురుడు పట్టరాని శోకంలో మునిగాడు.

ఉ. ఆ యెడఁ గాలు దన్నక రయంబున నేఁగి సరస్వతీనదీ
తోయములందుఁ గ్రుంకి మునితుల్యుఁడు వే చనియెం దనూనపా
త్తోయరుహాప్త భార్గవ పృథుత్రిత సోమ సుదాస శక్తిభృ
ద్వాయు యమాభిధానయుత వాహినులం దనురక్తిఁ గ్రుంకుచున్.
44

* అక్కడ ఉండడానికి విదురునకు కాలు నిలువలేదు. మునిసదృశుడైన విదురుడు వెంటనే బయలుదేరాడు. సరస్వతీ నదిలో స్నానం చేశాడు. అనంతరం అగ్ని, సూర్య, శుక్ర, పృథు, త్రిత, సోమ, సుదాస, కుమార, వాయువు, యమ ఇత్యాది దేవతానామాలతో ప్రసిద్ధమైన పుణ్యతీర్థాలను ఆసక్తితో సేవించాడు.

ఉ. వెండియుఁ బుణ్యభూములఁ బవిత్రసరిత్తులఁ జూచుచున్ రమా
మండనుఁ డుండు దివ్యరుచిమన్మణిచారుకవాట గేహళీ
మండిత సౌధగోపుర విమానము లున్నత భక్తిఁ జూచుచున్
నిండిన వేడ్కఁ గృష్ణ పద నీరజ చింతను ద్వైక్రమంబునన్.
45

* ఈ విధంగా విదురుడు పుణ్యస్థలాలనూ, పవిత్రనదీతీర్థాలనూ సేవిస్తూ వెళ్ళి ఇందిరావల్లభుడైన గోవిందుని మందిరాలై మహోజ్జ్వలాలైన మణులు పొదిగిన తలుపులతో, గడపలతో విరాజిల్లుతున్న విమానాలనూ, గోపురాలనూ, ఆలయాలనూ అత్యంత భక్తితో ఆలోకిస్తూ నందనందనుని పాదారవిందాలను స్మరిస్తూ ఎంతో సంతోషంతో ముందుకు సాగాడు.

విదురుం డుద్ధవుం గని కృష్ణాదుల వృత్తాంతం బడుగుట

చ. చని చని తొంటి మత్స్య కురుజాంగలభూము లతిక్రమించి చ
య్యన యమునానదిం గదిసి యచ్చట భాగవతున్ సరోజలో
చన దృఢభక్తు సద్గుణవిశారదు శాంతుని దేవమంత్రి శి
ష్యుని మహిత ప్రసిద్ధుఁ బరిశోషితదోషుఁ ప్రబుద్ధు నుద్ధవున్. 46

* అలాగా ముందుకువెళ్ళి మత్స్య, కురు, జాంగల భూములను అతిక్రమించి అనంతరం యమునా నదిని సమీపించాడు, ఆ నదీతీరంలో పరమభాగవతుడు, పుండరీకాక్షుని మీద అఖండమైన భక్తిగలవాడు, ఉత్తమగుణసంపన్నుడు, శాంతుడు, రాజనీతిలో బృహస్పతి శిష్యుడు, విశాలయశోవిరాజితుడు, దోషశూన్యుడు, ఉజ్వలచైతన్యుడు అయిన ఉద్ధవుణ్ణి దర్శించాడు.

క. కని యనురాగ వికాసము
దన మనమునఁ దొంగలింపఁ దగ గాఢాలిం
గన మాచరించి నెయ్యం
బునఁ గుశలప్రశ్న సేసి ముదమునఁ బలికెన్. 47

* ఉద్ధవుణ్ణి చూడగానే విదురుని హృదయంలో అనురాగం పొంగి పొరలింది. రెండుచేతులు చాచి గట్టిగా కౌగిలించుకున్నాడు. స్నేహం కొద్దీ కుశల ప్రశ్నలు కురిపించిన అనంతరం సంతోషంతో విదురుడు ఉద్ధవునితో ఇట్లా అన్నాడు.

క. హరిభక్తులు పుణ్యాత్ములు
దురితవిదూరులు విరోధిదుర్దమబలులుం
గురుకులతిలకులు గుంతీ
వరసూనులు గుశలులే యవారిత భక్తిన్. 48

* వృష్ణికులోద్భవా! ఉద్ధవా! కృష్ణభక్తులూ, పవిత్రచరిత్రులూ, విరోధులకు నిరోధింపరాని వీరాధివీరులూ కురుకులాలంకారులూ అయిన కుంతీకుమారులు కుశలంగా వున్నారా?

చ. హరి దన నాభిపంకరుహమందు జనించిన యట్టి భారతీ
శ్వరుఁ డతిభక్తి వేఁడ యదువంశమునన్ బలకృష్ణమూర్తులై
పరఁగ జనించి భూభరముఁ బాపిన భవ్యులు రేవతీందిరా
వరు లట శూరసేనుని నివాసమునన్ సుఖ మున్నవారలే ? 49

* తన నాభికమలం నుండి పుట్టిన బ్రహ్మదేవుడు పరమభక్తితో ప్రార్థింపగా శ్రీహరి బలరాముడుగా, కృష్ణుడుగా యదువంశంలో ఉదయించాడు. అట్లాపుట్టి భూభారాన్ని పోగొట్టిన మహోదయులు, రేవతీ రుక్మిణీ హృదయప్రియులు రామకృష్ణులు తమ తాతగారైన శూరసేనుని గృహంలో సుఖంగా ఉన్నారా?

చ. కురుకులు లాదరింపఁగ సఖుండును నా ప్తుఁడునై తనర్చి సో
దర తరుణీజనంబులను దత్పతులం గడు గారవంబునం
గరుణ దలిర్ప నాత్మజులకంటెఁ బ్రియోన్నతిఁ బ్రోచువాఁడు సు
స్థిరమతి నున్నవాఁడె వసుదేవుఁడు వృష్ణికులప్రదీపకా ! 50

* యదువంశదీపకా! కురువంశీయులైన కౌరవులూ, పాండవులూ తన్నెంతో గౌరవింపగా, నెయ్యమై, వియ్యమై, తన అనుగు చెల్లెళ్లను వారిభర్తల్నీ ఎంతో ఆదరంగా ఆప్యాయంగా కన్నబిడ్డలకంటే మిన్నగా లాలించి పాలించే వసుదేవుడు ఆరోగ్యంగా ఉన్నాడా?

శా. కందర్పాంశమునం దనూజుఁ బడయం గామించి భూదేవతా
బృందంబున్ భజియించి తత్తరుణ దీపింపం బ్రభావంబు పెం
పొందన్ రుక్మిణి గన్ననందనుఁడు ప్రద్యుమ్నుండు భాస్వచ్చమూ
సందోహంబులు దన్నుఁ గొల్వ మహితోత్సాహంబునన్ మించునే. 51

* మన్మథుని అంశగల కుమారుణ్ణి పొందదలచి రుక్మిణీదేవి బ్రాహ్మణుల్ని పూజించింది. వారి అనుగ్రహం వల్ల అత్యంతమహిమోపేత అయిన రుక్మిణీమాత కడుపుచల్లగా కన్నసంతానం ప్రద్యుమ్నుడు సమస్త సేనాసమూహం తనను సంసేవిస్తూ ఉండగా ఉత్సాహంతో ఉన్నాడుగదా!

క. సరసిజలోచన కరుణా
పరిలబ్ధ సమస్త ధరణిపాలన మహిమం
బరమప్రీతి సుఖించునె
చిరవిభవోదారుఁ డుగ్రసేనుఁడు జగతిన్. 52

* కమలాక్షుని కరుణాకటాక్షం వల్ల సంప్రాప్తమైన సమస్త రాజ్యాన్నీ పాలిస్తున్న ఉగ్రసేనుడు సంప్రీతుడై, శాశ్వతవైభవోపేతుడై సుఖంగా ఉన్నాడా?

చ. లలిత పతివ్రతామణి విలాసవతీతిలకంబు పార్వతీ
లలన గుమారుఁ గన్నటు సులక్షణ జాంబవతీ లలామ ని
ర్మల గతిఁ గన్న పట్టి సుకుమారతనుండు విరోధిభంజనో
త్కలిక సుఖించునే గుణకదంబుఁడు సాంబుఁడు వృష్ణిపుంగవా! 53

* పతివ్రతా శిరోమణీ, ఉత్తమ రమణీమణీ, సమస్త సద్గుణవతీ అయిన జాంబవతి, పార్వతీదేవి కుమారస్వామిని కన్నట్లు సాంబుని కన్నది. విరోధులను చీల్చి చెండాడే వీరాధివీరుడు, సుగుణాలవాలుడు- ఆ సాంబుడు క్షేమమేనా?

క. హరిపదసేవకుఁ డరి భీ
కరుఁ డర్జును వలన మిగులఁ గార్ముక విద్యల్
దిరముగఁ గఱచిన సాత్యకి
వరసుఖ విభవముల నున్నవాఁడె ధరిత్రిన్? 54

* హరిచరణ కింకరుడూ, అరిజన భయంకరుడూ, అర్జునుని దగ్గర చక్కగా విలువిద్య నేర్చుకొన్నవాడూ అయిన సాత్యకి అత్యంత సుఖవైభవాలతో అలరారుతున్నాడా?

మ. జలజాతాంకుశ చక్ర చాప కులిశ చ్ఛత్రాది రేఖాంకితో
జ్జ్వల గోవింద పదాబ్జ లక్షిత విరాజన్మార్గ ధూళిచ్ఛటా

కలితాంగుండు విధూతకల్మషుఁడు నిష్కామైక ధర్ముండు స
త్కులజాతుండన నొప్పు నట్టి ఘనుఁ డక్రూరుండు భద్రాత్ముఁడే? 55

గోవిందుని పాదాలు-పద్మం, అంకుశం, చక్రం, ధనుస్సు, వజ్రం, ఛత్రం మొదలైన శుభరేఖలతో ఒప్పుతుంటాయి. అటువంటి శ్రీపాద ముద్రలు ప్రకాశించే త్రోవలలోని దుమ్ముతో క్రమ్మిన నెమ్మేనుతో, దురిత దూరుడైన అక్రూరుడు ఆనందంగా ఉన్నాడా? నిష్కాముడూ, నిర్మల ధర్మపరుడూ, సద్వంశ సంజాతుడూఐన ఆ మహానుభావునికి క్షేమమేకదా?

క. శ్రుతులును గ్రతుజాతము స
మ్మతిఁ దాల్చినయట్టి వేదమాతగతిఁ శ్రీ
పతిఁ దనగర్భమ్మున ర
క్షితుఁ జేసిన గరిత దేవకీసతి సుఖమే. 56

వేదాలనూ, యజ్ఞాలనూ తనలో సాదరంగా దాచుకొన్న వేద మాతలా శ్రీమన్నారాయణుణ్ణి తన గర్భంలో ఆప్యాయంగా ధరించి కాపాడిన దొడ్డఇల్లాలు దేవకీదేవి సుఖంగా ఉందా?

వ. మఱియు మహాత్మా! మహితోపాసకు లగువారల కోర్కులు నిండింపంజాలిన భగవంతుండును, శబ్దశాస్త్రంబునకుం గారణం బని తన్ను నఖిలదేవతాజనంబు లగ్గింప గల మేటి యగుటంజేసి మనోమయుండును, సకలజీవ చతుర్విధాంతఃకరణంబు లయిన చిత్తాహంకారబుద్ధి మనంబులకుం గ్రమంబున వాసుదేవ–సంకర్షణ-ప్రద్యు-మ్నానిరుద్ధు లధిదైవతంబు లగుదు రట్టి చతుర్విధ తత్త్వంబులకుఁ దుర్యంబైన తత్త్వంబునునైన యనిరుద్ధ కుమారుండు సంతోషచిత్తుం డగునే యని. 57

* మహాత్మా? అనిరుద్ధుడు-నిత్యం తన్ను భక్తితో సేవించేవారి కోరికలన్నీ నెరవేర్చగల భగవానుడు. శబ్దశాస్త్రానికి కారణమని సమస్త దేవతలూ కొనియాడే వాడు. మనోమయుడైనవాడు. అఖిల ప్రాణులకూ

అంతఃకరణాలైన, చిత్తం - అహంకారం - బుద్ధి - మనస్సుఅనే నాలుగింటికీ క్రమంగా వాసుదేవుడు - సంకర్షణుడు - ప్రద్యుమ్నుడు - అనిరుద్ధుడు అధిష్ఠాన దైవాలు. ఇలా మనస్సుకు అధిపతియైన ఆ అనిరుద్ధుడు ఆనందంగా ఉన్నాడా ?

మ. ఇతరారాధన మాని కృష్ణుఁ గమలాధీశుం బయోజాసనా
ర్చితు భక్తిన్ నిజనాథుఁగా సతతమున్ సేవించుపుణ్యుల్ జగ
న్నుతు లధ్యాత్మవిదుల్ మహాభుజులు మాన్యుల్ ధర్మమార్గుల్ సము
న్నతి సత్యాత్మజచారుదేష్ణగదు లానందాత్ములే యుద్ధవా! 58

* ఓ ఉద్ధవా ! తక్కిన పూజలన్నీ విడిచిపెట్టి, బ్రహ్మదేవునికికూడ పూజనీయుడూ, లక్ష్మీవల్లభుడూ అయిన శ్రీకృష్ణుణ్ణి తమకు రక్షకుడుగా భావించి భక్తితో నిత్యం సేవించే ధన్యులూ, జగన్మాన్యులూ, అంతేకాక లోకంచే పొగడబడువారూ, ఆధ్యాత్మిక విద్యావేత్తలూ, ధర్మమార్గంలో నడిచేవారూ అయిన సత్యభామానందనులు చారుదేష్ణగదులు సంతోషంగా ఉన్నారా ?

తే. క్రోధమాత్సర్యధనుఁడు సుయోధనుండు
వొలుచు నెవ్వనిసభఁ జూచి కలుష మొదవి
మనములోన నసూయానిమగ్నుఁ డయ్యె
నట్టి ధర్మజుఁ డున్నాఁడె యనఘచరిత! 59

* ఓ పుణ్యచరిత్రా ! దేదీప్యమానమైన ఏ మహనీయుని మయసభను చూచి దుర్యోధనుడు క్రోధమాత్సర్యాలతో క్రుంగిపోయి మనస్సునిండా కల్మషం నింపుకొని, అంతులేని అసూయలో మునిగితేలాడో - ఆ ధర్మరాజు సుఖంగా ఉన్నాడా?

తే. ఘనగదాభ్యాస చిత్ర సంగతుల మెఱసి
కురుకుమారుల భూరి సంగరము లోన
హతులఁ గావించి వెలసినయట్టి జెట్టి
వాయుతనయుండు గుశలియై వఱలునయ్య! 60

* ఉద్ధతమైన తన గదాయుద్ధ కౌశలంతో కౌరవుల నందర్నీ రణ రంగంలో మట్టుపెట్టిన జగజెట్టి వాయుదేవుని ముద్దులపట్టి భీముడు క్షేమంగా ఉన్నాడా ?

చ. హరికరుణాతరంగిత కటాక్ష నిరీక్షణ లబ్ధ శౌర్య వి
స్ఫురణఁ దనర్చి తన్ను నని బోయగతిన్ గిరిశుం డెదిర్చినన్
బరవస మొప్పఁగా గెలిచి పాశుపతాస్త్రముఁ గొన్న శత్రు భీ
కరుఁడు ధనంజయుండు సుభగస్థితిమోదమునొందుచుండునే? 61

* కరుణాతరంగాలు పొంగిపొరలే కమలాక్షుని కటాక్షవీక్షణాలవల్ల ప్రాప్తించిన పరాక్రమాతిశయం కలవాడూ, మాయాకిరాతరూపంతో మహేశ్వరునంతవాడు యుద్ధానికి సిద్ధమైనా తొడగొట్టి నిలిచి గెలిచి మెప్పించి పాశుపతాస్త్రం ఇప్పించుకొన్న మొనగాడూ, అరిభయం కరుడూ అయిన అర్జునుడు సుఖంగా సంతోషంగా ఉన్నాడా?

మ. తెలఁగొప్పన్‌జననీవియోగమునఁ గుంతీస్తన్యపానంబు సో
దరసంరక్షయుఁ గల్గి దేవవిభు వక్త్రస్థామృతంబుం ఖగే
శ్వరుఁ డర్థిం గయికొన్న మాడ్కిఁ గురువంశ శ్రేణి నిర్జించి త
ద్ధరణీరాజ్యముఁ గొన్న మాద్రికొడుకుల్ ధన్యాత్ములే? యుద్ధవా! 62

* విధివశంవల్ల తమకన్నతల్లి కన్నుమూయగా కుంతీదేవి చను బాలు త్రాగుతూ, అన్నలచే రక్షింపబడినట్టివారూ, అమరేంద్రుని అధీనంలో ఉన్న అమృతాన్ని సంపాదించిన గరుత్మంతునిలా కౌరవుల నంద రినీ నిర్జించి వారి రాజ్యాన్ని ఆర్జించినవారూ అయిన మాద్రి నందనులు నకులసహదేవులు కుశలంగా ఉన్నారా?

తే. పాండుభూమీశ్వరుండు సంప్రాప్తమరణుఁ
డైన శిశువులఁ బ్రోచుటకై నిజేశుఁ
గూడి చనకున్న యట్టి యా కుంతిభోజ
తనయ జీవించునే నేఁడు ? మనుచరిత్ర ! 63

* ఉదాత్తచరిత్రుడవైన ఉద్ధవా! ఆ నాడు పాండురాజు మరణింపగా భర్తతో పాటు తానుకూడా సహగమనం చేయకుండా బిడ్డల మంచి చెడ్డలు చూడటంకోసం ప్రాణాలు బిగబట్టుకొని ఉన్నది కుంతీదేవి. ఆ తల్లి ఇప్పుడు క్షేమంగా జీవించి ఉన్నది కదా!

వ. అని వెండియు. 64

మ. అనుజాతుండగుపాండుభూవిభుఁడునిర్యాణంబునంబొంద నా
తని పుత్త్రుల్ దనుఁ జేర వచ్చినను మాధ్యస్థంబుఁ బోఁ దట్టి యె
గ్గొనరించెన్ ధృతరాష్ట్ర భూమివిభుఁడ ట్లూహింపఁగా నెగ్గు సే
సిన వాఁడే యగుఁ గాక మేలు గలదే చింతింపఁగా నుద్ధవా! 65

* అని మరల ఇలా అన్నాడు విదురుడు. తమ్ముడు పాండురాజు తనువు చాలించగా అతని కొడుకులు తన దగ్గరకు వచ్చినపుడు న్యాయం చేసేవానిలా వెన్నుదట్టి ఆశ్రయమిచ్చి ఆపైకీడే చేశాడు ధృతరాష్ట్రుడు. వాస్తవానికి ఆ గ్రుడ్డిరాజు చెడ్డవాడేకానీ ఉద్ధవా! ఆయన సుఖంగా ఉన్నాడా?

క. అనుజుఁడు వీఁ డనకయు తన
తనయులు నను వెడల నడువఁ దా నూరక యుం
డిన ధృతరాష్ట్రుఁడు నరకం
బునఁ బడు నాద్రైన దుఃఖమున ననఘాత్మా! 66

* ఓ పాపరహితుడవైన మహానుభావా! తుంటరులైన తన కొడుకులు నన్ను బయటికి గెంటిన సమయంలో తమ్ముడే అనికూడా అనుకోకుండా నోరుమూసుకొని ఊరకున్నాడు ధృతరాష్ట్రుడు. అతడు నాకు కలిగించిన దుఃఖం కారణంగా తప్పక నరకయాతన అనుభవిసాడు.

వ. అదియునుం గాక పరమశాంతుఁడవైన నీ మనంబున దుఃఖంబు గర్తవ్యంబు గాదంటేని. 67

CENTRAL LIBRARY TIRUPATI

* "నీవేమో పరమశాంతుడవు. నీవు ఇలా దుఃఖపడటం సమంజసం కా"దని అంటావేమో !

క. నరలోక విడంబనమున
హరి పరమపరుండు మానవాకృతితో ని
ద్ధరఁ బుట్టి యాత్మమాయా
స్ఫురణన్ మోహింపఁజేయు భూజనకోటిన్. 68

* పరాత్పరుడైన హరి లీలామానవుడై ఈ లోకంలో పుట్టి తన మాయాప్రభావంతో మానవులనందరినీ వ్యామోహంలో ముంచుతున్నాడు.

ఉ. కావున నమ్మహాత్ముని వికార విదూరుని సర్వమోహ మా
యావిల మానసుండ నగు నప్పుడు సంసృతి దుఃఖి నౌదుః న
ద్దేవుని సత్కృపామహిమ దేలిన వేళ సుఖింతుః నేన కా
దా విధి శంకరప్రభృతు లవ్విభుమాయఁ దరింప నేర్తురే? 69

* కాబట్టి, ఎట్టి వికారాలూలేనివాడూ, మహాత్ముడూ అయిన ఆ శ్రీహరి మాయావ్యామోహాలకు నా మనస్సు లోనైనపుడు సంసార సంబంధమైన ఈ దుఃఖాలు అనుభవిస్తాను. అలాకాక ఆ దేవదేవుని అపార కృపారసం ప్రసరించిననాడు సుఖంగా ఉంటాను. నేనే కాదు, ఆ బ్రహ్మరుద్రాదులుకూడా ఆ పరాత్పరుని మాయాజాలం నుంచి తప్పించుకొని బయటపడలేరు.

వ. అయిన నమ్మహాత్ముని కరుణాతరంగి తాపాంగ పరిలబ్ధ విజ్ఞాన దీపాంకుర నిరస్త సమస్త దోషాంధకారుండ నగుటంజేసి మదీయచిత్తంబు హరిపదాయత్తంబయిన కారణంబునను దత్త్వంబు సతతంబు నిరీక్షించుచునుండుదుః మఱియును. 70

* అయినా, కరుణారసం వెల్లివిరిసే ఆ మహానుభావుని కడగంటి చూపులద్వారా సంప్రాప్తమైన జ్ఞానదీపకళికవల్ల నా దోషాలనే చీకట్లన్నీ తొలగిపోయాయి నా చిత్తం భగవంతుని పాదాలను హత్తుకున్నది. అందువల్ల ఆ పరతత్త్వం కోసమే నిరంతరం నిరీక్షిస్తూ ఉన్నాను.

సీ. అట్టి సరోజాక్షుఁ డాత్మీయ పదభక్తు
లడవుల నిడుమలఁ గుడుచు చుండ
దౌత్యంబు సేయఁ గొందఱు విరోధులు పట్టి
బద్ధునిఁ జేయ సన్నద్ధులైన
బలహీనుమాడ్కి మార్పడలేఁడ యసమర్థుఁ
డని తలంచెదవేని నచ్యుతుండు
పరుల జయింప నోపక కాదు విద్యాభి
జన ధనమత్తులై జగతిఁ బెక్కు

తే. బాధల నలంచు దుష్టభూపతుల నెల్ల
సైన్య యుక్తంబుగా నని సంహరించు
కొఱకు సభలోన నప్పు డా కురుకుమారు
లాడు దుర్భాషణములకు నలుగఁడయ్యె. 71

* ఆ కమలాక్షుడు అనురక్తులైన తన భక్తులు అడవుల్లో అష్ట కష్టాలు పడడం చూడలేక వారికోసం రాయబారం నడిపాడు. పగబట్టిన శత్రువులు కొందరు అతణ్ణి పట్టి కట్టివేయాలని గట్టి ప్రయత్నాలు చేశారు. అప్పుడు అచ్యుతుడు అశక్తునిలాగా వారిని వారించలేదు. అంతమాత్రం చేత అది ఆయన అసమర్థత అనుకోకూడదు. ఆయన వారిని జయింపలేక కాదు. విద్య-వంశం-ధనం వీనివల్ల అహంకరించి లోకుల్ని పలుబాధలకు బలిచేస్తున్న పలుగాకులైన రాజుల్ని ససైన్యంగా సంగ్రామభూమిలో సంహరించాలనే సదుద్దేశంతోనే ఆనాటి సభలో కౌరవుల సూటిపోటు మాటలకు నొచ్చుకోలేదు; ఆగ్రహం తెచ్చుకోలేదు.

మ. జననం బందుట లేని యీశ్వరుఁడు దా జన్మించు టెల్లన్ విరో
ధి నిరాసార్థము; వీతకర్ముఁ డగు న ద్దేవుండు గర్మప్రవ
ర్తనుఁ డౌటెల్లఁ జరాచర ప్రకట భూత శ్రేణులం గర్మ వ
ర్తనులం జేయఁదలంచి కాక కలవే దైత్యారికిం గర్మముల్. 72

పుట్టుకలేని భగవంతుడు పుడుతున్నాడంటే - కేవలం శత్రువుల్ని అంతం చేయడానికే! కర్మలు లేని దేవుడు కర్మలు చేస్తున్నాడంటే చరా

చర జీవకోటిని కర్మబద్ధుల్ని చేయడానికే ! అంతేకాని, రాక్షసాంతకుడైన కమలాక్షునికి కర్మలంటూ ఉన్నాయా ?

క. హరి నరుల కెల్లఁ బూజ్యుఁడు
హరి లీలామనుజుఁడును గుణాతీతుఁడు నై
పరఁగిన భవ కర్మంబులఁ
బొరయం డఁట; హరికిఁ గర్మములు లీల లగున్. 73

* హరి నరు లందరికీ పూజనీయుడు. ఆయన లీలామానుష విగ్రహుడు. గుణాలకు అతీతుడు. జన్మసంబంధమైన బంధాలు ఆయనకు లేవు. అవి కేవలం ఆ వాసుదేవునికి లీలావిలాసాలు మాత్రమే.

క. మదిఁ దన శాసన మిడి నిజ
పదములు సేవించు లోకపాలాదుల పెం
పొదవింప యదుకులంబున
నుదయించెను భువిని బలభహోదరుఁ డగుచున్. 74

* తన అనుజ్ఞ తలదాల్చి తన పాదాల్ని సేవించే లోకపాలకులకు అభ్యుదయం కలిగించేందుకు భూలోకంలో యాదవ వంశంలో బలరామునికి తమ్ముడై శ్రీహరి జన్మించాడు.

తే. చలన మందక భూరి సంసరణ తరణ
మైన సత్కీర్తి దిక్కుల నతిశయిల్లి
వఱల సమమతియై యున్నవాఁడె కృష్ణుఁ
డనుచు నుద్ధవుని విదురుఁ డడుగుటయును. 75

* సంసారసాగరాన్ని తరింపజేస్తూ చెక్కుచెదరని యశోవైభవాన్ని దిక్కులంతటా నిండిస్తూ, అందరినీ సమబుద్ధితో ఆదరించే ఆ నందనందనుడు క్షేమంగా ఉన్నాడా ! ఈ విధంగా విదురుడు ఉత్కంఠతో ఉద్ధవుణ్ణి అడిగాడు.

వ. అట్టి యెడ న య్యుద్ధవుండు. 76

క. యదుకులనిధి యగు కృష్ణుని
పద జలజ వియోగ తాప భరమున మాటల్
ప్రిదులక హృదయం బెరియఁగఁ
బెదవులు దడుపుచును వగలఁ బెంపఱియుండెన్. 77

* అప్పుడు యాదవకులానికి పెన్నిధి అయిన కృష్ణుని పాదపద్మాలకు, దూరమైన కారణంగా ఉద్ధవునికి దుఃఖం పొంగి వచ్చింది. నోట మాట రాలేదు. గుండె పగిలినట్లయింది. పెదవులు తడుపుకున్నాడు. శోకంవల్ల కాంతివిహీనుడైనాడు.

క. అని చెప్పి బాదరాయణి
మనుజేంద్రుని వలను సూచి మఱి యిట్లనియెన్
విను మొకనాఁ డీ యుద్ధవుఁ
డనయము నైదేండ్ల బాలుఁడై యున్న తఱిన్. 78

వ. మున్ను కృష్ణునిం గూడి యాడు బాలకులలో నొక్క బాలునిఁ గృష్ణునింగా భావించి పరిచర్య సేయుచుండ గుణవతీమతల్లి యగు తల్లి సనుదెంచి "యాఁకొంటి; విదియేల రావన్న" యని పిలిచిన జననీ వాక్యంబులు గైకొనక యఖండతేజోనిధియైన పుండరీకాక్షు పాదారవింద మకరంద సేవానురక్తిం జేసియున్న యుద్ధవుండు నేఁడు కృష్ణవియోగతాపంబున హరివార్త విదురునకుఁ జెప్పఁజాలక యొప్పఱి యుండుట యేమి చిత్రంబని వెండియు నిట్లనియె; నంత నుద్ధవుండు సరోజాక్ష పాదారవింద మకరంద సుధాజల నిధి నిమగ్న మానసుండై సముత్కంఠం జింతించి యొక్క ముహూర్తమాత్రంబునకు బాష్పజల పూరిత లోచనుండై గద్గదకంఠుం డగుచు. 79

* అని చెప్పి, శుకుడు పరీక్షిత్తును చూచి, ఇంకా ఇలా అన్నాడు. "రాజా! విను. చిన్నతనంలో ఈ ఉద్ధవుడు ఐదేండ్ల బాలుడై ఉండగా

ఒకనాడు కృష్ణునితో కలసి ఆడుకుంటున్న ఆ బాలురందరిలో ఒక బాలుణ్ణి కృష్ణునిగానే భావిస్తూ సేవలు చేయసాగాడు. సుగుణాలవెల్లి అయిన అతని తల్లి అక్కడికి వచ్చి "నాయనా! ఆకలి గొన్నావు అన్నానికి రా! ఇంకా ఆటలేమిట్రా" అని పిలిచింది. ఉద్ధవుడు తల్లి మాటలు వినిపించు కోలేదు. అనంత తేజస్సంపన్నుడగు పద్మాక్షుని పాదారవింద మకరంద మాధుర్యంలో మైమరచి అలాగే ఉన్నాడు. అటువంటి ఉద్ధవుడు నేడు కృష్ణుని ఎడబాటువల్ల ప్రాప్తించిన పరితాప భారంతో ఆ విషయాన్ని విదురునకు చెప్పలేక కుప్పగూలి పోవడంలో ఆశ్చర్యం ఏముంది" అని మళ్ళీ శుకుడు ఇట్లా అన్నాడు. అప్పుడు ఉద్ధవుని హృదయం శ్రీకృష్ణ చరణారవింద మకరందాల పాలమున్నీటిలో మునిగి తేలింది. ఏదో తహ తహ పాటుతో ఒక్క క్షణంపాటు కన్నులు బాష్పాలతో నిండిపోయాయి. కంఠం గద్గద మయింది.

క. ఘనముగ నెమ్మనమున మిం
చిన కృష్ణవియోగ జనిత శిఖి దరికొనఁగాఁ
గనుఁగవఁ బెడచే నొత్తుచుఁ
బెనుపొందిన దురిత శిఖరిభిదురున్ విదురున్. 80

వ. కనుంగొని యిట్లనియె. 81

* శ్రీకృష్ణ వియోగంవల్ల కలిగిన శోకాగ్నికి చీకాకైన మనస్సుతో ఉద్ధవుడు ముంజేతులతో కన్నులుతుడుచుకుంటూ పాపాలు అనే పర్వతా లకు వజ్రాయుధం వంటివాడైన విదురుణ్ణి చూచి ఇలా అన్నాడు.

క. యముఁడను ఘనకాలభుజం
గము పుంగవుఁ డెగచి పట్టఁగా యదువంశో
త్తముల చరిత్రులుఁ దత్కుశ
లము లే మని చెప్పుదుం గలంగెడి మనమున్. 82

* యమధర్మరాజు అనే నల్లని నాగరాజు యదువంశాన్ని ఒడిసి పట్టి కాటువేశాడు. ఇప్పుడు యాదవ వంశీయుల వృత్తాంతమూ, వారి క్షేమమూ ఏమని చెప్పేది? నా మనస్సు కళవళ పడుతూవుంది.

సీ. మునిజన ముఖపద్మములు ముకుళింపంగ
ఖలజన లోచనోత్పలము లలర
జార చోరుల కోర్కి సఫలత నొందంగ
దానవదర్పాంధ తమస మడర
వర యోగి జన చక్రవాకంబు అడలంగఁ
గలుషజనానురాగంబు పర్వ
భూరి దోషానల స్ఫూర్తి వాటిల్లంగ
నుదిత ధర్మక్రియ లుడిగి యణఁగ

తే. మానుషాకార రుచికోటి మందపఱిచి
యనఘ! యే మన నేర్తుఁ గృష్ణాభిధాన
లోకబాంధవుఁ డుత్తమశ్లోకమూర్తి
మించు తేజంబుతో న స్తమించెనయ్య! 83

* పుణ్యమూర్తీ! విదురా! నోటమాట పెగలటం లేదు. లోకబాంధవుడూ, ఉత్తమశ్లోకుడూ, మహాతేజస్వి అయిన శ్రీకృష్ణుడనే సూర్యుడు అస్తమించాడయ్యా! ఇంకేమున్నది! మునీంద్రుల ముఖకమలాలు ముకుళితా లయినాయి. కలుషాత్ముల కనుగలువలు విప్పారాయి. జార చోరుల కోరికలు ఫలించాయి. రాక్షసుల గర్వాంధకారాలు నలుదిశలా వ్యాపించాయి. పరమ యోగులనే చక్రవాకాలు శోకించాయి. దురితమనే సంధ్యారాగాలు చెలరేగాయి. దోషాభిధానమైన రాత్రి విజృంభించింది. ధర్మకృత్యాలకు ప్రత్యవాయం ఏర్పడింది. మానవుల తేజస్సులు మందగించాయి.

వ. మఱియును. 84

క. హల కులిశ జలజరేఖా
లలిత శ్రీకృష్ణ పాదలక్షితయై ని
ర్మలగతి నొప్పెడు ధరణీ
లలనామణి నేఁ డభాగ్యలక్షణ యయ్యెన్. 85

* అంతేకాదు; హలమూ, వజ్రమూ, పద్మమూ మొదలైన రేఖలతో అందమైన నందనందనుని అడుగుముద్రలతో స్వచ్ఛంగా సలక్షణంగా ప్రకాశించే భూదేవి ఈనాడు దౌర్భాగ్యలక్షణాలు కలది అయింది.

క. యాదవుల వలన రాజ్య
శ్రీ దొలఁగెనుః ధర్మగతి నశించెనుః భువి మ
ర్యాదలు దప్పె నధర్మో
త్పాదనమునః దైత్యభేది దప్పినపిదపన్. 86

* దానవాంతకుడైన శ్రీకృష్ణుడు కనుమరుగు కావడంతో యాదవుల రాజ్యవైభవం మాయమయింది. ధర్మమార్గం నశించింది. అధర్మం అతిశయించింది. లోకంలో మర్యాదలు లేకుండా పోయాయి.

వ. మఱియు లలిత నికషణ విరాజమాన మణిగణ కిరణ సుషమా విశేష విడంబిత విమల సలిలంబులందుఁ బ్రతిఫలిత సంపూర్ణ చంద్రమండల రుచి నిరీక్షించి జలచర బుద్ధిం జేసి తజ్జల విలోలమీనంబు లనూన స్నేహంబునం దలంచు చందంబునఁ గృష్ణానుచరులైన యదు వృష్ణికుమారు లమ్మహనీయ మూర్తిం దమకు నగ్రేసరుం డని కాని లీలామానుష విగ్రహుండైన పరమాత్ముండని యెఱుంగక హరిమాయా జనితంబగు నసద్భావంబునం జేసి భోజన శయనాసనానుగమనంబులం జేరి సహోదరాది భావంబులం గూడి చరియింతుః రద్దేవుని మాయాపయోనిధి నిమగ్నులు గాకుండ నబ్జభవాదులకైనం దీఱదు. సర్వగుణగరిష్ఠులును, సత్పురుష శ్రేష్ఠులును నగు పరమభాగవతులకుం దక్క తక్కినవారలకుం జెప్పనేల? అదియునుంగాక యభిజన విద్యాధన బలగర్వమదాంధీభూత చేతస్కులైన శిశుపాలాది భూపాలకు లమ్మహాత్మునిం బరతత్త్వంబని యెఱుంగక నిందించు దుర్భాషలు దలంచి మనస్తాపంబు నొందుచుండుదు నని వెండియు. 87

* అంతేకాకుండా – చక్కగా సానపట్టటంవల్ల ఎక్కువగా ప్రకాశించే మణిసమూహాల మనోజ్ఞ కాంతిరేఖలవలె తళతళ మెరిసే స్వచ్ఛమైన జలాల్లో ప్రతిబింబించిన పరిపూర్ణ చంద్రమండల కాంతిని చూచి ఏదో జలచరమని భ్రాంతిపడి ఆ నీటిలో తిరిగే చేపలు దానిచుట్టూ తిరుగుతూ సాటిలేని చనువునూ, స్నేహాన్నీ ప్రకటిస్తాయి. అదేవిధంగా కృష్ణుని వెంట తిరిగే యదువృష్ణి కుమారులు ఆ మహానుభావుని తమకు అగ్రనాయకుడని మాత్రమే భావించేవారుకాని లీలావిలాసార్థం మానవరూపం ధరించిన పరాత్పరుడని తెలుసుకోలేక, శ్రీహరిమాయామోహితులై ఆయనతోపాటు భుజిస్తూ, శయనిస్తూ, కలసికూర్చుంటూ, వెంట తిరుగుతూ తమతోబుట్టువు, చుట్టం ఇత్యాది భావాలతో ప్రవర్తించేవారు. ఆ దేవాదిదేవుని మాయాసముద్రంలో మునిగి పోకుండా ఉండేందుకు బ్రహ్మాదులకు కూడా సాధ్యం కాదు. అన్ని గుణాల్లోనూ మిన్నయైన వారూ, ఉత్తమ పురుషుల్లో అగ్రేసరులూ అయిన భాగవతోత్తములమాట అటుంచితే ఇక మిగిలిన వారివిషయం చెప్పడం ఎందుకు? కులం – విద్య – ధనం – బలం – వీటివల్ల విర్రవీగుతూ గర్వాంధకారంతో మసకబారిన మనస్సులతో శిశుపాలుడు మొదలైన మహీపతులు ఆ మహానుభావుణ్ణి దేవదేవుణ్ణిగా తెలుసుకోలేక పలికిన దుర్భాషలు, నిందావాక్యాలు తలుచుకుంటే నా మనస్సు క్షోభించిపోతూ ఉంటుంది.

మ. అవితృప్తేక్షణధీ సమాహిత తపోవ్యాసంగులైనట్టి భా
గవత శ్రేష్ఠుల కాత్మమూర్తి నిఖిలైక జ్యోతియైఁ జూపి శో
కవిశోకంబులు నిర్దహించి కమలాకాంతుండు శాంతుండు మా
నవరూపంబగు దేహమున్ వదలియంతర్ధానుఁడయ్యెంజుమీ. 88

* తనివి తీరక తన్ను చూచేవారికీ, బుద్ధియోగంతో తన్ను తెలుసుకోగోరినట్టి వారికీ, తన్నుగూర్చి తపస్సుచేసి భాగవతధర్మం అవలంబించినవారికీ, సమస్త సృష్టిలో తన్నే దర్శించే భక్తులకూ తన అఖండ జ్యోతి స్వరూపం చూపించి వారి జంజాటాలూ, దుఃఖాలూ పోగొట్టి ప్రశాంత సాక్షాత్కారం ప్రసాదించి లక్ష్మీవల్లభుడైన శ్రీకృష్ణుడు తన అవతారం చాలించి అంతర్హితు డయ్యాడు!

సీ. మానవైక వికాసమానమై తనకును
విస్మయజనకమై వెలయునట్టి
యాత్మీయ యోగమాయాశక్తిఁ జేపట్టి
చూపుచు నత్యంత సుభగ మగు
భూషణంబులకును భూషణంబై వివే
కముల కెల్లను బరకాష్ఠ యగుచు
సకల కల్యాణ సంస్థానమై సత్యమై
తేజరిల్లెడునట్టి దివ్యమూర్తి

తాన తనమూర్తి నిజశక్తిఁ దగ ధరింప
యమతనూభవు రాజసూయాధ్వరంబు
నందు నెవ్వని శుభమూర్తి నర్థితోడ
నిండు వేడుకఁజూచి వర్ణించి రెలమి.

* మానవులకు మహాభ్యుదయానికి అవధియై, త
ర్యాన్ని కల్గించే తనయోగ మాయాబలాన్ని స్వీకరించి
మిక్కిలి సుందరమై అలంకారాలకే అలంకారమై, జ్ఞానాని
సకల శుభాలకూ సన్నిధానమై, సత్యమై, నిత్యమై
మంగళమూర్తి తన ఆకారాన్ని తనశక్తివల్ల తానే ధరిం
రాజసూయ యాగంలో మూర్తిభవించిన ఆ నందనందను
ఎంతో ఆనందంతో అందరూ సందర్శించారు. ఎంతో స
వర్ణించారు.

క. ప్రకటముగఁ గమలభవ సృ
ష్టికిఁ గారణ మి మ్మహాత్ముఁడే యనుచును
త్సుకులై తన్మూర్తినిఁ ద
ప్పక చూచిరి గాదె తత్సభాజను లెల్లన్.

* ఆ నాడు ఆ సభలోని వారంతా "బ్రహ్మసృష్టి
కారణం ఈ మహానుభావుడే" అని ఉత్సాహంతో ఆయన స
స్వరూపాన్ని తదేకధ్యానంతో రెప్పవాల్చకుండా చూచా

వ. మఱియు శాంతోగ్రరూపధరుండైన సర్వేశ్వరుండు శాంత రూపుండు గావునఁ బరకృతాపరాధనిపీడ్యమాన మానసుండయ్యు ననుకంపాయత్తచిత్తుండై వర్తించు పరాపరుండును బ్రకృతికార్యం బైన మహత్తత్త్వరూపుండును జననవిరహితుండయ్యును దారు వులవలన ననలంబు దోఁచు చందంబున జననంబు నొందుచుండు నట్టి సరోజనాభుని హాసరాస లీలానురాగ విలోకన ప్రతిలబ్ధమాన లైన గోప కామినులు తన్మూర్తిదర్శనానుషక్తమనీషలం గలిగి వర్తించి రదియునుంగాక. 91

* శ్రీకృష్ణుడు వారి వారి స్వభావాలను అనుసరించి కొందరికి శాంతస్వరూపుడుగానూ, మరికొందరికి భయంకర స్వరూపుడుగాను కని పించుతాడు. ఆ సర్వేశ్వరుడు సహజంగా శాంత స్వభావుడు. అందువల్ల ఇతరులు తనకు చేసిన అపరాధాలకు ఆయన మనస్సు ఎంతో బాధపడు తున్నా వారియందు వాత్సల్యపరిపూర్ణమైన బుద్ధితోనే వర్తిస్తూ ఉంటాడు. ఆ పరాత్పరుడు ప్రకృతి కార్యమైన మహత్తత్త్వమే స్వరూ పంగా కలవాడు. పుట్టుకలేనివాడైనా కట్టెల్లోనుండి అగ్ని పుట్టినట్లుగా ఆవిర్భవిస్తూ ఉంటాడు. అటువంటి శ్రీకృష్ణుని చిరునవ్వులకూ, రాసక్రీడ లకూ, ప్రేమావలోకనాలకూ తహతహలాడుతున్న వ్రేపల్లెలోని గొల్లభామ లంతా ఆయన దివ్యసౌందర్య సందర్శనంలో పరవశమైన భావాలతో ప్రవర్తించారు. సరే ఈ సంగతి ఇలా ఉంచు.

చ. దివిజుల కోర్కెఁదీర్ప వసుదేవుని యింట జనించి కంస దా
నవుఁడు వధించునన్ భయమునంజని నందునియింటనుంటకున్
యవన జరా సుతాదులకు నాజి నెదుర్పడలేక సజ్జన
స్తవ మధురాపురిన్ విడిచి దాఁగుటకున్ మదిఁజింత నొందుదున్ 92

* అంతటి మహానుభావుడు దేవతల కోర్కె తీర్చడానికై వసుదేవుని ఇంట్లో జన్మించి నృశంసుడైన కంసుడు హింసిస్తాడేమో అనే భయంతో వెళ్ళి, నందుని ఇంట్లో చాటుమాటుగా పెరగటమూ – కాలయవనుడూ,

జరాసంధుడూ మొదలైన వాళ్ళను కదనరంగంలో ఎదిరించకుండా తప్పుకొని సజ్జన స్తవనీయమైన మధురాపట్టణాన్ని కూడా వదలిపెట్టి ఎక్కడో దాక్కోటమూ — ఈ రెండు సన్నివేశాలు స్మరించినపుడు నా మనస్సు దుఃఖంతో కుమిలి పోతుంది.

వ. అదియునుంగాక. 93

సీ. కడఁగి పెక్కిడుమలఁ గుడుచుచుఁ జిత్తముల్
గలఁగఁగ బంధనాగారములను
వనరిన దేవకీవసుదేవులను డాయఁ
జనుదెంచి భక్తి వందన మొనర్చి
తలిదండ్రులార ! యేఁ గలుగంగ మీరలు
కంసుని వలజడిఁ గ్రాఁగుచుండఁ
గడఁగి శత్రునిఁ జంపఁగా లేక చూచుచు
నున్న నా తప్పుఁ బ్రసన్ను లగుచుఁ

తే. గావుఁడని యానతిచ్చిన దేవదేవు
నద్భుతావహమధుర వాక్యములఁ దలఁచి
తలఁచి నా చిత్తమునఁ బెద్ద గలఁగుచుండుఁ
బృథులపాతక భూమిభృద్భిదుర ! విదుర ! 94

* ఇంతేకాదు, కొండలను వజ్రాయుధం చెండాడినట్లు ప్రచండ మైన పాపాలను పటాపంచలు చేసే ఓ విదురా! ఇది విను. గుండెనిబ్బరంతో ఎన్నో కష్టాలు అనుభవిస్తూ మనస్సంతా అల్లకల్లోలమవుతూ చిర కాలం చెరసాలలో బాధపడ్డారు దేవకీ వసుదేవులు. వారిదగ్గరకు వెళ్ళి కృష్ణుడు భక్తితో నమస్కారం చేసి "జననీజనకులారా! నేనుండగా మీరిద్దరూ కంసుని క్రూరకృత్యాలకు గురికావలసి వచ్చింది. ఆ దురాత్ముణ్ణి తుదముట్టించకుండా చూస్తూ ఉపేక్షించిన నా అపరాధాన్ని కృపతో క్షమించండి" అని విన్నవించుకొన్నాడు. ఆ దేవదేవుని అద్భుతమైన ఆ మృదుమధుర వచనాలను పదేపదే స్మరించి స్మరించి నాహృదయం ఎంతో వ్యథపడుతూ ఉంటుందయ్యా!

క. విమలమతిఁ దలఁప నెవ్వని
బొమముడి మాత్రమున నిఖిల భూదేవీ భా
రము వాయు నట్టి హరిపద
కమల మరందంబు గ్రోలు ఘనుఁ డెవ్వాఁడో ? 95

* వాస్తవానికి ఆయన కనుబొమలు ఒక్కమాటు ముడిపడితేచాలు; దుష్టశిక్షణ జరిగి భూభారమంతా తొలగి పోతుంది. అటువంటి ఆదిదేవుని పాదపద్మ మకరందాన్ని ఆస్వాదించే అదృష్టం పట్టిన మహాత్ముడేగదా ధన్యాత్ముడు!

క. మంద ప్రజ్ఞుఁడనై గో
విందుని మురదైత్యహరునిఁ విష్ణునిఁ బరమా
నందుని నందతనూజుని
మందరధరుఁ జిత్తమందు మఱతునె యెందున్. 96

* ఆ గోవిందుణ్ణి, ఆ మురాంతకుణ్ణి, ఆ విష్ణుస్వరూపుణ్ణి ఆ ఆనంద మయుణ్ణి, ఆ నందనందనుణ్ణి, ఆ మందరగిరిధరుణ్ణి ఎక్కడైనా ఎప్పుడైనా మరచిపోయేటంత మందబుద్ధినా నేను!

చ. అదియునుగాక మీరు నృపు లందఱుఁ జూడఁగ ధర్మసూతి పెం
పొదవిన రాజసూయసవనోత్సవ మందును జన్మమాదిగాఁ
బదపడి యెగ్గొనర్చు శిశుపాలుఁడు యోగిజనంబు లిట్టి ద
ట్టి దని యెఱుంగ నోపని కడిందిపదంబును నొందెనే కదా! 97

* మరొక్కమాట. తాను పుట్టినప్పటినుండీ పనిగట్టుకొని ఎన్నో ఎగ్గులు చేసినవాడేకదా శిశుపాలుడు. అటువంటి శిశుపాలుడు మీరందరూ చూస్తుండగా, సమస్తరాజులూ చూస్తూ ఉండగా ధర్మరాజు సర్వోత్తమంగా నిర్వహించిన రాజసూయ మహోత్సవంలో మహాయోగీంద్రుల మనస్సుకుకూడా అగమ్యగోచరమైన పరమపదాన్ని అందుకున్నాడుగదా!

చ. కురునృప పాండు నందను లకుంఠిత కేళిఁ జమూ సమేతు లై
యరిగి రణోర్వి నెవ్వని ముఖాంబురుహామృత మాత్మలోచనో
త్కరములఁ గ్రోలి పార్థ విశిఖప్రకర క్షత పూతగాత్రు లై
గురుతరమోక్షధామమునకుం జని సౌఖ్యమునొందిరో గదా! 98

* కౌరవులూ, పాండవులూ మొక్కపోని మగటిమితో, లెక్కలేని సైన్యాలతో కదనభూమికి కదలిపోయారు. అక్కడ రణవీరులు శ్రీకృష్ణుని ముఖారవిందాన్ని సందర్శిస్తూ, ఆ సౌందర్యమధురసాన్ని త్రాగుతూ కిరీటి శరాఘాతాలకు క్షతగాత్రులై పరమపవిత్రులై మహోన్నతమైన మోక్షాన్ని పొంది ఆనందించారు గదా!

సీ. అట్టి సరోజాక్షుఁ డాద్యంత శూన్యుండు
  సుభగుండు త్రైలోక్య సుందరుండు
కమనీయ సాగర కన్యకా కుచకుంకు
  మాంకిత విపుల బాహాంతరుండు
సకల దిక్పాల భాస్వత్కిరీటన్యస్త
  పద్మరాగారుణ పాదపీఠుఁ
డజుఁ డనంతుఁడు సమానాధిక విరహితుం
  డిద్ధమూర్తిత్రయాధీశ్వరుండు

తే. నైన హరి యుగ్రసేనుని నఖిలరాజ్య
రుచిర సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి
భృత్యభావంబు నొంది సంప్రీతి నతని
పనుపు సేయుట కెపుడు నా మనము గుందు. 99

* అటువంటి అరవిందాక్షుడు, ఆద్యంతరహితుడు, అత్యంత సుందరుడు, త్రిజగన్మనోహరుడు, అందాలు చిందే ఇందిరాదేవి చందోయి కుంకుమగుర్తులు హత్తుకొన్న విశాలవక్షఃస్థలంకలవాడు, సకలదిక్పాలకుల ధగధగమెరిసే బంగారు కిరీటాలలోని పద్మరాగాల కాంతులతో ఎర్రనైన పాదపీఠం కలవాడు, పుట్టడం గిట్టడం లేనివాడు, సాటిలేనివాడు, తనకంటె మేటిలేనివాడు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు అధీశ్వరుడు అయిన శ్రీకృష్ణుడు — కంసుని తండ్రిఅయిన ఉగ్రసేనుణ్ణి సర్వరాజ్యానికి పట్టంగట్టి సింహాసనం మీద కూర్చోబెట్టి తాను వానికి భృత్యుడై అతని ఆజ్ఞల్ని ఆనందంతో తలదాల్చటం తలచుకుంటె నామనస్సు ఎప్పుడూ ఎంతో సంతాపపడుతూ ఉంటుంది.

వ. అని వెండియు నిట్లనియె ననఘా! పరాత్పరుండును యోగీశ్వరేశ్వరుండును నగు కృష్ణుండు భగవద్భక్తుండును బరమ భాగవతోత్తముండును నైన యుగ్రసేనుని సేవించుట యాశ్చర్యంబు కాదు: తన్ను హరియింపందలంచి కుచంబుల విషంబు ధరియించి స్తన్యపానంబు సేయించిన దుష్టచేతన యైన పూతనకుం జన్నిచ్చి పెంచిన యశోదాదేవికి నైన నందరాని పదంబు గారుణ్యాయత్తచిత్తుండై యొసంగె ననిన నిజపద ధ్యానపరాయణు లగు వారల ననుసరించి సేవించుట సెప్పనేల? యనిన నుద్ధవునికి విదురుం డిట్లనియె: భక్తవత్సలుండును గారుణ్యజలనిధియునై భాగవత జనుల ననుగ్రహించు పుండరీకాక్షుండు నిజదాస లోకంబున కొసంగు పరమపదంబు సుగ్రకర్ములైన రాక్షసుల కెట్లొసంగె నత్తెఱం గెఱింగింపు మనిన విదురునకు నుద్ధవుండిట్లనియె. 100

* అని మళ్లీ ఇట్లా అన్నాడు ఉద్ధవుడు. ఓ పుణ్యుడా! పరాత్పరుడూ, పరమ యోగీశ్వరుడూ, అయిన శ్రీకృష్ణుడు-దైవభక్తుడు, ఉత్తమ భాగవతుడు అయిన ఉగ్రసేనుణ్ణి సేవించడం ఏమంత ఆశ్చర్యంగా లేదు; కాని తనను చంపాలని, చన్నులకు విషం పూసుకొని వచ్చి పాలిచ్చిన పరమపాతకురాలు పూతనకు మోక్షం ఇచ్చాడంటే-చన్నిచ్చి పెంచిన యశోదమ్మకు సైతం అతీతమైన పరమపదాన్ని కరుణార్ద్ర హృదయంతో ఆ ఘాతుకురాలికి ప్రసాదించాడంటే-ఇక నిజ పాదాల్ని నిరంతరం భావించే వారిని అంటిపెట్టుకొని సేవించటంలో విశేష మేమున్నది?

ఈ విధంగా పల్కిన ఉద్ధవునితో విదురుడు ఇట్లా అన్నాడు. "భక్తులపై వాత్సల్యం కలవాడూ, కరుణా సాగరుడూ, భాగవతులను పరిరక్షించే కమలాక్షుడు, తన అనుచరులకు ప్రసాదించే పరమపదాన్ని ఘోరకృత్యాలు చేసే క్రూర రాక్షసులకు ఎట్లా ఇచ్చాడు? ఆ కథంతా సవిస్తరంగా నాకు చెప్పు."

ఈ ప్రకారంగా అడిగిన విదురుణ్ణి చూచి ఉద్ధవుడు ఇట్లా అన్నాడు.

మ. దనుజానీక మనేక వారములు దోర్దర్పంబు సంధిల్లఁగా
వినతాసూను భుజావరోహుఁడగు నవ్విష్ణున్ సునాభాస్త్రుఁ దా
రనిలోమార్కొని పోకు పోకు హరి! దైత్యారాతియంచుం దదా
ననముంజూచుచుఁగూలిమోక్షపదమున్బ్రాపింతురత్యున్నతిన్. 101

* గరుడ వాహనారూఢుడూ, సుదర్శన చక్రధరుడూ అయిన శ్రీమన్నారాయణుని ఎందరో రాక్షసులు ఎన్నో పర్యాయాలు అవక్ర భుజ పరాక్రమంతో కదనరంగంలో ఎదుర్కొన్నారు. "ఓరీ హరీ! అసుర వైరీ! ఆగు! పారిపోకు! నిలు" అని ఆయన నామాన్నే అంటూ, ఆయన ముఖాన్నే కనుగొంటూ రణరంగంలో నేలగూలిన వారై ఆ రాక్షసులు మోక్షసామ్రాజ్యాన్ని చూరగొని అత్యున్నతమైన స్థానాన్ని పొందారు.

క. ధీరజనోత్తమ! నవ సిత
సారసలోచనుఁడు కృష్ణు జననంబును ద
చ్చారిత్రము నెఱిఁగింతు ను
దారత నీ విపుడు వినుము తద్విధ మెల్లన్. 102

* ధీరవరేణ్యా! నిగనిగలాడే తెల్లని కొందామరరేకులవంటి కందోయి కల ఆ నందకుమారుని జన్మవృత్తాంతాన్నీ, ఆయన లీలా విశేషాలనూ నీకు తేటతెల్లంగా వెల్లడిస్తాను. నీవు ఏకాగ్ర చిత్తంతో ఆకర్ణించు.

చ. ధరణిభరంబుఁ బాపుటకుఁ దామరసాసను ప్రార్థనన్ రమా
వరుఁ డల కంసబంధన నివాసమునన్ వసుదేవదేవకీ
వరులకునుద్భవింప బలవంతుఁడు కంసుఁడు హింససేయు న
న్వెఱపుననర్ధరాత్రిసుతునింగొనియవ్వసుదేవుఁడిమ్ములన్. 103

* పుట్టుక ఎరుగని ఆ శ్రియఃపతి భూభారాన్ని పోగొట్టడానికి, బ్రహ్మదేవుని ప్రార్థన మన్నించి కంసుని కారాగారంలో దేవకీ వసుదేవులకు పుత్రుడై పుట్టాడు. తన ముద్దుల కుమారుణ్ణి నృశంసుడైన కంసుడు హింసిస్తాడేమో అనే భయం కలిగింది వసుదేవుడికి. వెంటనే వసుదేవుడు ఆ నిసిరేయి పసివాణ్ణి చేతుల్లోకి తీసుకుని బయలుదేరాడు.

క. నందుని మందకుఁ జని త
త్సుందరి తల్పమునఁ బరులు సూడకయుండన్
నందనుని నునిచి యానక
దుందుభి మఱలంగ నేఁగెఁ దొల్లిటి పురికిన్. 104

* నందుడున్న వ్రేపల్లెకు వెళ్ళాడు. ఎవ్వరూ చూడకుండా నందుని భార్య యశోద పక్కలో బాలుణ్ణి పడుకోబెట్టాడు. తిరిగి మధురా నగరం లోని తన కారాగారానికి వచ్చాడు.

క. హరి యేకాదశ సంవ
త్సరములు నందవ్రజమునఁ దను హరి యని యె
వ్వరు నెఱుఁగకుండ నా హల
ధరుతోఁ గ్రీడించుచుండె దద్దయుఁ బ్రీతిన్. 105

* నంద గోకులంలో బాల ముకుందుడు నందనందనుడై అన్న బలరామునితో కలిసి ఆనందంగా ఆడుకుంటున్నాడు. ఇలా పదకొండు సంవత్సరాలు గడిచాయి. అయినా శ్రీహరి అవతారమని ఎవరూ గుర్తించలేదు.

క. గోపాల వరుల కైనను
నాపోవఁగఁ దన సమంచితాకార మొగిం
జూపని శ్రీపతి వేడుక
గోపాలురఁ గూడి కాచె గోవత్సములన్. 106

* కొమ్ములు తిరిగిన దేవతలకు సైతం కన్నుల విందుగా తన దివ్య స్వరూపాన్ని చూపించని రమాపతి తోడి గొల్ల పిల్లలతో కూడి ఆడుతూ ఎంతో వేడుకగా ఆవుల్నీ దూడల్నీ కాచాడు.

వ. అయ్యవసరంబునం గృష్ణుండు లీలావినోదంబులు దోడి గోపాలబాలురకుం జూపం దలంచి. 107

* ఆ సమయంలో శ్రీకృష్ణుడు తనతో ఉండే గోపాలబాలురకు తన లీలలూ వినోదాలూ చూపించా లనుకున్నాడు.

చ. వరయమునా నదీ సలిల వర్ధిత సౌరభ యుక్త పుష్పమే
దుర మకరంద పాన పరితుష్ట మధువ్రత యూథ మాధవీ
కురవక కుంద చందన నికుంజములందు మయూర శారికా
పరభృత రాజకీరమృదుభాషలభంగిఁ జెలంగి పల్కుచున్. 108

* ఆ బాలగోపాలుడు నిర్మలాలైన యమునానదీ జలాలతో పెరిగి పెద్దవైనవీ, గుమగుమలాడే పూలనిండా చిందుతున్న మకరందాన్ని కడుపునిండా త్రాగి మైమరచిన తుమ్మెదల గుంపులతో కూడినవీ అయిన మాధవీ మంటపాలలో - గోరింట గుబురులలో - మొల్ల పొదలలో - మంచి గంధపు నికుంజాలలో దూరి - నెమలిలాగా కేకలు వేస్తూ, గోరువంకలాగా కూతలు కూస్తూ, కోకిలలాగా రాగాలు తీస్తూ, రామచిలుకలాగా రమణీయ ధ్వనులు చేస్తూ ఉండేవాడు.

ఉ. శ్రీరమణీ మనోవిభుఁడు సింహ కిశోరముఁ బోలిలీలఁ గౌ
మారదశన్ రమా విమల మందిరముం బురుడించుగోతతిన్
వారక మేపుచుండెఁ దన వంశ రవ స్ఫుట మాధురీ సుధా
సారముచేతగోపజనసంఘములన్ముదమందఁ జేయుచున్. 109

* ఇందిరా వల్లభుడైన ఆ నందకుమారుడు తన కుమారదశలో సింహకిశోరంలాగా ప్రకాశించాడు. లీలగా పిల్లనగ్రోవిని మ్రోగిస్తూ ఆ మధురగాన సుధా సరస్సులో గోగోపబృందాన్ని ముంచితేల్చి పరవశింప జేస్తూ లక్ష్మీనివాసాలైన గోవుల్ని మేపుతూ ఉండేవాడు.

వ. మఱియును, 110

మ. చిరకేళీరతి బాలకుల్ తృణములన్ సింహాది రూపంబులం
గరమొప్పన్విరచించివానిమరలన్ఖండించుచందంబునం
గరుడాతీతులఁ గామరూప లగు నక్కంసప్రయుక్త క్షపా
చరులంగృష్ణుఁడుసంగరస్థలములంజక్కాడెలీలాగతిన్. 111

* చిన్న పిల్లలు ఆడుకోటానికి - గడ్డితో సింహం మొదలైన బొమ్మల్ని తయారుచేస్తారు. ఆట పూర్తి కాగానే వాటిని మళ్లీ చించి

తుంచి పారేస్తారు. అదే విధంగా, కరుణా దూరులూ, కామరూపధారులూ, కంసుని చారులూ అయిన రాక్షసవీరుల్ని ఎందరినో గోవిందుడు కదన రంగంలో అవలీలగా చించి చెండాడినాడు.

చ. వర యమునా నదీ జల నివాస మహోరగ వి స్తృతాస్య వి
స్ఫురిత విషానల ప్రభల సోఁకునఁ గ్రాఁగిన గోపగోధనో
త్కరముల నెల్లఁ గాచి భుజగప్రవరున్వెడలంగఁ దోలి త
త్సరి దమలాంబు పానమునసంతసమందఁగఁజేసెగోత్తతిన్. 112

* యమునా నదిలో ఒక భయంకరమైన మహాసర్పం నివాసం చేస్తూ ఉండేది. విశాలంగా తెరచిన దాని ముఖంలోనుంచి వెలువడే విషానల జ్వాలల తాపానికి గోపాలకులు తాళలేక పొయ్యేవారు. గోధనం బాధ పడుతూ ఉండేది. నందనందనుడు ఆ నాగరాజును నదిలోనుంచి తరిమి వేశాడు. గోవుల్ని కాపాడి వాటికి మళ్లీ ఆ నదిలోని నిర్మలమైన నీటిని త్రాగే అవకాశాన్ని అనుగ్రహించాడు. అందరికీ ఆనందం కలిగించాడు.

మ. దివిజాధీశు గుఱించి వానకొఱకై దీపింప నందాది వ
ల్లవు లేటేఁట ననూన సంపదల నుల్లాసంబునం జేయు ను
త్సవముంగృష్ణు డుమాన్పిగోపగణముల్సంప్రీతినొందన్శచీ
ధవుగర్వంబడఁపంగనవ్యయముగాఁదాఁజేసెగోయాగమున్. 113

* వర్షం బాగా కురియుటంకోసం నందుడు మొదలైన యాదవులు ఇంద్రుణ్ణి గూర్చి ఎంతో వైభవంతో, ఎంతో ఉత్సాహంతో ఏటేటా గొప్ప ఉత్సవం చేసేవారు. కృష్ణుడు, ఆ ఇంద్రోత్సవాన్ని మాన్పించి ఇంద్రుని అహంకారం అడుగంటేటట్లూ, గోపాలు రందరూ సంతోషించేటట్లూ గోపూజ ప్రధానమైన గోయాగాన్ని తక్కువ వ్యయంతో, ఎక్కువ వైభవంతో జరిపించాడు.

చ. హరిహయుఁ డంత రోషవివశావిల మానసుఁడై సరోరుహో
దరు మహిమం బెఱుంగక మదం బడరంగ వలాహకాదిభీ
కరఘన పంక్తిఁ బంపిన నఖండ శిలామయభూరి వర్షముల్
గురిసె ననూన గర్జనల గోకుల మాకుల మొందుఁ గుందఁగన్. 114

* ఈ విషయం తెలుసుకొని ఇంద్రుడు ఆగ్రహోదగ్రుడైనాడు. అతడి మనస్సు ద్వేషంతో, రోషంతో నిండి పోయింది. పద్మనాభుని మహత్త్వం తెలుసుకోలేక అహంకారంతో "వలాహకం" మొదలైన భయంకర కాలమేఘాల్ని పంపించాడు. ఆ కారుమబ్బులు గోకులమంతా శోకవ్యాకులమై పోయేటట్లు పెద్దగా ఉరుముతూ ఎడతెగకుండా రాళ్లవర్షం కురిశాయి.

ఉ. ఆ తఱి మంద కొండలము నందఁగ వల్లవులెల్లఁ గృష్ణ యీ
చేతను లెల్ల నిట్టి జడిఁ జిందఱ వందఱలై కలంగుచుం
గాతరులైరి నీవు కృపఁ గావుము కావు మనాథనాథ! ని
ర్ధూతకళంక! భక్తపరితోషణ భూషణ! పాప శోషణా! 115

* అప్పుడు వ్రేపల్లెలోని గోపాలురూ, గోవులూ ఆ వర్షానికి అల్లకల్లోలమైనారు. గొల్లలంతా తల్లడిల్లి ఒకచోట చేరారు. "కృష్ణా! రక్షించు రక్షించు. దిక్కులేని వారికి నీవే దిక్కు. నీవు నిష్కళంకుడవు! సజ్జన పోషకుడవు! దుర్జన శోషకుడవు! ఈ జడివాన ధాటికి గోకులంలోని ప్రాణులంతా చీకాకుపడి చిందరవందరైనారు. దయతో కాపాడు!"

మ. అనియిబ్భంగివిపన్నులైపలుకఁగుయ్యాలించికృష్ణుండుస
జ్జన వర్ధిష్ణుఁడు గోప గో నివహ రక్షా దక్షుఁడై దేవతా
జనులగ్గింపఁగరాంబుజాతముననచ్ఛత్రంబుఁగాఁ దాల్చెబో
రన గోవర్ధన శైలముం దటచరద్దమ్యామరీజాలమున్. 116

* ఈ విధంగా ఆపన్నులైన వ్రేపల్లె గోపాలకులందరూ ప్రార్థింపగా, సజ్జనుల పెంపుకోరే కృష్ణుడు, వారి మొర ఆలకించి, గోవులనూ, గోపాలకులనూ కాపాడటానికి నడుం కట్టాడు. చక్కని దేవతా స్త్రీలు విహరించే చరియలుగల గోవర్ధన పర్వతాన్ని ఒక్క చేత్తో గొడుగుగా ఎత్తి పట్టాడు. ఆ దృశ్యం ఆలోకించి ఆకాశంలోని అమరులంతా 'బళీ' అని ప్రశంసించారు.

వ. వెండియు. 117

సీ. శర దాగమారంభ సంపూర్ణ పూర్ణిమా
చంద్ర సాంద్రాతపోజ్జ్వలిత మగుచు
వెలయు బృందాటవీ వీథియం దొకనాఁడు
రాసకేళీ మహోల్లాసుఁ డగుచు
రుచిర సౌభాగ్యతారుణ్య మనోరమ
స్ఫూర్తిఁ జె న్నొందిన మూర్తి దనర
సలలిత ముఖచంద్ర చంద్రికల్ గోపికా
నయనోత్పలముల కానంద మొసఁగ

భవ్య చాతుర్య భంగిఁ ద్రిభంగి యగుచు
నబ్జనాభుఁడు సమ్మోద మతిశయిల్ల
లీలఁ బూరించు వర మురళీ నినాద
మర్థి వీతేర విని మోహితాత్మ లగుచు. 118

* మరొక్క సంగతి. శరత్కాలం ప్రారంభమైంది. పూర్ణిమనాటి నిండు చందమామ పండువెన్నెలలో బృందావనం కన్నుల విందు చేస్తున్నది. ఒకనాడు కృష్ణునకు రాసకేళిపై ఉల్లాసం కలిగింది. అందాలు చిందే రూపంతో హృదయంగమమైన నవయౌవనంతో భువనమోహన మూర్తియై తన ముఖచంద్రుని కాంతులతో గోపికల కను కలువలకు ఆనందాన్ని అందిస్తూ నందనందనుడు 'త్రిభంగి'గా నిలబడి వేణుగానం కావించాడు. ఆ మువ్వంకల ముద్దుకృష్ణుని మురళీనినాదం వీనులవిందుగా విని వ్రేపల్లెలోని గోపికలు మైమరచి పోయారు.

చ. పతులుమఱందులున్సుతులుబావలునత్తలుమామలున్సము
న్నతి వలదన్న మానక మనంబునఁ గృష్ణ పదాబ్జ సేవనా
న్వితరతి గోప కామినులు వేచనుదేర దయాపయోధి శో
భితగతి రాసకేళి సలిపెం దరుణీనవపుష్పచాపుఁడై. 119

* తమ భర్తలూ, మరుదులూ, కొడుకులూ, బావలూ, అత్తలూ, మామలూ ఎంతగానో వెళ్ళవద్దని చెప్పినా ఏమాత్రం వినకుండా చిత్తాలలో శ్రీకృష్ణుని పాదపద్మాలను ఆరాధించాలనే ఆరాటం అధికంకాగా గోపికలు

పరుగు పరుగున వచ్చారు. కరుణాసముద్రుడైన శ్రీకృష్ణుడు, ఆ జవ రాండ్ర పాలిటి నవమన్మథుడై రమ్యమైన రాసకేళీ నాట్యంతో వారందరినీ ఆనందింపజేశాడు.

ఉ. రాముఁడుదానుగూడి మధురాపురికిం జనియందు వైభవో
ద్దామనృపాసనంబునముదంబుననున్న దురాత్ముఁగంసుదు
ష్టామరశత్రుఁద్రుంచి ముదమారఁగఁతల్లినిదండ్రి నంచిత
శ్రీమహితాత్ములై తనరఁజేసెసరోరుహనాభుఁడున్నతిన్. 120

* అనంతరం అన్నగారైన బలరామునితో కలిసి మాధవుడు మధురకు వెళ్ళాడు. అక్కడ మహావైభవంగా మదోన్మత్తుడై మణిమయ సింహాసనాన్ని అధిష్ఠించి ఉన్న దుర్మార్గుణ్ణి దుష్టరాక్షసుణ్ణి కంసుణ్ణి సంహరించాడు. తల్లిదండ్రులైన దేవకీ వసుదేవుల్ని బంధవిముక్తుల్ని గావించి భోగభాగ్యాలతో సంతుష్టులై సమున్నతులై ఉండేటట్లు చేశాడు.

మ. నలువొప్పంగషడంగయుక్తమహితామ్నాయంబుచౌషష్టివి
ద్యలుసాందీపనిచేనెఱింగెఁ జెలువొందన్‌విన్నమాత్రంబులో
పలనే లోకగురుండు దానతనకున్‌భావింపనన్యుల్ గురు
ల్గలరే లోకవిడంబనార్థమగులీలల్‌గావె యమ్మేటికిన్. 121

* శ్రీకృష్ణుడు సమస్త జగత్తుకూ గురువు. అయినా శ్రద్ధగలవాడై షడంగాలతో కూడిన వేదాల్ని, అరవైనాల్గు కళల్ని "సాందీపని" అనే గురువుగారి సన్నిధిలో అభ్యసించాడు. విన్న మరుక్షణంలోనే అన్ని చక్కగా అవగతం చేసుకొన్నాడు. నిజానికి జగద్గురువులకు ఇతరులు గురువులు అవుతారా? ఇవన్నీ ఆ పరాత్పరుడు లోకాచారం కోసం చేసే లీలలు కాక మరేమిటి?

ఉ. మించిప్రభాసతీర్థమునమృత్యువశంబునఁబొందిపోయియా
పంచజనోదరస్థుఁడగు బాలకు దేశికనందనుం బ్రభో
దంచిత లీలఁ దెచ్చి గురుదక్షిణగా నతిభక్తి యుక్తి న
ర్పించెగురుండుచిత్తమునఁబెంపెసలారమురారి వెండియున్.

* శ్రీకృష్ణుడు తన ఆచార్యునకు అపరిమితానందం కలిగించేటట్లు సమర్పించిన గురుదక్షిణ పేర్కొనదగింది. ఒకనాడు గురుపుత్రుడు ప్రభాస తీర్థంలో స్నానం చేస్తున్నాడు. అతనికి చావు ముంచుకొని వచ్చింది. పంచజనుడనే రాక్షసుడు అతణ్ణి పొట్టపెట్టుకున్నాడు. ఆ సందర్భంలో ఆ మృతబాలకుణ్ణి రక్షించి శ్రీకృష్ణుడు గురువుగారి కోరిక మేరకు గురుదక్షిణగా తెచ్చియిచ్చాడు.

సీ. ఘనుఁడు విదర్భేశుఁ డన నొప్పు భీష్మకు
  వరసుతామణి నవవారిజాక్షిఁ
బద్మా సమాన రూపశ్రీ విభాసితఁ
  గమనీయభూషణఁ గంబుకంఠిఁ
జతురస్వయంవరోత్సవ సమాగత చైద్య
  సాల్వ మాగధ ముఖ్య జనవరేణ్య
నికర సమావృతఁ బ్రకట సచ్చారిత్ర
  రుక్మిణి ననమాన రుక్మ కాంతి

తే. నమరగుప్తామృతంబు విహంగ విభుఁడు
గొనిన కైవడి మనుజేంద్ర కోటి దోలి
కమలనాభుండు నిజభుజాగర్వ మలరఁ
దెచ్చి వరియించె నతని నుతింప వశమె? 123

* విదర్భ దేశాధిపతి భీష్మకుడు. ఆయన ముద్దుల కూతురు రుక్మిణి. అందమైన ఆమె కన్నులు క్రొందామర రేకులు. లక్ష్మీసమాన రాలైన లావణ్యరాశి ఆమె. శుభంకరాలైన అలంకారాలతో శంఖంవంటి కంఠంతో సాటిలేని మేటి బంగారు చాయతో సంస్తవనీయమైన సత్ప్రవర్తనంతో విరాజిల్లే రుక్మిణికి స్వయంవరం ప్రకటించారు. ఆ స్వయంవర మహోత్సవానికి శిశుపాలుడు, సాల్వుడు, జరాసంధుడు మొదలైన రాజాధిరాజులంతా వచ్చి పడ్డారు. దేవతలు రక్షించుతున్న అమృత కలశాన్ని పక్షిరాజైన గరుత్మంతుడు ఎగురదన్నుకొనిపోయిన విధంగా భగవంతుడైన శ్రీకృష్ణుడు తన బాహుబలాన్ని ప్రదర్శించి ఆ రాజు లందరినీ

పరాజితులనుగావించి రుక్మిణిని తీసుకొనివెళ్ళి పరిణయమాడాడు. అటు
వంటి ఆ జగదేక వీరుణ్ణి పొగడడం ఎవరికి సాధ్యమౌతుంది.

చ. పరువడిఁ బట్టి సప్తవృషభంబుల ముక్కులు గుట్టఁ దద్బల
స్ఫురణ సహింపఁజాలక నృపుల్ దలపడ్డ జయించి నగ్నజి
ద్ధరణిపు నందనన్ వికచ తామరసాక్షిఁ బ్రమోదియై స్వయం
వరమునఁబెండ్లియాడెగుణవంతుఁడనంతుఁడనంతశక్తితోన్. 124

* అంతేకాదు ఏడు మదించిన ఆబోతులున్నాయి. వాటి ధాటికి
నిలువలేక రాజులంతా పలాయనం చిత్తగించారు. అటువంటి సమయంలో
శ్రీకృష్ణుడు ఎదురొడ్డి నిలిచి తన అపారశక్తితో ఆ ఆబోతులకు ముక్కు
తాళ్ళు బిగించి వాటిని లొంగదీసుకొన్నాడు. వికసించిన తామరరేకులవంటి
కన్నులుగల రాజపుత్రి నాగ్నజిత్తిని గుణవంతుడూ, అనంతుడూ, అనంత
శక్తిమంతుడూ అయిన గోపాలకృష్ణుడు సంతోషంతో స్వయంవరంలో
పెండ్లాడాడు.

మ. ప్రతివీరక్షయకారి నాఁబరఁగి సత్రాజిత్తనూజా హృదీ
ప్సితముం దీర్పఁ దలంచి నాకమునకుం బెంపారఁగా నేఁగి వ
ర్ణిత శౌర్యోన్నతిఁ బారిజాత మిలకుఁ లీలాగతిం దెచ్చె ను
ద్ధతి దేవేంద్రు జయించి కృష్ణుఁడన నేతన్మాత్రుఁడేచూడఁగన్
125

* శత్రువీరులకు సింహస్వప్నంగా పేరుగాంచిన యదుసింహుడు
సత్యభామ మనస్సులోని కోర్కెను తీర్చడానికై స్వర్గానికి జైత్రయాత్ర
సాగించి ప్రశంసనీయమైన పరాక్రమాతిశయంతో ఇంద్రుణ్ణి జయించి,
పారిజాతాన్ని అవలీలగా దివినుండి భువికి తీసుకొనివచ్చాడు. అటువంటి
జగన్మాన్యుడు కృష్ణుడు సామాన్యుడా?

సీ. మానితాఖిల జగన్మయ దేహమునఁ బొల్చు
ధరణిదేవికిఁ బ్రియతనయుఁ డైన
నరక దానవుని సునాభాఖ్యఁ జెన్నొందు
ఘన చక్రధారా విఖండితోత్త

మాంగునిఁ జేయ నయ్యవనీ లలామంబు
వేఁడినఁ దత్పుత్త్ర విపుల రాజ్య
పదమున నిల్పి లోపలి మందిరంబులఁ
జిరముగ నరకుండు సెఱలఁ బెట్టి

తే. నట్టి కన్యలు నూఱుఁ బదాఱువేలు
నార్త బంధువుఁడైన పద్మాక్షుఁ జూచి
హర్ష బాష్పాంబు ధారా ప్రవర్ష మొదవఁ
బంచశర బాణ నిర్భిన్న భావ లగుచు. 126

* సమస్త జీవులకు అంతర్లీనమైన రూపం ధరించి గౌరవాన్ని అందుకొనే భూదేవికి ప్రియమైన కుమారుడు నరకుడు. అయినా వాడు రాక్షస లక్షణాలు కలవా డయినందువల్ల శ్రీకృష్ణుడు "సునాభము" అనే పేరుగల చక్రము అంచుతో అతని శిరస్సును త్రుంచివైచినాడు. అనంతరం ధరణీమాత ప్రార్థింపగా అతని కుమారుణ్ణి ఆ విశాల సామ్రాజ్యానికి అధిపతిగా చేశాడు. ఆ నరకాసురుని అంతఃపురంలోని చెరసాలలో క్రుమ్గుతున్న పదారువేల నూర్గురు కన్యలను విడిపించాడు. సులక్షణలైన ఆ హరిణేక్షణ లందరూ ఆర్తజన రక్షకుడైన కమలాక్షుని వీక్షించి హర్షిస్తూ ప్రమోదబాష్పాలు వర్షిస్తూ ఆయన దివ్య సౌందర్యానికి ఆకర్షిత లైనారు.

చ. లలిత తదీయ సుందర విలాస విమోహిత లైన వారి నిం
పొలసినకోర్కిఁ దీర్చుటకునొక్క సుహూర్తమునన్వరించి క
న్యల లలితావరోధభవనంబుల నందఱ కన్ని రూపులై
కలసి సుఖస్థితిందనిపెఁ గాంతల భక్తి నితాంతచిత్తలన్. 127

* అందాలరాశియైన నందనందనుడు తన సౌందర్యవిలాసాలకు వ్యామోహం చెందిన ఆ సుందరీమణుల కోర్కె తీర్చటంకోసం ఒక్క సుముహూర్తంలోనే వారందరినీ పెండ్లాడాడు. అత్యంతమనోహరాలైన అంతఃపురాలలో అందరికీ అన్ని రూపులై అంతులేని అనురాగంతో కూడిన స్వాంతాలు గల ఆ కాంతాలలామలను సంతోషపరచాడు.

క. చతురతతో నం దొక్కొక
యతివకుఁ బదురేసి సుతులఁ నాత్మసముల ను
న్నత భుజశక్తులఁ గాంచెను
వితతంబై కీర్తి దిశల వినుతికి నెక్కన్. 128

* చతురకళానిధి అయిన శ్రీకృష్ణుడు తనకు సాటిఅయిన మేటి పరాక్రమంగల కుమారులను ఒక్కొక్క భార్యకు పదిమంది చొప్పున ప్రసాదించాడు. నలుదిశలా విశాలమైన యశోదీప్తులు నిండించాడు.

సీ. మధురాపురముఁ జతు ర్విధ బలౌఘములతో
నావరించిన కాలయవన సాల్వ
మగధ భూపాలాది మనుజేంద్ర లోకంబు
సైన్యయుక్తముగాఁగ సంహరించి
తన బాహుశక్తిఁ జిత్తముల నర్థించిన
భీమ పార్థులకు నుద్దామ విజయ
మొసఁగి తద్వైరుల నుక్కడంగఁగఁ ద్రుంచి
బాణ శంబర ముర పల్వలాది

తే. దనుజ నాయక సేనా వితానములను
హలధరాది సమేతుఁడై హతులఁ జేసె
దంతవక్త్రాది దైత్యులు దన్ను నెదుర
ఖండనములోనఁ ద్రుంచె దోర్బలము మెఱసి. 129

* కాలయవనుడు, సాల్వుడు, జరాసంధుడు మొదలైన మహీపతులంతా, చతురంగ బలసహితులై మధురాపురాన్ని చుట్టుముట్టారు. ఆ రాజలోకాన్ని సేనానీకంతో సహా శ్రీ కృష్ణుడు సంహరించాడు. మనసార తన అండదండలను అర్థించిన భీమార్జునులకు సాటిలేని విజయశ్రీని సమకూర్చాడు. మదోన్మత్తులైన వారి శత్రువులను తుదముట్టించాడు. బలరాముణ్ణి వెంటబెట్టుకొని, బాణుడు, శంబరుడు, మురుడు, పల్వలుడు

అనే రాక్షస నాయకుల్ని, సేనలతోసహా సంహరించాడు. కదనరంగంలో ఎదిరించిన దంతవక్త్రుడు మొదలైన దానవుల్ని అవక్రవిక్రమంతో నేల కూల్చాడు.

వ. వెండియుం గృష్ణుండు కౌరవ పాండవ ఖండనంబునకుం దోడ్పడి రాజన్యు లన్యోన్య మాత్స ర్యోత్సాహసమేతులై సైనిక పాదఘట్టనంబుల ధరాచక్రంబు కంపింప ననన్య సామాన్యంబులైన శంఖ భేరీ ప్రముఖ తూర్యఘోషంబుల నింగి మ్రింగఁ దురంగమ రింఖా సముద్ధూత ధూళీ పటల పరిచ్ఛన్న భాను మండలంబుగాఁ జనుదెంచి కురుక్షేత్రంబున మోహరించిన నుభయపక్షబలంబులం దునుమాడి నిఖిలరాజ్యవైభవ మదోన్మత్తుం డయిన సుయోధనుండు నిఖిలరాజ సమక్షంబునఁ గర్ణ శకుని దుశ్శాసనాదుల దుర్మంత్రంబున నిరంతరంబుఁ గుంతీ నందనుల కెగ్గు చేసిన దోషంబునం జేసి సంగరరంగంబున భీము గదాఘాతంబునం దొడలు విఱిగి పుడమింబడి గతాయుశ్శ్రీ విభవుండై యుండఁ జూచినంగదా పరితుష్ట చిత్తుండనగుదు నని యపరిమిత బాహుబలోత్సాహులైన భీష్మ ద్రోణ భీమార్జునులచేత నిఖిలధరాపతుల నష్టాదశాక్షౌహిణీ బలంబులతోడం దునిమించి మఱియు స్వసమానబలులైన యదువీరుల జయింప నెంతవారలకైనం దీరదు; మధుపాన మదవిఘూర్ణితాతామ్ర విలోచనులై ప్రవర్తించు యాదవుల కన్యోన్య వైరంబులు గల్పించి పోరించి యితరేతర కరాఘాతంబుల హతులై తన్నుఁ గలసినంగాని భూభారం బుడుగదని చిత్తంబునం దలంచి యంత ధర్మనందనుచే నిస్సపత్నంబగు రాజ్యంబు పూజ్యంబుగాఁ జేయించుచు మర్త్యులకుం గర్తవ్యంబులైన ధర్మపథంబులు సూపుచు, బంధు మిత్రులనెల్లఁ బరితోషంబు నొందించుచుం దత్పరోక్షంబున వారి వంశం బుద్ధరింపం దలంచి యభిమన్యువలన నుత్తరయందు గర్భంబు నిలిపి, గురుతనయ ప్రయుక్తమహిత బ్రహ్మాస్త్రపాతం

బునం దగ్ధర్భదళనంబు గాకుండ నర్భకుని రక్షించి, నిజపదార విందసేవారతుండైన ధర్మసుతుచేఁ గిరి ప్రతాపంబులు నివ్వటిల్లం దురంగమేధంబులు మూఁడు సేయించి వెండియు. 130

* దుర్యోధనుడు సమస్త మహీరాజ్య మహాసంపత్తివల్ల మదోన్మత్తుడైనాడు. కర్ణ, శకుని, దుశ్శాసనుల దురాలోచనలూ, దుర్బోధలూ తల కెక్కి, తెగనిక్కి పాండవులకు తగని, ఎడతెగని ఎన్నెన్నో ఎగ్గులు చేశాడు. ఆ పాపానికి ప్రాయశ్చిత్తంగా సంగ్రామంలో భీముని ప్రచండ గదా ఘాతంతో తొడలు విరిగి, ప్రాణాలు సురిగి, రాజ్యం పోయి ప్రతిష్ఠ గోల్పోయి భూమిమీద పొరలాడుతున్న రారాజును చూడాలని వేడుక కలిగింది శ్రీకృష్ణస్వామికి. కౌరవపాండవుల పోరాటం నిశ్చయమయింది. ఉభయ పక్షాల రాజులూ పెచ్చు పెరిగిన మచ్చరంతో ఉరకలు వేసే ఉత్సాహంతో కురుక్షేత్రంలో యుద్ధానికి సన్నద్ధులై నిలిచారు. సైనికుల చరణ ఘట్టనలకు ధరణి కంపించింది. శంఖధ్వానాలకూ భేరీపటహాది వాద్యధ్వనులకూ ఆకాశం దద్దరిల్లింది. గుర్రాలడెక్కల తొక్కిడికి రేగిన పరాగపటలాలు సూర్యమండలాన్ని కప్పివేశాయి.

ఒకరు మరొకరి చేతుల్లో చచ్చి తనలో చేరితే తప్ప భూభారం తగ్గదు అనుకొన్నాడు శ్రీకృష్ణుడు. అపారపరాక్రమోపేతులూ, అపరిమితోత్సాహసమేతులూ అయిన భీష్మ ద్రోణులను ఒక పక్షంలోనూ, భీమార్జునులను ఒక పక్షంలోనూ నిలిపి మదోన్మత్తులైన మహీపతులతోపాటు పదునెనిమిది అక్షౌహిణుల సైన్యాన్ని సైతం చంపించాడు. తనతో సమానమైన బలం గల యాదవయోధుల్ని నిర్జించటం ఎంతబలవంతులకైనా సాధ్యం కాదు. అందువల్ల మద్యపానం వల్ల మత్తెక్కి గిరగిర తిరుగుతూ ఎర్రబడిన కన్నులతో కన్నుమిన్ను గానని యదువీరులకు వారిలో వారికే వైరాలు పెట్టించి, పోరాటాలు పుట్టించి తదకు అందరినీ తుదముట్టించాడు. అలా అన్యోన్యం కొట్టుకొని మరణించి తనలో చేరితేనే కాని భూభారం తగ్గదని భావించిన వాసుదేవుడు ధర్మరాజుచే నిష్కంటకమైన రాజ్యాన్ని ప్రశంసనీయంగా పాలింపచేశాడు. మానవులకు అవశ్యకాలైన ధర్మమార్గాలను ప్రతిష్ఠించాడు. బంధువులకూ, మిత్రులకూ పరమానందాన్ని కలిగించాడు. పాండవ వంశాన్ని నిలుపదలచి అభిమన్యుని అర్ధాంగి అయిన

ఉత్తర గర్భాన్ని రక్షించాడు. అశ్వత్థామ ప్రయోగించిన అమోఘమైన బ్రహ్మాస్త్రం వల్ల ఆమె గర్భంలోని అర్భకుడికి హానికలుగ కుండా కాపాడాడు. తన చరణ కమలసేవా పరాయణుడైన ధర్మతనయుని పేరు ప్రతిష్ఠలూ, శౌర్యసాహసాలూ ప్రకటితం అయ్యేట్లు ఆయనచేత మూడు అశ్వమేధయాగాలు చేయించాడు:

సీ. వలనొప్ప లౌకిక వైదిక మార్గముల్
నడపుచు ద్వారకానగర మందు
నవిదితాత్మీయ మాయా ప్రభావమున ని
స్సంగుఁడై యుండి సంసారిపగిదిఁ
జెంది కామంబులచేత విమోహితుం
డై సుఖించుచు ముదితాత్ముఁ డగుచు
నంచిత స్నిగ్ధ స్మితావలోకముల సు
ధా పరిపూర్ణ సల్లాపములను

తే. శ్రీ నికేతన మైన శరీరమునను
బాండునందన యదుకుల ప్రకరములను
లీలఁ గారుణ్య మొలయఁ బాలించుచుండె
నార్త రక్షాచణుండు నారాయణుండు. 131

* భక్త రక్షణ దీక్షాపరాయణుడైన శ్రీమన్నారాయణుడు ద్వారకా పట్టణంలో నివసిస్తూ వైదికములూ, లౌకికములూ అయిన సముదాచారాలను సక్రమంగా చక్కగా నిర్వహిస్తూ తన మాయామహత్వం అభివ్యక్తం కాకుండా ప్రవర్తించాడు. ఏమీ అంటనివాడై కూడా సంసారిలాగా, కోరికలకు ఆకర్షితుడైన వానిలాగా, భోగభాగ్యాలతో నిత్య సంతోషియై ఉన్నాడు. సౌందర్యలక్ష్మికి మందిరమైన దేహంతో, అతిశయించిన స్నేహంతో, చిరునవ్వులు విరిసే కడగంటి చూపులతో, అమృతం కురిసే సరససల్లాపాలతో ఇటు పాండవులనూ, అటు యాదవులనూ ఆనందింపజేస్తూ కరుణతో లాలించి పాలించాడు.

పో. భా. కృ. 4:

సీ. సంపూర్ణ పూర్ణిమా చంద్ర చంద్రిక నొప్పు
రమణీయ శారద రాత్రు లందు
సలలిత కాంచన స్తంభ సౌధోపరి
చంద్రకాంతోపల స్థలములందు
మహిత కరేణుకా మధ్య దిగ్గజముల
గతిని, సౌదామనీ లతల నడిమి
నీల మేఘంబుల లీల, ముక్తా మధ్య
లాలిత శక్ర నీలముల భాతి

తే. సతత యౌవన సుందరీయుత విహారుఁ
డగుచు సతు లెంద ఱందఱ కన్ని రూప
ములను గ్రీడించెఁ బెక్కబ్దములు సెలంగి
నందనందనుఁ డభినవానందలీల. 132

* పున్నమనాటి నిండు జాబిల్లి పండు వెన్నెల వెలుగులతో విరాజిల్లే శరత్కాల రాత్రుల్లోనూ, అందమైన మేలిమిబంగారు స్తంభాలుగల సౌధాల పై అంతస్తులలోని చలువరాతి తిన్నెలపైనా, తరుగని తారుణ్యం, చెరగని సౌందర్యం గల అంగనలతో కూడి క్రీడించాడు. అందమైన ఆడ ఏనుగులమధ్య దిగ్గజాలు తిరిగినట్లు, మెరుపుతీగల నడుమ నీలమేఘాలు విహరించినట్లు, ముత్యాల సందున ఇంద్రకాంతమణులు ప్రకాశించినట్లు అందగత్తె లందరికీ అన్నిరూపాలు ధరించిన నందనందనుడైన గోవిందుడు సరికొత్త ఆనందంతో ఎన్నో సంవత్సరాలు విహరించాడు.

వ. అంత నొక్కనాఁడు 133

చ. మునివరు లేఁగుదేర యదు భోజ వరేణ్యులు గూడి ముట్టఁ బ
ల్కినఁ గన లొంది వారు దమకించి శపించినఁ గొన్ని మాసముల్
సను నెడ దైవ యోగమున జాతరఁ బో సమకట్టి వేడుకల్
మనములఁ దొంగలింపగరిమన్ నిజయానములెక్కి యాదవుల్.
134

* ఇలా వుండగా ఒక్క రోజు కొంతమంది మహామునులు ద్వారకా నగరానికి వచ్చారు. అప్పుడు కొందరు యాదవకుమారులు వారిని చుట్టు ముట్టి ఎత్తిపొడుపు మాటలతో వారి మనస్సు నొప్పించారు. అందుకు వారు ఆగ్రహించి ఆ తొందరలో ఘోరంగా శపించారు. కొన్ని మాసాలు గడిచాయి.

దైవయోగం వల్ల యాదవు లంతా ఒక పెద్దఉత్సవం చెయ్యటానికి తలపెట్టారు. అతిశయించిన కుతూహలంతో కూడిన అంతరంగాలతో పొంగి పోతూ, తమతమ వాహనా లెక్కి జాతరకోసం ప్రయాణమైనారు.

ఉ. కోరి ప్రభాసతీర్థమునకుం జని తన్నదిఁ గ్రుంకి నిర్మలో
దారత నందు దేవముని తర్పణముల్ పితృ తర్పణంబులున్
వారని భక్తిఁ జేసి నవ వత్సలతోఁ బొలుపారు గోవులన్
భూరిసదక్షిణాకముగ భూసురకోటికినిచ్చివెండియున్. 135

* అలా ప్రయాణమై యాదవు లందరూ ప్రభాసతీర్థానికి వెళ్ళారు. ఆ నదీజలాల్లో స్నానాలు చేశారు. అరమరికలులేని ఉదారబుద్ధితో దేవతలకూ, మహర్షులకూ, పితృదేవతలకూ తర్పణాలు విడిచారు. అపారమైన భక్తితో లేగదూడలతో చూడముచ్చటైన గోవులను ధరణీసురులకు దక్షిణలతోపాటు దాన మిచ్చారు.

క. అజిన పట రత్నకంబళ
రజత మహారజత తిల ధరా వరకన్యా
గజ తురగ రథములను స
ద్ద్విజ కోటికి నిచ్చి పెంపు దీపింపంగన్. 136

* అనంతరం జింకచర్మాలూ, మంచిమంచివస్త్రాలూ, రత్న కంబళ్లూ, వెండీ బంగారమూ, నువ్వులూ, భూములూ, కన్నెమిన్నలూ, ఏనుగులూ, గుర్రాలూ, రథాలూ తమతమ గౌరవ మర్యాదలకు తగినట్లు బ్రాహ్మణోత్తములకు బహూకరించారు.

వ. ఇట్లు సఫలంబు లయిన భూదానంబు మొదలుగా గల దానంబు లనూనంబులుగా భగవదర్పణబుద్ధిం జేసి యనంతరంబ. 137

TIRUPATI.
36198

* ఈ విధంగా పంటలతో కూడిన భూమి మొదలైన వాటిని భగవంతునికే ఇస్తున్నామన్న భావంతో ఎడతెరపి లేకుండా దానం చేశారు.

తే. ఎసఁగు మోదంబు సంధిల్ల నిష్టమైన
రసిక మృదులాన్న మర్థిఁ బారణలు సేసి
మంజులాసవ రసపాన మత్తు లగుచుఁ
గడఁగి యన్యోన్య హాస్య వాక్యముల గలఁగి. 138

* ఈ విధంగా దానధర్మాలు చేసిన తర్వాత యాదవు లందరూ సంతుష్టిగా ఇష్టమృష్టాన్నాలను కడుపునిండా భుజించి మధుర మోహనమైన మద్యపానంతో మత్తెక్కి మైమరచి పరస్పరం పరిహసించుకో సాగారు.

వ. ఇట్లు దమలోన మదిరాపాన మద విఘూర్ణిత తామ్రములోచనులై, మత్సరంబుల నొండొరులం బొడిచి సమస్త యాదవులును వేణుజాతానలంబునఁ దద్వంశ పరంపరలు దహనంబు నొందు చందంబునం బొలిసి; రది యంతయుం గనుంగొని శ్రీకృష్ణుం డప్పుడు. 139

* మధుపానమత్తులైన వారి కళ్లు బాగా ఎరుపెక్కాయి. ఒళ్లు తిరిగింది. మచ్చరం పెచ్చు పెరిగింది. ఒకరి నొకరు పొడుచుకొని చచ్చారు. వెదుళ్ల రాపిళ్లవల్ల ఆవిర్భవించిన అగ్ని జ్వాలల్లో ఆ వెదురు పొదలన్నీ దగ్ధమైపోయినట్లు సమస్త యాదవులూ నాశనమైనారు. ఈ యాదవకుల విధ్వంస మంతా శ్రీకృష్ణుడు చూచాడు.

క. చతురతతో నిజమాయా
గతిఁ జూచి లసద్వీలోల కల్లోల సమం
చిత విమల కమల సార
స్వత జలముల విహిత విధులు సలిపినవాఁడై 140

* చాతుర్యంతో కూడిన తన మాయా విలాసాన్ని తిలకించిన అనంతరం పొంగిపొరలే తరంగాలతో, వికసించిన కమలాలతో, జలజల ప్రవహించే సరస్వతీ నదిలోని జలాలతో చనిపోయిన వారందరికీ యథా విధిగా ఉత్తరక్రియలు జరిపాడు.

క. ఒక వృక్షమూల తలమున
నకలంక గుణాభిరాముఁ డాసీనుండై
యకుటిలమతి బదరీ వన
ముకు ననుఁ బొమ్మనుచు మొఱఁగి పోయిన నేనున్. 141

* మచ్చలేని మంచి గుణాలతో విరాజిల్లే శ్రీకృష్ణుడు ఒక చెట్టు మొదట్లో కొంచెముసేపు కూర్చున్నాడు. తర్వాత నన్ను పిలిచి "ఉద్ధవా! ఇక నీవు బదరీవనానికి పో" అని చెప్పి నన్ను మాయపుచ్చి ఎచ్చటికో లేచి వెళ్ళాడు.

క. క్రమమున నిజకుల సంహా
రము సేయఁ గడంగు టెఱిఁగి రమణీయ శ్రీ
రమణు చరణాబ్జ యుగ విర
హమునకు మది నోర్వ లేక యనుగమనుఁడనై. 142

* స్వామి తన వంశాన్ని సంపూర్ణంగా సమాప్తం చేసుకోవటానికి సంకల్పించాడన్న సంగతి నేను గ్రహించాను. ఆ నందనందనుని సుందర పాదారవిందాల ఎడబాటును సహించలేకపోయాను. ఆయన వలదన్నా ఆయన అడుగు జాడలను అనుసరించాను.

క. హరి నరయుచుఁ జనిచని యొక
తరుమూల తలంబు నందుఁ దన దేహరుచుల్
పరఁగఁగ నున్న మహాత్ముని
బరునిఁ బ్రపన్నార్తిహరుని భక్తవిధేయున్. 143

* ఆ విధంగా గోవిందుని జాడ అన్వేషిస్తూ వెళ్ళగా వెళ్ళగా ఒక వృక్షాన్ని ఆనుకొని నేలమీద ఆసీనుడై ఉన్న వాసుదేవుడు నాకు

కన్పించాడు. ఆయన దేహం దేదీప్యమానంగా కాంతులు వెదజల్లుతున్నది. ఆ సమయంలో ఆ మహానుభావుడు ఆర్తుల కష్టాలను పోగొట్టి భక్తజనులను పరిపాలించే పరమాత్మగా నాకు కన్పించాడు.

వ. మఱియును. 144

సీ. అస్మత్ప్రియస్వామి నచ్యుతుఁ బరు సత్త్వ
గుణగరిష్ఠుని రజోగుణవిహీను
సురుచిర ద్వారకాపుర సమాశ్రయు ననా
శ్రయు నీల నీరద శ్యామ వర్ణు
దళ దరవింద సుందర పత్రనేత్రు ల
క్ష్మీయుతుఁ బీత కౌశేయ వాసు
విలసిత వామాంక విన్యస్త దక్షిణ
చరణారవిందు శశ్వ త్ప్రకాశు

తే. ఘన చతుర్బాహు సుందరాకారు ధీరుఁ
జెన్నుగల లేఁత రావిపై వెన్ను మోపి
యున్న వీరాసనాసీను నన్నుఁగన్న
తండ్రి నానంద పరిపూర్ణు దనుజహరుని. 145

* నా ప్రేమమూర్తి, నాస్వామి, అచ్యుతుడు, పరాత్పరుడు, సత్త్వ గుణసంపన్నుడు, రజోగుణ రహితుడు, సుందర ద్వారకా మందిరుడు, అన్యులను ఆశ్రయించనివాడు, నీలమేఘ శ్యామల కోమల శరీరుడు, అప్పుడే వికసించుతున్న అందమైన అరవిందాలవంటి కన్నులుకలవాడు, శ్రీనివాసుడై పట్టుపీతాంబరం కట్టుకుని తనఎడమ తొడపై కుడిపాదాన్ని ఉంచి కూర్చుని ఉన్నాడు. అక్షర తేజస్సుతో, చతుర్బాహువులతో ప్రకాశిస్తున్నాడు. అటువంటి ధీరుణ్ణి, సుందరాకారుణ్ణి, దనుజసంహారుణ్ణి, లేత రావిమ్రాకు నానుకొని వీరాసనాసీనుడై విరాజిల్లుతున్న ఆనందమయుణ్ణి నన్నుగన్నతండ్రిని కన్నులారా కన్నాను.

మ త్త. కంటిఁ గంటి భవాబ్ధి దాఁటఁగఁ గంటి నా శ్రిత రక్షకుం
గంటి యోగిజనంబు డెందముఁ గంటిఁ జుట్టముఁ గంటి ము
క్కంటికిం గనరాని యెక్కటిఁ గంటి దామరకంటిఁ జే
కొంటిముక్తివిధానమున్ దలకొంటిసౌఖ్యములందఁగన్. 146

* దర్శించాను! సందర్శించాను! సంసార సాగరాన్ని తరించాను. ఆశ్రిత రక్షకుణ్ణి అవలోకించాను. ఆయన మహాయోగుల ఆత్మబంధువు. మూడుకన్నుల దేవర కూడ చూడలేని జోడులేని వేలుపు. ఆ కమలాక్షుని కనుగొన్నాను. ముక్తిమార్గాన్ని చేరుకొన్నాను. ఆనందాన్ని అందుకొన్నాను.

వ. అయ్యవసరంబునం బరమ భాగవతోత్తముండును, ముని జన సత్తముండును, ద్వైపాయన సఖుండును, మహాయోగి ప్రముఖుండును, నఘశూన్యుండును, నఖిల జను మాన్యుండును, బుధజనవిధేయుండును నగు మైత్రేయుండు తీర్థాచరణంబు సేయుచుం జని చని. 147

* విదురా! అదే సమయంలో భగవద్భక్తులలో వరేణ్యుడూ, మునులలో అగ్రగణ్యుడూ, వేదవ్యాసుని సహాధ్యాయుడూ యోగిజన ధ్యేయుడూ సద్గుణనికాయుడూ, సకలజన పూజనీయుడూ, సుధీ విధేయుడూ, అయిన మైత్రేయుడు తీర్థయాత్రలుచేస్తూ అచ్చటికి విచ్చేశాడు.

మ. కనియెం దాపస పుంగవుం డఖిల లోకఖ్యాత వర్ధిష్ణు శో
భన భాస్వత్పరిపూర్ణ యౌవనకళాభ్రాజిష్ణు యోగీంద్ర హృ
ద్వన జాతైక చరిష్ణుఁ గౌస్తుభ ముఖోద్యద్భూషణాలంకరి
ష్ణు నిలింపాహితజిష్ణు విష్ణుఁ బ్రభవిష్ణుం గృష్ణు రోచిష్ణునిన్. 148

* ఆ విధంగా అచ్చటికి వచ్చిన మైత్రేయుడు విశ్వమంతటా విస్తరిల్లిన శాశ్వతకీర్తితోనూ, సౌభాగ్యశోభా వైభవంతో కూడిన సంపూర్ణ యౌవన స్ఫూర్తితోనూ విరాజిల్లేవాడూ, మహాయోగీంద్రుల మానస

పద్మాలలో సంచరించేవాడూ, కౌస్తుభం మొదలైన వెలుగులు వెల్లివిరిసే ఆభరణాలు అలంకరించుకొన్నవాడూ, రాక్షసులను శిక్షించేవాడూ, సర్వవ్యాపకుడూ, సర్వసమర్థుడూ, తేజోమయుడూ అయిన శ్రీకృష్ణుణ్ణి అవలోకించాడు.

క. తదనంతరంబ హరిఁ దన
హృదయాబ్జము నందు ముకుళితేక్షణముల స
మ్మదమునఁ జూచుచు నానత
వదనుండై యుండె ముదము వఱలఁగ ననఘా! 149

* అనఘాత్ముడవైన విదురా! విను! అలా చూచి చూచి కన్నులు మూసుకున్నవాడై మైత్రేయ మహర్షి తన హృదయకమలంలోనే వదిల పరచుకున్న ఆ భగవంతుణ్ణి సంతోషంతో సందర్శించుతూ తలవంచుకొని నిలబడ్డాడు.

వ. అంత డగ్గఱ నేతెంచి యున్న మైత్రేయుండు వినుచు నుండ దరహాస చంద్రికా సుందర వదనారవిందుండును, నానంద సుధానిష్యంద కందళిత హృదయుండును, భక్తానురక్త దయాసక్త విలోకనుండును నగు పుండరీకాక్షుండు నన్ను నిరీక్షించి యిట్లని యానతిచ్చె; పూర్వభవంబున వసుబ్రహ్మలు సేయు సత్రయాగంబున వసువై, భవదీయ హృదయంబున నితర పదారంబులు గోరక మదీయపాదారవింద సేవం గాంక్షించితివి కావునం దన్నిమిత్తంబున నేను నీ హృదయంబున వసియించి సమస్తంబును గను చుండుదు; నాత్మారాముండ నైన నన్ను నెవ్వరేని సదసద్వివేకులై యెఱుంగం జాలరు; వారలకు నేను నగోచరుండనై యుండుదు; మత్పరిగ్రహంబు గల నీకు నీ జన్మంబ కాని పునర్భవంబు నొంద కుండుటకు భవదీయపూర్వజన్మకృత సుకృత విశేషంబు కతంబున నియ్యాశ్రమంబున మత్పాదారవింద సందర్శనంబు గలిగె; నదియునుంగాక పద్మ

కల్పంబునందు మన్నాభి పద్మ మధ్య నిషణ్ణుం డయిన పద్మ సంభవునకు జన్మమరణాది సంసృతి నివర్తకంబును నవిరతానశ్వర సౌఖ్య ప్రవర్తకంబును నగు మన్మహత్త్వంబుఁ దెలియంజేసితి నట్టి దివ్యజ్ఞానంబు నీకు నెఱింగింతు నని యమ్మహనీయ తేజోనిధి యానతిచ్చిన సుధాసమానసరసాలాపంబులు కర్ణ కలాపంబులై మనస్తాపంబులం బాపిన రోమాంచకంచుకితశరీరుండను. నానంద బాష్పధారా సిక్త కపోలుండను, బరితోష సాగరాంతర్నిమగ్న మానసుండను నయి యంజలిపుటంబు నిటల తటంబున ఘటియించి యిట్లంటి. 150

• అలా తన దగ్గరికి వచ్చి మైత్రేయుడు వింటూ ఉండగా, చిరునవ్వు వెన్నెలలు చిందించే అందమైన అరవిందంలాంటి ముఖం కలవాడూ, ఆనందం అనే అమృతంతో వికసించిన హృదయం కలవాడూ, భక్తులను ఆదరించే దయతో కూడిన చూపులు కలవాడూ — అయిన కమలాక్షుడు నా ముఖం వైపు చూచి ఈ విధంగా ఆజ్ఞాపించాడు. "ఉద్ధవా! పూర్వజన్మలో వసుబ్రహ్మలు చేస్తూఉండిన సత్త్రయాగంలో వసువువైన నీవు నీ మనస్సులో మరే వస్తువునూ కోరకుండా నా పాదపద్మాల సేవనే కోరుకొన్నావు. అందుకని నేను ఇకమీద నీ ఎదలో నివాసంచేస్తూ సకలం చూస్తూ ఉంటాను. ఆత్మారాముడనైన నన్ను ఇది సత్తు ఇది అసత్తు అని విమర్శించేవారు ఎవరూ తెలుసుకోలేరు. నేను వారికి కనిపించకుండా ఉంటాను. నా అనుగ్రహం వల్ల ఇదే నీకు చివరిజన్మ. మరో జన్మ ఉండదు. అందుకనే నీ పూర్వజన్మలోని పుణ్యవిశేషం కారణంగా నా చరణారవిందాలను ఈనాడు ఈ ఆశ్రమంలో సందర్శించగలిగావు. అంతేకాక పద్మకల్పంలో నా నాభి కమలంలో ఆసీనుడైవున్న బ్రహ్మదేవునికి తెలియజేసిన దివ్యజ్ఞానాన్ని నీకు ఉపదేశిస్తాను. ఆ దివ్యజ్ఞానం వల్ల జననమరణాది సంసారబంధాన్ని నివర్తింపజేసి అఖండమూ, అనంతమూ అయిన ఆనందాన్ని ప్రవర్తింపజేసే నా మహత్త్వం నీకు తెలుస్తుంది."

ఈ విధంగా మహాతేజస్సంపన్నుడైన కృష్ణుడు ఆజ్ఞాపించాడు. అమృత సమానా లయిన స్వామి సరససంభాషణాలు నాకు శ్రవణ భూషణా లైనాయి. నా మనస్తాపాన్ని తొలిగించాయి. నా శరీరం సంతోషంతో గగుర్పొడిచింది. నా చెక్కిళ్లు ఆనందబాష్పాలతో తడిసి పోయాయి. నా అంతరంగం సంతోష సముద్రతరంగాలలో ఓలలాడింది. నేను దోసిలి నెన్నుదుటిపై చేర్చి ఇలా విన్నవించుకొన్నాను.

క. పురుషోత్తమ! నీ పద సర
సిరుహ ధ్యానామృ తాభిషేక స్ఫురణం
గర మొప్పిన నా చిత్త మి
తరవస్తువులందు వాంఛఁ దగులునె యెందున్. 151

* పరమపురుషా! నీ చరణ కమలస్మరణ మనే అమృతాభిషేకంతో పొంగి పరవశించిన నా మనస్సు ఇతర వస్తువులను ఎందుకు కాంక్షిస్తుంది?

చ. జననము లేని నీవు భవ సంగతి నొందుట కేమి కారణం
బనియును, గాలసంహరుఁడవై జగముల్ విలయించు నీవు పా
యని రిపు భీతికై సరిదుదంచిత దుర్గము నాశ్రయించు ట
ట్లనియును దేవ! నామనమునందుఁ దలంతు సరోజలోచనా!
152

* పుండరీకాక్షా! పుట్టుకలేని నీవు పుడమిపై అవతరించట మేమిటో బోధపడటం లేదు. కాల స్వరూపుడవై లోకాలను లోగొనే నీవు శత్రు భయంతో నదులను అడ్డుపెట్టు కొని సముద్రాలలో కోటలు కట్టుకోవటం ఏమిటో నా మనస్సుకు అర్థం కావటం లేదు.

వ. అదియునుంగాక. 153

క. శ్రీ రమణీశ్వర! నీ వా
త్మారాముఁడ వయ్యు లీలఁ దరుణీకోటిం
గోరి రమించితి వనియును
వారక యేఁ దలఁతు భక్తవత్సల! కృష్ణా! 154

* అంతేకాక ఇందిరారమణా! భక్తవత్సలా! శ్రీకృష్ణా! నీవు ఆత్మలలో విహరించువాడవు. అయినా స్త్రీల సమూహాలనడుమ లీలా విలాసాలతో విహరించట మేమిటో ఊహించలేకున్నాను.

క. పరతత్త్వజ్ఞులు కరుణా
కర! నిను సంసారి వనుచుఁ గడఁకఁ దలంప
న్నరసి ననుఁ గాచు టెల్లను
గర మరుదు తలంచి చూడఁ గమలాధీశా! 155

* ఓ కమలాపతీ! నీవు కరుణా నిలయుడవు. పెద్దలు చాలమంది వేదాంతులు గూడ నిన్ను సంసారివి అనుకుంటున్నారు. నీవు నాపై చూపే దయ, రక్షించే విధానం గమనిస్తే నాకే మిక్కిలి ఆశ్చర్యంగా ఉంటుంది. ఇది ఎంతటి అరుదైన సంగతి?

వ. దేవా! నీ వఖండిత విజ్ఞాన రూపాంతఃకరణుండ వయ్యును ముగ్ధ భావంబునఁ బ్రమత్తుని చందంబున విమోహితుఁడవై వడిం బ్రవర్తించుచు నెందేని నొదిగి యుండుటం దలంచి నా డెందంబు గుందుచుండు; నరవిందలోచన! సురవందిత! ముకుంద! యిందిరా సుందరీ రమణ! సరస్వతీరమణునకుం గరుణించిన సుజ్ఞానంబు ధరించు శక్తి నాకుం గలదేనిఁ గృపసేయుము; భవదీయ శాసనంబు ధరియించి భూరిసంసార పారావారోత్తరణంబు సేయుదు నని విన్నవించి బహుభంగులం బ్రస్తుతించిన భగవంతుండును బ్రపన్నపారిజాతంబును నైన కృష్ణుండు పరతత్త్వ నిర్ణయంబు నెఱింగించిన. 156

* దేవా! నీవు మొక్కవోని విజ్ఞానమే రూపుకట్టిన ఆత్మకలవాడవై కూడ, అమాయకునిలా, అవివేకిలా, వ్యామోహానికి లొంగిన వానిలా ప్రవర్తిస్తావు. ఒక్కొక్కప్పుడు ఎక్కడో దాక్కొని ఉంటావు. ఈ సంగతులు గుర్తుకు వచ్చినప్పుడు నా స్వాంతం ఎంతో చింతాక్రాంత మవుతుంది. అరవింద నయనా! బృందారక బృందవందిత చరణా! ఇందిరా రమణా!

ముకుందా! సరస్వతీ పతియైన చతుర్ముఖబ్రహ్మకు ప్రసాదించిన సుజ్ఞానాన్ని, దాన్ని పరిగ్రహించి భరించగల శక్తిసామర్థ్యాలూ నాకంటూ ఉన్నట్లైతే, ఆ జ్ఞానాన్ని నాకు కూడా అనుగ్రహించు. దానిని గ్రహించి, మీ ఆజ్ఞ శిరసావహించి ఈ అపార సంసార సముద్రాన్ని తరిస్తాను అని విన్నవించుకొని ఎన్నో విధాల సన్నుతించగా - భగవంతుడూ, భక్తజన కల్పవృక్షమూ అయిన శ్రీకృష్ణుడు నాకు పరతత్త్వ సంబంధమైన పరిపూర్ణ జ్ఞానాన్ని ప్రసాదించాడు.

క. సరసిజలోచన కరుణా
పరిలబ్ధ జ్ఞాన కలిత భావుఁడ నగుటం
బరతత్త్వవేదినై త
చ్చరణ సరోజముల కెరఁగి సమ్మతితోడన్. 157

* కమల దళాక్షుని కరుణాకటాక్షం వల్ల సంప్రాప్తమైన జ్ఞానంతో మనస్సు నింపుకొన్నవాడనై పరతత్త్వాన్ని తెలుసుకొన్నాను. ఎంతో ఇష్టంగా ఆ స్వామి పాదపద్మాలకు ప్రణామం చేశాను.

క. హరిపద జలరుహ విరహా
తురతన్ దుర్దాంత దుఃఖ తోయధిఁ గడవన్
వెర వేది తిరుగ వలసెను
సరసిజభవకల్ప విలయ సమయము దాఁకన్. 158

* కృష్ణుని పాదపద్మాలతో కలిగిన ఎడబాటు నాకు తడబాటు కలిగించింది. భరింపరాని ఆ దుఃఖ సముద్రాన్ని తరించటానికి మరో ఉపాయం లేదు. కల్పాంత పర్యంతం నేనిలాగు తిరుగుతూ ఉండవలసిందే.

వ. ఇట్లు దిరుగుచు 159

మ. నర నారాయణ తాపసాశ్రమ పదౌన్నత్యంబునం బొల్చు భా
సుర మందార రసాల సాల వకుళాశోకామ్ల పున్నాగ కే
సర జంబీర కదంబ నింబ కుట జాశ్వత్థస్ఫురన్మల్లికా
కరవీర క్షితిజాభిరామ బదరీకాంతార సేవారతిన్. 160

* నేను తిరిగి తిరిగి బదరికాశ్రమాన్ని దర్శించాలనే కుతూహలంతో బయలుదేరాను. ఆ పుణ్యభూమి పరమ తపోధనులైన నరనారాయణులు తపస్సు చేసిన పవిత్రాశ్రమంగా ప్రఖ్యాతి గన్నది. ఆ బదరీవనం అందమైన మందారాలు, తీయ మామిళ్లు, పొగడలు, అశోకాలు, చింతలు, సురపొన్నలు, పొన్నలు, నిమ్మలు, కదంబాలు, వేములు, కొండ మల్లెలు, రావులు, మల్లెలు, గన్నేరులు మొదలైన మంజుల తరునికుంజాలతో నిండి మనోహరంగా ఉంటుందిట.

క. చనుచున్నవాఁడ నని ప
లికిన పలుకుల కులికి కళవళించుచు విదురుం
డనుపమశోకార్ణవమున
మునిఁగియు నిజయోగ సత్త్వమునఁ దరియించెన్. 161

* నేను బదరికాశ్రమానికి వెళ్తూ ఉన్నాను అని ఉద్ధవుడు చెప్పగానే ఆ పలుకులు విని అదిరిపడి కలతచెంది విదురుడు అపారమైన దుఃఖసాగరంలో మునిగిపోయాడు. మళ్ళీ తనయోగసాధనవల్ల సంప్రాప్తమైన సత్త్వబలంతో గుండె నిబ్బరించుకొని మామూలు స్థితికి వచ్చాడు.

వ. ఇట్లు విదురుండు శోకపావకునిం దన వివేకజలంబుల నార్చి యుద్ధవున కిట్లనియె. 162

మ. అనఘా! యుద్ధవ! నీకుఁగృష్ణుఁడసురేంద్రారాతిమన్నించి చె
ప్పినయధ్యాత్మ రహస్యతత్త్వ విమలాభిజ్ఞాన సారంబు బో
రన నన్నుం గరుణించి చెప్పినఁ గృతార్థత్వంబునంబొందెదన్
వినుపుణ్యాత్ములుశిష్యసంఘములనుర్విం బ్రోవరే వెండియున్.
163

* ఈ విధంగా విదురుడు శోకం అనే అనలాన్ని వివేకం అనే సలిలంతో చల్లార్చి, ఉద్ధవునితో ఇలా అన్నాడు. పరమ పావనుడైన ఉద్ధవా! దైత్యమర్దనుడైన జనార్దనుడు అత్యాదరంతో నీకు అనుగ్రహించిన ఆ అధ్యాత్మ తత్త్వ రహస్యాన్ని, అతి పవిత్రమైన అభిజ్ఞాన

సారాన్ని అపార కృపాతిశయంతో ఇపుడే నాకు ఉపదేశించు. నా జన్మ సార్థకమౌతుంది. పుణ్యాత్ములైన గురువులు తమ శిష్యులను ధన్యాత్ములను చేయాలి కదా!

క. భగవద్భక్తులు సుజనులు
దగ వెఱిఁగి పరోపకారతాత్పర్య వివే
క గరిష్ఠులై చరింతురు
జగతిం బొగడొంది వృష్ణిసత్తమ! యెందున్. 164

* వృష్ణివంశపావనా! ఈ భూవలయంలో పుణ్యమూర్తులైన భగవద్భక్తులు ధర్మానురక్తులై, పరోపకార పరాయణులై ప్రవర్తిస్తారు. అటువంటి వారిని ప్రజలు ప్రస్తుతిస్తారు.

క. అనవుడు నుద్ధవుఁ డవ్విదు
రున కిట్లను ననఘ! మునివరుఁడు సాక్షాద్వి
ష్ణునిభుండగు మైత్రేయుఁడు
దన మనమున మనుజగతి వదలఁ దలఁచి తగన్. 165

క. హరి మురభేదిఁ బరాపరుఁ
గరుణాకరుఁ దలఁచునట్టి ఘనుఁ, డమ్ముని కుం
జరుకడ కేఁగిన నాతఁడు
గర మర్థిం దెలుపు సాత్త్విక జ్ఞానంబున్. 166

* ఆ మాటలు విని ఉద్ధవుడు విదురునితో ఇలా అన్నాడు. వినవయ్యా! విదురా! సంయమివరేణ్యుడూ, సాక్షాత్తూ విష్ణువుతో సమానుడూ అయినమైత్రేయుడు తన మనుష్యదేహాన్ని వదలిపెట్టటానికి మనస్సులో నిశ్చయించుకున్నాడు. ఆ మహానుభావుడు ఆ మురహరుని, ఆ పరాత్పరుని, ఆ కరుణాకరుని స్మరిస్తూ ఉన్నాడు. ఇప్పుడు నీవు ఆయన సన్నిధికి వెళ్ళు. తప్పకుండా ఆ మహాముని నీకు అత్యంత ప్రీతితో ఆధ్యాత్మిక తత్త్వజ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు.

వ. అని యుద్ధవుండు విదురుం గూడి చని చని. 167

ఉ. ముందటఁగాంచెనంత బుధ ముఖ్యుఁడు హల్లక ఫుల్లపద్మ ని
ష్యంద మరంద పాన విలసన్మదభృంగఁ, జల త్తరంగ. మా
కందలవంగ లుంగ లతికాచయ సంగ. సురాంగనాశ్రితా
నందితపుణ్యసంగ. యమునన్. భవభంగ.శుభాంగనర్మిలిన్.
168

• ఈ విధంగా చెప్పి ఉద్ధవుడు విదురునితో కలిసి కొంత దూరం వెళ్ళాడు. ఎదురుగుండా యమునానది కన్పించింది. ఆ నదిలో కలువ పూలూ, తామరపూలూ వికసించి వున్నాయి. ఆ పూలలో చిందే మకరంద బిందువులను కమ్మగా కడుపు నిండా త్రాగిన తుమ్మెదలు మైమరచి విహరిస్తున్నాయి. నదిలో తరంగాలు కదలాడుతున్నాయి. ఆ నది ఒడ్డున మామిడిచెట్లూ, లవంగ లతలూ, మాదీఫలవృక్షాలూ చిక్కగా చక్కగా క్రిక్కిరిసి ఉన్నాయి. ఆ పొదరిండ్లలో సురసుందరులు చరిస్తున్నారు. సంసార బంధాలను పోకార్చి పుణ్యాన్ని చేకూర్చే సుగుణాల దొంతి అయిన ఆ యమునా స్రవంతి కన్నుల విందుగా కానవచ్చింది.

క. కని డాయ నేఁగి మోదం
బునఁ దత్సరిదమల పులిన భూములఁ దగ నా
దినశేషము నివసించెను
వనజోదర పాదపద్మ వశమానసుఁడై. 169

• ఆ విధంగా దర్శన మిచ్చిన యమునా నదిని విదురునితో కూడిన ఉద్ధవుడు సమీపించాడు. ఆ నదిలోని అందమైన తెల్లని ఇసుక తిన్నెల మీద ఆనందంగా ఆసీను డై నాడు. నందనందన చరణారవింద స్మరణ పరాయణుడై ఆ దినమంతా గడిపాడు.

క. మఱునాఁడు రేపకడ ఖా
సురపుణ్యుఁడు ఘనుఁడు మధు నిషూదన చరణ
స్మరణ క్రీడా కలితుఁడు
దరియించెన్ గలుష గహనదమునన్ యమునన్. 170

* మరుదినాన ఉదయాననే విదురునితో కలిసి యదునందన పద చింతన సంతోష తరంగాలలో ఓలలాడే అంతరంగం గల పుణ్యమూర్తి ఉద్ధవుడు పాపాలను రూపుమాపే యమునా తరంగిణిని దాటాడు.

వ. ఇట్లుద్ధవుండు యమునానది నుత్తరించి బదరికాశ్రమంబు నకుం జనియె ననిన విని రాజేంద్రుండు యోగీంద్రున కిట్లనియె. 171

* ఉద్ధవుడు యమునానది దాటి బదరికాశ్రమానికి వెళ్ళాడు అని చెప్పగా విని రాజశ్రేష్ఠుడైన పరీక్షిత్తు యోగిశ్రేష్ఠుడైన శ్రీశుకునితో ఇలా అన్నాడు.

క. శౌరియు నతిరథ వరులు మ
హారథ సమరథులు యదు బలాధిపు లెల్లం
బోరి మృతిఁ బొంద నుద్ధవుఁ
డేరీతిన్ బ్రదికె నాకు నెఱిఁగింపు తగన్. 172

* శ్రీకృష్ణుడు అవతారం చాలించాడు. అతిరథ మహారథ సమరథులైన యాదవ వీరు లందరూ తమలో తాము పోరాడుకొని ప్రాణాలు గోల్పోయారు. సర్వులూ చనిపోగా ఉద్ధవుడు మాత్రం ఎలా బ్రతుకగలిగాడు? ఈ విషయం నాకు వివరించండి.

సీ. నావుడు రాజేంద్రునకు శుకయోగీంద్రుఁ
డిట్లను మున్ను లోకేశుచేత
సంప్రార్థితుండైన జలరుహనాభుండు
వసుమతిపై యదువంశమందు
నుదయించి తనుఁ దాన మదిలోనఁ జింతించి
తెలివొంది యాత్మీయ కులవినాశ
మొనరించి తాను బంచోపనిషన్మయ
మగు దివ్యదేహంబునందుఁ జెందఁ

తే. దలఁచి విజ్ఞాన తత్త్వంబు ధరణిమీఁదఁ
దాల్చి జనకోటి కెఱిఁగింపఁదగిన ధీరుఁ
డుద్ధవుఁడు దక్క నితరులే నోప రితఁడు
నిర్జితేంద్రియుఁ డాత్మసన్నిభుఁ డటంచు. 173

* ఈ విధంగా అడిగిన పరీక్షిత్తుతో శుకుడు ఇలా అన్నాడు. పూర్వం బ్రహ్మదేవుడు ప్రార్థింపగా పుండరీకాక్షుడు భూలోకంలో యదు వంశంలో ఉదయించాడు. తనకు తాను మనస్సులో ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చినవాడై తన సంకల్పానుసారం తన కులాన్నంతా అంతంచేసివేశాడు. ఐదు ఉపనిషత్తులతో కూడిన దివ్యదేహాన్ని పొంద దలచి తన తర్వాత విజ్ఞాన తత్త్వాన్ని అందు కొని లోకంలో జిజ్ఞాసువులైన ప్రజలకు తెలియజేయగల ప్రజ్ఞాశాలి, జితేంద్రియుడు, తనంతటివాడు-ఒక్క ఉద్ధవుడు తప్ప ఇంకొకడు లేడని భావించాడు.

క. క్షితిపై నిలిపిన కతమున
నతనికి మృతి దొరక దయ్యె నవనీశ! రమా
పతి యభిమానము గలిగిన
యతి పుణ్యుఁడు సనియె బదరికాశ్రమమునకున్. 174

* అందుచేతనే భూలోకంలో అతణ్ణి నిల్పాడు. ఈ కారణాల వల్ల అతనికి మృతి లేకుండాపోయింది. రాజా! రమా వల్లభునిమీద ఆదరాభిమానాలు గల ఆ పరమ పుణ్యుడు ఉద్ధవుడు బదరికాశ్రమానికి వెళ్ళాడు.

వ. అంత. 175

క. ఉద్ధవుఁ డరిగిన పిదప స
మిద్ధ పరిజ్ఞాను, సుజనహితు, మైత్రేయున్
వృద్ధజన సేవ్యుఁ, దాపస
వృద్ధశ్రవుఁ జూడఁగోరి విదురుఁడు గడఁకన్. 176

* ఈ విధంగా ఉద్ధవుడు వెళ్ళిపోయిన తర్వాత, విదురుడు దేదీప్యమానమైన జ్ఞానం కలవాడూ, సజ్జనులకు మిత్రుడైనవాడూ, మహా

నీయులకు సైతం సేవనీయుడూ, తాపసేంద్రుడూ అయిన మైత్రేయ మహామునిచంద్రుణ్ణి సందర్శించటానికి ముందుకు సాగాడు.

వ. యమునానది దాఁటి కతిపయ ప్రయాణంబులఁ బుణ్య నదుల, హరిక్షేత్రంబులను దర్శించుచు నతిత్వరిత గమనంబున, 177

* యమునానదిని దాటిన అనంతరం కొన్నిదినాలు ప్రయాణం సాగించి పుణ్యనదులనూ, పురుషోత్తమ క్షేత్రాలను దర్శించుకుంటూ బిర బిరా పురోగమించాడు.

క. చని చని ముందటఁ గనుఁగొనె
ఘనపాప తమః పతంగఁ, గరుణాపాంగన్,
గనదుత్తుంగ తరంగన్,
జనపరనుత బహుళపుణ్య సంగన్, గంగన్. 178

* అలా వెళ్ళి వెళ్ళి విదురుడు ఉత్తుంగ తరంగాలతో పొంగి ప్రవహించే గంగానదిని కన్నుల విందుగా కనుగొన్నాడు. ఆ గంగానది పాపాలనే చీకట్లను సూర్యునివలె పారదోలుతుంది. కరుణారసం ప్రసరించే కడగంటి చూపులు కలది. పెద్దలైనవారు ప్రశంసించే అగణ్య పుణ్యాలకు ఆలవాలమైంది.

క. అందు నరవింద సౌరభ
నందిత పవమాన ధూత నట దూర్మి పరి
స్పందిత కందళ శీకర
సందోహ లసత్ప్రవాహ జల మజ్జనుఁడై. 179

* ఆ గంగానదిలో పద్మాల సువాసనలతో నిండిన గాలులు వీస్తున్నాయి. ఆ పద్మ సుగంధాలు వహించిన వాయువుల వల్ల కదలి నదీ తరంగాలు నాట్యం చేస్తున్నాయి. అలా ఎగిరిపడుతున్న కెరటాలు తుంపురులను విరజిమ్ముతున్నాయి. అటువంటి పరమపవిత్ర గంగాప్రవాహంలో విదురుడు స్నానం చేశాడు.

సీ. ఘనసారరుచి వాలుకా సముదంచిత
సైకత వేదికా స్థలము నందు
యమ నియ మాది యోగాంగ క్రియా నిష్ఠఁ
బూని పద్మాసనా సీనుఁ డగుచు
హరిపాద సరసీరుహ న్యస్త చిత్తుఁడై
బాహ్యేంద్రియ వ్యాప్తిఁ బాఱఁ దోలి
సకల విద్వజ్జన స్తవనీయ సముచితా
చార వ్రతోపవాసములఁ గ్రుస్సి

తే. యున్న పుణ్యాత్ము, విగత వయో వికారు,
వినుత సంచారు, భువన పావన విహారు,
యోగిజనగేయు, స త్తతి భాగధేయు
నాశ్రితవిధేయు, మైత్రేయు నచటఁ గాంచె. 180

* స్నానానంతరం విదురుడు ఎదురుగుండా యోగిజన స్తవనీయుడూ, సాధుజనభాగధేయుడూ, శ్రితజన విధేయుడూ అయిన మైత్రేయుణ్ణి చూచాడు. ఆ మహనీయుడు కర్పూరము కుప్పపోసినట్లున్న, ఒకానొక ఇసుక తిప్పమీద పద్మాసనాసీనుడై ఉన్నాడు. యమ నియ మాదులతో కూడిన అష్టాంగ యోగాన్ని నిష్ఠాగరిష్ఠుడై ఆచరిస్తున్నాడు. శ్రీకృష్ణుని చరణ సరోజాలపై చిత్తం లగ్నం చేసి ఉన్నాడు. ఇంద్రియాలను వశం చేసుకొని ఉన్నాడు. సమస్త విద్వాంసులకు సంస్తవనీయమైన సదాచారాలతో, వ్రతాలతో, ఉపవాసాలతో, ఆ మహాముని శరీరం సన్నబడి ఉన్నది. ఆయనలో వార్ధక్యలక్షణాలు ఏమీ కన్పించటం లేదు. అటువంటి పుణ్యజీవనుడూ, భువనపావనుడూ అయిన మైత్రేయుడు విదురుని ముందు సాక్షాత్కరించాడు.

—: విదుర మైత్రేయ సంవాదము :—

వ. ఇట్లు గనుంగొని యమ్మునీంద్రుని పాదంబులకుం బ్రణమిల్లి ముకుళిత హస్తుండై యిట్లనియె. 'మునీంద్రా! లోకంబున

సకల జనంబులు మనంబుల ఘనంబులగు సౌఖ్యంబు లందం దలంచి తత్ఫలప్రాప్తి హేతువులైన కర్మంబు లాచరించి దైవోపహతులై తత్కర్మంబులచేత నిష్ఫలారంభు లగుదురు: కర్మంబులు బంధకంబులును దుఃఖహేతువులునుం గాని సౌఖ్యదాయకంబులై పాప నివృత్తి జేయనోప: వది యట్లుండె: భూరి దుఃఖానుసారంబైన సంసార చక్రంబు నందుఁ బరిభ్రమించుచుం గామవిమోహితులై పూర్వకర్మానుగతంబులైన శరీరంబులు దాల్చుచుం జచ్చుచు మరలం బుట్టుచు నెంతకాలంబునకుఁ బాప నివృత్తిఁ గానక మాతృయౌవన వన కుఠారులై జనియించి వర్తించు మూఢాత్ములం. బశుప్రాయుల రక్షించుకొఱకుఁగాదె నారాయణ పరాయణులైన మీవంటి పుణ్యాత్ములు లోకంబునం జరియించుట: యదియునుం గాక. 181

* విదురుడు మైత్రేయుని పాదాలకు నమస్కారం చేసి, చేతులు జోడించి ఇట్లా అన్నాడు. "మునీంద్రా! లోకులంతా తమతమ మనస్సులలో ఎల్లప్పుడూ సుఖాన్నే కోరుకుంటారు. దానిని పొందడానికై ఎన్నో కర్మలు చేస్తారు. దైవం అనుకూలించకపోవడంతో తమ ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయి వాటి ఫలాన్ని అందుకోలేక పోతున్నారు. ఈ కర్మలన్నీ ప్రతిబంధకాలు. అంతేగాక దుఃఖాన్ని కల్గిస్తాయే గాని సుఖాన్నిచ్చి పాపాన్ని పోగొట్టలేవు. అంతేకాక ఈ లోకులు దురంత దుఃఖాలకు కారణమైన సంసారం అనే చక్రంలో తగుల్కొని గిరగిర తిరుగుతూ ఉంటారు. కోర్కెల వ్యామోహంలో చిక్కి పూర్వం తాము చేసిన కర్మఫలాలకు తగినట్టి శరీరాలను పొందుతూ ఉంటారు. ఇలా చస్తూ, పుడుతూ ఎంతో కాలానికిగాని పాపాన్ని పోగొట్టుకొనే మార్గం తెలుసుకోలేరు. తల్లి యౌవనానికి గొడ్డలిపెట్టులాంటివారై పుట్టి ఇటువంటి పశుప్రాయులైన బుద్ధిహీనులను ఉద్ధరించడానికే గదా తమ వంటి పుణ్యాత్ములు శ్రీమన్నారాయణ సేవాపరాయణులై లోకంలో తిరుగుతూ ఉంటారు!!

మ. అవివేకానుగత స్వకార్య జలవేలా కీర్ణమై మిత్ర బం
ధు వధూ పుత్త్రజలగ్రహోగ్రయుతమై దుర్దాంతమైనట్టి ధు
ర్భవ పాథోధిఁ దరింపలేరు హరిసంబంధ క్రియాలోల భా
గవతానుగ్రహ నావ లేని యధముల్ కారుణ్యసంధాయకా! 182

* ఓ కరుణామయా! భగవత్కార్య నిర్వాహకులై సదా భగవంతుని యందే ఆసక్తులైన దైవభక్తుల అనుగ్రహం అనే నావ లేకుండా ఈ సంసార సముద్రాన్ని దాటటానికి ప్రయత్నించడం పరమ మూర్ఖత. భయంకరమైన ఈ సంసార సాగరానికి అవివేకమే జలం. స్వార్థ పరత్వమే చెలియలి కట్ట. మిత్రులూ, బంధువులూ, భార్యాపుత్త్రులే జలచరాలు. ఇది దురంతమైనది.

క. మునినాథచంద్ర! ననుఁ గైకొని కాచు తలంపు బుద్ధిఁ గూడిన యేనిన్
వినుము మదీప్సిత మది నా
చనవునఁ గావింపవయ్య సజ్జన తిలకా! 183

* సౌజన్యసాంద్రుడవైన ఓ మునిచంద్రా! నన్ను మన్నించి రక్షించే ఉద్దేశం నీకు ఉన్నట్లయితే నా విన్నపం ఆలకించు. నా మనస్సులోని కోరిక తీర్చు.

వ. అని వెండియు విదురుండు మైత్రేయుం జూచి మునీంద్రా! త్రిగుణాత్మక మాయా నియంత యగు భగవంతుండు స్వతంత్రుండయ్యు నవతరించి యే యే యవతారంబుల నే కర్మంబు లాచరించె? నదియు నిష్క్రియుండగు నీశుండు మొదలం బ్రపంచంబు నే విధంబునం గల్పించె? నే పగిదిం బాలించె? మఱియు నీ విశ్వంబు నాత్మీయ హృదయాకాశ గతముం జేసి నివృత్తవృత్తి యగుచు యోగమాయయం దెట్లు వసియించె? బ్రహ్మాండంబునందు నే లీల వర్తించె? నందు బ్రహ్మాదిరూపంబులం బొంది బహుప్రకారంబుల నెట్లు క్రీడించె? భూసుర గోసు

రాదులఁ బరిరక్షించుటకై మత్స్యాద్యవతారంబులు ధరియించి యే యే ప్రయోజనంబులం దీర్చెఁ? బయోరుహ గర్భాండ కటాహాంతర్గతంబులై లోకపాల సహితంబులైన లోకంబులను లోకాలోక పర్వతంబుల బహిర్భాగంబులను నేయే తత్త్వభేదంబులను నెత్తెఱంగునం బుట్టించె? నందు బ్రతీతంబగు జీవకోటి యెవ్వనిం గొల్చి బ్రదుకు? జనులకు గర్మ నామ రూప భేదంబు లెట్లు నిర్దేశించె? నింతయు సవిస్తరంబుగా వివరింపు; ముత్తమశ్లోకమౌళి మండనుండును యోగేశ్వరేశ్వరుండును నైన పుండరీకాక్షుని చరిత్ర శ్రవణంబునం గాని జన్మమరణాది సకల దుఃఖాకరంబులును, దుష్కర్మ ప్రాప్తంబులును నగు భవబంధంబులు దెగవని వెండియు నిట్లనియె. 184

* అని మళ్లీ విదురుడు మైత్రేయుణ్ణి చూచి ఇట్లా అన్నాడు మునీంద్రా! సత్త్వము, రజస్సు, తమస్సు అనబడే మూడు గుణాలతో కూడిన మాయకు నియామకుడైన భగవంతుడు సర్వస్వతంత్రుడు. అటువంటివాడు ఎందుకు అవతారా లెత్తాడు. ఏ యే అవతారాలలో ఏ యే సత్కార్యాలు సాధించాడు? క్రియారహితుడైన ఈశ్వరుడు ఆదిలో ఈ ప్రపంచాన్ని ఏ విధంగా సృష్టించాడు? ఏ విధంగా పరిపాలించాడు? మళ్లీ ఈ విశ్వాన్ని తన హృదయాకాశంలో ఎలా విలీనం చేసుకున్నాడు? ఏ వ్యాపారాలు లేనివాడు ఏ విధంగా యోగమాయలో ఉన్నాడు? తను సృష్టించిన బ్రహ్మాండంలో ఎట్లా సంచరించాడు? బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది రూపాలు పొంది, ఎట్లా అనేక విధాలుగా విహరించాడు? బ్రాహ్మణులనూ, గోవులనూ, దేవతలనూ రక్షించడానికై మత్స్యావతారం మొదలైన అవతారా లెత్తి ఏ యే ప్రయోజనాలు నెరవేర్చాడు? బ్రహ్మాండ భాండం లోపల ఉన్న దిక్పాలకులతో కూడిన లోకాలనూ, లోకాలోక పర్వతం బయటి భాగాలను ఏయే తత్త్వభేదాలతో ఏ విధంగా పుట్టించాడు? ఆ సృష్టిలో నివసించే జీవకోటి ఎవ్వనిని సేవించి జీవిస్తూ ఉంటుంది? జీవులకు కర్మ, నామ, రూప భేదాలు ఎట్లా నిర్ణయింపబడినాయి? ఇదంతా నాకు చక్కగా వివరంగా చెప్పు. పుణ్యమూర్తులకు శిరోభూషణమై యోగే

శ్వరులకు అధీశ్వరుడైన శ్రీమన్నారాయణుని పవిత్ర చరిత్ర వింటేనేకాని జననమరణాది సకల దుఃఖాలకూ, సమస్త దుష్కార్యాలకూ అనుబంధాలైన ఈ సంసార బంధాలు తెగవు అని మళ్లీ ఇట్లా అన్నాడు.

తర. సతతమున్ సరసీరుహోదర సత్కథామృత పూరమున్
[శుతి పుటాంజలి చేత నిమ్ముల జుట్టియుం దనివోదు భా
రత కథామిష మూని విష్ణుఁ బరాశర[ప్రియసూతి స
న్మతి నుతించిన చోట సన్మునినాథ నామది నుబ్బెదున్. 185

* ఓ మునీం[ద్రా! శ్రీమన్నారాయణుని సత్కథలనే అమృతాన్ని చెవులనే దోసిళ్లతో ఎంతగా జుర్రుకొన్నా తనివి తీరదు. భరతవంశీయుల చరిత్ర ఐన భారతంలోకూడా సందర్భానుసారంగా వ్యాసులవారు ఎక్కడైతే శ్రీమహావిష్ణువును నుతించారో అక్కడ నా మనస్సు ఎంతో ఉబ్బి తబ్బిబ్బై పోతుంది.

క. ఇతర కథాకర్ణనముల
నతి హేయత నొందెఁ జిత్త మనఘాత్మ! రమా
పతి చరితామృత రతి సం
సృతి వేదన లెల్లఁ బాయఁజేయు మునీం[ద్రా! 186

* ఓ పుణ్యాత్ముడా! ఇతర కథలు విని విని నా మనస్సుకు చాల వెగటు కలిగింది, ఓ మునినాథా! రమానాథుడైన శ్రీమన్నారాయణుని కథాసుధాపూరాన్ని తనివితీరా సేవించడం వల్లనే సంసార బాధలు దూరంగా తొలగిపోతాయి.

తే. భూరి విజ్ఞాన నిధులగు నారదాది
నిర్మలాత్ముల కయిన వర్ణింపరాని
హరికథామృత పానంబునందు విసివి
యొల్ల ననువాఁడెవో వెఱ్ఱిగొల్లఁ డనఘ! 187

* ఓ పుణ్య పురుషా! విశేషమైన విజ్ఞానానికి నిధులవంటివారు నారదాది మహనీయులు. అటువంటి నిర్మల హృదయులకు కూడా వర్ణింప శక్యముకానివి విష్ణుకథలు. అటువంటి హరికథాసుధారసాన్ని త్రాగి విసుగు చెంది 'ఇక వద్దు' అనే వాడే పనికిమాలిన మొద్దు.

వ. అదియునుం గాక. 188

సీ. అరవిందనాభుని యపరావతారమై
జననమొందిన పరాశరసుతుండు
చతురవర్ణాశ్రమాచార ధర్మంబులు
రవణింప లోకవిడంబనంబు
లగు గ్రామ్యకథలు పెక్కర్థిఁ గల్పించుచు
హరికథావర్ణన మందులోన
నించుకించుక గాని యేర్పడఁజెప్పమి
నంచిత విజ్ఞాన మాత్మనిలుప

తే. కున్నఁ జింతించి మఱి నారదోపదిష్టుఁ
డగుచు హరివర్ణనామృత మాత్మఁ గ్రోలి
విమల సుజ్ఞాననిధి యన వినుతికెక్కి
ధన్యుఁ డయ్యెను లోకైకమాన్యుఁ డగుచు. 189

* అదీ కాకుండా శ్రీమన్నారాయణుని అవతారమైన వ్యాసుడు నాలుగు వర్ణాల, నాలుగు ఆశ్రమాల ఆచార ధర్మాలను లోకానికి చాటి చెప్పదలచినవాడై పురాణాలలో పామర కథలు ఎన్నెన్నో కల్పించవలసి వచ్చింది. అందువల్ల ఆగ్రంథాలలో హరికథలను అక్కడక్కడా కొంచెం కొంచెంగా మాత్రమే అభివర్ణించాడు. భగవద్విజ్ఞానాన్ని ఆత్మగతం చేసుకోలేనందుకు ఎంతో చింతించాడు. చివరకు నారదమహర్షి ఉపదేశంతో నారాయణ కథాసుధాపూరాన్ని తనివితీరా త్రాగి ధన్యుడై, సుధీజన మూర్ధన్యుడై, సకలలోక సమ్మాన్యుడైనాడు.

వ. కావున. 190

క. సరసిరుహోదరు మంగళ
చరితామృత మాత్మఁ గ్రోలు జనుఁ డితరకథా
గరళముఁ గ్రోలునె? హరి సం
స్మరణము జీవులకు నఖిల సౌఖ్యద మనఘా! 191

* కాబట్టి ఓ పుణ్యాత్ముడా! విశ్వ కల్యాణకరమైన విష్ణుదేవుని చరితామృతాన్ని స్వేచ్ఛగా సేవించే మానవునికి మరో కథలు విషంతో సమానం. శ్రీమన్నారాయణ ధ్యానం సకల జీవులకూ సమస్త సౌఖ్య నిధానం.

క. శ్రీవనితాధిప నామ క
థా విముఖుల కిహముఁ బరము దవ్వై పిదపం
బోవుదురు నరకమునకున్
వావిరి నే వారిఁ జూచి వగతు మునీంద్రా! 192

* ఓ మునీంద్రా! శ్రీమన్నారాయణుని నామస్మరణానికీ, కథా శ్రవణానికీ విముఖులైన వారు ఈ లోకానికీ, పరలోకానికీ - రెంటికీ కాకుండాచెడతారు. నరకంలో పడతారు. అట్లాంటి వాళ్లను చూచి నేను ఎంతగానో బాధపడతాను.

క. ఏ నరుఁడే నొక నిమిషం
బైన వృథావాదగతిని హరిపదకమల
ధ్యానానందుఁడు గాఁడే
నా నరునకు నాయు వల్పమగు మునినాథా! 193

* ఓ మునిశ్రేష్ఠా! ఎవడైనా సరే పనికిమాలిన వాదాలలో పడి ఒక్క నిముషమైనా హరి పాదపద్మాలను స్మరించి ఆనందించడో అట్టివాని ఆయుస్సు అల్పమైపోతుంది.

చ. మృదుగతిఁబువ్వుఁదేనియరమించుచుఁబానముసేయుఁబాణుష
ట్పదమునుబోలి యార్తజన బాంధవు విశ్వభవస్థితివ్యయా
స్పద మహితావ తారుఁడగు పంకరుహోదరు నిత్యమంగళ
ప్రద గుణకీర్తనామృతముఁ బాయక గ్రోలెదఁ జెప్పవే దయన్
194

* ఆపన్నులకు ఆప్తబాంధవుడూ, విశ్వానికి సంబంధించిన సృష్టి స్థితి లయాలకు కారణభూతుడూ, అవతార పురుషుడూ, అయిన శ్రీమన్నారాయణుని కల్యాణగుణ సంకీర్తనం అనే అమృతాన్ని మృదు మధురంగా పువ్వులలోని తేనెను గ్రోలే తుమ్మెదవలెనే నేను తనివి తీరా త్రాగుతాను. దయచేసి చెప్పు స్వామీ!

క. అని విదురుఁడు మైత్రేయుం
డను మునినాయకుని నడిగె నని వేదవ్యా
సుని తనయుం డభిమన్యుని
తనయునకుం జెప్పి మఱియుఁ దగ నిట్లనియెన్. 195

* ఈ విధంగా విదురుడు మునిశ్రేష్ఠుడైన మైత్రేయుణ్ణి అడిగాడు అని శుకుడు పరీక్షిత్తునకు చెప్పి మళ్ళీ ఇలా అన్నాడు.

వ. ఇట్లు విదురుండు మైత్రేయు నడిగిన నతం డతనిం గని యతిమృదుమధుర వచన రచనుండై యిట్లనియె: ననఘా! కృష్ణకథాశ్రవణ తత్పరుండవై నీవు నన్నడిగితివి గావున భద్రం బయ్యె: నీవు భగవద్భక్తుండవు గావున హరికథాసక్తుండవగుట విచిత్రంబు గాః దదియును గాక మాండవ్య శాపంబున సాత్యవతేయువలన భ్రాతృ క్షేత్రంబున శూద్రయోనిం బుట్టినట్టి ప్రజాసంయమనుండ వగు యముండవుః నారాయణునకుం బ్రియతముండవు గావున గృష్ణుండు నిర్యాణకాలంబునం దన సన్నిధికిం జనిన నన్ను డాయం జీరి విజ్ఞానం బెల్ల నుపదేశించి నీకు నెఱింగింపు మని యానతిచ్చుటంజేసి యవశ్యంబును నీకు నెఱింగింతుః దత్తావధానుండవై వినుము. 196

* ఈ విధంగా విదురుడు మైత్రేయుణ్ణి అడిగాడు. అప్పుడు ఆ మహర్షి విదురుణ్ణి చూచి మిక్కిలి మృదుమధుర వాక్యాలతో ఇట్లా అన్నాడు. ఓ పుణ్యాత్ముడా! వీనులవిందుగా విష్ణుకథలు వినాలన్న ఆసక్తితో నన్ను అడిగావు. మంచిది. నీవు భగవంతునియందు భక్తి గల వాడవు. కాబట్టి హరి కథలపై నీకు ఆసక్తి ఉండడంలో ఆశ్చర్యం లేదు

అంతేకాక నీవు సాక్షాత్తూ సమవర్తియై ప్రజలను శాసించే యముడవు. మాండవ్యమహాముని శాపంవల్ల వ్యాసభగవానునకు శూద్ర స్త్రీయందు జన్మించావు. శ్రీమన్నారాయణుని ప్రేమకు పాత్రుడైనవాడివి. అందు కనే కృష్ణుడు తన అవసాన సమయంలో సమీపానికి వెళ్ళిన నన్ను చేర పిలిచి విజ్ఞానాన్నంతా బోధించాడు. దానిని నీకు చెప్పవలసిందిగా నన్ను ఆదేశించాడు. ఆయన ఆనతి ప్రకారం అదంతా నీకు తప్పకుండా చెబు తాను. ఏకాగ్రమైన మనస్సుతో ఆకర్ణించు.

క. వనజాక్ష యోగమాయా
జనితం బగు విశ్వ జనన సంస్థాన వినా
శనముల తెఱఁ గెఱిఁగింపుచు
ననఘా! విష్ణుని మహత్త్వ మభివర్ణింతున్. 197

* ఓ పుణ్యాత్ముడా! విష్ణుదేవుని యోగమాయాప్రభావం వల్ల ప్రాదుర్భవించిన ఈ ప్రపంచం పుట్టుకనూ, అభివృద్ధినీ, వినాశాన్నీ తెల్పుతూ మహావిష్ణువు మహిమలను అభివర్ణిస్తాను. ఆలకించు.

సీ. సకలజీవుల కెల్లఁ బ్రకట దేహము నాత్మ
నాథుండుఁ బరుఁడు నానావిధైక
మత్యుపలక్షణ మహితుండు నగు భగ
వంతుండు సృష్టిపూర్వంబునందు
నాత్మీయ మాయా లయంబు నొందిన విశ్వ
గర్భుఁడై తాన యొక్కటి వెలుంగు
పరమాత్ముఁ డభవుం డుపద్రష్ట యయ్యు వ
స్త్వంతరపరిశూన్యుఁ డగుటఁజేసి

తే. ద్రష్ట గాకుండు మాయా ప్రధానశక్తి
నతుల చిచ్ఛక్తి గలవాఁడు నగుచుఁ దన్ను
లేని వానిఁగఁ జిత్తంబులోనఁ దలఁచి
ద్రష్ట యగుఁ దన భువన నిర్మాణ వాంఛ. 198

* ఈ విశ్వంలోగల సమస్త జీవుల దేహాలూ భగవంతుని స్వరూపాలు. సమస్తమైన ఆత్మలూ ఆయనే. ఆయనే సర్వానికి ప్రభువు. పరాత్పరుడు. అనేకవిధా లయిన బుద్ధులకు ఉపలక్షణమైన మహానుభావుడు. అటువంటి భగవంతుడు తన మాయవల్ల తనలోనే లీనమైన ప్రపంచాన్ని, తన గర్భంలో ధరించి ఒక్కడుగా వెలుగుతూ ఉంటాడు. ఆ పరమాత్మ పుట్టుకలేనివాడు. సమస్తమూ పై నుండి చూచేవా డయినప్పటికీ వేరే మరే వస్తువూ లేకుండా తానే సర్వమూ అయినప్పుడు ఇక ద్రష్ట కాడు. కానీ - మాయాప్రధాన శక్తి కలవాడై ప్రపంచాన్ని నిర్మించే కోరికతో గొప్ప చిచ్ఛక్తి గల్గి తనను తాను లేనివాడుగా మనస్సులో భావించు కొంటాడు. సృష్టికి ఉపక్రమించిన పిమ్మట ద్రష్ట అవుతాడు.

తే. బుద్ధిఁ దోఁచిన న మ్మహాపురుషవరుఁడు
కార్య కారణ రూపమై ఘనత కెక్కి
భూరి మాయాభిధాన విస్ఫురిత శక్తి
వినుతి కెక్కినయట్టి యవిద్య యందు 199

* ఈ విధంగా భగవంతునికి సృష్టి చేయాలనే సంకల్పం కలగగానే కార్యకారణాల రూపమై ఘనతవహించినదై మహత్తరమైన మాయా శక్తిగా ప్రకాశించే అవిద్య రూపొందుతుంది.

క. పురుషాకృతి నాత్మాంశ
స్ఫురణము గల శక్తి నిలిపి పురుషోత్తముఁ డీ
శ్వరుఁ డభవుం డజుఁడు నిజో
దర సంస్థిత విశ్వ మపుడు దగఁ బుట్టించెన్. 200

* ఈ విధంగా తన అంశనుండి ఆవిర్భవించిన మాయను తన శక్తిగా ప్రతిష్ఠించి, పుట్టుక లేనివాడూ పురుషోత్తముడూ ఐన ఈశ్వరుడు తన కడుపులో ఉన్న విశ్వాన్ని ఉద్భవింపచేశాడు.

సీ. ధృతిఁ బూని కాలచోదితము నవ్యక్తంబుఁ
ప్రకృతియు నను పేళ్లఁ బరఁగు మాయ
వలన మహత్తత్త్వ మెలమిఁ బుట్టించె మా
యాంశ కాలాది గుణాత్మకంబు

నైన మహత్తత్త్వ మచ్యుత దృగ్గోచ
  ర మగుచు విశ్వనిర్మాణ వాంఛ
నందుటఁజేసి రూపాంతరంబునఁ బొంది
  నట్టి మహత్తత్త్వమందు నోలిఁ

తే. గార్య కారణ కర్త్రాత్మ కత్వమైన
మహిత భూతేంద్రియక మనోమయ మనంగఁ
దగు నహంకారతత్త్వ ముత్పన్న మయ్యెఁ
గోరి సత్త్వరజస్తమోగుణక మగుచు. 201

* కాలచోదితము - అవ్యక్తము - ప్రకృతి - అనే పేర్లతో వ్యవహృతమైన తన మాయవల్ల మహత్తత్త్వాన్ని పుట్టించాడు. మాయకు సంబంధించినదీ, కాలము మొదలైన గుణాలు కలదీ అయిన ఈ మహత్తత్త్వం భగవంతుని కంటికి మాత్రమే కనిపిస్తూ ప్రపంచాన్ని నిర్మించాలనే కోరిక కల్గడంతో ఇంకొక రూపాన్ని పొందింది. రూపాంతరం పొందిన అటువంటి మహత్తత్త్వంలో నుంచి క్రమంగా కారణం, కార్యం, కర్త అనే భేదాలు ఏర్పడి అవి వరుసగా పంచభూతాలు - ఇంద్రియాలు - మనస్సు అను రూపములుగా గోచరించాయి. ఈమూడింటితో సత్త్వరజస్తమోగుణాలతో కూడిన అహంకారం ఏర్పడింది.

వ. వెండియు రూపాంతరంబులం బొందుచున్న సాత్త్వికాహంకారంబు వలన మనంబును. వైకారిక కార్యభూతంబులైన దేవతాగణంబులును సంభవించె. ఇంద్రియాధిష్ఠాతలైన వానివలన శబ్దంబు పూర్వంబునఁ బ్రకాశం బగుటంజేసి జ్ఞానేంద్రియంబులైన త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులును. కర్మేంద్రియంబులయిన వాక్పాణిపాద పాయూపస్థములును. తైజసాహంకారంబున నుత్పన్నంబులయ్యెఁ: దామసాహంకారంబువలన శబ్దస్పర్శరూపరసగంధంబు లుదయించెః నందు శబ్దంబు నిజగుణంబైన శబ్దంబు వలన నాకాశంబుఁ బుట్టించె. గగనంబు కాల మాయాంశ యోగం

బునం బుండరీకాక్షు నిరీక్షణంబున స్పర్శతన్మాత్రంబు వలన వాయువుం గలిగించెఁ; బవనుండు నభోబలంబున రూపతన్మాత్రంబువలన లోకలోచనంబైన తేజంబు నుత్పాదించెఁ; దేజంబు కాల మాయాంశ యోగంబున నుత్తమశ్లోకుని విలోకనంబునఁ బవమానయుక్తం బగుచు రసతన్మాత్రంబువలన నంబువులం బుట్టించెః సలిలంబు కాల మాయాంశయోగంబునం బరమేశ్వరానుగ్రహంబుగలిగి తేజోయుక్తంబైన గంధగుణంబు వలనఁ బృథివిం గలిగించెః నందు గగనంబునకు శబ్దంబును, వాయువునకు శబ్దస్పర్శంబులును, దేజంబునకు శబ్దస్పర్శరూపంబులును, సలిలంబునకు శబ్దస్పర్శరూపరసంబులును, బృథివికి శబ్దస్పర్శరూపరసగంధంబులును గుణంబులై యుండుఁ; గాల మాయాంశ లింగంబులు గలిగి మహదాద్యభిమానంబును నొందిన దేవతలు విష్ణుకళాకలితు లగుదుః రట్టి మహదాదితత్త్వంబు లైక్యంబు సొలమిం బ్రపంచంబులు కల్పింప సమర్థంబులుగాక కృతాంజలులై యోగేశ్వరేశ్వరుండైన నారాయణు నిట్లని స్తుతియించె. 202

* మార్పు చెందుతున్న సాత్త్వికాహారం వల్ల మనస్సూ, ఇంద్రియాల అధిదేవతలైన దేవతా గణాలూ ఉదయించాయి రాజసాహంకారం వల్ల జ్ఞానేంద్రియాలైన చర్మం, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు, కర్మేంద్రియాలైన వాక్కు, హస్తాలు, పాదాలు, పాయువు, ఉపస్థ జన్మించాయి. తామసాహంకారం వల్ల శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే పంచ తన్మాత్రలు ఆవిర్భవించాయి. వీనిలో శబ్దం వల్ల ఆకాశం పుట్టింది. ఆకాశం కాలమాయాంశ యోగంతో పుండరీకాక్షుని నిరీక్షణంతో స్పర్శతన్మాత్ర వల్ల వాయువును పుట్టించింది. వాయువు ఆకాశంతో కలిసి కాలమాయాంశ యోగంతో పుండరీకాక్షుని నిరీక్షణంతో రూపతన్మాత్ర వల్ల లోకలోచనమైన తేజస్సును పుట్టించింది. తేజస్సు వాయువుతో కలిసి కాలమాయాంశ యోగంతో పుండరీకాక్షుని నిరీక్షణంతో రసతన్మాత్ర వల్ల జలాన్ని కలిగించింది. జలం తేజస్సుతో కలిసి కాల

మాయాంశ యోగంతో పుండరీకాక్షుని నిరీక్షణంతో గంధతన్మాత్ర వల్ల పృథ్విని పుట్టించింది.

ఈ విధంగా ఏర్పడ్డ పంచభూతాలలో ఆకాశానికి గుణం శబ్దం; వాయువుకు శబ్ద స్పర్శాలు గుణాలు; తేజస్సుకు శబ్దస్పర్శ రూపాలు గుణాలు; జలానికి శబ్దస్పర్శరూపరసాలు గుణాలు; పృథ్వికి శబ్ద స్పర్శ రూపరస గంధాలు గుణాలై ఉంటాయి. కాల మాయాంశ లింగ స్వరూపులై మహదాదులందు అభిమానం గల దేవతలు విష్ణుదేవుని కళలే. ఐనా మహదాది తత్త్వాలూ, పంచభూతాలూ, పంచేంద్రియాలూ, పంచతన్మాత్రలూ వేరువేరుగా ఉండి అన్నీ సమైక్యం కాకపోవడంతో ప్రపంచాన్ని సృష్టించడానికి సామర్థ్యం వానికి చాలలేదు. అందువల్ల అందరూ చేతులు జోడించి యోగేశ్వరులకు ఈశ్వరుడైన శ్రీమన్నారాయణుని ఇట్లా స్తోత్రం చేశారు.

ద. శ్రీనాథ నాథా! జగన్నాథ! నమ్రైతరక్షా! విపక్షక్షమా భృత్స్వహస్తాక్ష! నీరేజపత్రేక్షణా! దేవదేవా! భవ ద్దానవర్గోపతాపంబులం బాపఁగా నోపు దివ్యాతపత్రంబు నాఁ బొల్చు యుష్మత్పదాంభోజ మూలంబు పుణ్యాలవాలంబుగాఁ బొంది యోగీంద్రు లుద్దామ సంసార తాపంబులం బోవఁగా మీటి వర్తింతురో తండ్రి! యీశా! సమస్తాఘ నిర్ణాశ! యీ విశ్వమందెల్ల జీవుల్ భవోదగ్ర దుర్వార తాపత్ర యాఖీల దావాగ్ని చేఁ గ్రాఁగి దుఃఖాబ్ధిలోఁ దోఁగి యే కర్మమున్ ధర్మముం బొందఁగా లేక సంసారచక్రంబు నందుం బరిభ్రామ్యమాణాత్ములై యుందు; ర మ్మూఢచేతస్కులం జెప్పఁగా నేల యో దేవ! విజ్ఞాన దీపాంకురం బైన మీ పాదపంకేరుహచ్ఛాయఁ బ్రాపింతు; మబ్జాక్ష! సన్మౌనిసంఘంబు లైకాంతిక స్వాంతతం బేర్చి దుర్దాంత పాపౌఘనిర్ణాశ కాంబు ప్రవాహాభ్ర గంగా నివాసంబు గా నొప్పు నీ పాదయుగ్మంబు యుష్మన్ముఖాంభోజ నీడోద్గతం బైన వేదాండజ శ్రేణిచేతన్ గవేషించి సంప్రాప్తులై యుందు; రో నాథ! వైరాగ్య శక్తిస్ఫుట జ్ఞాన బోధా

త్ములై నట్టి ధీరోత్తముల్ నిత్య నైర్మల్య భవ్యాంతరంగంబులం
దే పరంజ్యోతి పాదాబ్జ పీఠంబు గీలించి కైవల్య సంప్రాప్తులై
రట్టి నిర్వాణ మూర్తిం బ్రశంసింతు; మింద్రాది వంద్యా!
ముకుందా! సమస్తంబుఁ గల్పింపఁ బాలింపఁ దూలింపఁగాఁ
బెక్కు దివ్యావతారంబులం బొందు నీ పాద పంకేరుహ ధ్యాన
పారీణ సుస్వాంతులై యొప్పు భక్తాళికిన్ మోక్షదం బైన మీ పాద
కంజాతముల్ గొల్తు; మీశా! రమాధీశ! పుత్త్రాంగనా మిత్ర సం
బంధ బంధంబులం జెంది నిత్యంబు దుష్క్రియా లోలురై దేహ
గేహంబులం దోలి వర్తించు దుర్మానవ శ్రేణులం దంతరాత్ముండవై
యుండియున్ దూరమై తోఁచు నీ పాదపద్మంబు లర్చింతు;
మో దేవ! బాహ్యేంద్రియ వ్యాప్తి నుద్వృత్తులై నట్టి మూఢాత్ము
లధ్యాత్మ తత్త్వ ప్రభావాఢ్యులై నీ పదాబ్జాతవిన్యాస లక్ష్మీ
కళావాసముం గన్న యయ్యుత్తమశ్లోకులం గానఁగాఁ జాల;
రప్పుణ్యులా దుష్టులం జూడఁగా నొల్ల రంభోధిరాట్కన్యకాకాంత!
వేదాంత శుద్ధాంత సిద్ధాంతమై యొప్పు నీ సత్కథాపార
చంచత్సుధాసార పూరంబులం గ్రోలి - సౌఖ్యోన్నతిన్ సోలి,
ధీయుక్తులై వ్రాలి, తాపంబులం దోలి, మోదంబులం దేలి,
సంపన్నులై మన్న నిత్యప్రసన్నుల్ మహోత్కంఠతం బేర్చి
వైకుంఠధామంబు నల్పక్రియాలోలురై కాంతు; ర ద్దివ్యవాసైక
సంప్రాప్తికిం గోరుచున్నార; మో దేవ! వైరాగ్య విజ్ఞాన బోధాత్మ
యోగక్రియారూఢి నంతర్బహిర్వ్యాప్తిఁ జాలించి శుద్ధాంత
రంగంబు గావించి హృత్పద్మవాసుండవై చిన్మయాకారమై యున్న
నీ యున్న తానంత తేజో విలాసోల్లసన్మూర్తిఁ జిత్తంబులం జేర్చి
యానంద లోలాత్మతం బొల్చు యోగీశ్వర శ్రేణికిం దావకీనాను
కంపానులబ్ధిస్ఫుటజ్ఞానముం గల్గుటం జేసి యాయాసముం జెంద;
రో దేవతాచక్రవర్తీ! సదానందమూర్తీ! జగద్గీతకీర్తీ! లసద్భూత
వర్తీ! భవద్దాసులై నట్టి మమ్మున్ జగత్కల్పనాసక్త చిత్తుండవై

నీవు త్రైగుణ్యవిస్ఫూర్తిఁ బుట్టించినం బుట్టుటే కాక నీ భవ్యలీలానుమేయంబుగా సృష్టినిర్మాణముం జేయ నే నెంతవారౌదు? మీ శక్తి యుక్తిన్ భవత్పూజ గావింతుః మట్లుండె నీ సత్కళాజాతులైనట్టి మమ్మెన్నఁగా నేల? యధ్యాత్మతత్త్వంబ వన్నం బరంజ్యోతి వన్నం బ్రపంచంబ వన్న న్నధిష్ఠాతవన్నన్ సదాసాక్షి వన్నన్ గుణాతీత! నీవే కదా పద్మపత్రాక్ష! సత్త్వాదిత్రైగుణ్య మూలంబు నా నొప్పు మాయా గుణంబందు నుద్యన్మహాతత్త్వమైనట్టి నీ వీర్యముం బెట్టుటం జేసి నీ వింతకుం గారణం బౌదుః వాయాయి కాలంబుల న్నీకు సౌఖ్యంబు లేమెట్లు గావింతు? మే రీతి నన్నంబు భక్షింతు? మెబ్భంగి వర్తింతు? మే నిల్కడన్నుందు? మీ జీవలోకంబె యాధారమైయుండి భోగంబులం బొందుచున్నన్న యిక్కార్య సంధానులైనట్టి మాకుం జగత్కల్పనా శక్తికిన్ దేవ! నీ శక్తిఁదోడ్పాటు గావించి, విజ్ఞానముం జూపి. కారుణ్య సంధాయివై మమ్ము రక్షింపు లక్ష్మీమనః పల్వలక్రోడ! యోగీంద్ర చేతస్సరోహంస! దేవాదిదేవా! నమస్తే నమస్తే నమః. 203

* ఓ లక్ష్మీవల్లభా! అనాథ నాథా! అఖిలజగన్నాథా! నీవు శిరస్సువంచిన వారిని చేర దీసే కరుణా సాంద్రుడవు! పగవారనే పర్వతాలను బద్దలు కొట్టే దేవేంద్రుడవు! కమలదళాల వంటి కన్నులు గలవాడవు! దేవతలకు దేవుడవైనవాడవు! నీ దాసుల తాపాన్ని పోగొట్టే చల్లని వెల్లగొడుగులు నీ అడుగులు. అఖిల సౌభాగ్యాలకూ ఆలవాలాలైన నీ అంఘ్రికమలాలను ఆశ్రయించిన మహాయోగులు దుర్వార సంసార బాధలన్నింటినీ దూరంగా పారదోలి సుఖంగా ఉంటారు. సకల పాతక సమూహాలనూ సంహరించే ఓ తండ్రీ! నీవు జగదీశ్వరుడవు! ఈ ప్రపంచం లోని ప్రాణులందరూ భయంకరమైన భవబంధాలలో చిక్కుకొని ఆధ్యాత్మికం – ఆధిభౌతికం – ఆధి దైవికం అనే తాపత్రయ రూప మైన దావానలంలో కాలుతూ దుఃఖసముద్రంలో మునిగి తేలుతున్నారు. ఒక సత్కర్మం గానీ, ధర్మం గాని లేకుండా సంసార చక్రంలో పడి క్రిందు మీదులుగా

తిరుగుతున్నారు. అటువంటి పరమ మూర్ఖుల మాట చెప్పేదేముంది! ఓ దేవాదిదేవా! విజ్ఞానదీపాన్ని వెలిగించి అజ్ఞాన తమస్సును తొలగించే మీ పాద పద్మాలను ఆశ్రయిస్తాము. కమలలోచనా! ఘనులైన మునులు మనస్సును ఏకాగ్రంచేసుకొని గూటిలోనుండి పక్షులవలె నీ నోటిలో నుండి వెలువడిన వేదవాక్కుల ద్వారా వెదకి వెదకి నీ పదార విందాలను అందు కుంటారు. నీ చరణ కమల ద్వయం దుర్దాంతమూ, దురంతమూ, అయిన దురిత సంచయాన్ని తుడిచివేసే గగన గంగా తరంగిణికి ఆశ్రయం.

ఓ ప్రభూ! నీవే అందరికీ పైవాడవు: నీపైని ఎవ్వరులేరు. వైరాగ్య బలంచేత ప్రాప్తించిన నిశ్చలమైన జ్ఞానోదయంతో మేల్కాంచిన ధీరశ్రేష్ఠులు, నిత్యములూ, నిర్మలములూ, అత్యంత పవిత్రములూ అయిన తమ హృదయంలో ఏ వరం జ్యోతి పాద పీఠాన్ని నెలకొల్పి మోక్షాన్ని పొందారో– ఆ మోక్ష స్వరూపుడవైన నిన్ను సన్నుతిస్తున్నాము. ఇంద్రాది బృందారక బృందాల అభివందనాలు అందుకొనే ఓ ముకుందా; ఈ సృష్టిసంతతినీ పుట్టించి, రక్షించి నశింప చేయడానికై అనేకాలైన దివ్యా వతారాలు ధరించావు. నీ పదకమలాలను హృదంతరాలలో నిరంతరం స్మరించే భక్త సమూహానికి ముక్తిని ప్రసాదించే ప్రభూ!. మేము నీ చరణ సరోజాలను సంసేవిస్తాము. ఈశా! ఓ రమాధీశా! పిల్లలూ, ఇల్లాలు, మిత్రులూ – అనే సంబంధ బంధాల్లో బంధితులై ఎల్లప్పుడూ దుష్టకార్యాలు చేయుటయందే ఇష్టం కలిగి నాయిల్లూ నాఒళ్లూ అనే మమకారంతో ప్రవర్తించే మూఢమానవుల అంతరంగాలలో కూడా సర్వాంతర్యామి వైన స్వామీ! నీవు నిండి ఉంటావు. కాని నీ పాదాలు వారికి దూరంగానే ఉంటాయి. అటువంటి నీ చరణ సరోజాలను పూజిస్తాము.

ఓ దేవా! ఇంద్రియోన్మాదానికి లోబడి చెడుపనులనే చేస్తూ మిడిసిపడే పరమ శుంఠలు, అధ్యాత్మ తేజోవిరాజితులై అఖిల సంపదలకు ఆలవాలమైన నీ పాద మూలమందే మనస్సు నిల్పిన మహానుభావులను దర్శించాలని వాంఛించరు. ఈ మహాపురుషులు కూడా ఆ కాపురుషుల ముఖం చూడటానికి సుముఖులు కారు. లక్ష్మీమనోవల్లభా! ఉపనిష త్కాంతలకు అంతఃపురమైన నీ కథాసారమనే సుధాపూరాన్ని గ్రోలుతూ

సంతోషాతిశయంతో సోలుతూ, జ్ఞానవంతులై సంసార తాపాన్ని పార దోలుతూ, ఆనంద పారవశ్యంలో మునిగి తేలుతూ, సత్త్వసంపన్నులై నిత్యప్రసన్నులైన వారు పరమోత్కంఠతో నీ వైకుంఠ ధామాన్ని చేరు తారు. మేముకూడా అటువంటి దివ్యస్థానాన్ని కోరుతున్నాము. ఓ దేవ దేవా! వైరాగ్యం చేతనూ, విజ్ఞానం చేతనూ ప్రబుద్ధమైన ఆత్మయోగంలో సిద్ధిపొంది, లోపలా బయటా వ్యాపించి చలిస్తూ ఉండే మనోవృత్తిని నిరోధించి, పరిశుద్ధమైన అంతరంగంతో ఒప్పే యోగీశ్వరులు - తమ హృదయపద్మాల్లో వర్తిస్తూ చిన్మయాకారంతో ప్రవర్తిస్తూ ఉన్న నీ అనంత తేజో విరాజితమైన దివ్యమూర్తిని తమ మనస్సుల్లో నిలుపుకొని ఎల్లప్పుడు ఆనందిస్తూ ఉంటారు. నీ అనుగ్రహం వల్ల ప్రాప్తించిన పరమజ్ఞానం పొందినందువల్ల వారికి ఆయాస మనేది ఉండదు.

ఓ సకల దేవతా చక్రవర్తీ! ఓ సచ్చిదానందమూర్తీ! నీ కీర్తిని విశ్వమంతా కీర్తిస్తున్నది. నీ మూర్తి సమస్తజీవరాసులలో వర్తిస్తున్నది. లోకాలను సృష్టించాలనే సంకల్పంతో సత్త్వరజస్తమోగుణాలను ప్రస్ఫు రింపజేసి నీ దాసులమైన మమ్ములను పుట్టించావు. పుట్టిస్తే పుట్టామే తప్ప గొప్పదైన నీ సృష్టిని అనుసరించి లోకాలను సృష్టించటానికి మే మెంత వాళ్లం స్వామీ! నీ ప్రసాదంవల్ల కల్గిన శక్తియుక్తులతో నిన్ను పూజి స్తాము. అంతే. నీ అంశవల్ల పుట్టిన మమ్మల్ని ప్రత్యేకంగా గణించడం ఎందుకు? త్రిగుణాలకు అతీతుడవైన ఓ పరమాత్మా! అధ్యాత్మతత్త్వాని వన్ననూ, పరంజ్యోతి వన్ననూ, ప్రపంచాని వన్ననూ, అధిష్ఠాత వన్ననూ, సదాసాక్షి వన్ననూ - అన్నీ నీవే కదా? తామర రేకులవంటి కన్నులు కలదేవా! సత్త్వరజస్తమోగుణాలకు మూలమైన మాయాగుణంలో మహత్తత్త్వమైన నీ తేజస్సును ప్రవేశపెట్టిన నీవు ఈ సృష్టికంతటికీ కారణమైనావు. నీ అంశలమైన మేము కాలానుసారంగా నీ కే విధంగా సంతోషాన్ని సమకూర్చుతాము? మా ఆహారం ఏమి? మేము ఏ విధంగా ప్రవర్తించాలి? మా స్థితి ఏమి? ఈ ప్రాణి లోకమే మాకు ఆధారం కాగా అనుభవాల్ని పొందుతూ నీ కార్యం నెరవేర్చాలని కుతూహలపడుతున్న మాకు మార్గాన్ని చూపించు. కరుణతో నీ శక్తిని ప్రసాదించి జగత్తును సృష్టించే శక్తిని కల్గించి రక్షించు. లక్ష్మీహృదయ

మనే నీటి పడియలో విహరించే మహావరాహస్వామీ! మహాయోగుల మానస సరోవరాలలో సంచరించే మరాళరాజా! దేవాది దేవా! నీకు నమస్కారం! నీకు నమస్కారం!

సీ. అనినఁ బ్రసన్నుఁడై హరి మహదాదుల
కన్యోన్యమిత్రత్వ మందకున్న
కతమున నిఖిలజగత్కల్పనాశక్తి
వొడమ కుండుటఁ దన బుద్ధి నెఱిఁగి
కైకొని కాలవేగమున నుద్రేకంబు
నొందిన ప్రకృతితోఁ బొంది నిజ బ
లము నిల్పి తా నురుక్రముఁడన సప్త విం
శతి తత్త్వములయందు సమత నొక్క

తే. పరి ప్రవేశించి యా తత్త్వభవ్యగుణము
నందు జ్యేష్ఠానురూపంబు లలరఁ జెంది
యొకటి నొకటిని గలయక యుండి విశ్వ
రచన మెఱుఁగనియా తత్త్వ నిచయమునకు. 204

* ఇలా స్తోత్రం చేయగా విని శ్రీహరి సంతోషించాడు. మహత్తు మొదలగు తత్త్వాలకు పరస్పరం పొత్తు కుదరక పోవడం వల్ల సమస్త జగత్తును సృషించే శక్తి అభ్యం కాకపోవడాన్ని తెలుసుకొన్నాడు. అప్పుడు కాలవేగంతో ఉద్రేకం పొందిన ప్రకృతితోకూడి నిజ శక్తి ని నిక్షే పించి ఉరుక్రముడై ఇరవై యేడు తత్త్వాలలో ఏకకాలంలో తాను ప్రవే శించి ఘనపరిణామరూపుడై విడివిడిగా ఉన్న వానికి ఏకత్వం కలిగిం చాడు. పంచభూతాలు - పంచతన్మాత్రలు - పది ఇంద్రియాలు - కాలం, ప్రకృతి, మహత్తు, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే అంతః కరణ చతుష్టయం - ఇవి ఇరువదియేడు తత్త్వాలు.

వ. ఇట్లు విశ్వనిర్మాణ నిపుణత్వంబు నెఱుంగం జూపుచు నన్నింటికి నన్యోన్యతం గల్పించి తన యనుగ్రహంబునం బ్రేరి తంబై కానంబడి క్రియాసామర్థ్యంబునం జెన్నొందిన తత్త్వవితా

నంబు దేవప్రేరితం బయి స్వకీయంబు లగు నంశంబులచేతం
బుట్టించిన విరాడ్విగ్రహంబై తత్త్వవితతి దమయందుఁ జెందిన
పుండరీకాక్షుని కళాంశంబున నొకటి కొకటికి నైక్యంబు వాటిల్లి
పరిణతంబై రూపాంతరంబునుం జెందె; నే తత్త్వంబునఁ జరా
చరలోక పుంజంబులు నిండియుండు నా హిరణ్మయంబైన
విరాడ్విగ్రహంబు నొందిన పురుషుండు సర్వజీవ సమేతుండై
యుండె నంత 205

* ఈ విధంగా ప్రపంచాన్ని నిర్మించడంలో వానికి నేర్పు కలుగ జేస్తూ శ్రీహరి క్రమానుసారంగా అన్నింటికీ పరస్పరమైత్రి కల్పించాడు. ఇలా శ్రీహరి అనుగ్రహంచేత ప్రేరేపింపబడి సృష్టిక్రియకు సమర్థమైన తత్త్వసమూహం, తనుతమ అంశలతో విరాడ్విగ్రహంగా రూపొందింది. విష్ణుదేవుని కళాంశలతో ఒకటి మరొక్కదానితో ఏకీభావం పొంది, పరి పక్వమై ఇంకొక రూపం ధరించింది. ఏ తత్త్వం ఈ జగత్తంతా నిండి ఉందో హిరణ్మయమైన ఆ విరాట్ స్వరూపం ధరించిన పరమాత్మ సమస్త జీవులలో నిండియున్నవా డయ్యాడు.

క. జలముల లోపల నిమ్ముల
జలరుహజాతాండమందు సాహస్రాబ్దం
బులు నిలిచెఁ గార్యరూపా
కలితంబగు నవ్విరాట్సుగర్భము వరుసన్. 206

* ఈ విరాట్ పురుషుడు మొదటి జలాలలో ఏర్పడ్డ బ్రహ్మాండం అనే గర్భరూపంతో వేయి సంవత్సరాలు ఉన్నాడు. దాని నుండే సమస్త సృష్టి కార్యరూపంగా వెలువడింది.

తే. దైవకర్మాత్మ శక్తి వితానములను
దగిలి తనచేతఁ దనుఁ దాన దైవశక్తి
యగుచు వెలుఁగొందుచును బ్రకారాంతరమునఁ
దనువు వితతంబుగాని చైతన్య మొంది. 207

* దైవం - కర్మ - ఆత్మ అనువాటి శక్తి వ్యాపించి భగవంతుడు తానే బహుళ రూపాలతో వెలుగొందుతాడు. అపుడు సంకల్పమయమైన సృష్టి చైతన్యంతో విస్తరిస్తుంది గాని దేహం ఏర్పడదు.

తే. రూపసంసక్తిఁ జేసి నిరూఢకర్మ
శక్తియును వృత్తిభేద సంసక్తి దశ వి
ధములు గలిగిన ప్రాణరూపమున నాత్మ
శక్తి బోధత్వ మగుచున్న శక్తి కలిగి. 208

* ఆ చైతన్య శక్తికి రూపాలుగా ఏర్పడే లక్షణం ఏర్పడుతుంది. అదే కర్మశక్తి. దీనివల్ల అనేక ప్రవృత్తి భేదాలు ఉద్భవిస్తాయి. దాని యందు పది విధాలైన ప్రాణాలు స్పందిస్తాయి. ఇన్ని శక్తులతో గూడిన ప్రజ్ఞవల్ల తాను అనగా ఏమో తనకు తెలిసే శక్తి ఏర్పడుతుంది.

క. త్రివిధం బగుచును నాధ్యా
త్మ్య విభేదంబులను బాపి మఱి యధిభూతా
త్మ విరాడ్రూప మ్మగు నిది
వివిధప్రాణులకు నాత్మవిధమై మఱియున్. 209

* అధ్యాత్మం, అధిభూతం, అధిదైవం అనబడే మూడు భేదాలు కలిగి ఈ విరాట్ స్వరూపం జీవులకు తాను ఆత్మగా మెలగుతుంది.

క. జీవంబై పరమాత్మకుఁ
దావలమై యాదిమావతారంబగు న
ద్దేవుని గర్భంబున భూ
తావలితోడం బ్రపంచ మర్థిం దోఁచెన్. 210

* సమస్తానికి జీవమై పరమాత్మకు స్థానమై తొలి అవతారమైన ఆ విరాట్ పురుషుని గర్భంనుండి భూతమయమైన ఈ సమస్త ప్రపంచం పుట్టింది.

వ. ఇట్లు దోఁచిన విరాట్పురుషుం డాధ్యాత్మి కాధిదై వికాధి భౌతికంబులను భేదంబులచేఁ బూర్వోక్త క్రమంబున వెలుఁగొందు ననుచు విదురునకు మైత్రేయుం డెఱింగించె నని చెప్పి వెండియు నిట్లనియె. 211

* ఈ విధంగా విరాజిల్లిన విరాట్ పురుషుడు - ఆధ్యాత్మికము, ఆధిదైవికము, ఆధిభౌతికము అనే భేదాలతో మొదట చెప్పిన విధంగా ప్రకాశిస్తూ ఉంటాడు అని మైత్రేయుడు విదురునికి తెలియజెప్పి నాడని మళ్లీ శ్రీశుకుడు పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.

చ. హరి పరమాత్ముఁ డీశుఁ డజుఁ డాఢ్యుఁ డనంతుఁ డనంతమూర్తి సా
గర తనయాహృదీశుఁడు వికారవిదూరుఁడు నిత్యమంగళా
కరుఁడు కృపాపయోనిధి యకల్మష చిత్తుఁడు సర్వశక్తి తా
మరసవిలోచనుండు బుధమాన్య చరిత్ర పవిత్రుఁ డిమ్ములన్. 212

* ఆ శ్రీహరి, పరమాత్ముడు, ఈశ్వరుడు, అజుడు, అధ్యుడు, అనంతుడు, అనంతమూర్తి, లక్ష్మీరమణుడు, నిర్వికారుడు, నిత్యమంగళ స్వరూపుడు, కరుణాసముద్రుడు, నిర్మలహృదయుడు, సమస్త శక్తి మంతుడు, కమలదళ నేత్రుడు, సకల బుధ సంస్తవనీయ చరిత్రుడు, పరమ పవిత్రుడు.

వ. ఇత్తెఱంగున నీశుండగు నధోక్షజుండు మహదాది తత్త్వం బుల మనంబుల ఘనంబులగు తలంపులు దా నెఱిఁగి యట్టి తత్త్వంబుల వివిధవృత్తి లాభంబునకై స్వకీయ చిచ్ఛక్తిచే నిట్టు లొనర్తునని చింతించి నిజకళాకలితంబగు విరాడ్విగ్రహంబునందు నగ్నిప్రముఖంబగు దేవతావళి కెల్ల నివాసం బగుచుఁ గానంబడిన వైరాజపురుషుని యాస్యాద్యవయవంబుల వినిపింతుః దత్తావ ధానుండవై వినుము. 213

* సర్వేశ్వరుడైన పరాత్పరుడు ఈ విధంగా మహదాది తత్త్వాల మనస్సుల్లోని గొప్ప ఆలోచనలన్నీ తెలుసుకొన్నాడు. ఆ తత్త్వాల

ప్రవర్తనలన్నీ సఫలం కావటానికి తన చైతన్య శక్తిని ఉపయోగించాలని నిశ్చయించాడు. తన కళలతో కూడిన విరాట్ స్వరూపంలో అగ్ని మొదలైన దేవత లందరికీ నివాసాలు కల్పించాడు. విరాట్ పురుషుని ముఖం మొదలైన అవయవాల స్వరూపాలను వినిపిస్తాను. ఏకాగ్రమైన భావంతో ఆకర్ణించు.

సీ. నరనుత! యా దివ్యపురుషోత్తముని పృథ
 గ్భావంబు నొంది ముఖంబు వలన
భువనపాలకుఁ డైన పవమాన సఖుఁ డంత
 రాత్ముఁ డీశ్వరు నంశ మైన వాణి
కనయంబు ననుకూల మగుచు నిజస్థాన
 మునఁ బ్రవేశించిన ముఖమునందుఁ
బరఁగు జీవుండు శబ్దము నుచ్చరించుఁ బృ
 థగ్భావములను నేత్రముల నినుఁడు

తే. చక్షురింద్రియ యుక్తుఁడై సరవిఁ జెంది
రూపవిజ్ఞాన మహిమ నిరూఢి నొందు
మఱియుఁ జర్మంబునను బవమానుఁ డీశ్వ
రాంశమై త్వగింద్రియమందుఁ గూడి. 214

* భవ్యచరిత్రుడవైన విదురా! ఆ దివ్యమూర్తియైన విరాట్పురుషుని నుండి కొంతభాగం వేరయింది. అది ముఖంగా రూపొందింది. ఆ పరమేశ్వరుని అంశగలవాడై వాయుదేవుని మిత్రుడైన అగ్నిదేవుడు ముఖాన్ని నిజస్థానంగా చేసుకొన్నాడు. అందువల్ల జీవుడు శబ్దాన్ని పలుక గలుగుతున్నాడు. విరాట్ పురుషుని నుండి మరికొంత భాగము వేరై కన్నులుగా రూపొందాయి. సూర్యుడు చక్షురింద్రియానికి అధికారియై రూప విజ్ఞానాన్ని జీవునకు కలుగజేస్తున్నాడు. అట్లే విరాట్పురుషునిలో కొంతభాగం వేరై చర్మంగా ఏర్పడింది. ఈశ్వరాంశ అయిన వాయువు త్వగింద్రియంలో నిల్చాడు.

వ. నిజనివాసంబు నాశ్రయించిన జీవుండు స్పర్శేంద్రియ గతుండగు పృథగ్భావంబైన శ్రోత్రంబుల దిక్కు లచ్యుత కళాంశంబులగు. శ్రవణేంద్రియ యుక్తంబులై నిజస్థానంబునం బొందిన జీవుండు శబ్దజ్ఞాన గతుండగు; వెండియుఁ దాలువు నిర్భిన్నం బయిన లోకపాలుండగు వరుణుం డందుఁ బ్రవేశించి రసనేంద్రియంబుచేఁ బ్రకాశించినం బ్రాణి రసంబులం గ్రహించెః బరమేశ్వరుని నాసికేంద్రియంబు పృథగ్భావంబు నొంది యాశ్వినే యాధిష్ఠానంబై ఘ్రాణాంశంబు నొందిన జంతువు గంధగ్రహణ సమర్థంబయ్యెః వెండియు భిన్నంబయిన చర్మంబును నోషధు లును బరమపురుషాంశంబు లయిన కేశంబులంగూడి నిజనివా సంబు నొందిన జీవుండు కండూయ మానుండగుః భిన్నభూతం బైన మేఢ్రంబునం బ్రజాపతి రేతంబున నిజస్థానంబు నొందిన జీవుం డానందంబునం బొరయుః భిన్నభావంబైన గుదంబున మిత్రుం డచ్యుతాంశంబును బొంది వాయువుం గూడి నిజాధిష్ఠా నంబు నొందిన జీవుండు విసర్గంబుఁ జెందుః వేఱు వేఱైన బాహు వులం ద్రిదశాధీశ్వరుండయిన పురందరుండు క్రయవిక్రయాది శక్తియుక్తుండగుచు నిజస్థానంబు నొందిన జీవుండు వానిచేత జీవికం బొందుః మఱియుఁ బాదంబులు నిర్భిన్నంబులయిన విష్ణుండు స్వావాసంబు గైకొని గతిశక్తిం బొందిన జీవుండు గమ నాగమ నార్హుం డయ్యెః వెండియు భిన్నభావంబయిన హృద యంబు మనంబుతోడం గలసి నిజాధిష్ఠానంబునం జంద్రుండు ప్రవేశించిన జీవుండు శరీరసంకల్పాది రూపంబగు వికారంబునుం బొందుః భిన్నభావంబైన యహంకారంబున నహంకృతి యుక్తుండై రుద్రుండు నిజస్థానంబుగా వసియించుః నా యహం కృతిచే శరీరి కర్తవ్యంబులు నడపుః బుద్ధి వాగీశ్వరావాసంబై హృదయంబుతోడం గలసి నిజాధిష్ఠానంబున బోధాంశంబుచే వెలింగిన శరీరి బోద్ధవ్యతం బొందుః భిన్నంబైన చిత్తంబు బ్రహ్మ

వాసంబై చేతనాంశంబు నొందినఁ బ్రాణి విజ్ఞానంబునుం బొందు; నట్టి విరాట్పురుషుని శీర్షంబున స్వర్గంబును, జరణంబుల వసుమతియు, నాభియందు గగనంబునుం గలిగె; సత్త్వాదిగుణపరిణామంబుల నమరులైరి; ఊర్జిత సత్త్వగుణంబున న ద్దేవతలు త్రిదివంబునుం బొందిరి; రజోగుణంబున మనుజులును గవాదులును ధరణిం బొందిరి; తామసంబున భూతాదులైన రుద్ర పారిషదులు ద్యావాపృథివ్యంతరంబగు వియత్తలంబునుం బొందిరి; ముఖంబువలన నామ్నాయంబు లుత్పన్నంబులయ్యె. వెండియు— 215

* జీవునకు స్పర్శజ్ఞానాన్ని కలిగించు విరాట్పురుష నుండివేరైన చెవులయందు ఈశ్వరాంశలైన దిక్కులు జీవుని శ్రవణేంద్రియాన్ని కూడి జీవునకు శబ్ద జ్ఞానాన్ని కలిగిస్తున్నవి. అట్లే వేరైన తాలువులందు లోక పాలకుడైన వరుణుడు ఈశ్వరాంశతో ప్రవేశించి జీవుని రసనేంద్రియంగా ప్రకాశిస్తున్నాడు. అందువల్ల ప్రాణి రుచులను తెలుసుకొంటాడు. పరమేశ్వరుని నాసికేంద్రియం వేరై ఆయన అంశగల అశ్వినీ దేవతలకు అధిష్ఠానమయింది. అందువల్ల జీవునకు వాసనచూచే శక్తి కలిగింది. పరమ పురుష నుండి వేరైన చర్మం ఓషధులు ఆయన అంశలైన కేశాలను కూడడం చేత జీవునకు కండూయమానస్థితి (గోకుకొనుట) ఏర్పడింది. అట్లే పరమేశ్వరుని నుండి వేరైన పురుషాంగంలో ఈశ్వరాంశమైన ప్రజాపతి రేతస్సుతో సంయోగ మందటం వల్ల జీవుడు ఆనందాన్ని పొందుతున్నాడు. పరమేశ్వరుని నుండి వేరైన గుదస్థానంలో అచ్యుతాంశమైన మిత్రుడు, వాయువుతో కూడి ప్రవేశించటం వల్ల జీవునకు మలవిసర్జన శక్తి కలుగుతున్నది.

విరాట్పురుషుని నుండి వేరైన చేతులందు ఈశ్వరాంశమైన ఇంద్రుడు ప్రవేశించటం వల్ల ఇచ్చిపుచ్చుకొను శక్తి కలవాడై, నిజస్థానాన్ని పొందిన జీవుడు జీవనోపాధిని పొందుతున్నాడు. విరాట్ పురుషుని నుండి వేరైన పాదాలను విష్ణువు అధిష్ఠించి గమన శక్తి కలిగించటం వల్ల జీవుడు నడచుటకు శక్తిమంతు డగుతున్నాడు. పరమేశ్వరుని నుండి బయటకి

వచ్చిన హృదయం మనస్సుతో కలిసి, అధిష్ఠాత అయిన చంద్రుడు ప్రవేశించడం చేత జీవుడు సంకల్ప వికల్పాలను పొందుతున్నాడు. వేర్పాటు చెందిన అహంకారంలో అహంకృతియుక్తుడైన రుద్రుడు నిజస్థానంగా ప్రవేశించినప్పుడు జీవుడు కర్తవ్యాలను నిర్వర్తిస్తాడు. విడివడిన బుద్ధి వాగీశ్వరునికి ఆవాసమై హృదయంతో కలిసి జ్ఞానాంశతో వెలిగినప్పుడు జీవునకు గ్రహణశక్తి కలుగుతుంది. వేరుపడిన చిత్తం బ్రహ్మకు ఆవాసమై చేతనాంశం పొందినప్పుడు జీవుడు విజ్ఞానాన్ని పొందుతాడు.

అటువంటి విరాట్పురుషుని శిరస్సునుండి స్వర్గమూ, పాదాల నుండి భూమీ, నాభి నుండి ఆకాశమూ కలిగాయి. సత్త్వ రజస్తమో గుణాల మార్పుచేత జీవులు అమరు లయ్యారు. సత్త్వ గుణం అధికంగా ఉండడంచేత ఆ దేవతలు స్వర్గాన్ని పొందారు. రజోగుణంవల్ల మనుష్యులూ, గోవులూ మొదలైన జీవులు భూమిని పొందాయి. తామస గుణం వల్ల భూతాదులైన రుద్రపారిషదులు భూమికీ, ఆకాశానికీ మధ్యగల ప్రదేశాన్ని పొందారు. విరాట్పురుషుని ముఖం నుండి వేదాలు పుట్టాయి.

క. ధరణీదివిజులు శ్రుతులును
నరవర! యమ్మేటి ముఖమునం బొడముట భూ
సురుఁ డఖిల వర్ణములకున్
గురుఁడున్ ముఖ్యుండు నయ్యెఁ గుణరత్ననిధీ! 216

* ప్రశస్త గుణసంపన్నుడవైన పరీక్షిన్మహారాజా! బ్రాహ్మణులూ, వేదాలూ ఆ విరాట్పురుషుని ముఖంనుండి పుట్టడం వల్ల బ్రాహ్మణుడు సమస్త వర్ణాలకూ జ్యేష్ఠుడూ, శ్రేష్ఠుడూ అయ్యాడు.

క. ధర బ్రాహ్మణాదికము ద
స్కర బాధలఁ బొందకుండఁ గైకొని కావం
బురుషోత్తము బాహువులన్
నరనాథకులంబు వుట్టె నయతత్త్వనిధీ! 217

* నీతి విద్యావిశారదుడవైన విదురా! బ్రాహ్మణాది వర్ణాల వారు దొంగలూ దుండగులూ మొదలైన వారివల్ల బాధలు పొందకుండా వారిని రక్షించడానికి ఆ పురుషోత్తముని భుజాల నుండి క్షత్రియజాతి జన్మించింది.

క. గణుతింపఁగఁ గృషిగోర
క్షణవాణిజ్యాది కర్మకలితంబుగ నా
గుణనిధి యూరువులందుం
బ్రణుతింపఁగ వైశ్యజాతి ప్రభవం బయ్యెన్. 218

* వ్యవసాయం, గోసంరక్షణం, వ్యాపారం–మొదలైన కార్యాలను నిర్వహించటం కోసం ఆ సర్వేశ్వరుని తొడలనుండి వైశ్యజాతి ఆవిర్భవించింది.

తే. తవిలి సేవక ధర్ములై దేవదేవు
పదములను శూద్రసంతతు లుదయమైరి
వీర లందఱుఁ దమతమ విహితకర్మ
మలరఁ జేయుచు జనకుండు నాత్మగురుఁడు 219

క. అగు సర్వేశుఁ బరాత్పరు
జగదేకప్రభుని పాదజలజాతంబుల్
దగిలి భజింతురు సతతము
నిగమోక్తిన్ భక్తియోగనిపుణాత్మకులై. 220

* ఆ దేవదేవుని పాదాలనుండి సేవావృత్తియే ధర్మంగాగల శూద్రజాతి పుట్టింది. వీరంతా తమకై విధింపబడిన పనులు చేస్తూ–జగజ్జనకుడూ, విశ్వగురుడూ, సర్వేశ్వరుడూ, పరాత్పరుడూ అయిన ఆ లోకైకనాథుని పాదపద్మాలను వేదాల్లో చెప్పిన విధంగా భక్తియోగ పరాయణులై అనుదినమూ ఆరాధిస్తుంటారు.

తే. మహిమ దీపింపఁ గాలకర్మ స్వభావ
శక్తిసంయుక్తుఁ డగు పరేశ్వరుని ఘోరి
యోగమాయా విజృంభణోద్యోగ మెవ్వఁ
డెఱిఁగి నుతియింపఁగా నోపు నిద్ధచరిత! 221

* మహనీయ చరిత్రా! కాల, కర్మ, స్వభావశక్తులతో ప్రకాశించే పరమేశ్వరుని యోగమాయ అమేయ మైనది. దాని విశేష విజృంభణాన్ని తెలుసుకొని సంస్తుతించడానికి ఎవరికి సాధ్యమౌతుంది?

చ. అన్యకథానులాపము లహర్నిశముం బఠియించి చాల మా
లిన్యము నాత్మశోభన విలీనత నొందు మదీయ జిహ్వ సౌ
జన్యము నొందె నేఁడు హరిసద్గుణ దివ్య కథామృతంబు స
న్మాన్యచరిత్రమై నెగడుమద్గురు వాక్యపదంబుఁ జెందఁగన్. 222

* విదురా! ఈ నా నాలుక ఇతరుల కథాకలాపాలను రాత్రింబవళ్లు చదివి చదివి, చాలా మలినమై, ఆత్మ సౌందర్యాన్ని పోగొట్టుకొన్నది. నేడు నా గురుదేవునిచే నిర్దేశింపబడిన మార్గాన్ని అవలంబించి విష్ణుదేవుని సద్గుణవంతమైన సత్కథా గానం అనే అమృతాన్ని పానం చేసి సౌజన్యాన్నీ, సౌభాగ్యాన్నీ సంతరించుకున్నది.

మ. హరినామాంకిత సత్కథామృత రసవ్యాలోలుఁ డైనట్టి స
త్పురుష శ్రేష్ఠుఁడసత్కథాలవణవాఃపూరంబుఁదాఁగ్రోలునే?
వరమందార మరంద పానకుతుకస్వాంత ద్విరేఫంబు స
త్వరమైపోవునెచేఁదువేములకుఁదద్గంధానుమోదాత్మమై 223

* హరి నామస్మరణ పరాయణమైన సరస కథాసుధా రసాన్ని ఆసక్తితో ఆస్వాదించి ఆనందించే సత్పురుషవరేణ్యుడు రసహీనమైన అసత్కథలనే ఉప్పునీటిని త్రాగాలని ఉబలాటపడతాడా? మధురమైన మందార మకరందాన్ని త్రాగి మైమరచే తుమ్మెద చేదువాసనలు వెదజల్లే వేపచెట్ల పైపు వెళ్ళాలని వేగిరపడుతుందా?

క. హరి మహిమముఁ దన్నాభీ
సరసిజ సంజాతుఁడైన చతురాననుఁడుం
బరికించి యెఱుఁగఁ డన్న ని
తర మనుజులఁ జెప్పనేల తత్త్వజ్ఞనిధీ! 224

* తత్త్వవేత్తవైన ఓ విదురా! నారాయణుని మహిమను ఆయన నాభికమలం నుండి పుట్టిన నాలుగు ముఖాల బ్రహ్మకూడా తెలుసుకోలేదు అంటే, ఇక ఇతరుల విషయం చెప్పడం ఎందుకు?

తే. శ్రుతులు దమలోన వివరించి చూచి పుండ
రీకలోచను నుత్తమ శ్లోక చరితు
నమర గణ వంద్యమాన పాదాబ్జ యుగళు
వెదకి కనుఁగొనలే వంద్రడు విమల మతులు. 225

* ఉత్తమశ్లోకుడూ, ఉదారచరితుడూ, ముక్కోటి దేవతలు మ్రొక్కే చక్కని పాదపద్మాలుగలవాడూ అయిన ఆ దేవాది దేవుని వేదాలు కూడా తమలో తాము వితర్కించి, విచారించి, వెదకి వెదకి వీక్షింప లేవని విజ్ఞు లంటారు.

క. హరియుం దన మాయాగతిఁ
బరికించియుఁ గానఁడయ్యెఁ బరిమితి లేమిన్
మఱి మాయావిని మోహిని
చరితముఁ గనుఁ గొందు రెట్లు చతురాస్యాదుల్? 226

* ఇదిగో విదురా! ఆ హరికూడా అనంతమైన తన మాయావ్యవహారాన్ని అవగాహనం చేసుకోలేక పోయాడంటే మాయావిని అయిన ఆ మహామోహిని ప్రభావం బ్రహ్మాదులకు మాత్రం ఎలా అంతుపట్టుతుంది?

క. ఆ దివిజాధీశుఁడు, మహ
దాదులు, దిక్పతులుఁ, బంకజాసనుఁడున్, గౌ
రీ దయితుఁడు గనఁజాలని
శ్రీ దేవునిపదయుగంబుఁ జింతింతు మదిన్. 227

* మహేంద్రుడూ, మహదాది తత్త్వాలూ, దిక్పాలకులూ, పద్మ సంభవుడూ. పరమశివుడూ కూడా చూడలేని ఆ దేవదేవుని పాద పద్మాలను నా మనస్సులో ధ్యానిస్తాను.

క. అని మైత్రేయుం డ వ్విదు
రున కెఱిఁగించిన తెఱంగు రుచిరముగా న
ర్జున పౌత్త్రునకుఁ బరాశర
ముని మనుమం డెఱుఁగఁ జెప్పి ముదము దలిర్పన్. 228

వ. వెండియు నిట్లనియె. 229

* ఈ విధంగా మైత్రేయ మహర్షి విదురునికి వెల్లడించిన విశేషాలను పార్థుని పౌత్త్రుడైన పరీక్షిత్తుకు పరాశరుని పౌత్త్రుడైన శుకమహర్షి హర్షపూర్వకంగా విశదీకరించి మరల ఇట్లా అన్నాడు.

క. భూమీశ్వర! మైత్రేయ మ
హాముని విదురునకు నట్లు హరి శుభగుణ లీ
లా మాహాత్మ్యముఁ జెప్పిన
నా మైత్రేయునకు విదురుఁ డనియెన్ మఱియున్. 230

* మహారాజా! ఆ విధంగా మైత్రేయమహాముని అత్యంత మంగళ ప్రదాలైన హరిలీలా మహత్త్వాలను విదురునికి విశదీకరించగా విని మైత్రేయునితో విదురుడు మళ్ళీ ఇట్లా అన్నాడు.

క. అగుణుండగు నీశ్వరునకు
జగదవనోద్భవ వినాశ సత్కర్మములుం
దగులీల లెట్లు లాతఁడు
సగుణుండై యుండు టెట్లు సౌజన్యనిధీ! 231

* సౌజన్య మహనీయా! మైత్రేయా! భగవంతుడు నిర్గుణ పర బ్రహ్మ కదా! మరి ఈ లోకాలన్నీ పుట్టించటం రక్షించటం లయం

చెయ్యటం ఆయన క్రీడా విశేషాలుకదా! నిర్గుణుడైన వానికి ఈ క్రీడలూ, ఈ లీలలూ ఎలా పొసగుతాయి? నిర్గుణుడైన ఈశ్వరుడు సగుణుడుగా ఎలా ఉంటాడు? ఇది పరస్పర విరుద్ధంగా లేదా!

సీ. అని యర్భకునిగతి యనుకొని మైత్రేయ
మునిఁ జూచి విదురుఁ డిట్లనియె మరల
బాలుఁడు క్రీడావిలోలమానసమున
దీపించు లీలానురూపుఁ డగుచుఁ
గానిచోఁ గామానుగతుఁడై రమించును
నర్భకుఁ డర్థి వస్త్వంతరమున
నర్భకాంతరమున నైనను బాలకే
ళీసంగుఁ డగుచు నోలిని జరించు

తే. హరియు నెపుడు నివృత్తుఁ డత్యంత తృప్తుఁ
డగుట వర్తించు టెట్లు క్రీడాదులందు?
మఱియుఁ ద్రిగుణాత్మకంబైన మాయఁ గూడి
యఖిల జగములఁ గల్పించె ననుట యెట్లు? 232

* అని అడిగి విదురుడు "ఒక వేళ భగవంతుడు బాలునివలె క్రీడించునేమో" అనుకొని, మైత్రేయుణ్ణి చూచి మళ్ళీ ఇట్లా అన్నాడు. బాలుడు ఆడుకోవాలి అనుకున్నప్పుడు అతడి మనస్సు క్రీడాలోకి పోతుంది. అందుకు తగినట్లుగా ఆడుకుంటాడు. బాలుడు ఆడుకోటానిల ఆటవస్తువులు కావాలి. లేదా మరికొందరు బాలకులు కావాలి. అప్పుడు ఆనందంగా ఆటసాగుతుంది. కాని భగవంతుడు ఎటువంటి కోరికలు లేని వాడూ, నిత్య సంతృప్తుడూ గదా! అటువంటి వానికి ఆటలందు ఆసక్తి కలగటం ఆశ్చర్యంగా ఉంది. త్రిగుణాత్మకమైన మాయను సృష్టించి ఆ మాయవల్ల సమస్తలోకాలనూ కల్పించే కుతూహలం ఆయనకు ఎట్లా కలిగిందో చిత్రంగా ఉంది.

సీ. అమ్మాయచేత నీ యఖిలంబు సృజియించి
పాలించి పొలియించి పరమపురుషుఁ
డనఘాత్మ! దేశకాలావస్థలందును
నితరులయందు నహీనమైన
జ్ఞానస్వభావంబుఁ బూని యా ప్రకృతితో
నెబ్బంగిఁ గలసెఁ దా నేకమయ్యుఁ
గోరి సమస్తశరీరంబులందును
జీవరూపమున వసించి యున్న

తే. జీవునకు దుర్భగక్లేశసిద్ధి యెట్టి
కర్మమున సంభవించెను? గడఁగి నాదు
చిత్త మజ్ఞాన దుర్గమస్థితిఁ గలంగి
యధికఖేదంబు నొందెడు ననఘచరిత! 233

* ఓ పుణ్యుడా! తన మాయచేత ఈ లోకాలన్నింటినీ సృష్టించి, పాలించి, లయంచేసే ఆ పరమాత్ముడు దేశం కాలం మొదలైన అవస్థలను కల్పించుతున్నాడు. ఇతరులను సృష్టించి వారియందు అఖండమైన జ్ఞానంతో వర్తిస్తున్నాడు. కేవలం జ్ఞాన స్వరూపుడైన భగవంతుడు ఆ ప్రకృతితో తాను ఏ విధంగా కలసి ఉంటాడు? దేవుడు ఒక్కడై ఉండి అన్ని శరీరాల్లోనూ జీవుడుగా వసించి ఉంటున్నాడు గదా! దేవుడైన జీవునకు భరింపరాని గర్భనరకం వంటి కష్టాలు ఏ కర్మంవల్ల సంభవిస్తున్నవి? ఈ సందేహాలతో నామనస్సు చాల వ్యాకుల పడుతున్నది. ఈ అజ్ఞానావస్థనుండి బయట పడలేక తల్లడిల్లి పోతున్నది.

వ. అది గావున సూరిజనోత్తముఁడవైన నీవు మదీయ మానసిక సంశయంబులం దొలఁగింప నర్హుండవని విదురుండు మైత్రేయ మహామునీంద్రు నడిగె నని బాదరాయణతనూభవుం డభిమన్యునందనున కిట్లనియె. 234

* ఈ విధమైన నా మనస్సులోని సందేహాలను తొలగించడానికి విద్వాంసులలో అగ్రగణ్యుడవైన నీవే సమర్థుడవు – అని విదురుడు మైత్రేయుణ్ణి వేడుకొన్నాడు అని చెప్పి శుకమహర్షి పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.

క. సరసిరుహోదర మంగళ
చరితామృతపానకుతుకసంగంబున ని
ర్భరుఁడగు విదురునకు ముని
శ్వరుఁ డగు మైత్రేయుఁ డనియె సజ్జనతిలకా! 235

* నృపకుల తిలకా! కల్యాణదాయకమైన కమలనాభుని మధుర కథా సుధారసాన్ని ఆస్వాదించాలనే కుతూహలంతో ఉవ్విళ్ళూరే విదురునితో మహనీయుడైన మైత్రేయుడు ఇట్లా అన్నాడు.

చ. వినుము వితర్కవాదములు విష్ణుని ఫుల్ల సరోజపత్ర నే
త్రునిఘనమాయనెప్పుడువిరోధము సేయుఁ బరేశునిత్యశో
భనయుతు బంధనాదిక విపద్దశలుం గృపణత్వ మెప్పుడే
ననయముఁబొందలేవువిభుఁడాద్యుఁడనంతుఁడునిత్యుఁడౌటచేన్ 236

* వినవయ్యా! విదురా! విను! వికసించిన కమలాలవంటికన్నులు గల విష్ణుదేవునిమాయ అజేయమైనది. కేవలం పిడివాదాలైన ఈ తర్క వితర్కాలు ఆ మాయను స్పృశింప లేవు. ఆయన ఆద్యుడు, అనంతుడు, నిత్యుడు అయిన కారణంగా నిత్య మంగళ స్వరూపుడైన ఆ పరమేశ్వరుణ్ణి ఈ బంధాలూ ప్రతి బంధాలూ విపత్తులూ విషాదాలూ అంటవు. ఆయన వీటి కన్నింటికీ అతీతుడు.

వ. మఱియును. 237

చ. పురుషుఁడునిద్రవోఁగలలఁబొందుసమస్తసుఖంబులాత్మసం
హరణ శిరోవిఖండనము లాదిగ జీవునికిం బ్రబోధమం
దరయఁగఁ దోఁచుచున్నగతి నాదిఁ బరేశుఁడు బంధనాదులం
బొరయక తక్కఁ బెట్లనుచు బుద్ధినిసంశయమందెదేనియున్. 238

* ఇంకా విను. పురుషుడు నిద్రపోయే సమయంలో ఏవేవో కలలు వస్తాయి. ఎన్నో సుఖాలు పొందుతున్నట్లూ, తనను ఎవరో చంపినట్లూ, తనశిరస్సు ఖండించి వేసినట్లూ కలలు కంటాడు. మెలకువ వచ్చిన పిమ్మట అవన్నీ అసత్యాలని తెలుసుకుంటాడు. ఆ విధంగానే దేవుడు జీవుడుగా నటించునప్పుడు ఈ కష్టసుఖాలు ఏవీ ఆయనకు అంటవు. అయితే స్వప్నంలో ఉన్నంతకాలమూ జీవుడు పడే చిక్కులూ బాధలూ జీవుడుగా ఉన్న భగవంతునకు మాత్రం ఎందుకు కలగవు? అనే సందేహం కలిగి నట్లైతే విను.

వ. అవ్విధం బతనికిం గలుగ నేర దది యెట్లం టేని— 239

చ. లలిత విలోల నిర్మల జలప్రతిబింబిత పూర్ణచంద్రమం
డలము దదంబుచాలనవిడంబనహేతువు నొందియున్వియ
త్తలమునఁ గంప మొందని విధంబున సర్వశరీరధర్మముల్
గలిగి రమించు నీశునకుఁ గల్గఁగనేరవుకర్మబంధముల్. 240

* భగవంతుడికి ఆ విధమైన బాధలూ బంధనాలూ ఏవీ అంటవు. అది ఎలాగంటే అందంగా అటూ ఇటూ కదలుతూ ఉన్న స్వచ్ఛమైన కోనేటి నీటిలో ప్రతిబింబించే సంపూర్ణపూర్ణిమా చంద్రబింబం ఆ నీటి కదలిక వల్ల కదలుతున్నట్లు కన్పిస్తుంది. జలం కదలిక వల్ల ప్రతిబింబం కదలినా ఆకాశంలో ఉన్న చంద్రబింబం ఏమాత్రం చలించదు. అదే విధంగా – సర్వజీవుల శరీర ధర్మాలను కలిగి క్రీడించే ఈశ్వరునకు కర్మ బంధాలు ఏ మాత్రమూ అంటవు.

వ. కావున జీవునకు నవిద్యామహిమంజేసి కర్మబంధనాదికంబు సంప్రాప్తంబగుంగాని సర్వభూతాంతర్యామియైన యీశ్వరునకుం బ్రాప్తంబుగానేరదని వెండియు — 241

* కాబట్టి జీవునకు మాత్రమే అజ్ఞానప్రభావంవల్ల కర్మబంధాలు కలుగుతున్నాయి. కాని సర్వభూతాల్లో అంతర్యామిగా ఉండే పరాత్పరునకు బంధనాలు ప్రాప్తించవు.

చ. నరునకు నాత్మ దేహజగుణంబులఁ బాపఁగనోపుఁ బంకజో
దర చరణారవింద మహితస్ఫుట భక్తియ; యింద్రియంబు లీ
శ్వర విషయంబులైన మది సంచితనిశ్చలతత్త్వ మైనచో
సరసిజనేత్రుకీర్తనమె చాలు విపద్దశలన్ జయింపఁగన్. 242

* మానవునకు - తన శరీరం నుండి పుట్టిన గుణాలను పోగొట్టడానికి నారాయణుని పాదసరోజాలమీద విశేషించి విస్పష్టమైన భక్తి ఒకటే చాలు. అట్లే ఆపదలను బాపుకొనడానికి పంచేంద్రియాలను భగవంతుని అధీనం చేసి మనస్సును - చలించని ఉన్నతమైన ఏకాగ్రభావంతో నింపి ఆ సరోజాక్షుని సంకీర్తనం సలిపితే చాలు.

చ. హరిచరణారవిందయుగళార్చన సన్నుతి భక్తి యోగముల్
నిరతముఁ గల్గువారు భవ నీరజగర్భుల కందరాని భా
సురపదమందుఁ జేరుదురు; సూరిజన స్తవనీయ! యట్టి స
త్పురుషుల పూర్వజన్మఫలమున్ గణుతింపఁ దరంబె యేరికిన్
243

* విద్వజ్జనులు వినుతింపదగిన చరిత్రముగల విదురా! విను. ఎవరైతే శ్రీహరి పాదపద్మాలను పూజించుతూ సన్నుతించుతూ నిరంతరమూ భక్తియోగంలో సమాసక్తులై ఉంటూ ఉంటారో వారు, శివునకూ పద్మభవునకూ సైతం అందుకోరాని దివ్యమైన స్థానాన్ని చేరుకుంటారు. అటువంటి పుణ్యపురుషుల పూర్వజన్మ సుకృత విశేషాన్ని పొగడడానికి ఎటువంటి వారికైనా చేతనౌతుందా?

వ. అని చెప్పిన విదురుండు మైత్రేయుం గనుంగొని ముకుళితహస్తుండును వినమితమస్తకుండును నగుచుఁ దన మనంబున శ్రీహరిం దలంచుచు వినయ వచనరచనుండై యిట్లనియె. మునీంద్రా! భవదీయవాక్యంబులచేత నా మనంబున నారాయణుండు లోకైకనాథుండెట్లయ్యెననియు, శరీరధారియైన జీవునికిఁ గర్మబంధంబు లేరీతి సంభవించె ననియునుం బొడమిన సంశ

యంబు నేఁడు నివృత్తం బయ్యెఁ: నెట్లనిన లోకంబున కీశ్వరుండు హరి యనియు జీవుండు పరతంత్రుం డనియును దలంపుదుః నారాయణభక్తిప్రభావంబు ప్రాణిగోచరంబైన యవిద్యకు నాశన కారణం బనందనరుచుండుః నారాయణుండు దనకు నాధారంబు లేక సమస్తంబునకుం దాన యాధారభూతుండై విశ్వంబుం బొదివి యందుఁ దా నుండు తెఱంగెట్లు ? శరీరాభిమానంబును బొంది యెవ్వఁడు మూఢతముండై సంసారప్రవర్తకుం డగు? నెవ్వండు భక్తి మార్గంబునఁ బరమాత్ముండైన పుండరీకాక్షునిం జెందు? వీర లిద్దఱును సంశయ క్లేశంబులు లేమింజేసి సుఖానంద పరిపూర్ణులై యభివృద్ధి నొందువార లగుదుః రెవ్వండు సుఖ దుఃఖానుసంధానంబుచే లోకానుగతుం డగుచుం బ్రమోద వేద నంబుల నొందుః నతండు దుఃఖాశ్రయుండగుః నారాయణ భజ నంబున సమస్త దుఃఖనివారణం బగునని భవదీయచరణ సేవా నిమిత్తంబునం గంటిఁః బ్రపంచంబు ప్రతీతిమాత్రంబు గలిగి యున్న దయిన నందులకుఁ గారణంబు లేకుండుటంజేసి తెలియని వాఁడనై వర్తింతునని వెండియు. 244

* అని మైత్రేయమహాముని చెప్పగా వింటున్న విదురుడు ఒక్క మాటు తలయెత్తి మైత్రేయుణ్ణి చూచాడు. చేతులు జోడించి, శిరస్సు వంచి నమస్కరించాడు. తన మనస్సులో శ్రీహరిని స్మరిస్తూ వినయ మొలుకు పలుకులతో ఈ విధంగా అన్నాడు. మునివరేణ్యా! నారా యణుడు లోకానికి ఏకైక ప్రభువు ఎట్లా అయ్యాడు? శరీరాన్ని ధరించిన జీవునకు కర్మబంధాలు ఏ విధంగా కలిగాయి? అనే అనుమానాలు ఇప్పుడు మీ మాటలవల్ల తొలగిపోయాయి. లోకాలన్నింటికీ ఈశ్వరుడైన శ్రీహరి సర్వస్వతంత్రుడనీ, జీవుడు అస్వతంత్రుడనీ తెలుసుకొన్నాను. నారా యణుని మీద భక్తిగల్గి ఉండడం ఒక్కటే జీవులలోని అవిద్యను తొలగించ డానికి మూలం అవుతుంది అని భావిస్తున్నాను.

నారాయణుడు తనకు తాను ఏ ఆధారం లేకుండానే సమస్తలోకానికీ తానే ఆధారమై ఈ విశ్వాన్నంతా పొదివి పట్టుకొని ఆ విశ్వంలోనే తా

నుండటం ఎలా కుదురుతుంది? ఎవడు కేవలం శరీరంపై అభిమానం పెంచుకొని పరమమూర్ఖుడై సంసారాన్ని సాగిస్తూ ఉంటాడో, ఎవడు భక్తిమార్గంలో ప్రవర్తించి పరబ్రహ్మమైన శ్రీహరిని చేరుకుంటాడో వీళ్లిద్దరూ సంశయమూ క్లేశమూ లేనివారవటంవల్ల సుఖమూ ఆనందమూ అతిశయించినవారై అభివృద్ధి పొందుతారు. "ఎవరు గొప్పవాడు? ఎవడు సుఖిస్తాడు" అనే సంశయ తర్కాలు దుఃఖాలు లేకుండడంవల్ల సుఖానం దాల్ని సమృద్ధిగా పొందిన వారవుతారు. ఎవడు సుఖ దుఃఖాలలో మనస్సు నిలిపి లోకాన్ని అనుసరిస్తాడో వాడు సుఖదుఃఖాలు అనుభవిస్తూ చివరకు చిక్కులపా లవుతాడు. నారాయణ సంసేవనంవల్ల సకలదుఃఖాలూ పటాపంచలౌతాయని మీ పాదసేవవల్ల తెలుసుకొన్నాను. ఈ ప్రపంచం సమస్తం ఉన్నట్లుగా మనకు గోచరిస్తున్నది. అటువంటి ప్రతీతి కల్గి ఉండడానికి కారణం మాత్రం తెలియడం లేదు.

క. అలి నా మదిఁ దలఁపుదు సుమ
తులు గొనియాడంగఁదగిన తోయజనాభుం
డలవడఁ డల్పతపోనిర
తుల తలపోఁతలకు మిగుల దుర్లభుఁ డనియున్. 245

* "సుధీజనసంస్తూయమానుడైన మధుసూదనుడు అంతంత మాత్రం తపస్సుచేసేవారి ఆలోచనలకు అందరానివాడు" అని నా మనస్సులో అనుకుంటూ ఉంటాను.

సీ. ఇంద్రియంబులతోడ నెలమినొప్పెడి మహ
దాదుల నితరేతరానుషంగ
ముగఁజేసి వానియం దొగి విరాడ్దేహంబు
పుట్టించి యందుఁ జేపట్టి తాను
వసియించు నాతఁడు వరుస సహస్ర సం
ఖ్యాకంబులగు మస్తకాంఘ్రిబాహు
కలితసత్పురుషునిఁగా బ్రహ్మవాదులు
వలుకుదు రా విరాట్ప్రభువునందు

తే. భువనజాలంబు లలజడిఁ బొరయకుండఁ
బ్రాణదశకంబు నింద్రియార్థములు నింద్రి
యాధిదైవతములుఁ గూడ ననఘ! త్రివిధ
మగుచు విప్రాది వర్ణములయ్యె నందు. 246

* భగవంతుడు ఇంద్రియాలతో కూడిన మహదాదులకు పరస్పర సంబంధం కల్పించి విరాట్ దేహాన్ని పుట్టించి అందు నివాసంచేస్తూ ఉంటాడు గదా! బ్రహ్మవేత్తలైనవారు ఆ పరాత్పరుణ్ణి సహస్రశీర్షునిగా సహస్రపాదునిగా సహస్రబాహునిగా పేర్కొంటున్నారు. ఆ విరాట్పురుషునిలో అఖిల లోకాలూ అలజడి పొందకుండా ఉంటున్నాయి. అటువంటి విరాట్ స్వరూపం నుంచే పది ప్రాణాలూ, ఇంద్రియగోచరాలయిన విషయాలూ, ఇంద్రియాల కధిపతులైన దేవతలూ, మూడువిధాలైన బ్రాహ్మణాది వర్ణాలూ ఏర్పడ్డాయి.

క. ఇలఁ బుత్త్రపౌత్త్రసంపద
గలిగిన వంశములతోడఁ గడుఁ జోద్యముగా
లలిఁ బ్రజ లే గతిఁ గలిగిరి?
కలిగిన యాప్రజలచే జగము లెట్లుండెన్? 247

* అందులోనుంచి ఈ భూమిపై మహాశ్చర్యం కలిగేలా కొడుకులూ మనుమలూ అనే వంశపరంపరలతో పలురూపాల ప్రజలు ఏ విధంగా ఆవిర్భవించారు? ఆ ప్రజలతో నిండిన ఈ ప్రపంచం ఏ విధంగా ప్రవర్తిల్లుతున్నది?

క. చతురత దీపింపఁ బ్రజా
పతులకుఁ బతి యనఁగ వెలయు పద్మాపతి యే
గతిఁ బుట్టించెను స్రష్ట
ప్రతతులచే నవవిధప్రపంచము మఱియున్. 248

* ప్రజాపతులకు అధిపతియైన లక్ష్మీపతి చతురమతియై తాను సృష్టించిన ప్రజాపతులచే నవనవోన్మేషమైన ఈ ప్రపంచాన్ని ఏ విధంగా సృష్టింపజేశాడు?

తే. వానిభేదంబులును మనువంశములును
మనుకులాధీశ్వరులును దన్మనుకులాను
చరితములు నే విభూతి నే జాడ దీని
నింతయునుఁ బుట్టఁజేసె? నా కెఱుఁగఁ బలుకు. 249

* ఆ సృష్టిభేదాలనూ, మనువంశాలనూ, మనువంశాల అధిపతు లనూ, వంశానుచరితాలనూ భగవంతుడు ఎటువంటి మహామహిమతో ఏ విధంగా పుట్టించాడో? నాకు తెలిసేలా చెప్పు.

క. సరవిం గ్రిందన్ మీఁదం
ధరణికిఁ గల లోకములను దత్తత్స్థితులన్
వరుసం బరిణామంబుల
నెఱిఁగింపఁగదయ్య నాకు నిద్ధచరిత్రా! 250

* సుప్రసిద్ధ చరిత్రుడవైన ఓ స్వామీ! ఈ భూమికి దిగువనున్న లోకాలనూ, ఎగువనున్న లోకాలనూ వానివాని పరిస్థితులనూ వానిలో వరుసగా వచ్చిన మార్పులనూ నాకు వివరించు.

క. సురతిర్యఙ్నరరాక్షస
గరు డోరగసిద్ధ సాధ్య గంధర్వ నభ
శ్చరముఖ భవములు మునికుం
జర! గర్భస్వేదజాండజముల తెఱంగున్. 251

* మునికుల తిలకా! దేవతలు, జంతువులు, మనుష్యులు, రాక్ష సులు, గరుడులు, నాగులు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు, ఖేచరులు మొదలైన వారంతా ఎట్లా పుట్టారు? ఇంకా గర్భజములూ, స్వేద జములూ, అండజములూ అయిన జీవులు జన్మించిన విధానం కూడా నాకు విశదీకరించు.

క. త్రిగుణప్రధానకంబుగ
నగు నవతారములఁ బూర్ణమై వెలసిన యా
జగదుత్పత్తి స్థితిలయ
నిగమముల విధంబు వాని నిలుకడలు దగన్. 252

* సత్త్వరజస్తమోగుణాలు ప్రధానంగాగల అవతారాలనూ, సమగ్రమైన ఈజగత్తు జన్మ స్థితి లయాలనూ, అవి ప్రవర్తించు విధాలనూ, వేదాలనూ వాని శాశ్వతమైన ఉనికినీ నాకు తెలుపు.

క. చక్రాయుధుసౌందర్య ప
రాక్రమముఖ గుణములును, ధరామరముఖ వ
ర్ణ క్రమములు, నాశ్రమ ధ
ర్మక్రియలును, శీలవృత్తమతభావములున్. 253

* చక్రధరుడైన జగన్నాథుని సౌందర్యం, పరాక్రమం మొదలైన సుగుణాలను వెల్లడించు. బ్రాహ్మణులు మొదలైన నాలుగు వర్ణాలనూ, బ్రహ్మచర్యం మొదలైన నాలుగు ఆశ్రమాలనూ, వారివారి ఆ యా ధర్మాలనూ, కర్తవ్యాలనూ, స్వభావాలనూ, నడవడులనూ నాకు ఎరిగించు.

తే. యోగవిస్తారమహిమలు యాగనులును
జ్ఞానమార్గములును బరిజ్ఞాన సాధ
నములునై యొప్పు సాంఖ్యయోగములు వికచ
జలజనయనస్మృతంబులౌ శాస్త్రములును. 254

* యోగ విద్యలు వాని విశేషమహిమలూ, యాగాలూ, వాని విధానాలూ, జ్ఞానమార్గాలూ, విజ్ఞానసాధనాలైన సాంఖ్యయోగాలూ, శ్రీమన్నారాయణుని స్మరణమాత్రంచే సంజాతాలైన శాస్త్రాలూ నాకు వినిపింపు.

సీ. పాషండ మార్గంబుఁ బ్రతిలోమకుల విభా
గములు జీవుల గుణకర్మములును
బలుకుల గతులును గలిగెడి ధర్మ మో
క్షములయందలి పరస్పరవిరోధ
ములు లేని సాధనములు భూమిపాలక
నీతి వార్తలు దండనీతి జాడ

యును బృథగ్భావంబులును విధానములును
బితృమేధములును దత్పితృవిసర్గ

తే. గతులుఁ దారాగ్రహంబులుఁ గాలచక్ర
మున వసించిన నిలుకడలును దపములు
దానములుఁ దత్ఫలంబులుఁ దనరు ప్రబల
ధర్మములుఁ బ్రజ లొనరించు కర్మములును. 255

* నాస్తికులయినవారి ప్రవర్తన లెటువంటివి ? అశాస్త్రీయమైన వివాహాలవల్ల ప్రభవించినవారిని విభజించు విధాన మేది ? జీవుల గుణ కర్మలు, మాటల తీరుతెన్నులు ఎటువంటివి ? ధర్మమోక్షాల్లో అన్యోన్యం విరుద్ధం కాని సాధనలు ఎలాంటివి ? రాజనీతి, దండనీతి, వేరుపాటు విధానాలు, పితృయజ్ఞాలు, పితృతర్పణాలు, తారలు, గ్రహాలు, ఈ కాల చక్రంలో వాని నిలుకడలు, తపస్సులు, దానాలు, వాని ఫలితాలు, విశేష ధర్మాలు, ప్రజలు చేసే కర్మలు వాని ఫలితాలు నాకు తెలియజెప్పు.

చ. వదలక భూజనావళికి వచ్చు విపద్దశ ధర్మముల్. సరో
జదళనిభాక్షుఁ డేగతిని సంతస మందెడు ? నెట్టివారి మేల్
వదలక కాన వచ్చు. గురులం బ్రియశిష్యులు గొల్వ వారు స
మ్మదమునఁ గోరు నర్థములు మానుగ నెట్లెఱిఁగింతురిమ్ములన్.
256

* భూప్రజలకు సంబంధించిన ఆపద్ధర్మాలు ఎట్టివి ? అరవిందాక్షుడైన గోవిందుడు ఏ విధంగా సంతోషిస్తాడు? ఎటువంటివారు చేసినమేలు ఎల్లప్పుడూ కనిపిస్తూ ఉంటుంది ? శిష్యులు గురువులను సేవించగా వారు సంతోషంతో కోరే పరమార్థాలూ వాటిని చక్కగా తీర్చగల మార్గాలూ నాకు బోధించు.

క. విలయాది భేదముల న
య్యలఘునిఁ బరమేశు నెవ్వ రంచితభక్తిం
గొలుతు రదెవ్వరిలో ను
త్కలికన్ సుఖియించు జీవతత్త్వము? మఱియున్. 257

* ప్రళయం ఎన్నివిధాలు? సర్వేశ్వరుడైన పరాత్పరుణ్ణి ఎవరు అచంచల భక్తితో సేవిస్తారు? జీవతత్త్వం ఎవరిలో వికాసాతిశయంతో ప్రకాశిస్తుంది?

క. గోవిందుని రూపంబును
జీవబ్రహ్మలకు నైక్యసిద్ధియు నెటులొ?
భావన నుపనిషదర్థం
బై వెలసెడి జ్ఞాన మెట్టి దార్యస్తుత్యా! 258

* మహనీయ స్తవనీయా! మైత్రేయా! గోవిందుని స్వరూప నిరూపణం ఎలాగు? జీవబ్రహ్మలకు ఏకత్వం ఎలా కలుగుతుంది? ఎటువంటి జ్ఞానం కలిగితే ఉపనిషత్తుల అర్థం ఊహకు అందుతుంది?

తే. ఉచిత మగునట్టి శిష్యప్రయోజనములు
సజ్జనులచేత విజ్ఞాన సాధనములు
నేమి పలుకంగఁబడు, వాని నెల్ల మఱియుఁ
బొలుచు వైరాగ్యమునఁ దగు పురుషభక్తి. 259

* ఉత్తములైన శిష్యులు కలిగినందువల్ల కలిగే ప్రయోజనాలూ, సజ్జనులు బోధించే విజ్ఞాన సాధనాలూ, వైరాగ్యం వల్ల ప్రకాశించే భగవద్భక్తి ఎటువంటివో వివరించు.

తే. ఇన్నియుఁ దెలియ నానతి యిచ్చి నన్ను
నర్థి రక్షింపు; యజ్ఞ దానాదిపుణ్య
ఫలము, వేదంబు సదివిన ఫలము, నార్త
జనులఁ గాచిన ఫలముతో సమము గావు. 260

* వీటి నన్నింటినీ వివరంగా చెప్పి విపన్నుడనైన నన్ను రక్షించు. యజ్ఞాలు చేసిన ఫలం, దానాలు ఇచ్చిన ఫలం, వేదాలు చదివిన ఫలం– ఇవన్నీ కలిసి ఆర్తులైన నావంటివారిని ఆదరించిన ఫలంతో సమానం కావు.

క. అని విదురుఁడు మైత్రేయుని
వినయంబునఁ దెలియ నడుగు విధమెల్లను వ్యా
సునిసుతుఁ డభిమన్యుని నం
దనున కెఱింగించి మఱియుఁ దగ నిట్లనియెన్. 261

* అని వినయంగా విదురుడు మైత్రేయుణ్ణి అడిగినట్లు శుకమహర్షి పరీక్షిత్తునకు చెప్పి మళ్ళీ ఇట్లా అన్నాడు.

చ. ఇలఁ గల మానవావళికి నెల్ల నుతింప భజింప యోగ్యమై
వెలసిన పూరువంశము పవిత్రము సేయఁగఁ బుట్టి సద్గుణా
కలిత యశః ప్రసూనలతికాతతికిం బ్రతివాసరంబుఁ బెం
పలరఁగఁ బోఁది వెట్టుదుగదయ్య ముకుందకథామృతంబునన్. 262

* రాజా! భూమండలంలో గల ప్రజలందరికీ ప్రశంసనీయమూ, పూజనీయమూ అయింది పూరువంశం. అటువంటి పూరువంశాన్ని మరింత పవిత్రం చెయ్యటానికి జన్మించినవాడవు నీవు. మంచిగుణాలనే పుష్పాలతో నిండిన నీ కీర్తి లతావితానానికి ప్రతిదినం కమలాక్ష కథా సుధారసం నింపి పెంపు కలిగిస్తూ ఉంటావుకదా!

తే. అల్పతరమైన సుఖముల నందుచున్న
జనుల దుఃఖంబు మాన్పంగఁ జాలునట్టి
పుండరీకాక్ష గుణకథా ప్రోతమైన
వితత నిగమార్థ మగు భాగవతము నీకు. 263

వ. ఎఱింగింతు విను మని యిట్లనియె. 264

* అల్పమైన సుఖాలకోసం అర్రులుచాస్తూ వాటిని పొంది కూడా దుఃఖాన్నే అనుభవిస్తున్నారు మానవులు. అటువంటి జనులను దుఃఖాల నుండి దూరం చేయడానికి సమర్థమైనట్టిదీ, శ్రీమన్నారాయణుని చరిత్ర లనే దారాలతో అల్లబడినదీ, వేదాల అర్థాన్ని విస్తరింపజేసేదీ భాగవతం. అటువంటి భాగవతం నీకు వివరిస్తాను విను అని శ్రీశుకుడు పరీక్షిత్తుకు ఇలా చెప్పసాగాడు.

సీ. అమ్మహాభాగవతామ్నాయు మొకనాఁడు
గైకొని పాతాళలోకమందు
నప్రతిహతబుద్ధియై వాసుదేవాఖ్యఁ
బొలుచు సంకర్షణమూర్తి దివ్య
పురుషుండు దనుఁ దాన బుద్ధిలోఁ జూచుచు
సలలితధ్యానముకుళితనేత్రుఁ
డై సనందాభ్యుదయార్థంబు గను విచ్చి
చూచిన వారు సంస్తుతు లొనర్ప

తే. నమర గంగావగాహనులై యహీంద్ర
కన్య లార్ద్రజటాబంధకలిత లగుచు
భర్తృ వాంఛాను బుద్ధి నప్పరమపురుషుఁ
గదియ నేతెంచి తత్పాదకమలయుగము. 265

• "వాసుదేవుడు" అనే పేరుతో ప్రకాశించేవాడూ, కేవల జ్ఞాన స్వరూపుడూ, దివ్యపురుషుడూ—అయిన సంకర్షణుడు ఒకనాడు వేదసారమైన భాగవతాన్ని పాతాళలోకంలోనికి తీసుకొని పోయాడు. తన మనస్సులో తన్ను తానే చూచుకొంటూ తదేక ధ్యానంలో కొంచెంసేపు కన్నులు మూసుకున్నాడు స్వామి. సనందనాదుల అభ్యుదయం కోరిన వాడై కన్నులువిప్పి చూచాడు. సనక సనందనాదులు స్వామిని సంస్తుతులు చేశారు. అంతలో ఆకాశగంగలో స్నానం చేసిన నాగకన్యకలు తడిసిన జడచుట్టలతో అచ్చటికి వచ్చారు. ఆ నాగకన్యలు ఆ దివ్య పురుషుడే తమకు భర్త కావాలని భావించారు. ఆ పరమపురుషుని సమీపించి ఆయన పాదపద్మాలను సేవించారు.

క. సేవించి భక్తితో నా
నావిధపూజోపహారనతి నుతులను నా
దేవుని హృదయము వడసిరి
యావేళ సనందనాదు లమ్మహితాత్మున్. 266

* అలా సేవించి భక్తితో అనేక విధాలైన పూజలు చేశారు. కానుకలు సమర్పించారు. నమస్కరించారు. స్తోత్రాలతో ఆ దేవుని హృదయాన్ని వశపరచుకొన్నారు. ఆ సమయంలో సనందనాదులు పరమ పురుషుణ్ణి ప్రస్తుతింపసాగారు.

మ. ఘనసాహస్ర కిరీటరత్న విలసత్కాంత ప్రసిద్ధప్రభా
జనితోదగ్రరుచిప్రకాశితఫణాసాహస్రుఁడౌ దేవతా
వనదీక్షాచణు రూపకృత్యము లొగిన్ వాంఛం బ్రశంసించి వా
రనురాగ స్థలితోక్తు లొప్ప నడుగన్ హర్షించి యా దేవుఁడున్. 267

* ఆ దేవదేవుడు వేలకొలది శిరస్సులుకలిగి ఉన్నాడు. ఆ శిరస్సులపై కిరీటాలు అలంకరింపబడి ఉన్నాయి. ఆ కిరీటాలలోనిరత్నాలు రమణీయమైన కాంతులు వెదజల్లుతున్నాయి. ఆ కాంతి పుంజాల వెనుక ఆదిశేషుని వేయిపడగలు సుందరంగా వెలుగొందుతున్నాయి. అటువంటి స్వామిని, దేవతలను రక్షించు ప్రభువును సనందనాదులు మిక్కిలి వేడుకతో సంస్తుతించారు. ఆయన అవతారాలను, ఆయన చేసిన ఘనకార్యాలను ప్రశంసించారు. అలా స్తుతించేటప్పుడు వారి మాటలు దేవునిపై గల అనురాగం వల్ల తడబడ్డాయి. వారి సంస్తుతులకు ఆ దేవుడు సంతోషించాడు.

తే. భూరి నిగమార్థ సార విచార మగుచుఁ
దనరు నీ భాగవతము సాదరతఁ బలికె
నలినభవసూతి యైన సనత్కుమార
కునకు నెఱిఁగించె సాంఖ్యాయనునకు నతఁడు. 268

* సనక సనందనాదుల ప్రార్థనలకు ప్రసన్నుడైన భగవంతుడు సమస్తవేదసారమై పరిఢవిల్లే ఈ భాగవతాన్ని బ్రహ్మదేవుని కుమారుడైన సనత్కుమారునికి సాదరంగా ఉపదేశించాడు. ఆయన సాంఖ్యాయనునకు వెల్లడించాడు.

క. పరఁగ నతం డంతఁ బరా
శరునకు నుపదేశ మిచ్చె సమ్మతిః నతఁడున్
సురగురున కొసఁగెః నాతఁడు
గర మరుదుగ నాకుఁ జెప్పెఁః గైకొని యేనున్. 269

* ఆ సాంఖ్యాయనుడు మంచిమనస్సుతో పరాశరునకు ఉపదేశించాడు. పరాశరుడు సురగురుపైన బృహస్పతికి తెలిపాడు. ఆయన ఏకాంతంగా నాకు చెప్పాడు.

క. నీ కిప్పుడు వివరించెద
నా కర్ణింపుము సరోరుహాక్షుండగు సు
శ్లోకుని చరితామృత పరి
షేకుఁడవై ముదము గదురఁ జెలఁగుము విదురా. 270

* ఓ విదురా ! విను. నేను ఆ భాగవతాన్ని ఇప్పుడు నీకు వివరంగా చెప్పుతున్నాను. ఉత్తమశ్లోకుడైన పురుషోత్తముని చరిత్ర అనే అమృత వర్షంలో తడిసినవాడవై హర్షోత్కర్షంతో ఆకర్ణించు.

వ. ఇట్లు భగవత్ప్రోక్తంబును, ఋషి సంప్రదాయాను గతంబును, పురుషోత్తమ స్తోత్రంబును, పరమ పవిత్రంబును, భవలతా లవిత్రంబును నయిన భాగవత కథా ప్రపంచంబు శ్రద్ధాళుండవు భక్తుండవు నగు నీకు నుపన్యసించెద వినుము. 271

* ఇట్లు భగవంతునిచే చెప్పబడినదీ, ఋషుల సంప్రదాయానుసారంగా సమాగతమైనదీ పురుషోత్తముడైన పుండరీకాక్షుని పొగడ్తకలదీ, పరమపావనమైనదీ, భవబంధాలను తెగటార్చేదీ—ఐన భాగవత కథావిధానాన్ని భక్తుడవూ ఆసక్తుడవూ అయిన నీకు విశదీకరించుతాను విను.

సీ. అనఘ ! యేకోదకమై యున్న వేళ నం
తర్నిరుద్ధానల ధారు వితతి
భాతిఁ జిచ్ఛక్తి సమేతుఁడై కపట ని
ద్రాలోలుఁ డగుచు నిమీలితాక్షుఁ

డైన నారాయణుం డంబు మధ్యమున భా
సుర సుధా ఫేన పాండుర శరీర
రుచులు సహస్ర శిరో రత్న రుచులతోఁ
జెలిమి సేయఁగ నొప్పు శేష భోగ

తే. తల్పమునఁ బవ్వళించి యనల్ప తత్త్వ
దీప్తిఁ జెన్నొందఁగా నద్వితీయుఁ డగుచు
నభిరతుండయ్యుఁ గోర్కులయందుఁ బాసి
ప్రవిమలాకృతి నానంద భరితుఁ డగుచు. 272

* ఓ విదురా! పూర్వం ప్రళయసమయంలో విశ్వమంతా జలమయంగా ఉన్నప్పుడు శ్రీమన్నారాయణుడు ఆదిశేషుణ్ణి పాన్పుగా చేసుకొని సముద్రమధ్యంలో పవ్వళించాడు. ఆ ఆదిశేషుడు స్వచ్ఛమైన అమృతం నురుగులవంటి శరీరం కలవాడు. అతని తెల్లనిశరీర కాంతులు అతని వేయి తలలపై తళతళలాడే రత్నాల కాంతులతో చెలిమి చేస్తున్నట్లుగా వెలుగొందాయి. నారాయణుడు తన కడుపులో అగ్నిని దాచుకొన్న దారువులా లోపల చైతన్యశక్తికలవాడై ఉన్నాడు. అనంతమైన తత్త్వదీప్తితో అద్వితీయుడై ఆనందమయుడై కపటనిద్ర నభినయించుచూ కన్నులు మూసుకొని ఉన్నాడు. కుతూహలం కలిగి కూడా కోర్కెలు లేనివానిలా నిష్కళంకమైన స్వరూపంతో విరాజిల్లాడు.

తే. యోగమాయావిదూరుఁడై యుగసహస్ర
కాలపర్యంత మఖిలలోకములు మ్రింగి
పేర్చి మఱీ కాల శక్త్యుపబృంహితమున
సమత సృష్టి క్రియా కలాపములఁ దగిలి. 273

* ఈ విధంగా యోగమాయకు కూడా దూరంగా వెయ్యియుగాల పర్యంతం సమస్తలోకాలను తనకడుపులో దాచుకొని వెలుగొందుతూ ఆ పైన కాలమూ శక్తీ చక్కగా అభివ్యక్తంకాగా సమత్వం వహించి సృష్టి కార్యం నిర్వహించటానికి ఆసక్తుడైనాడు.

క. తన జఠరము లోపలఁ దాఁ
చిన లోక నికాయముల సృజించుటకును సా
ధన మగు సూక్ష్మార్థము మన
సున గని కాలానుగత రజోగుణ మంతన్. 274

* తన కడుపులో దాచుకొనివున్న సకలలోకాలనూ తిరిగి సృష్టించ డానికి ఉపకరణమైన సూక్ష్మపదార్థాన్ని మనస్సులో భావించి, కాలాను గుణంగా రజోగుణాన్ని పుట్టించాడు.

సీ. పుట్టించెఁ దద్గుణంబునఁ బరమేశ్వరు
నాభిదేశమునందు నలిననాళ
ముదయించె మఱి య ప్పయోరుహముకుళంబు
గర్మబోధితమైనకాలమందుఁ
దన తేజమునఁ బ్రవృద్ధంబైన జలముచేఁ
జలజాప్తుగతిఁ బ్రకాశంబు నొందఁ
జేసి లోకాశ్రయస్థితి సర్వగుణ విభా
సితగతి నొప్పు రాజీవమందు

తే. నిజకళాకలితాంశంబు నిలిపె, దాని
వలన నామ్నాయమయుఁడును వరగుణుండు
నాత్మయోనియు నైన తోయజభవుండు
సరవిఁ జతురాననుండు నా జనన మయ్యె. 275

* ఆ విధంగా పుట్టించిన రజోగుణంవల్ల నారాయణుని నాభిలో నుండి మొగ్గతో కూడిన ఒక తామరతూడు జన్మించింది. సృష్టికార్యప్రభా వితమైన కాలాన్ని అనుసరించి భగవంతుడు తన తేజస్సుచేత వృద్ధి పొందిన నీటినడుమ ఆ తామరమొగ్గను సూర్యునిలాగా వికసింపజేశాడు. లోకాలకు ఆశ్రయం ఇచ్చే స్థితినీ సకలగుణాలతో ప్రకాశించే ప్రకృతినీ కలిగిఉన్న ఆ కమలంలో పరాత్పరుడు తన కళతోకూడిన అంశాన్ని ప్రస రింప జేశాడు. అప్పుడు ఆ పద్మంలోనుంచి సంపన్నుడూ, స్వయం భువుడూ, చతుర్ముఖుడూ అయిన బ్రహ్మదేవుడు ఉద్భవించాడు.

తే. అతఁడు తత్పద్మ కర్ణికయందు నిలిచి
వికచలోచనుఁడై లోకవితతి దిశలు
నంబరంబును నిజచతురాననములఁ
గలయఁ బరికించి చూచుచుఁ గమలభవుఁడు. 276

* పద్మంలోనుంచి ప్రభవించిన ఆ బ్రహ్మ పద్మం పైభాగాన నిల బడి, కన్నులు బాగా తెరచి లోకాలనూ, దిక్కులనూ, ఆకాశాన్నీ తన నాల్గుమోములతో పరికించి చూడ సాగాడు.

చ. అలఘుయుగాంత కాలపవనాహత సంచలదూర్మిజాల సం
కలిత జలప్రభూత మగు కంజముఁ దద్వనజాత కర్ణికా
తలమున నున్న తన్ను విశదక్రియఁ గల్గిన లోకతత్త్వమున్
నలిఁ దెలియంగ నోపక మనంబునఁ జాల విచార మొందుచున్. 277

వ. ఇట్లని వితర్కించె. 278

* అంతులేని ప్రళయకాలం. చుట్టూ మహాజలం! ప్రచండమైన గాలులు వీస్తున్నాయి! అలలు లేచి పడుతున్నాయి! ఆ జలమధ్యంలో ఒక పద్మం! ఆ పద్మంమధ్య దుద్దుపై తాను! స్పష్టమవుతూ ఉన్న లోకాల స్వరూపం! ఇదంతా ఏమిటో అర్థంకాక-తెలుసుకో లేక చతుర్ముఖుడు తన మనస్సులోచాలా విచారాన్ని పొంది ఇలా వితర్కించాడు.

ఉ. ఈ జలమందు నీ కమల మే గతి నుద్భవమయ్యె? నొంటి యే
నీ జలజాత పీఠమున నే గతి నుంటి? మదాఖ్య యెద్ది? నా
కీ జననంబు నొందుటకు నెయ్యది హేతువు? బుద్ధిఁజూడ నే
యోజ నెఱుంగలే నని పయోరుహగర్భుడు విస్మితాత్ముఁడై. 279

* ఈ నీటిపై ఈ పద్మం ఏ విధంగా పుట్టింది? ఒంటరిగా నేను ఈ తామర గద్దెపై ఎట్లా ఉంటున్నాను. నా పేరు ఏమిటి? నాకు ఈ పుట్టుక రావడానికి కారణం ఏమిటి? ఎంత ఆలోచించినా ఈ క్రమం ఏమిటో తెలుసుకోలేక పోతున్నాను—అని బ్రహ్మదేవుడు ఆశ్చర్యచకితుడైనాడు.

క. ఆ వనజనాళ మూలం
బా పనములలోన నర్థి నరయుట కొఱకై
యా వనజాతప్రభవుం
డా వనరుహనాళ వివరమం దభిముఖుఁడై. 280

* ఆ తామరతూడు ఎక్కడ నుంచి పుట్టిందో దాని మొదలు ఎక్కడవున్నదో తెలుసుకోవాలని ఆ నీటిలో వెదకడంకోసం బ్రహ్మదేవుడు పద్మనాళం వెంట లోపలికి ప్రవేశించాడు.

మ. అతిగంభీర విశాల వారినిధితోయాంతర్నిమగ్నాంగుఁడై
చతురాస్యుం డొగి దివ్యవత్సరసహస్రం బబ్జమూలంబు స
న్మతి నీక్షించియుఁ గానలేక భగవన్మాయామహత్త్వంబు వి
స్మృతిఁ గావింప విభీతుఁడై మరలఁ జేరెం దత్సరోజాతమున్.
281

* మిక్కిలి లోతూ, మిక్కిలి విరివీ కలిగిన ఆ మున్నీటి నీటిలో మునిగినవాడై ఆ బ్రహ్మ వేయిదివతావత్సరాలు ఎంతో జాగ్రత్తగా వెదికాడు. అయినా ఆ తామరతూడు మూలాన్ని తెలుసుకోలేక పోయాడు. భగవంతుని మాయాప్రభావం మూలాన ఆయనకు ఆ మూల రహస్యం అంతు చిక్కలేదు. మతి గోల్పోయి బెదరిపోయి మళ్లీ ఆ తామర పూవు పైకే చేరాడు.

తే అట్లు గ్రమ్మఱఁ జేరి యయ్యబ్జ పీఠ
మందు నష్టాంగ యోగక్రియానురక్తిఁ
బవను బంధించి మహిత తపస్సమాధి
నుండి శతవర్షములు సనుచుండ నంత. 282

* ఆ విధంగా చతుర్ముఖుడు ఆ పద్మపీఠంపై కూర్చుండి అష్టాంగ యోగం పై ఆసక్తిగలవాడైనాడు. గాలిని బంధించి, ఏకాగ్ర భావంతో తపస్సు చేశాడు. ఈ విధంగా నూరేండ్లు గడచాయి.

ఆ. అట్టి యోగజనితమైన విజ్ఞానంబు
గలిగి యుండి దానఁ గమలనయనుఁ
గానలేక హృదయకమల కర్ణిక యందు
నున్నవానిఁ దన్నుఁ గన్నవాని. 283

* బ్రహ్మదేవుడు ఈ విధమైన యోగాభ్యాసం వల్ల విజ్ఞానాన్ని పొందాడు. ఆ విజ్ఞానంవల్ల కూడా అతడు విష్ణువును చూడలేకపోయాడు. అప్పుడు తన ధ్యానాన్ని తన హృదయంలో నిలిపాడు. అక్కడ పరాత్పరుని దర్శించి తన హృదయంలో "ఉన్నవాడే" తన "కన్నవా"డని తెలుసుకొన్నాడు.

మ. కనియెన్ నిశ్చలభక్తి యోగమహిమం గంజాతగర్భుండు శో
భనచారిత్రు జగత్పవిత్రు విలసత్పద్మాకళత్రున్ సుధా
శనముఖ్యస్తుతిపాత్రు దానవచమూజైత్రున్ దళత్పద్మనే
త్రు నవీనోజ్జ్వలనీలమేఘనిభగాత్రుం బక్షిరాట్పత్త్రునిన్.
284

* ఈ విధంగా అచంచలమైన భక్తితో కూడిన యోగమాహాత్మ్యం వల్ల బ్రహ్మదేవుడు శుభచరిత్రుడూ పరమపవిత్రుడూ లక్ష్మీకళత్రుడూ అయిన శ్రీమన్నారాయణుని దర్శించాడు. ఆయన వేలుపు పెద్దల వినతులు అందుకొనేవాడు. దానవసైన్యాలను తరిమికొట్టేవాడు. వికసించిన కమలాలవంటి కన్నులు కలవాడు. క్రొత్తదై వెలిగిపోతూ ఉన్న నీల మేఘంతో సమానమైన దేహం కలవాడు. గరుడధ్వజుడు.

వ. మఱియును. 285

చ. అలఘుఫణాతపత్ర నిచయాగ్ర సమంచిత నూత్న రత్నని
ర్మల రుచిచే యుగాంత తిమిరంబు నడంచి యకల్మ షోల్లస
జ్జలములఁ జేసి యందు నవసారస నాళ సితైక భోగముం
గలిగిన శేషతల్పమును గైకొని యున్నమహాత్ము నొక్కనిన్.
286

* అంతేకాదు. ఆ మహానుభావుడు గొప్పవైన పడగలనే గొడుగుల చివర గల స్వచ్ఛమైన రత్నాల కాంతులతో ప్రళయకాలంలోని చీకట్లను పోకార్చుతూ కొంగ్రొత్త తామరతూడులాంటి తెల్లని దేహసంపద కల్గిన ఆది శేషుణ్ణి పాన్పుగాచేసికొని మిక్కిలి నిర్మలంగా ఉన్న నీళ్ళమధ్యంలో శయనించి ఉన్నాడు.

సీ. వరపీత కౌశేయ పరిధానకాంతి సం
ధ్యాంబుద రుచి నిచయంబు గాఁగఁ
గమనీయనవహేమకలిత కిరీటంబు
రమణఁ గాంచన శిఖరంబు గాఁగఁ
మానితమౌక్తిక మాలికారుచి సాను
పతితనిర్ఝర పరంపరలు గాఁగఁ
జెలువొందు నవతులసీదామకములు లా
లితతటౌషధీ లతలు గాఁగఁ

తే. వరభుజంబులు నికటస్థవంశములుగఁ
బదము లంగణపాదపప్రచయములుగ
లలితగతి నొప్పుమరకతాచల విడంబి
తాత్మ దేహంబు గలుగు మహాత్ము హరిని. 287

* కట్టుకొన్న మేలైన పట్టువస్త్రాల కాంతులు సాయంకాలపు మేఘాలకాంతులు కాగా, పెట్టుకొన్న సుందర సువర్ణ కిరీటం బంగారు శిఖరం కాగా, రొమ్ముపై ప్రేలాడే ముత్యాలహారాలు చరియలపై నుండి జాలువారే సెలయేళ్లు కాగా, అందాలు చిందే తులసీమాలలు దరుల్లో ప్రకాశించే ఓషధీలతలు కాగా, ఉన్నతభుజాలు చెంగట ఉన్న వెదురు మొదళ్లు కాగా, పాదాలు ముంగిటఉన్న తరుగుల్మాలు కాగా, పచ్చని దేహంతో పచ్చల పర్వతంలాగా ప్రకాశిస్తున్నాడు ఆ పరాత్పరుడు.

వ. మఱియు నపరిచ్ఛిన్నంబును నిరుపమానంబును నిఖిల లోక సంగ్రహంబును నతివిస్తారవర్తులాయామంబును నై వివిధ

విచిత్ర దివ్యమణి విభూషణంబుల నాత్మీయనిర్మల ద్యుతిచేతం బ్రకాశంబు నొందం జేయు దివ్యదేహంబు దనర వివిధంబులగు కామంబు లభిలషించి విశుద్ధంబైన వేదోక్తమార్గంబున భజియించు పురుషశ్రేష్ఠులకుఁ గామధేను వనం దగిన పాదపద్మ యుగంబును. నలిక ఫలక లలితరుచినిచయంబులకు నోటువడి కృపాపాత్రుండై చంద్రుండు బహురూపంబులఁ బదసరోజంబుల నాశ్రయించెనన నొప్పు పదనఖంబులును. కమలాభూకాంతలకు నుపధానరూపంబు లనందగి నీలకదళికాస్తంభంబుల డంబు విడంబించు నూరు యుగళంబును. కనకమణిమయ మేఖలాకలాపాభిరామంబును గదంబ కింజల్క శోభిత పీతాంబరాలంకృతంబును నై విలసిల్లు కటిమండలంబును. శృంగారవాహినీ జలావర్తంబునాఁ బోలు పొందు నాభివివరంబును. జఠరస్థనిఖిలబ్రహ్మాండముహుర్ముహు రుద్భవకృశీభూతం బనం దగు మధ్యభాగంబును. మహిత ముక్తాఫలమాలికావిరచితరంగవల్లీ విరాజితంబు, నవతులసీదామ కిసలయతల్పంబుఁ, గుసుమ మాలికాలంకృతంబు, ఘనసారకస్తూ రికాచందనవిలిప్తంబుఁ; గౌస్తుభరత్న దీప్తిప్రదీప్తంబు, శ్రీవత్స లక్షణలక్షితంబు నై యిందిరారమణికిఁ గేళీమందిరం బనం బొల్చు వక్షస్స్థలంబును. సుఖకేళీ సమారంభ పరిరంభణాంభోధిరాట్కన్యకా కరాంభోజ కీలిత కనక మణికంకణనికషంబులనం బొలుపారు రేఖాత్రయవిరాజమానంబైన కంబుకంధరంబును. సుమహితానర్ఘ దివ్యమణిప్రభావిభాసిత కేయూర కంకణ ముద్రికాలంకృతంబు లయిన బాహువులును. సకలలోకార్తినివారక దరహాసచంద్రికా ధవళితంబులై కర్ణకుండల మండన మణిమరీచులు నర్తనంబులు సలుపం దనరి నిద్దంబులగు చెక్కుటద్దంబులును. బరిపక్వ బింబ ఫల ప్రవాళపల్లవారుణాధరంబును. నఖిలభువనపరిపాలనంబునకు నేన చాలదు నని వివాదించు నయనయుగళంబునకు సీమాస్తం భంబును చంపక ప్రసూనరుచివిభాసంబునునగు నాసాదండంబును

గమలకుముదంబులకుం బెంపు సంపాదించుచుఁ గరుణామృత తరంగితాపాంగంబులై కర్ణాంతవిశ్రాంతంబులై చెలువొందు నేత్రంబులును, సలలితశ్రీకారంబునకు నక్షరత్వంబు సార్థకంబయ్యె ననందగు కర్ణంబులును, నిక్షుచాప చాప ద్వయంబునాఁ జూపట్టు భ్రూయుగళంబును, నపరపక్షాష్టమీ శశాంకశంకాస్పద ఫాలఫలకంబును, నీలగిరీంద్ర శృంగసంగత బాలమార్తాండమండల విడంబిత పద్మరాగమణిఖచిత కాంచన కిరీటంబునం బొలుపారి సూర్యేందుపవనానల ప్రకాశంబులకు నవకాశంబు సూపక త్రిలోక వ్యాపక సమర్థంబులగు తేజోవిశేషంబులఁ జెలువొంది సంగర రంగంబుల దానవానీకంబుల హరింపంజాలు సుదర్శనాది దివ్య సాధనంబులచే దురాసదం బగు దివ్యరూపంబునుం గలిగి మఱియును. 288

* అంతేకాక ఆ మహాత్ముని దివ్యదేహం వేరుపరుపరానిది. సాటి లేనిది. సమస్తలోకాలను తనలో ఇముడ్చుకొన్నది. చాల విశాలమై గుండ్రనై నిడివికలిగి ఉన్నది. విచిత్రమైన మనోజ్ఞమైన అనేక దివ్య భూషణాలనుధరించి వాటిని స్వచ్ఛమైన తనకాంతులచే అలంకరిస్తున్నది. పలువిధాలైన కోర్కెలు కోరుతూ యథావిధిగా పూజించే పుణ్యపురుషులకు కామధేనువు అనదగిన చరణ కమలద్వయం కలిగివున్నది. ఫాలఫలకకాంతులకు ఓడిపోయిన చంద్రుడు అనుగ్రహింపబడినవాడై ఆయన పాదపద్మాలను అనేకరూపాల్లో ఆశ్రయించాడా అన్నట్లు ఉన్నాయి ఆయన కాలిగోళ్ళు.

శ్రీదేవికి, భూదేవికి తలగడలా అన్నట్లు నున్నని అరటిస్తంభాల నీల ద్యుతిని అతిశయిస్తున్నాయి అతని తొడలు. ఆయన కటిప్రదేశం మణులు చెక్కిన బంగారు ఒడ్డాణంతో మనోహరమై ఉన్నది. ఆయన నడుము కడిమిపువ్వుల కేసరాల కాంతులొలికే పట్టుపీతాంబరంతో ప్రకాశిస్తున్నది. ఆయన నాభి శృంగారతరంగిణి సుడివలె ఉన్నది. ఆయన మధ్యప్రదేశం కడుపులో ఉన్న సమస్త జగత్తులూ మాటిమాటికీ పుట్టుతున్నందువల్ల కృశించిందా అన్నట్లు ఉన్నది.

ఆయన వక్షఃస్థలం మంచి ముత్యాలుకూర్చిన ముగ్గులతో ముచ్చటగా ప్రకాశిస్తూ, క్రొంగ్రొత్త తులసీమాలలనే చిగురుల పాన్పుతో ఒప్పుతూ పూలదండలతో అలంకృతమై, పచ్చకర్పూరం కస్తూరి మంచి గంధం పూతలతో పరిమళిస్తూ, కౌస్తుభరత్న కాంతులతో వెలిగిపోతూ, శ్రీవత్సశోభితమై లక్ష్మీదేవి విహరించే విలాసమందిరమా అన్నట్లు ఉన్నది. శృంగారక్రీడకు ముందు గట్టిగా కౌగిలించుకొన్న లక్ష్మీదేవి చేతులందలి మణులుచెక్కిన బంగారుగాజులు ఒత్తుకున్న గుర్తులా అన్నట్లు ఆయన కంఠాన మూడురేఖలు కన్పిస్తున్నాయి.

ఆయన చేతులు వెలకట్టరాని రమణీయ రత్నకాంతులతో విరాజిల్లే భుజకీర్తులతో, కంకణాలతో, ఉంగరాలతో అలంకృతములై ఉన్నాయి. ఆయన చెక్కుటద్దాలు సమస్తలోకుల బాధలను పోగొట్టగల చిరునవ్వు వెన్నెలలతో తెల్లనై కర్ణకుండలాల మణిప్రభల నాట్యాలతో తళతళ లాడుతూ ఉన్నాయి.

ఆయన క్రింది పెదవి పండిన దొండపండులాగా, పగడంలా, చిగురుటాకులాగా అరుణారుణమై అలరారుతున్నది. ఆయన ముక్కు చక్కని సంపెంగ పువ్వులా, సమస్తలోకాలను పాలించడానికి చాలినదానిని 'నేనంటే నే' నని వాదులాడేకన్నులకు సరిహద్దుస్తంభం అన్నట్లు ఉన్నది. ఆయన కన్నులు కమలాలకూ, కలువలకూ శోభచేకూర్చుతూ, కరుణామృతం పొంగిపొరలే కటాక్ష వీక్షణాలతో చెవులవరకు విస్తరిల్లి ఉన్నాయి. ఆయన చెవులు శ్రీకారానికి అక్షరమైన ఆకారం చేకూరుస్తున్నాయి. ఆయన కనుబొమలు మన్మథుని ధనుస్సులా అన్నట్లు ఉన్నాయి. ఆయన నెన్నుదురు బహుళపక్షం అష్టమినాటి చంద్రుడా అన్నట్లు కన్నుల విందు చేస్తున్నది.

ఆయన శిరస్సుమీది పద్మరాగమణులు పొదిగిన బంగారు కిరీటం నీలపర్వత శిఖరంమీద ఉండే బాలసూర్యుణ్ణి తిరస్కరిస్తున్నది. సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని-వీని ప్రకాశానికి కూడా అవకాశం ఇవ్వకుండా, మూడులోకాల్లోనూ వ్యాపించడానికి సమర్థమైన తేజో విశేషంతో విరాజిల్లుతూ ఉన్న ఆ దేవదేవుడు రణరంగాలలో రాక్షసుల

సమూహాన్ని చించి చెండాడ గల్గిన సుదర్శనం మొదలైన దివ్యాయుధాలు ధరించి ఉన్నాడు. అనన్యసామాన్యమైన దివ్యరూపంతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉన్నాడు.

ఉ. హారకలాప పుష్పనిచయంబులఁ జంచదనర్ఘ రత్న కే
యూరకరాంగుళీయకమహోజ్జ్వల బాహుసహస్రశాఖ లొ
ప్పారఁగఁ జూడ నొప్పి భువనాత్మకలీల నదృష్ట మూల వి
స్ఫారితభోగివేష్టిత విభాసిత చందన భూరుహాకృతిన్. 289

* ఆ మహాత్ముడు హారాది అలంకారాలు పుష్పసమూహాలుగా, వెల కట్టరాని రత్నాలు చెక్కిన భుజకీర్తులతో ఉంగరాలతో, విరాజిల్లే వేలకొలది బాహువులు శాఖోపశాఖలుగా ప్రకాశిస్తూ, భువనానికి ఆత్మయై మూలం తెలియరానిదై పడగవిప్పిన మహాసర్పం చుట్టుకున్న చందన వృక్షంలా ఉన్నాడు.

మ. విలసత్కుండలి రాజసఖ్యమున నుర్వీభృత్సమాఖ్యన్సము
జ్జ్వలితోదార శిరోవిభూషణ సహస్రస్వర్ణ కూటంబులన్
సలిలావాసతఁ జారుకౌస్తుభ విరాజద్రత్న గర్భంబునన్
నలినాక్షుండు గనుంగొనంగఁ దగె మైనాకావనీభృద్గతిన్. 290

* పడగవిప్పిన సర్పరాజుతో కలిసి మెలిసి ఉన్నందువల్లా, భూమినిమోస్తూ ఉండటంవల్లా, శిరోవిభూషణాలుగా ప్రకాశించే వేలకొలది కిరీటాలవంటి బంగారు శిఖరాలవల్లా, సముద్రజలమధ్యంలో నివసించడం వల్లా, మనోహరమైన కౌస్తుభాది రత్నాలు కలిగివుండటం వల్లా మహావిష్ణువు మైనాక పర్వతంలా చూడదగినవాడు అయ్యాడు.

క. వితతార్థజ్ఞాన జప
స్తుతి మకరందప్రహృష్టశ్రుతిజాత మధు
వ్రత గణ పరివృత శోభా
గత కీర్తి ప్రసవమాలికలు గలవానిన్. 291

వ. కనుంగొని చతురాననుండు. 292

* విస్తారమైన భావంతో, జ్ఞానం-జపం-స్తోత్రం అనే తేనెలు త్రాగటంచే సంతోషించే తుమ్మెదలు అనే వేదసమూహాలతో చుట్టుకొనబడి వైభవోపేతంగా ప్రకాశించే కీర్తి అనే పూలదండలు గలవానిని ఆ విష్ణుదేవుని చతుర్ముఖబ్రహ్మ చూచాడు.

సీ. అనఘు సర్వేశ్వరు నాద్యంత శూన్యుని
ధన్యుని జగదేక మాన్య చరితుఁ
దన్నాభిసరసిజోద్భవ సరోజంబును
నప్పుల ననిలుని నంబరమును
మానితభువననిర్మాణ దృష్టిని బొడ
గనెఁ గాని యితరముఁ గానలేక
యాత్మీయకర్మబీజాంకురంబును రజో
గుణయుక్తుఁ డగుచు నకుంఠితప్ర

తే. జాభిసర్గాభిముఖత నవ్యక్త మార్గుఁ
డైన హరియందుఁ దనహృదయంబుఁ జేర్చి
య మ్మహాత్మునిఁ బరము ననంతు నభవు
నజు నమేయుని నిట్లని యభినుతించె. 293

* పుణ్యాత్ముడై సృష్టికంతటికీ ప్రభువై, ఆదీ అంతమూ లేనివాడై ధన్యుడై సకలలోకాలకూ మాన్యుడైన మహానుభావుని బ్రహ్మ దర్శించాడు. అంతేకాదు. ఆయన బొడ్డునుంచి పుట్టిన కమలాన్నీ, జలాన్నీ, అగ్నినీ, ఆకాశాన్నీ, మహాజగత్తును సృష్టించాలనే దృష్టినీ చూచాడు. ఆయనకు ఇతరం ఏమీ కనబడలేదు. తనదైన సృష్టికార్యానికి బీజాంకురమైన రజోగుణం తనలో పొడసూపింది. ప్రముఖమైన ప్రజాసృష్టికి సుముఖుడైనాడు. అంతుపట్టని - అర్థంకాని - ఆ హరియందు తన హృదయాన్ని కేంద్రీకరించాడు. మహాత్ముడూ, పురుషోత్తముడూ, అనంతుడూ. అభవుడూ, అమేయుడూ అయిన పరాత్పరుణ్ణి బ్రహ్మ ఈ విధంగా ప్రస్తుతించాడు.

సీ. నలినాక్ష! మాయాగుణ వ్యతికరమునఁ
జేసి కార్యంబైన సృష్టిరూప
మునఁ బ్రకాశించు నీ ఘనరూపవిభవంబు
రూపింప దేహధారులకు దుర్వి
భావ్యంబు దలపోయ భగవంతుఁడవునైన
పద్మాక్ష! నీ స్వరూపంబుకంటె
నన్య మొక్కటి సత్యమై బోధకంబైన
యది లేదు గాన నీ యతుల దివ్య

తే. మైన రూపంబు నాకుఁ బ్రత్యక్ష మయ్యె
నదియుఁగాక వివేకోదయమునఁ జేసి
వరద! నీ రూప మజ్ఞానగురుతమో ని
వారకం బయ్యె నాకు శశ్వత్ప్రదీప! 294

* తామర పూలవంటి కన్నులుగల స్వామీ! మాయాగుణ సంవర్కంవల్ల ఏర్పడింది ఈ సృష్టి. ఈ సృష్టి రూపంలో ప్రకాశించే నీ ఘన స్వరూపాన్ని నిరూపించటానికి మావంటి దేహధారులకు సాధ్యం కాదు. కమలాక్షా! నీ స్వరూపంకంటే మరొక్కటి సత్యమైనదీ, తెలియదగినదీ లేదు. ఓ వరదా! సాటిలేని నీ మనోహర రూపం నాకు సాక్షాత్కరించింది. నాలో వివేకం వికసించింది. జ్యోతిర్మయా! అటువంటి జ్ఞానం కలగడం చేత నీ రూపం అజ్ఞానం అనే పెనుచీకటిని పోగొట్టింది. అందువల్ల నీ రూపం నాపాలిటికి శాశ్వతమైన దీపం.

క. ఘన సత్పురుషానుగ్రహ
మునకై యమితావతారమూలం బగుచుం
దనరెడి నీరూపము శో
భనమగు భవదీయనాభిపద్మమువలనన్. 295

క. జననం బందిన నాచే
ననయము మొదలనె గృహీతమయ్యెః జగత్పా
వనః నీదు సుస్వరూపము
ఘనరుచిరంబై స్వయంప్రకాశక మగుటన్. 286

* ఉత్తమ పురుషులను అనుగ్రహించటానికై ధరించిన ఎన్నో అవతారాలకు మూలమై వెలుగొందే నీ రూపం శుభాన్ని కలిగిస్తుంది. నీ నాభికమలం నుంచి జన్మించిన నేను నీరూపాన్ని బాగా తెలుసుకున్నాను. లోకముల కన్నింటికీ పావనుడవైన దేవా ! నీ స్వరూపం ఎంతో సుందర మైనది. స్వయంప్రకాశమైనది.

వ. మఱియు జ్ఞానానందపరిపూర్ణ మాత్రంబును, ననావృత ప్రకాశంబును, భేదరహితంబును, బ్రపంచ జనకంబును, బ్రపంచ విలక్షణంబును, భూతేంద్రియాత్మకంబును, నేకంబును, నైన రూపంబు నొందియు నెందును బొడగాననట్టి నిన్ను నాశ్ర యించెదః నదియునుంగాక జగన్మంగళస్వరూపధరుండవై నీ యుపాసకులమైన మా మంగళంబుల కొఱకు నిరంతర ధ్యానంబు చేత నీ దివ్యరూపంబునం గానంబడితి, విట్టి నీవు నిరయభాక్కులై నిరీశ్వరవాదంబునం జేసి కుతర్కంబులు ప్రసంగించు భాగ్య రహితులచే నాదృతుండవు గావుః మఱియు కొందఱు కృతార్థులైన మహాత్ములు భవదీయ శ్రీ చరణారవిందకోశ గంధంబు వేదమారుతా నీతం బగుటంజేసి తమతమ కర్ణకుహరంబులచేత గ్రహించు దురుః వారల హృదయకమలంబులయందు భక్తిపారతంత్ర్యం బున గృహీతపాదారవిందంబులు గలిగి ప్రకాశింతుః వదియు నుంగాక ప్రాణులకు ద్రవ్యాగార సుహృన్నిమిత్తం బయిన భయంబును దన్నాశనిమిత్తం బయిన శోకంబును, ద్రవ్యాది స్పృహయును దన్నిమిత్తం బయిన పరిభవంబును, మఱియు నందుఁ దృష్ణయు నది ప్రయాసంబున లబ్ధంబైన నార్తియు,

తదీయంబైన వృథాగ్రహంబును నీ శ్రీ పాదారవిందంబులందు వైముఖ్యం బెంతకాలంబు గలుగు నంతకాలంబును బ్రాప్తంబు లగుంగాని మానవాత్మనాయకుండవగు నిన్ను నాశ్రయించిన భయనివృత్తి హేతువైన మోక్షంబు గలుగు: మఱియునుం గొందఱు సకలపాపనివర్తకంబయిన త్వదీయనామస్మరణ కీర్తనంబులందు విముఖులై కామ్యకర్మ ప్రావీణ్యంబునం జేసి నష్టమతులై యింద్రియ పరతంత్రులై యమంగళంబులైన కార్యంబులు సేయుచుందురు: దానంజేసి వాతాదిత్రిధాతు మూలంబైన క్షుత్తృడాదులచేతను, శీతోష్ణవర్ష వాతాది దుఃఖంబులచేతను, నతిదీర్ఘంబైన కామాగ్నిచేతను, నవిచ్ఛిన్నంబగు క్రోధంబుచేతనుం దహ్యమాను లగుదురు: వారలం గనిన నా చిత్తంబు గలంకంబొందు; జీవుండు భవదీయమాయాపరిభ్రామ్యమాణుండై యాత్మ వేఱని యెప్పుడు దెలియు. నంతకాలంబు నిరర్థకంబై దుస్తరంబైన సంసారసాగరంబు తరియింపంజాలకుండు: సన్మునీంద్రులైనను భవదీయ నామస్మరణంబు మఱచి యితరవిషయాసక్తులై రేని వారలు దివంబులందు వృథాప్రయత్నులై సంచరించుచు. రాత్రులయందు నిద్రాసక్తులై స్వప్నగోచరంబు లయిన బహువిధసంపదలకు నానందించుచు, శరీర పరిణామాది పీడలకు దుఃఖించుచుం బ్రతిహతంబులైన యుద్యోగంబుల భూలోకంబున సంసారులై వర్తింతురు; నిష్కామధర్ములై నిన్ను భజియించు సత్పురుషుల కర్ణమార్గంబులం బ్రవేశించి భవదీయ భక్తి యోగ పరిశోధితంబైన హృత్సరోజకర్ణికాపీఠంబున వసియింతు వదియు నుంగాక. 297

* జ్ఞానంచేతా ఆనందంచేతా పరిపూర్ణమైనదీ, ఆవరణం లేని కాంతి కలదీ, భేదభావం లేనిదీ, ప్రపంచాన్ని సృష్టించేదీ, ప్రపంచంకంటె భిన్నమైనదీ, పంచభూతములకూ, ఇంద్రియాలకూ ఆత్మవంటిదీ, అనన్య

మైనదీ అయిన రూపాన్ని ధరించి కూడా ఎక్కడాకనిపించని నిన్ను ఆశ్ర యిస్తాను. నీవు లోకాలకంతకూ శుభాన్నిచేకూర్చే రూపం ధరించిన వాడవు. నిరంతరం నిన్ను ధ్యానించే మాకు శుభాలను కల్గించడానికై ఈ దివ్యరూపంతో కనబడినావు.

నరకభాజనులై ఈశ్వరుడు లేడని వాదిస్తూ కుతర్కాలతో కాలం గడిపే దురదృష్టవంతులు నిన్ను గుర్తింపలేరు. ధన్యజీవులైన కొందరు మహాత్ములు వేదా లనే మలయమారుతాలు కొనివచ్చిన మీ పాద పద్మాల సుగంధాన్ని వీనులవిందుగా ఆఘ్రాణిస్తారు. వారు భక్తితో పరవశించిన తమ హృదయకమలాలతో నీ పాదపద్మాలను అందు కుంటారు. నీవు ఆ భక్తుల మనస్సులలో ప్రకాశిస్తావు.

అంతేకాక ప్రాణులకు ధనం, ఇల్లు, స్నేహితులవల్ల కలిగే భయం, అవి నాశనం కావడం చేత కలిగే దుఃఖం, వానిమీద ఆశ, వాని సంపా దనలో ఎదురయ్యే అవమానం, ఇన్ని శ్రమలుపడి పొందే శోకానికి మూల మైన తృష్ణ, ఇవన్నీ నీ మంగళకరమైన చరణాబ్జాలను తలంచకుండా ఎంతకాలం ఉంటామో అంతకాలమూ ఉంటాయి. కాని మానవుల ఆత్మ లకు అధినాయకుడవైన నిన్ను ఆశ్రయించినట్లయితే భయాన్ని పోగొట్టు కోవడానికి కారణమైన మోక్షం కలుగుతుంది. కొందరు అన్ని పాపాలూ పోగొట్టగలిగే నీ నామ ధ్యానసంకీర్తనలకు విముఖులై మోహసంబంధ మైన పనుల్లో మతి కోల్పోయి, ఇంద్రియాలకు దాసులై అశుభాలైన కార్యాలు చేస్తూ ఉంటారు. ఇందువల్ల వాతపిత్తశ్లేష్మాలకు మూలమైన అకలిదప్పుల బాధల చేతా, శీతం ఉష్ణం వర్షం వాయువు మొదలైనవాని వల్ల ప్రాప్తించే దుఃఖంచేతా, అవధిలేని కామ సంతాపం చేతా, ఎడతెగని కోపంచేతా, తపించి పరితపించుతూరు. అటువంటి వారిని చూచి నా మనస్సు చాలా కలత పడుతుంది.

జీవుడు నీ మాయ కల్పించే భ్రమలలో కీలుబొమ్మయై దేహంకంటె ఆత్మ వేరని ఎప్పటి వరకు తెలుసుకోడో అంతవరకు సారంలేని సంసార సాగరాన్ని దాటలేడు. శ్రేష్ఠులైన మునీంద్రులుకూడా, నీ నామస్మర ణాన్నిమరచి, అన్యవిషయాలపై ఆసక్తి కలవారైనట్లయితే, వారు

పగలంతా పనికిమాలినవారై తిరుగుతూ, రాత్రిళ్లు స్వప్నంలో కనిపించే అనేకాలైన సంపదలకు సంతోషపడుతూ, శరీరమందలి జరారోగాది వికారాలకు విచారపడుతూ, ప్రయత్నాలన్నీ భగ్నం కాగా భూలోకంలో సంసారబంధాలలో చిక్కుకొని తిరుగుతారు.

కోరికలు లేకుండా ధర్మ మార్గంలో నిన్ను సేవించే పుణ్యపురుషుల చెవులగుండా నీవు వారిలో ప్రవేశిస్తావు. నీపై భక్తిప్రపత్తుల వల్ల పరిశుద్ధమైన వారి హృదయ కమల పీఠం మీద నీవు కూర్చుంటావు.

మ. వరయోగీంద్రులు యోగమార్గముల భావంబందు నే నీ మనో
హరరూపంబుఁ దలంచి యే గుణగణధ్యానంబు గావింతు, ర
ప్పురుషశ్రేష్ఠపరిగ్రహంబునకునై పొల్పారఁ దద్ధ్యానగో
చరమూర్తిన్ ధరియింతు గాదె పరమోత్సాహుండవై మాధవా! 298

* ఓ మాధవా! ఉత్తములైన యోగీంద్రులు తమతమ యోగ సంప్రదాయాలతో తమతమ భావాలలో ఏ నీ మనోహరరూపాన్ని భావిస్తారో; ఏ నీ గుణగణాల్ని సంభావిస్తారో; వారిని అనుగ్రహించే నిమిత్తం ఆ రూపం ధరించి అటువంటి గుణగణాలతో వారికి సాక్షాత్కరిస్తావు. ఎంతో సంతోషంతో వారిని ఆదుకుంటావు.

తే. అరయ నిష్కామధర్ములైనట్టి భక్తు
లందు నీవు ప్రసన్నుండవైనరీతి
హృదయముల బద్ధకాములై యెనయు దేవ
గణములందుఁ బ్రసన్నత గలుగ వీవు. 299

* బాగా పరిశీలించి చూస్తే కోరికలు లేకుండా నిన్ను ఆరాధించే భక్తులను నీవు అనుగ్రహించినట్లు కోరికలతో ముడిపెట్టుకున్న హృదయం గల దేవతలనుకూడా నీవు అనుగ్రహించవు.

చ. అరయ సమస్తభూత హృదయంబులయందు వసించి యేకమై
పరఁగి సుహృత్క్రియానుగుణభాసితధర్ముఁడవుం బరాపరే
శ్వరుఁడవు నై తనర్చుచు నసజ్జనదుర్లభ మైన యట్టి సు
స్థిరమగు సర్వభూతదయచేఁ బొడగానఁగ వత్తు వచ్యుతా! 300

* ఓ స్వామీ! నీవు సకల జీవుల హృదయాలలో అంతర్యామివై ఉంటావు. అందరిలో ఒకే ఒక రూపంతో వెలుగొందుతావు. ఆప్యాయతకు అనుగుణంగా ప్రకాశించే ధర్మ స్వరూపుడవు. అచ్యుతా! ఇహపరాలకు నీవే అధీశ్వరుడవు. సజ్జనులకు సులభమూ అసజ్జనులకు దుర్లభమూ అయిన సర్వజీవకారుణ్యం వల్ల మాత్రమే జనులు నిన్ను దర్శింప గలుగుతారు.

మ. క్రతుదానోగ్రతపస్సమాధి జపసత్కర్మాగ్నిహోత్రాఖిల
వ్రతచర్యాదుల నాదరింప; వఖిలవ్యాపారపారాయణ
స్థితి నొప్పారెడి నీ పదాబ్జయుగళీసేవాభిపూజాసమ
ర్పితధర్ముం డగువానిభంగి నసురారీ! దేవచూడామణీ! 301

* దనుజవిరామా! దైవతసార్వభౌమా! సమస్త వ్యాపారాలూ, నీకే సమర్పించి, నీ యందే మనస్సు లగ్నం చేసి, నీ పాదపద్మ ద్వయాన్నే నిరంతరం ఆరాధించే భక్తుణ్ణి నీవు ఎంతో ఆప్యాయంగా ఆదరించి ఆదుకొంటావు. యజ్ఞాలూ, దానాలూ, కఠోరతపస్సులూ, జపాలూ, అగ్నిహోత్రాలూ, వ్రతాలూ, మొదలైన సత్కర్మలు ఆచ రించే వారిని కూడా ఇంత ప్రేమగా ఆదరించవు.

తే. తవిలి శశ్వత్స్వరూప చైతన్యభూరి
మహిమచేత నపాస్త సమస్త భేద
మోహుఁడ వఖిల విజ్ఞానమునకు నాశ్ర
యుండవగు నీకు మ్రొక్కెద నో రమేశ! 302

* ఓ లక్ష్మీవల్లభా! నీ స్వరూపం శాశ్వతమైనది. అందలి చైతన్య మహాప్రభావం వల్ల సమస్తమైన భేద భావాలనూ, వ్యామోహాలనూ రూపుమాపుతావు. అఖండమైన విజ్ఞానానికి ఆశ్రయమైన నీకు నమస్కరిస్తున్నాను.

క. జనన స్థితి విలయంబుల
కనయంబును హేతు భూతమగు మాయా లీ
లను జెంది నటన సలిపెడు
ననఘాత్మక! నీ కొనర్తు నభివందనముల్. 303

* పుట్టుట, వృద్ధిపొందుట, చనిపోవుట - అనే మూడింటికీ మూల కారణమైనది నీ మాయ. అటువంటి మాయా నటనలతో, లీలా విలాసాలతో నిరంతరము క్రీడించే ఓ పవిత్ర స్వరూపా! నీ కివే నా కై మోడ్పులు.

సీ. అనఘాత్మ! మఱి భవదవతార గుణకర్మ
ఘనవిడంబనహేతుకంబు లయిన
రమణీయమగు దాశరథి వసుదేవ కు
మారాది దివ్య నామంబు లోలి
వెలయంగ మనుజులు వివశాత్ములై యవ
సానకాలంబున సంస్మరించి
జన్మ జన్మాంతర సంచిత దురితంబుఁ
బాసి కైవల్యసంప్రాప్తు లగుదు

తే. రట్టి దివ్యావతారంబు లవధరించు
నజుఁడవగు నీకు మ్రొక్కెద ననఘచరిత!
చిరశుభాకార! నిత్యలక్ష్మీవిహార!
భక్త మందార! దుర్భవ భయవిదూర! 304

* స్వామీ! నీవు పరమపవిత్రుడవు! సచ్చరిత్రుడవు! శాశ్వతమైన దివ్యమంగళ స్వరూపం కలవాడవు! ఎల్లప్పుడూ లక్ష్మీదేవితోకూడి

సంచరించేవాడవు! భక్తులకు కల్పవృక్షం వంటివాడవు! దుర్భరమైన సంసార భయాన్ని దూరంగా పోగొట్టేవాడవు! నీ అవతారాలకూ, సద్గుణాలకూ, సత్కార్యాలకూ, మహదాశయాలకూ కారణమైనవీ, మనోహరమైనవీ అయిన "దాశరథి" "వాసుదేవా"ది దివ్యనామాలను మనుష్యులు తమ తుది గడియల్లో స్మరించి, జన్మజన్మల్లో కూడబెట్టుకొన్న పాపాలను పోగొట్టుకొని మోక్షం పొందుతారు. జన్మలేనివాడవై కూడా అటువంటి దివ్యావతారాలతో జన్మించే నీకు మ్రొక్కుతున్నాను.

త. జననవృద్ధివినాశహేతుకసంగతిం గల యేను నీ
వును హరుండుఁ ద్రిశాఖలై, మనువుల్ మరీచి ముఖామరుల్
దనర నందుపశాఖలై, భవదాత్మ దీనికి మూలమై
యనయమున్ భువనద్రుమాకృతి వైన నీ కిదె మ్రొక్కెదన్. 305

* ఈ విశ్వం ఒకమహావృక్షం. సృష్టిస్థితిలయ కారకులమైన నేనూ, నీవూ, శివుడూ ముగ్గురం ఆ వృక్షానికి మూడు శాఖలం. మనువులూ, మరీచి మొదలైన ప్రజాపతులూ, దేవతలూ దాని ఉపశాఖలు. ఆ విశ్వవృక్షానికి ఆధారమైన కూకటి వేరు నీవే. విశాలమైన దాని ఆకారం కూడా నీవే! అటువంటి నీకు కైమోడ్పులు.

మ. పురుషాధీశ! భవత్పదాబ్జయుగళీపూజాదికర్మక్రియా
పరతం జెందని మూఢచిత్తునిఁ బశుప్రాయున్ మనుష్యాధమున్
జరయున్ నాశము నొందఁజేయు నతిదక్షంబైన కాలంబు; త
ద్గురు కాలాత్ముఁడ వైన నీకు మది సంతోషంబునన్ మ్రొక్కెదన్. 306

* పురుషోత్తమా! నీ పాదపద్మాలను పూజించడం అనే మంచి పనిలో మునిగి తన్మయత్వం చెందనివాడు పరమమూఢుడు, పశువులాంటివాడు, అధముడు. అటువంటి మానవునకు సర్వసమర్థమైన కాలం త్వరగా ముసలితనాన్ని కల్గించి, వాని వినాశనానికి దారితీస్తుంది. అటువంటి అనంతకాలానికి ఆత్మస్వరూపుడ వయిన నీకు ఆనందంగా నమస్కరిస్తాను.

సి. సర్వేశ కల్పాంతసంస్థిత మగు జల
జాతమం దేను సంజనన మంది
భవదీయ సుస్వరూపముఁ జూడ నర్థించి
బహువత్సరములు దపంబు సేసి
క్రతుకర్మములు పెక్కు గావించియును నినుఁ
బొడగానఁగా లేక బుద్ధి భీతిఁ
బొందిన నాకు నిప్పుడును నిర్హేతుక
కరుణచే నఖిలలోకైకవంద్య

తే. మాన సతతప్రసన్న కోమల ముఖాబ్జ
కలిత భవదీయ దివ్యమంగళ విలాస
మూర్తి దర్శింపఁగలిగె భక్తార్తి హరణ
కరణ! తుభ్యం నమో విశ్వభరణ! దేవ!. 307

* ఓ సర్వేశ్వరా! కల్పాంతసమయంలో చెక్కుచెదరని తామర పువ్వునందు నేను పుట్టాను. నీ అత్యంతసుందరమైన ఆకారాన్ని చూడగోరి చాలా సంవత్సరాలు తపస్సు చేశాను. క్రతువులు కూడా ఎన్నో చేశాను. కాని నీ జాడ అంతుచిక్కక ఎంతో బెదరి పోయాను. అటువంటి నాకు ఎటువంటి కారణం లేకుండానే కరుణగలవాడవై ఇప్పుడు నీవు సాక్షాత్కరించావు. అఖిలలోకాలకూ ఆరాధనీయమై, ఎల్లప్పుడూ ప్రసన్నకోమలమైన ముఖ పద్మంతో విరాజిల్లే నీ దివ్యమంగళ విగ్రహాన్ని ఇప్పుడు కనులారా, కరవు దీరా దర్శింప గలిగాను. భక్తుల వేదనలను పోగొట్టే ఓ పరమాత్మా! ఈ విశాలవిశ్వాన్ని భరించే దేవాదిదేవా! నీకు నమస్కారం!

సీ. అమర తిర్యఙ్మనుష్యాది చేతనయోను
లందు నాత్మేచ్ఛచేఁ బెందినట్టి
కమనీయ శుభమూర్తి గలవాఁడవై ధర్మ
సేతు వనంగఁ బ్రఖ్యాతి నొంది
విషయ సుఖంబుల విడిచి సంతత నిజా
నందానుభవసమున్నతిఁ దనర్తు!

వది గాన పురుషోత్తమాఖ్యఁ జెన్నొందుదు
వట్టి ని న్నెప్పుడు నభినుతింతు;

తే. నర్థి భవదీయపాదంబు లాశ్రయింతు;
మహిత భక్తిని నీకు నమస్కరింతు;
భక్త జన పోష పరితోష! పరమ పురుష!
ప్రవిమలాకార! సంసార భయవిదూర! 308

* నీవు భక్తజనులను పోషించటంలో మిక్కిలి సంతోషపడేవాడివి.
నిర్మలమైన ఆకారం కలవాడవై సంసారభయాన్ని దూరం చేసే పురు
షోత్తముడవు! నీ సంకల్పానుసారంగా దేవతలు, జంతువులు, మను
ష్యులు మొదలైన సచేతన రూపాలు ధరించి అవతరిస్తావు. మనోహర
మైన మంగళ స్వరూపంతో ధర్మానికి సేతువుగా నిలుస్తావు. పేరు
ప్రఖ్యాతులు గడిస్తావు. లౌకిక సుఖాలను విడచిపెట్టి ఎల్లప్పుడూ అపార
మైన ఆత్మానందాన్ని అనుభవిస్తావు. అందుకనే నీవు పురుషోత్తముడనే
ప్రశస్తి గాంచావు. అటువంటి నిన్ను నిత్యమూ సన్నుతిస్తాను. ప్రీతితో
నీ పాదాలను ఆశ్రయిస్తాను. అపరిమిత భక్తితో నీకు నమస్కరిస్తాను.

సి. తలకొని పంచభూతప్రవర్తక మైన
భూరిమాయాగుణస్ఫురణఁ జిక్కు
పడక. లోకంబులు భవదీయ జఠరంబు
లో నిల్పి ఘనసమాలోలచటుల
సర్వంకషోర్మిభీషణవార్ధి నడుమను
ఫణిరాజభోగతల్పంబునందు
యోగనిద్రారతి నుండంగ నొకకొంత
కాలంబు సనఁగ మేల్కనిన వేళ

తే. నలఘుభవదీయ నాభితోయజమువలన
గడఁగి ముల్లోకములు సోపకరణములుగఁ
బుట్టఁజేసితి వతులవిభూతి మెఱసి
పుండరీకాక్ష! సంతత భువనరక్ష! 309

* తెల్లదామర రేకులవంటి కన్నులుగలవాడవై ఎల్లవేళలా ముల్లో కాలను చల్లగా రక్షించే స్వామీ! నీవు ముందుండి పంచభూతాలను ప్రవర్తింప జేసే మహామాయాబంధాలలో చిక్కుపడకుండా లోకాలను నీ కడుపులో నిల్పుకొంటావు. ఉవ్వెత్తుగా లేచిపడుతున్న ఉత్తుంగ తరంగా లతో పొంగిపొరలే భయంకరమైన సముద్రం నడుమ శేషతల్పం మీద శయనించి యోగనిద్రలో ఉంటావు. కొంతకాలం గడిచాక మేల్కొంటావు. అప్పుడు నీ సాటి లేని మేటి వైభవాన్ని వ్యక్తం చేస్తూ, నీ నాభికమలం లోనుంచి మూడు లోకాలను పుట్టింపజేస్తావు.

క. నిగమస్తుత! లక్ష్మీపతి!
జగదంతర్యామి వగుచు సర్గము నెల్లం
దగు భవదైశ్వర్యంబున
నగణిత సౌఖ్యానుభవము నందింతుగదే! 310

* వేదాలచే వినుతింపబడే లక్ష్మీవల్లభా! స్వామీ! నీవు జగము లలో అంతర్యామివై ఉంటూ ఈ విశ్వాని కంతటికీ భవ్యమైన నీ దివ్య విభూతిచే లెక్కలేనన్ని ఆనందానుభూతులను అందిస్తావు కదా!

సీ. జలజాక్ష యెట్టి విజ్ఞానబలంబునఁ
గల్పింతు వఖిలలోకంబు లోలి
నతజన ప్రియుఁడవు నా కట్టి సుజ్ఞాన
మర్థిమైఁ గృపసేయుమయ్య వరద!
సృష్టినిర్మాణేచ్ఛఁ జెంది నా చిత్తంబు
దత్కర్మ కౌశలిఁ దగిలియుండి
యును గర్మవైషమ్యమును బొందు కతమున
దురితంబుఁ బొరయక తొలఁగునట్టి

తే. వెరవు నా కెట్లు గలుగు న వ్విధముఁ దలఁచి
కర్మవర్తను నను భవత్కరుణ మెఱసి
తగఁ గృతార్థునిఁ జేయవే నిగమవినుత!
సత్కృపామూర్తి! యో దేవచక్రవర్తి! 311

* తామరరేకుల వంటి కన్నులు గల వాడవూ, వేదములచే పొగడ బడే వాడవూ అయిన ఓ పరమ కరుణార్ద్రమూర్తీ! ఓ దేవతాచక్రవర్తీ! నీవు ఏ విధమైన విజ్ఞానబలంతో ఈ సమస్తలోకాలను సృష్టిస్తున్నావో నాకు అటువంటి ఉత్తమజ్ఞానాన్ని ప్రసాదించు. నీకు నమస్కరించే జను లకు నీవు ప్రియుడవు కదా! ఓ వరదా! నా మనస్సులో సృష్టించాలనే కోరిక మిక్కుటంగా ఉన్నది. అది చేయడానికి తగిన నైపుణ్యం కూడా నాకు అనుగ్రహించి కర్మలందలి ఒడుదొడుకుల వల్ల పాపం పొందకుండా ఉండే ఉపాయం ఏమిటో నాకు తెల్పు. కర్మజీవినయిన నన్ను కనిక రించి కృతార్థుణ్ణి కావించు.

చ. భవదుదర ప్రభూతమగు పద్మమునందు వసించి యున్న నే
నవిరళతావకీనకలితాంశమునం దనరారు విశ్వముం
దవిలి రచించుచున్ బహువిధంబులఁ బల్కెడి వేదజాలముల్
శివతరమై ఫలింపఁ గృపసేయుము భక్తఫలప్రదాయకా! 312

* స్వామీ! నీవు భక్తులు కోరిన ఫలాన్ని పదింతలుగా ప్రసాదించే వాడివి! నీ కడుపున పుట్టిన కమలంలోనుంచి జన్మించిన నేను అపార మైన నీ అంశతో ప్రకాశించే ఈ విశ్వాన్ని సృష్టించడానికి పూను కొన్నాను. ఈ సందర్భంలో నేను పలురీతులుగా పలికే పలుకులు ప్రాబలుకులై మంగళప్రదాలై ఫలించేటట్లు అనుగ్రహించు.

చ. అని యనుకంప దోఁప వినయంబునఁ జాఁగిలి మ్రొక్కి చారులో
చన సరసీరుహుం డగుచు సర్వజగత్పరికల్పనారతిం
దనరిన నన్నుఁ బ్రోచుటకుఁ దా నిటు సన్నిధియైన యీశ్వరుం
డనయము నాదుదుఃఖము దయామతిఁ బాపెడు మంచు నమ్రుఁడై. 313

* అని కమలసంభవుడు కనికరం ఉట్టిపడేటట్లు విష్ణుదేవునికి విన్న వించుకొని వినయంతో సాగిలబడి మ్రొక్కాడు. "సర్వప్రపంచాన్ని సృష్టించడానికి పూనుకొన్న నన్ను అందాలుచిందే కమలాలవంటి కన్ను లతో వీక్షించి రక్షించడానికై, ఈ విధంగా సాక్షాత్కరించిన పరాత్పరుడు నా దుఃఖాన్ని దూరం చేయుగాక!" అని తలవంచి నమస్కరించాడు.

క. వనరుహసంజాతుఁడు నె
మ్మనమున హర్షించె ననుచు మైత్రేయ మహా
ముని ఘనుఁడగు విదురునకున్
వినయంబున నెఱుఁగ జెప్పి వెండియుఁ బలికెన్. 314

* ఈ విధంగా ప్రణమిల్లి బ్రహ్మదేవుడు తనలో తాను ఆనందముతో పొంగిపోయాడు అని మైత్రేయ మహర్షి విజ్ఞానధనుడైన విదురునకు విశేషించి చెప్పి, మళ్లీ ఇట్లా అన్నాడు.

మ. వనజాతప్రభవుండు కేవలతపోవ్యాసంగుఁడై పద్మలో
చను గోవిందు ననంతు నాఢ్యుఁ దన వాక్ఛక్తిన్ నుతింపన్సుధా
శనవంద్యుండు ప్రసన్నుఁడై నిఖిలవిశ్వస్థాపనాలోకనం
బునఁ జూచెన్ విలయప్రభూతబహువాఃపూరంబులన్ బ్రేల్మిడిన్. 315

* పద్మసంభవుడైన బ్రహ్మదేవుడు కేవలం తపస్సుపై ఆసక్తి కలవాడై పద్మాక్షుడూ, గోవిందుడూ, అనంతుడూ, పురుషోత్తముడూ అయిన పరమేశ్వరుణ్ణి తనమాటల పాటవంతో ప్రస్తుతించాడు. దేవదేవుడైన ఆ స్వామి అనుగ్రహించాడు. సమస్త విశ్వాన్ని సంస్థాపించాలనే దృష్టితో ప్రళయాన్ని సృష్టించిన ఆ మహాజలప్రవాహంపైపు అలా అలవోకగా ఒకమాటు అవలోకించాడు.

తే. అట్లు వొడగని యార్తుఁడై నట్టి పద్మ
భవునివాంఛిత మాత్మఁ దీర్పంగఁ దలఁచి
యతని మోహనివారక మైనయట్టి
యమృతరసతుల్యమధుర వాక్యముల ననియె. 316

* అలా చూచి పరితపించే బ్రహ్మదేవుని కోర్కె తీర్చాలని మదిలో భావించాడు. అతనిలోని వ్యామోహాన్ని తొలగించగలిగి అమృతముతో సమానమైన తీయని మాటలతో ఇట్లా అన్నాడు.

చ. తలకొని నీ యొనర్చుపని తప్పి మదిం దలపోయు దుఃఖముం
దలఁగుము; నాదులీలకుఁ బ్రధానగుణంబగు సృష్టికల్పనం
బలవడఁజేయు బుద్ధి హృదయంబునఁ జొన్పి తపస్సమాధి ని
ష్ఠల నతిభక్తులన్ ననుఁ బ్రసన్నునిఁ జేయుము చెందు కోరికల్. 317

• నీవు చేయవలసినపని మానకు. అనవసరముగా మనస్సుకు తెచ్చి పెట్టుకొన్న దుఃఖాన్ని మాను. సృష్టినిర్మాణం నా లీలలలో ప్రధానమైనది. ఈ సత్యం నీ హృదయంలో ప్రతిష్ఠించుకొని సమాధినిష్ఠుడవై భక్తితో తపస్సుచేసి నన్ను ప్రసన్నుని చేసుకో. నీ కోరికలు నేరవేరుతాయి.

క. నీ వొనరించు తపో వి
ద్యావిభవ విలోకనీయమగు నీ సృష్టిం
గావింపుము లోకంబుల
లోవెలిఁగెడి నన్నుఁ గందు లోకస్తుత్యా! 318

• నీవు లోకస్తుత్యుడవు; నీ తపస్సంపదకుతగినట్లు చూడముచ్చటగా ఈ సృష్టికార్యాన్ని ప్రారంభించు. అప్పుడు అంతటా; అన్నిలోకాల్లో ప్రకాశించే నన్ను నీవు చూడగలుగుతావు.

క. నాలోని జీవకోటులు
వాలాయము నీకుఁ గానవచ్చు నిపుడు, నీ
వాలోకింపుము దారు వి
లోలహుతాశనుని కరణి లోకస్తుత్యా! 319

• ఓ జగన్నుతా! కట్టెలోపల దాగివున్న అగ్నిజ్వాలల విధంగా నాలో దాగి వున్న ప్రాణిసమూహా లన్నీ నీకు తప్పకుండా కనిపిస్తాయి. ఏదీ ఇప్పుడు నీవు చూడు.

సీ. నలు వొంద నఖిల జీవులయందుఁ గల నన్నుఁ
దెలిసి సేవింపుము నలినగర్భ!

భవదీయదోషముల్ వాయును భూతేంద్రి
యాశ్రయవిరహితమై విశుద్ధ
మైన జీవుని విమలాంతరాత్ముఁడనైన
నను నేకముగఁ జూచునరుఁడు మోక్ష
పరమార్గవర్తియై భాసిల్లు. బ్రహ్మాండ
మందున వివిధకర్మానురూప

తే. పద్ధతులఁ జేసి పెక్కు రూపముల నొందు
జీవతతి రచియించు నీ చిత్త మెపుడు
మత్పదాంబుజయుగళంబు మరగియున్న
కతన రాజసగుణమునఁ గలుగ దఘము. 320

* ఓ సరోజసంభవా! సకలజీవులలోనూ అంతర్యామినై ఉన్న నన్ను చక్కగా తెలుసుకొని సేవించు. నీ దోషా లన్నీ తొలగిపోతాయి. పంచభూతాలకూ, పది ఇంద్రియాలకూ అతీతుడైన జీవుడే ఆత్మ. పరిశుద్ధుడైన ఆత్మనూ, పరమాత్ముడనైన నన్నూ ఒకే తీరున దర్శించే మానవుడు మోక్షమార్గంలో నడచే బాటసారియై ప్రకాశిస్తాడు. విశ్వగోళంలో వివిధ కర్మలకూ అనురూపమైన పద్ధతుల్లో ప్రవర్తించే అనేకరూపాలుగల జీవులను నీవు సృష్టించుతున్నప్పటికీ నీ మనస్సు నిత్యం నా పాదపద్మాల మీదనే లగ్నమై ఉన్నందువల్ల నీ లోని రాజసగుణం నీకు పాపాన్ని కలిగించదు.

క. విను మదియుఁగాక ప్రాణుల
కనయము నెఱుఁగంగరాని యనఘుఁడఁ దేజో
ధనుఁడఁ బరేశుఁడ నీ చే
తను గానంబడితి నిదె పితామహ! కంటే. 321

* అది అట్లాఉంచు. ఓ పితామహా! నేను ప్రాణులకు ఏ నాడూ తెలియబడని పురాణపురుషుడను, తేజోనిధిని, పరమేశ్వరుడను. అటువంటి నేనే ఇప్పుడు నీ ముందు సాక్షాత్కరించాను. చూచావు గదా!

వ. మఱియు భూతేంద్రియగుణాత్మ్కుండనియు జగన్మయుండ
ననియు నన్ను నీ చిత్తంబునందుఁ దలంపుము; తామరస
నాళనవివరపథంబువెంటం జని జలంబులలోనం జూడం గోరి
నట్టి మదీయస్వరూపంబు- 322

క. నీ కిప్పుడు గానంబడె
నాకులకును నురగపతి పినాకిలకైనన్
వాకొనఁగం దలపోయను
రాకుండు మదీయరూప రమ్యత్వంబుల్. 323

* నేనే, పంచభూతాలకూ, పది ఇంద్రియాలకూ, త్రిగుణాలకూ ఆత్మననీ, జగత్తు అంతటా వ్యాపించినవాడననీ, నన్ను నీ మనస్సులో భావించు. అప్పుడు కమలనాళం కన్నం వెంటవెళ్ళి నీటిలో నన్ను చూడాలనుకున్న నా స్వరూపం ఇప్పుడు నీకు కన్పించింది. దేవతలూ, ఆదిశేషుడూ చివరకు ఆ పరమ శివుడుకూడా నా స్వరూపంలోని సౌందర్య విశేషాన్ని మాటలలో వర్ణింపలేరు; మనస్సులో ఊహింపలేరుకూడా.

క. కావున మచ్చారిత్ర క
థావిలసితమైన సుమహిత స్తవము జగ
త్పావనము విగతసంశయ
భావుఁడవై బుద్ధి నిలుపు పంకజజన్మా! 324

* నళినసంభవా! నా చరిత్రతోకూడి, నా లీలా విలాసాలైన కథలతో ప్రకాశించే ఈ పరమ పవిత్రస్తోత్రం లోకాన్ని పవిత్రం చేస్తుంది. అందుకని ఏ మాత్రం సంశయం లేకుండా దీనిని నీ బుద్ధిలో స్థిరంగా నిల్పి ఉంచుకో!

క. అగుణుఁడ నై లీలార్థము
జగములఁ గల్పింపఁ దలఁచు చతురుని నన్నున్
సగుణునిఁగా నుతియించితి
దగ సంతసమయ్యె నాకుఁ దామరసభవా! 325

* సరసిజసంభవా! నిర్గుణుడనై, వినోదం కోసం జగత్తులను సృష్టించా లనుకున్న నన్ను సగుణ పరబ్రహ్మనుగా ప్రస్తుతించావు. నాకు ఎంతో సంతోషమైంది.

క. ఈ మంజు స్తవరాజను
నీ మనమునఁ జింతఁ దక్కి నిలుపుము భక్తిన్
ధీమహిత! నీ మనంబునఁ
గామించిన కోర్కు లెల్లఁ గలుగుం జుమ్మీ. 326

* మతిమంతుడా! మనోహరమైన ఈ మహాస్తోత్రాన్ని నిశ్చింతగా నిశ్చల భక్తితో నీ మనస్సులో నిలుపుకో. నీ కోరికలన్నీ నిశ్చయంగా నెరవేరుతాయి.

క. అనుదినమును ద్రిజగత్పా
వన మగు నీ మంగళ స్తవంబుఁ బఠింపన్
వినినను జనులకు నేఁ బొడ
గనఁబడుదు నవాప్తసకల కాముఁడ నగుచున్. 327

* ముల్లోకాలను పవిత్రంచేసే శుభప్రదమైన ఈ స్తుతిని ప్రతిదినం ఎవరు పఠిస్తారో, వింటారో ఆ జనులకు వారి కోర్కె లన్నింటినీ తీర్చు వాడనై నేను దర్శనమిస్తాను.

తే. వనతటాకోపనయనవివాహదేవ
భవన నిర్మాణ భూమ్యాదివివిధ దాన
జపతపోవ్రత యోగయజ్ఞముల ఫలము
మామక స్తవఫలము సమంబు గాదు. 328

* ఉద్యానవనాలు నెలకొల్పటం, చెరువులు త్రవ్వించటం, వివాహ మంటపాలు, ఉపనయనశాలలు, దేవాలయాలు నిర్మించటం, భూదానాలు మొదలైనవి చేయుటం, జపతపాలు, వ్రతాలు యోగాలు, యజ్ఞాలు చేయుటంవల్ల ప్రాప్తించే ఫలాలు నా స్తోత్రఫలానికి ఏ మాత్రం సమానం కావు.

క. జీవావలిఁ గల్పించుచు
జీవావలిలోనఁ దగ వసించుచుఁ బ్రియ వ
స్త్వావలిలోపలఁ బ్రియ వ
స్త్వావలినై యుండు నన్ను ననిశముఁ బ్రీతిన్. 329

క. తలఁపుము మత్ప్రీతికినై
కలిగించితి నిన్ను భువనకారణ! నాలో
పల నడఁగి యేకమై ని
శ్చలగతి వసియించి యున్న జగముల నెల్లన్. 330

* జీవులను సృష్టిస్తూ, ఆ జీవ సమూహంలో అంతర్యామివై వర్తిస్తూ, ప్రియవస్తువుల్లో అత్యంత ప్రియవస్తువునై ఉండే నన్ను నిత్యమూ ప్రీతితో భావించు. ఓ జగత్కారణా! నాసంతోషార్థమే నిన్ను సృష్టించాను. నాలో లీనమై దాగి చలనం లేకుండా ఉండే లోకాలను అన్నింటిని నీవు చక్కగా సృజించు.

తే. తగ నహంకార మూలతత్త్వంబు నొంది
నీవు పుట్టింపు మనుచు రాజీవభవుఁడు
వినఁగ నానతి యిచ్చి య వ్విష్ణుఁ డభవుఁ
డంత నంతర్హితుండయ్యె ననఘచరిత! 331

* అహంకారమే మూలతత్త్వంగా గ్రహించి నీవు సృష్టి చెయ్యి. అని బ్రహ్మను ఆజ్ఞాపించి, అనంతరం భగవంతుడైన విష్ణువు అంతర్హితుడైనాడు.

క. అని చెప్పిన మైత్రేయునిఁ
గనుఁగొని విదురుండు పలికెఁ గడు ముద మొప్పన్
జననుత! నలినదళాక్షుఁడు
సనినం బద్మజుఁడు దేహసంబంధమునన్. 332

క. మానస సంబంధంబును
బూనిన యీసర్గ మెట్లు పుట్టించె? దయాం
భోనిధివై నా కింతయు
మానుగ నెఱిఁగింపవయ్య మహితవిచారా! 333

* ఈ విధంగా చెప్పిన మైత్రేయుణ్ణి చూచి విదురుడు ఎంతో సంతోషంతో ఇట్లా అన్నాడు. జనులందరికీ వందనీయుడవైన మైత్రేయా! విష్ణువు అంతర్ధానమైన అనంతరం బ్రహ్మదేవుడు దేహ సంబంధంతో మానస సంబంధంగల ఈ సృష్టిని ఏ విధంగా చేశాడు? అమోఘమైన ఆలోచనలు కలవాడవు! దయాసముద్రుడవు! ఇదంతా నాకు చక్కగా వివరించి చెప్పు.

వ. అనవుడు నమ్మునివరేణ్యుండు విదురున కిట్లనియెఁ బుండరీకాక్షవరదాన ప్రభావంబునం బంకజాసనుండు శతదివ్య వత్సరంబులు భగవత్పరంబుగాఁ దపంబు గావించి తత్కాలవాయువుచేఁ గంపితంబగు నిజనివాసంబయిన పద్మంబును వాయువును జలంబులను గనుంగొని యాత్మీయ తపశ్శక్తిచేత నభివృద్ధిం బొందిన విద్యాబలంబున వాయువు బంధించి, తోయంబులతోడ నొక్క తోయంబ సమస్తంబునుం గ్రోలి, యంత గగనవ్యాపి యగు జలంబును గనుంగొని. 334

* అని అడుగగా ఆ మునిశ్రేష్ఠుడైన మైత్రేయుడు విదురునితో ఇట్లా అన్నాడు. విష్ణుదేవుడు అనుగ్రహించిన వరముల ప్రభావంవల్ల బ్రహ్మ నూరు దివ్యసంవత్సరాలు భగవంతుణ్ణిగూర్చి తపస్సు చేశాడు. అప్పుడు మహావాయువు వీచింది. ఆ గాలికి తన నివాసమైన పద్మం చలించింది. నీరు చలించింది. అది చూచి బ్రహ్మదేవుడు తన తపశ్శక్తి చేత వృద్ధిపొందిన బ్రహ్మ విద్యాబలంతో వాయువును నిరోధించాడు. ఆ మహాజలాన్నంతా ఒక్క పర్యాయంగా త్రాగాడు. అనంతరం పైకి చూడగా ఆకాశమంతటా నిండివున్న జలం కన్పించింది.

ఉ. వారిజ సంభవుండు బుధవంద్యుఁడు చిత్తమునం దలంచె దై
త్యారిఁ బయోవిహారి సముదంచితహారి నతాఖిలామృతా
హారి రమాసతీహృదయహారి నుదారి విదూరఘూరి సం
సారి భవప్రహారి విలసన్నుత సూరి నఘూరి నయ్యెడన్. 335

* పండితులకు వందనీయుడైన పద్మసంభవుడు తన హృదయంలో రాక్షసులకు శత్రువైనవాడూ, జలాలలో విహరించువాడూ, అందమైన హారాలు ధరించినవాడూ, సమస్త దేవతలచేత నమస్కరింపబడేవాడూ, లక్ష్మీదేవి హృదయాన్ని అపహరించినవాడూ, ఉదారుడైనవాడూ, సంసారదుఃఖాలను దూరంచేసేవాడూ, భవబంధాలనూ త్రెంచివేసేవాడూ, విద్వాంసులు వినుతించేవాడూ, పాపాలను పటాపంచలుగావించేవాడూ అయిన భగవంతుణ్ణి తన మనస్సులో ధ్యానించాడు.

తే. అట్లు దలఁచి సరోజజుం డంబుజమును
గగనతలమునఁ జూచి యా కమలకోశ
లీనమైయున్న లోకవితానములను
నొయ్యఁ బొడగని హరిచే నియుక్తుఁడైన. 336

తే. వానిఁగాఁ దన్నుఁ దలఁచి య వ్వనరుహంబు
లోపలికిఁ బోయి మున్నందులోన నున్న
ముజ్జగంబులఁ జూచి యిమ్ముల సృజించె
మఱి చతుర్దశభువనముల్ మహిమఁ జేసి. 337

* ఇలా ధ్యానించగా, బ్రహ్మదేవునికి ఆకాశంలో ఒక పద్మం కనిపించింది. ఆ తామరరేకులలో దాగివున్న లోకాలన్నీ కన్పించాయి. అప్పుడు బ్రహ్మ తాను శ్రీహరిచే నియమింపబడిన వాడనని భావించాడు. మెల్లగా ఆ తామరపువ్వులోపలికి ప్రవేశించాడు. మున్ముందుగా అందులో ఉన్న మూడు లోకాలనూ ఆలోకించాడు. తర్వాత మహత్తరమైన తన శక్తినంతా వినియోగించి పదునాల్గు భువనాలను చక్కగా సృష్టించాడు.

క. పరఁగ సుధాశన తిర్య
జ్నర వివిధస్థావరాది నానా సృష్టి
స్ఫురణ నజుం డొనరించెం
బరువడి నిష్కామధర్మ ఫలరూపమునన్. 338

* ప్రతిఫలం ఆశించని తన పరమధర్మానికి ఫలస్వరూపంగా దేవతలు, పశుపక్ష్యాదులు, మనుష్యులు, అనేకాలైన స్థావరాలు మొదలైన వాటితో కూడిన సృష్టిని క్రమంగా బ్రహ్మదేవుడు కొనసాగించాడు.

వ. ఇట్లు భువనంబులం బద్మజుండు గల్పించెనని మైత్రేయుండు విదురున కెఱింగించిన. 339

* ఈ విధంగా చతుర్ముఖుడు లోకాలను సృష్టించాడని మైత్రేయుడు విదురునకు చెప్పాడు.

క. విదురుఁడు దురితావనిభృ
ద్భిదురుఁడు మునివరునిఁ జూచి ప్రియము మనమునం
గదురఁగ ని ట్లని పలికె న
తి దురంతం బయిన విష్ణుదేవుని మహిమన్. 340

తే. అమరె భువనంబు లతని కాలాఖ్యతయును
గణుతిసేయు తదీయలక్షణము లర్థి
నాకు నెఱిఁగింపుమయ్య వివేక చరిత!
యనిన మైత్రేయుఁ డ వ్విదురునకు ననియె. 341

* అప్పుడు కొండల్లాంటి పాపాలను ఖండించటంలో వజ్రాయుధం వంటివాడైన విదురుడు హృదయంలో పొంగిపొరలే సంతోషంతో మైత్రేయుణ్ణి చూచి అంతుచిక్కని మహావిష్ణువు మహిమవల్లనే ఈ లోకాలన్నీ విలసిల్లాయిగదా! అటువంటి పరాత్పరుని కాలస్వరూపాన్ని, దాన్ని గణించే విధానాన్ని, దాని లక్షణాలనూ వివేకవంతుడవైన నీవు నాకు విశదీకరించు అని అడిగాడు. అప్పుడు విదురునితో మైత్రేయుడు ఇట్లా అన్నాడు.

సీ. ఆద్యంతశూన్యంబు నవ్యయంబై తగు
తత్త్వ మింతకు నుపాదాన మగుట
గుణవిషయములు గైకొని కాలమును మహ
దాది భూతములు దన్నాశ్రయింప
గాలానురూపంబుఁ గైకొని యీశుండు
దన లీలకై తనుఁ దా సృజించెఁ
గర మొప్ప నఖిలలోకములందుఁ దా నుండుఁ
దనలోన నఖిలంబుఁ దనరుచుండుఁ

తే. గాన విశ్వమ్మునకుఁ గార్యకారణములు
దానః య మ్మహాపురుషుని తనువు వలనఁ
బాసి విశ్వంబు వెలియై ప్రభాస మొందె
మానితాచారః యీ వర్తమాన సృష్టి. 342

* సదాచారసంపన్నుడవైన విదురా! విను. మొదలు తుద లేనిదీ, తరిగిపోనిదీ ఐన తత్త్వమే ఈ సృష్టికంతటికీ ప్రధాన కారణం. అందువల్ల గుణాలూ, ఇంద్రియార్థాలూ, మహత్తూ, పంచభూతాలూ, తన్ను ఆశ్రయించగా, ఈశ్వరుడు కాలానికి అనురూపమైన రూపం ధరించినవాడై వినోదానికై తనను తాను సృష్టించుకొన్నాడు. ఈ విధంగా సృష్టించిన సమస్తలోకాలందూ ఈశ్వరు డుంటాడు. ఆ యీశ్వరునియందు సమస్త లోకాలూ ప్రకాశిస్తూ ఉంటాయి. కాబట్టి విశ్వానికి కార్యమూ కారణమూ రెండూ తానే. ఆ పరమపురుషుని శరీరం నుండి విడివడి ఈ విశ్వం విరాజిల్లు తున్నది. ఈ విధంగా వర్తమాన సృష్టి ఏర్పడింది.

క. తెఱఁగొప్ప నఖిలవిశ్వముఁ
బురుషోత్తము మాయచేతఁ బుట్టుం బెరుఁగున్
విరతిం బొందుచునుండుం
గర మర్థిన్ భూతభావికాలములందున్. 343

* పురుషోత్తముని మాయవల్ల, ఈ జగత్తు అంతా ఒక క్రమంలో పుట్టి పెరిగి నశిస్తూ ఉంటుంది. ఇట్లాగే పూర్వకాలంలో జరిగింది. భవిష్యత్కాలంలోగూడ ఇదే విధంగా జరుగుతుంది.

వ. అట్టి సర్గంబు నవవిధం; బందుఁ బ్రాకృతవైకృతంబులు గాల ద్రవ్య గుణంబులను త్రివిధంబగు భేదంబుచేఁ బ్రతిసంక్రమంబు లగుచు నుండు నందు మహత్తత్త్వంబు ప్రథమసర్గం; బది నారాయణసకాశంబున గుణవైషమ్యంబునం బొందు ద్రవ్యజ్ఞానక్రియాత్మకంబైన యహంకారతత్త్వంబు ద్వితీయసర్గంబు; శబ్దస్పర్శరూప రసగంధంబు లను పంచతన్మాత్ర ద్రవ్య శక్తియుక్తంబైన పృథివ్యాది భూతసర్గంబు మూఁడవది యైయుండు; జ్ఞానేంద్రియంబులైన త్వక్చక్షు శ్శ్రోత్ర జిహ్వాఘ్రాణంబులుఁ గర్మేంద్రియంబులైన వాక్పాణిపాదపాయూపస్థలు నను దశవిధేంద్రియ జననంబు చతుర్థ సర్గంబు; సాత్త్వికాహంకారజనితంబైన సుమనోగణసర్గం బైదవసర్గంబై యొప్పు; నది మనోమయంబై యుండు; జీవలోకంబునకు నబుద్ధికృతంబులైన యావరణ విక్షేపంబులం జేయు తామససర్గం బాఱవదై యుండు; నియ్యాఱు నీశ్వరునకు లీలార్థంబు లయిన ప్రాకృతసర్గంబు లయ్యె; నింక వైకృతసర్గంబు నేడవది మొదలుగాఁ గలుగు నవి వినిపింతు వినుము; పుష్పోత్పత్తిరహితంబులై ఫలించెడు నశ్వత్థోదుంబర పనస న్యగ్రోధాదులైన వనస్పతులును, బుష్పితంబులై ఫలపాకాంతంబులైన వ్రీహి యవ ముద్గా ద్యోషధులును, నారోహణా నపేక్షంబులైన మాలతీమల్లికాది లతలును, ద్వక్సారంబులైన వేణ్వాదులును, గఠినీభూతమూలంబులును, శిఖావిస్తృతంబులున్నగు లతావిశేషరూపంబులైన వీరుధంబులును, బుష్పవంతంబులయి ఫల ప్రాప్తంబులగు చూతాది ద్రుమంబులును, నవ్యక్త చైతన్యంబులు నూర్ధ్వస్రోతంబులు నంతస్స్పర్శంబులుఁ దమఃప్రాయంబులునై స్థావరంబు లయిన యీ యాఱు నేడవ సర్గంబయ్యె; నెనిమిదవ సర్గంబు తిర్యక్సర్గంబు. ఇది యిరువది యెనిమిది భేదంబులు గలిగి శ్వస్తనాది జ్ఞానశూన్యంబులయి యాహారాది జ్ఞానమాత్ర నిష్ఠంబులయి, ఘ్రాణంబువలన నెఱుంగం దగినవాని నెఱుం

గుచు హృదయంబున దీర్ఘానుసంధాన రహితంబులై వర్తించు ద్విశఫంబులు గల వృషభ మహిషాజ కృష్ణ సూకర రోష్ట్రి గవయ రురు మేష ముఖర నవకంబును, నేకశఫంబు గల ఖరాశ్వాశ్వతర గౌర శరభ చమర్యాదిషట్కంబును, బంచ నఖంబులుగల శునక సృగాల వృక వ్యాఘ్ర మార్జార శశ శల్యక సింహ కపి గజ కూర్మ గోధాముఖ భూచర ద్వాదశకంబును, మకరాది జలచరంబులును, గంక గృధ్ర బక శ్యేన భాస భల్లూక బర్హి హంస సారస చక్రవాక కాకోలూకాది ఖేచరంబులును నయ్యె. నర్వాక్స్రోతంబై యేకవిధం బగు మానుష సర్గంబు రజోగుణప్రేరితంబై కర్మకరణదక్షంబై దుఃఖంబందును సుఖంబు గోరు: నిది తొమ్మిదవ సర్గం బనందగు: నీ త్రివిధసర్గంబులు వైకృతసర్గంబు లనంబడు; నింక దేవసర్గంబు విను మదియు నెనిమిది తెఱంగులు గలిగి యుండు: నందు విబుధ పితృసురాదులు మూఁడును, గంధర్వాప్సరస లొకటియు, యక్షరక్షస్సు లేకంబును, భూతప్రేతపిశాచంబు లొకటియు, సిద్ధ చారణ విద్యాధరు లేకంబును, గిన్నర కింపురుషు లొకటియు నుంగా దేవసర్గం బయ్యె: నిట్టి బ్రహ్మ నిర్మితంబులైన దశవిధ సర్గంబులు నెఱింగించితి; నింకమనువులం దదంతరంబుల నెఱింగిం చెదఁ; గల్పాదులయందు నీ ప్రకారంబున స్వయంభూతుండును, నమోఘ సంకల్పుండును నగు నప్పుండరీకాక్షుండు రజోగుణ యుక్తుండై స్రష్ట యగుచు స్వస్వరూపంబయిన విశ్వంబు నాత్మీయ సామర్థ్యంబునం గల్పించె: నయ్యీశ్వరుని మాయావ్యాపారం బులచే నీ సృష్టియందు నద్యావర్తంబులంబడి భ్రమించుచున్న మహీరుహంబులంబోలె బూర్వాపరభావంబు లెఱుంగంబడకుండు: నీ కల్పంబునం దుండు దేవాసురాదులు ప్రతి మన్వంతరంబు నందును నిట్ల నామ రూపంబులచే నిర్దేశింపంబడుదురు: మఱియు నిం దొక్కవిశేషం బెఱింగించెదఁ గౌమారసర్గం బనునది దేవ సర్గాంతర్భూతంబయ్యును బ్రాకృత వైకృతోభయాత్మకంబై

దేవత్వ మనుష్యత్వ రూపంబైన సనత్కుమారాది సర్గం బనంబడెః నమోఘసంకల్పుండైన పుండరీకాక్షుండు దనఁదాన యిట్లు విశ్వ భేదంబును గల్పించె నని మైత్రేయుండు విదురునకుం జెప్పి కాల లక్షణం బెఱింగించువాఁడై యిట్లనియె. 344

* అటువంటి సృష్టి తొమ్మిది విధాలు. వానిలో ప్రాకృతాలు వైకృతాలు అనేవి కాల, ద్రవ్య గుణాలు అనే మూడు విధాలైన భేదాలచే పరస్పరం సంకర మవుతూ ఉంటాయి. అందులో మహత్తత్త్వం మొదటి సృష్టి. అది నారాయణుని సమీపంలో గుణభేదాన్ని పొందుతుంది. ద్రవ్య జ్ఞాన క్రియాత్మకమైన అహంకారతత్త్వం రెండవ సృష్టి. శబ్ద స్పర్శ రూప రస గంధాలు అనే పంచతన్మాత్రల ద్రవ్యశక్తితో కూడిన పృథివి మొదలైన పంచభూతాల సృష్టి మూడవది. జ్ఞానేంద్రియాలైన చర్మము, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు, కర్మేంద్రియాలైన వాక్కు, చేతులు, కాళ్లు, పాయువు, ఉపస్థ అను పది ఇంద్రియాల పుట్టుక నాలుగవ సృష్టి. సాత్త్వికాహంకారంవల్ల పుట్టిన దేవతాగణాల సృష్టి ఐదవ సృష్టి. అది కేవలం మనోమయమై ఉంటుంది. ప్రాణిసమూహానికి అజ్ఞానకృతాలైన ఆవరణ విక్షేపాలు కలిగించే తామస సృష్టి ఆరవది. ఈ ఆరున్నూ భగవంతుని లీలా విలాసా లయిన ప్రాకృత సృష్టులు.

ఇక ఏడవది మొదలుగా వైకృత సృష్టులను వినిపిస్తాను, విను. పూలు పూయకుండానే ఫలించే రావి, మేడి, పనస, మఱ్ఱి మొదలైన వనస్పతులునూ, పూచి ఫలించిన వెంటనే నశించిపోయే వడ్లూ, యవలూ, పెసలూ మొదలైన ఓషధులునూ, పైకి ఎగబ్రాకటానికి అవకాశంలేని మాలతి, మల్లె మొదలైన తీగలూ, గట్టి బెరడు కలిగిన వెదుళ్లు మొదలైనవీ, నేలలో దృఢమైన వేళ్లు గలిగి నేలపై బాగా విస్తరించే లతా విశేషాలైన దుబ్బులూ, పొదలూ, పుష్పించి ఫలాల నిచ్చే మామిడి మొదలైన వృక్షాలునూ, అవ్యక్తమైన చైతన్యంతో పైకి పెల్లుబుకుతూ తమోమయాలై లోపల మాత్రమే స్పర్శజ్ఞానం కలవై కదలిపోలేని ఈ ఆరూ ఏడవ సృష్టి.

ఇక ఎనిమిదవ సృష్టిలో ఇరవై ఎనిమిది భేదాలు ఉన్నాయి. రేపు అనే జ్ఞానం లేనివై, ఆహారం మొదలైన వాటియందు మాత్రమే

ఆసక్తి కలవై, వాసనచూచి తెలుసుకోదగిన వాటిని తెలుసుకొంటూ, మనస్సులో పెద్దగా ఆలోచన చేయలేనివై, చీలిన గిట్టలు కలవైన ఎద్దు, ఎనుము, మేక, జింక, పంది, ఒంటె, గురుపోతు, నల్లచారల దుప్పి, పొట్టేలు ఈ తొమ్మిదిన్నీ, చీలని గిట్టలు గలవైన గాడిద, గుఱ్ఱము, కంచర గాడిద, గౌర మృగం, శరభ మృగం, చమరీ మృగం ఈ ఆరున్నూ, ఐదు గోళ్లు గలవైన కుక్క, నక్క, తోడేలు, పులి, పిల్లి, కుందేలు ఏదు పంది, సింహం, కోతి, ఏనుగు, తాబేలు, ఉడుము ఈ పండ్రెండున్నూ, (ఇవన్నీ భూచరాలు) మొసలి మొదలైన జలచరాలున్నూ, రాబందు, గ్రద్ద, కొంగ, డేగ, తెల్ల పిట్ట, గబ్బిలం, నెమలి, హంస, బెగ్గురు పక్షి, జక్కవ పిట్ట, కాకి, గుడ్లగూబ మొదలైన ఆకాశాన సంచరించే తిర్యక్కుల సృష్టి ఎనిమిదవ సృష్టి.

ఇక తొమ్మిదవది మానవ సృష్టి. ఇది రజోగుణంతో పురికొల్పబడి కర్మలు చేయటంలో నేర్పుగల్గి, దుఃఖంలోకూడా సుఖాన్ని కోరేది. ఈ మూడు విధాలైన సృష్టులు వైకృత సృష్టులు.

ఇక దేవసర్గాన్ని గూర్చి విను. అదికూడా ఎనిమిది విధాలు. అందులో విబుధులు, పితృదేవతలు, సురాదులు మూడు భేదాలూ, గంధర్వులూ, అప్సరసలూ ఒకటీ, యక్షులూ, రాక్షసులూ ఒకటీ, భూత ప్రేత పిశాచాలు ఒకటీ, సిద్ధచారణ విద్యాధరులు ఒకటీ, కిన్నర కింపురుషులు ఒకటీ — ఈ ఎనిమిది కలిసి దేవసర్గం అయింది. ఈ విధంగా బ్రహ్మ దేవుడు నిర్మించిన పది విధాలైన సృష్టులనూ నీకు తెల్పాను.

ఇక మనువులనూ మన్వంతరాలనూ తెల్పుతాను. కల్పారంభాలలో ఇదే విధంగా తన్ను తాను సృజించుకొనే వాడున్నూ, మొక్కవోని తలంపు కలవాడున్నూ, అయిన మహావిష్ణువు రజోగుణంతో కూడినవాడై సృష్టి కర్తయై తన స్వరూపమే అయిన విశ్వాన్ని తన సామర్థ్యంవల్ల కల్పించాడు. ఆ ఈశ్వరుని మాయా విశేషంవల్ల ఈ సృష్టిలో నదులలోని నీటి సుడులలో పడి తిరిగే చెట్లలాగే ముందు వెనుకలు తెలియకుండా ఉంటాయి. ఈ కల్పంలో ఉన్న దేవతలూ, రాక్షసులూ మొదలైనవారు ఇలాగే ప్రతి మన్వంతరంలోనూ ఆ యా నామ రూపాలతో వ్యవహరింపబడతారు.

మళ్లీ ఇందులో ఒక విశేషముంది. అదేమంటే, కౌమారసర్గం అనేది దేవసర్గంలో ఒక భాగమే అయినా ప్రాకృత వైకృతముల రెంటి స్వభావము కలది. అందులో దైవత్వమూ మనుష్యత్వమూ కలిసి ఉంటాయి. ఇదే సనత్కుమారాది సర్గం. సఫల సంకల్పుడైన పురుషోత్తముడు తనకు తానై ఈ విధంగా వివిధ భేదాలతోకూడిన విశ్వాన్ని కల్పించాడు.

అని మైత్రేయుడు విదురునితో పలికి కాలస్వభావం వివరించాలనుకున్నవాడై ఈ విధంగా అన్నాడు.

సీ. భువిఁ దన కార్యాంశమునకు నంతము నన్య
 వస్తుయోగంబు నేవలన లేక
ఘటపటాదిక జగత్కార్యంబునకు నిజ
 సమవాయకారణత్వమునఁ బరఁగి
జాల సూర్య మరీచి సంగత గగనస్థ
 మగు త్రసరేణు షడంశ మరయఁ
బరమాణు వయ్యెఁ; దత్పరమాణువం దర్క
 గతి యెంత తడవు దత్కాలమగును

తే. సూక్ష్మకాలంబు; విను మది సూర్యమండ
లంబు ద్వాదశరాశ్యాత్మకం బనంగఁ
గలుగు జగమున నొక యేఁడు గడచి చనినఁ
గాల మెంతగు నది మహత్కాల మనఘ! 345

* భగవంతుని సృష్టి కార్యానికి అంతు అనేది లేదు. దానికి వేరే వస్తువులతో సంయోగంకూడా అవసరం లేదు. జగత్తులో కుండలు - బట్టలు తయారయ్యే తీరు ఒకటి - సృష్టికార్యం మరియొకటి. [కుండ ఈ లోకంలో తయారు కావాలంటే (1) మట్టి (ఉపాదాన కారణం) (2) మట్టిని కుండగా రూపొందించటం (సమవాయి కారణం) (3) కుండను చేసేవాడు (నిమిత్త కారణం) అవసరం. అట్లే పట నిర్మాణం. ప్రత్తి - ఉపాదానం; దారాలు, నేత - సమవాయి; వస్త్ర నిర్మాత - నిమిత్తం.

లోకంలో ఏ కార్యానికైనా పై మూడూ అవసరం) భగవత్ సృష్టిలో భగవంతుడే సమవాయ కారణం కూడా అవుతాడు.

[ఇక-సృష్టిని ముక్కలు ముక్కలుగా ప్రస్తరిస్తే ఏర్పడే సూక్ష్మాతి సూక్ష్మాంశానికే "పరమాణువు" అని పేరు] సూర్యుని కాంతి కిటికీలోనుండి ప్రసరించేటప్పుడు మన కంటికి కనిపించే చిన్న చిన్న రేణువులలో ఆరవభాగానికి "పరమాణువు" అని పేరు. ఆ పరమాణువుపై ఒక ప్రక్కనుండి మరియొక ప్రక్కకు సూర్యకిరణం పయనించే కాలానికి "సూక్ష్మకాలం" అని పేరు. [సూక్ష్మ కాలాన్ని కేవలం ఊహించుకోవలసిందే. అది మిక్కిలి అత్యల్పమైన కాలపరిమాణం] సూర్యుడు-మేషం మొదలైన పండ్రెండు రాసులలో పయనించే కాల పరిమాణం పేరు మహత్కాలం [దినికే సంవత్సరం అని పేరు. మహత్కాలానికి-సూక్ష్మకాలానికీ మధ్యనున్న వివిధ కాల పరిమాణాలు మునుముందు వివరింపబడుతాయి.]

వ. అందుఁ బరమాణుద్వయం బొక్క "యణు" వగుః నణు త్రితయం బొక్క "త్రసరేణు" వగుః నవి మూఁడు గూడ నొక్క "త్రుటి" యగుః నాత్రుటిశతం బొక్క "వేధ" యనంబరఁగుః నట్టి వేధలు మూఁడు గూడ నొక్క "లవం" బనదగుః నవి మూఁడైన నొక్క "నిమేషం" బనం జనుః నిమేషత్రయం బొక్క "క్షణం" బగుః తత్క్షణ పంచకం బొక్క "కాష్ఠ" యనం దగుః నవి పదియైన నొక్క "లఘు" వన నొప్పుః నట్టి లఘుపంచదశకం బొక్క "నాడి" యనం బరఁగుః నట్టి నాడికాద్వయం బొక్క "ముహూర్తం" బయ్యెః నట్టి నాడిక లాఱైన-నేడైన-మనుష్యులకు నొక "ప్రహరం" బగుః నదియ "యామం" బనం జనుః దివస పరిమాణ విజ్ఞేయంబగు నాడికోన్మాన లక్షణం బెఱింగింతు వినుముః షట్పల తామ్రంబునం బాత్రంబు రచియించి చతుర్మాష సువర్ణంబునం జతురంగుళాయామశలాకంబుఁ గల్పించి దానం దత్పాత్ర మూలంబున ఛిద్రంబుఁ గల్పించి తచ్ఛిద్రంబునం బ్రస్థమాత్ర తోయంబు పరిపూర్ణంబు నొందు నంతకాలం బొక్క "నాడిక" యగుః

యామంబులు నాలుగు సన నొక్క "పగ" లగుః రాత్రియు నిప్ప
గిది జరగుః నట్టి యహర్నిశంబులు గూడ మర్త్యుల కొక "దివసం"
బగుః నవి పదునేనైన నొక్క "పక్షం" బగుః శుక్ల కృష్ణ నామం
బులం బరఁగిన య పక్షంబులు రెండుగూడ నొక్క 'మాసం' బగుః
నది పితృదేవతలకు నొక్క "దివసం" బగుః నట్టి మాసంబులు
రెండైన నొక్క "ఋతు" వగుః షణ్మాసంబు లరిగిన నొక్క
'యయనం' బగుః దక్షిణోత్తర నామంబులం బరఁగినట్టి యయనం
బులు రెండు గూడి ద్వాదశ మాసంబులైన నొక్క "సంవత్సరం"
బగుః నట్టి సంవత్సరశతంబు నరులకుం బరమాయు వై యుండుఁః
గాలాత్ముండును నీశ్వరుండునునైన సూర్యుండు గ్రహ నక్షత్ర
తారాచక్రస్థుండై పరమాణ్వాది సంవత్సరాంతంబైన కాలంబునం
జేసి ద్వాదశరాశ్యాత్మకంబైన జగంబున సౌర బార్హస్పత్య సావన
చాంద్ర నాక్షత్ర మాన భేదంబులం గానంబడు చున్నవాఁడై సం
వత్సర పరీవత్స రేడావత్స రానువత్సర వత్సర నామంబుల
సృజ్యంబైన బీజాంకురంబులశక్తిం గాలరూపంబైన స్వశక్తిచేత
నభిముఖంబుగాఁ జేయుచుఁ బురుషులకు నాయురాది వ్యయం
బులం జేసి విషయాసక్తి నివర్తింపం జేయుచుం గోరికలు గల
వారికి యజ్ఞ ముఖంబులం జేసి గుణమయంబులైన స్వర్గాది
ఫలంబుల విస్తరింపంజేయుచు, గగనంబునఁ బరువువెట్టు. వత్సర
పంచక ప్రవర్తకుండగు మార్తాండునకుం బూజ గావింపు మని
మైత్రేయుండు వలికిన విదురుం డిట్లనియె. 346

* రెండు పరమాణువులు ఒక "అణువు". మూడు అణువులు ఒక "త్రసరేణువు". మూడు త్రసరేణువులు ఒక "త్రుటి". నూరు త్రుటులు "వేధ". మూడు వేధలు ఒక "లవం". మూడు లవాలు ఒక "నిమేషం". మూడు నిమేషాలు ఒక్క "క్షణం". ఐదు క్షణాలు ఒక "కాష్ఠ". పది కాష్ఠలు ఒక "లఘువు". పదునైదు లఘువులు ఒక "నాడి". రెండు నాడులు ఒక ముహూర్తం. అట్టి నాడులు ఆరు కాని

ఏడు కానీ అయినచో మనుష్యునకు ఒక "ప్రహరం" అవుతుంది. దానినే "యామ"మనీ లేక "జాము" అనీ అంటారు.

దిన పరిమాణాన్ని తెలిపే నాడిని కొలిచే విధానం చెబుతాను విను. ఆరు పలాల రాగితో పాత్ర సిద్ధంచేసి, నాల్గు మినుపగింజల బరువు గల బంగారుతో నాల్గు అంగుళాల పొడవైన కమ్మీ తయారుచేసి, దానితో ఆ పాత్ర క్రింద రంధ్రం చేస్తే, ఆ రంధ్రంగుండా తూమెడు నీరు పూర్తిగా క్రిందకు కారడానికి ఎంత కాలం పడుతుందో అంత కాలాన్ని ఒక "నాడి" అంటారు.

నాలుగు జాములు ఒక "పగ"లవుతుంది. అదే విధంగా నాలుగు జాములు ఒక "రాత్రి" అవుతుంది. పగలు రాత్రి కలిస్తే మానవులకు ఒక "దినం". పదునైదు దినాలు ఒక "పక్షం". శుక్ల పక్షం, కృష్ణ పక్షం అని పక్షాలు రెండు. ఈ రెండు పక్షాలూ కూడి ఒక "నెల". అది పితృదేవతలకు ఒక "దినం".

రెండు నెలలు ఒక "ఋతువు". ఆరు నెలలు ఒక "అయనం". దక్షిణాయనం, ఉత్తరాయణం అని అయనాలు రెండు. ఈ రెండూ కలసిన పండ్రెండు నెలలు ఒక "సంవత్సరం". ఈ సంవత్సరం దేవతలకు ఒక్క దినం అవుతుంది. నూరు సంవత్సరాలు మానవులకు పరమాయువు.

కాలమే ఆత్మగాగల సూర్యభగవానుడు గ్రహాలతో నక్షత్రాలతో కూడిన తారాచక్రంలో ఉన్నవాడై పరమాణువు మొదలుకొని సంవత్సర పర్యంతమైన కాలంలో పండ్రెండు రాసులను చుట్టివస్తాడు. ఈ విధమైన సూర్యగమనంవల్ల సౌరమానము, చాంద్రమానము, నక్షత్రమానము అనే భేదాలతో సంవత్సరకాలం ఏర్పడుతున్నది. ఇది సంవత్సరం, పరివత్సరం ఇడావత్సరం, అనువత్సరం, వత్సరం అనే భేదాలు కలిగి ఉంటుంది. ఈ ఐదు విధాలయిన వత్సరాలను ప్రవర్తింపచేసే సూర్యుడు విత్తనాలనుండి అంకురాలు మొలకెత్తించినట్లు కాలరూపమైన తన శక్తితో జీవసృష్టిని అనుకూలం చేసుకుంటూ ఆయుస్సు మొదలైన వానిని హరిస్తూ, మానవుల విషయాసక్తిని విస్తరింపచేస్తూ; కోరికలు కలవారికి యజ్ఞాలద్వారా స్వర్గ ఫలాన్ని సమకూరుస్తూ, ఆకాశంలో పరుగులు తీస్తుంటాడు.

పైన చెప్పిన అయిదు విధాలైన వత్సరాలనూ ప్రవర్తింప చేసే సూర్యభగవానుణ్ణి పూజించు అని మైత్రేయుడు పలుకగా విదురుడు ఈ విధంగా అన్నాడు.

క. నర పితృ సుర పరమాయుః
పరిమాణము లెఱుఁగ నాకుఁ బలికితివి. మునీ
శ్వర! యెఱింగింపు త్రిలోకో
పరిలోక విలోక నైకపరు లగు వారిన్. 347

* ఓ మునీశ్వరా! నరులు - పితృదేవతలు - దేవతలు వీరి పరమాయువుల పరిమాణాలను తెల్పావు. ముల్లోకాలూ, పై లోకాలూ దర్శించే వారి విశేషాలు వివరించు.

ఉ. పూనినయోగసిద్ధి దగఁ బొందిన నేత్రయుగంబునన్ బహిర్
జ్ఞానము గల్గి యుండి భువనంబులఁ జూచుచు నుండువారికి
న్మానుగఁ గల్గు కాలగతి నా కెఱిఁగింపు మునీంద్ర! నావుడు
న్మానయశాలి యవ్విదురు నాదర మొప్పఁగఁ జూచి యిట్లనున్. 348

* మునీంద్రా! దృఢమైన యోగసిద్ధివల్ల ప్రాప్తించిన నేత్రాలతో బాహ్యజ్ఞానం కలిగి లోకాలను ఆలోకించే వారికి కలిగే కాలపరిమాణం ఎటువంటిదో నాకు తెల్పు అనగా మహనీయుడైన మైత్రేయుడు విదురుని ఆదరపూర్వకంగా వీక్షించి ఈ విధంగా అన్నాడు.

సీ. జననుత! కృతయుగసంఖ్య నాలుగువేల
దివ్యవర్షములు! దదీయ సంధ్య
లెనిమిది నూఱేండ్లు; విను త్రేత వత్సర
త్రిసహస్రము లగుఁ దదీయ సంధ్య
లాఱునూఱేఁడులు నగు! ద్వాపరము రెండు
వేల వత్సరముల వెలయు సంధ్య
లోలి నన్నూఱేఁడు! లొగిఁ గలియుగము స
హస్ర వర్షములు సంధ్యాంశ మరయ

తే. రెండు నూఱేఁడులును నిల్చి యుండుఁ జువ్వె?
యనఘ! సంధ్యాంశమధ్యంబునందు ధర్మ
మతిశయించును; సంధ్యాంశమందు ధర్మ
మల్పమై కానఁబడుచుండు ననఘ చరిత! 349

* జనుల అభిమానం అందుకున్న పవిత్ర చరితా! విదురా! విను. కృతయుగం నాలుగువేల దివ్యసంవత్సరాలు ప్రమాణం కలది. దాని సంధ్యాకాలం ఎనిమిదివందల ఏండ్లు. ఒక యుగానికీ మరొక యుగానికీ మధ్యకాలాన్ని "సంధ్య" అంటారు. త్రేతాయుగ ప్రమాణం మూడు వేల దివ్యసంవత్సరాలు. సంధ్యాకాలం ఆరు వందల ఏండ్లు. ద్వాపర యుగ ప్రమాణం రెండువేల దివ్యసంవత్సరాలు. సంధ్యాకాలం నాలుగు వందల సంవత్సరాలు. కలియుగ ప్రమాణం వెయ్యి దివ్య సంవత్సరాలు. సంధ్యాకాలం రెండు వందల సంవత్సరాలు. ఈ సంధ్యాంశాల మధ్య కాలంలో ధర్మం అధికంగా ఉంటుంది. సంధ్యాంశంలో ధర్మం అల్పమై ఉంటుంది.

వ. మఱియు ధర్మదేవత కృతయుగంబున నాలుగు పాదంబు
లును, త్రేతయందు మూఁడుపాదంబులును, ద్వాపరంబునం
బాదద్వయంబును, గలియుగంబున నేకపాదంబును, గలిగి
సంచరించు నట్లగుటం జేసి. 350

* ధర్మదేవత కృతయుగంలో నాల్గుపాదాలతోనూ, త్రేతాయుగంలో మూడు పాదాలతోనూ, ద్వాపరయుగంలో రెండు పాదాలతోనూ, కలియుగంలో ఒక్క పాదంతోనూ నడుస్తూ ఉంటుంది.

క. పాదవిభేదంబున మ
ర్యాదలును దఱుఁగు. నధర్మ మా కొలఁదినె యు
త్పాదిల్లి వృద్ధిఁ బొందు ధ
రాదివిజులు పాపబుద్ధిరతు లగుదు రిలన్. 351

* ఈ పాదాల వ్యత్యాసంవల్ల ప్రజలు అదుపుతప్పి నడుస్తారు. అధర్మం ఆవిర్భవించి అభివృద్ధి పొందుతుంది. బ్రాహ్మణులు విపరీత బుద్ధులై అపమార్గాలలో అడుగు పెడతారు.

సీ. భూర్భువస్స్వర్లోకములకంటెఁ బొడువునఁ
గడునొప్పు సత్యలోకంబునందు
నుండు బ్రహ్మకుఁ జతుర్యుగసహస్రము లేఁగ
దివ మొక్కటి యగు రాత్రియును నిట్ల
చన ధాత నిద్రవో జగము లడంగు, మే
ల్కని చూడ మరల లోకములు పుట్టుఁ;
దద్దినమ్మునఁ జతుర్దశ మను లగుదు; రం
దొక్కొక్క మనువున కొనర దివ్య

తే. యుగము లోలిని డెబ్బదియొక్క మాఱు
సనిన మనుకాల మయ్యె; న మ్మను కులంబు
సురలు మునులును సప్తర్షు లరయ భగవ
దంశమునఁ బుట్టి పాలింతు రఖిలజగము. 352

భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం కంటె పైన సత్యలోకం ఒకటుంది. అందుండే బ్రహ్మకు యుగ చతుష్టయాలు వేయి గడిస్తే ఒక్క దినం అవుతుంది. అట్లే రాత్రికూడా. బ్రహ్మ నిద్రపోతే లోకాలకు ప్రళయం వస్తుంది. మేల్కొని చూస్తే మళ్లీ లోకాలు ఆవిర్భవిస్తాయి. బ్రహ్మదేవుని ఆ ఒక్క దినంలో పద్నాలుగురు మనువులు ఉద్భవిస్తారు. వారిలో ఒక్కొక్క మనువుకాలం డెబ్బై ఒక్క దివ్యయుగాలు. దీనినే "మన్వంతరం" అంటారు. దేవతలు, మునులు, సప్తర్షులు, భగవంతుని అంశంతో మనువులై పుట్టి లోకాలను పాలిస్తారు.

క. హరి పితృ సుపర్వ తిర్య
ఙ్నర రూపములన్ జనించి నయమున మన్వం
తరముల నిజసత్త్వంబునఁ
బరిపాలించును జగంబుఁ బౌరుష మొప్పన్. 353

ఈ మన్వంతరాలలో శ్రీహరి పితృ, దేవ, పశు, పక్షి, మానవ రూపాల్లో ఉద్భవించినవాడై ఆత్మశక్తితో పౌరుష ప్రతాపాలతో విశ్వాన్ని పరిపాలిస్తాడు.

క. క్రమమునఁ ద్రైవర్గిక స
ర్గము సెప్పంబడె. సరోజగర్భుఁడు దివసాం
తమునఁ దమఃపిహిత పరా
క్రముఁడై శయనించు నిద్రఁ గైకొని యంతన్. 354

* క్రమంగా మూడు వర్గాల సృష్టి విశేషాలనూ చెప్పాను. బ్రహ్మ పగలు పూర్తి కాగానే రాత్రి రాగానే నిద్ర పోతాడు. ఆయన శక్తి సామర్థ్యాలు అంధకారంతో ఆవరింపబడతాయి.

సీ. ఆ రాత్రి భువనత్రయము దమఃపిహితమై
భానుచంద్రులతో విలీనమైన
సర్వాత్ముఁడగు హరి శక్తిరూపంబయి
కడఁగి వెలుంగు సంకర్షణాగ్ని
భువనత్రయంబును దవిలి దహింప న
య్యనలకీలలఁ బొడమిన మహోష్మ
మలమినఁ గమలి మహర్లోకవాసులు
జనలోకమునకును జనుదు రపుడు

తే. విలయ సమయ సముత్కట విపుల చండ
వాత ధూతోర్మిజాల దుర్వార వార్ధి
భువనములు ముంచు నమ్మూఁడు భువనములను
దత్పయోరాశి మీఁదఁ బద్మావిభుండు. 355

* ఆ రాత్రి మూడులోకాలూ సూర్య చంద్రులతోపాటు కటిక చీకటితో కప్పబడి ఉంటాయి. సర్వాత్ముడైన విష్ణుదేవుని శక్తిరూపమైన సంకర్షణాగ్ని విజృంభిస్తుంది. ఆ అగ్ని జ్వాలలు ముల్లోకాలను దహించివేస్తాయి. తీక్షమైన ఆ మంటల వేడికి తట్టుకోలేక తపించి మహర్లోకవాసులు జనలోకానికి వెళ్ళుతారు. అప్పుడు ఆ ప్రళయకాలంలో భయంకరంగా, ప్రచండ వాయువులు వీస్తాయి. ఆ వాయువేగానికి ఉత్తుంగ తరంగాలతో ఉప్పొంగిన మహాసముద్ర జలాలు మూడు జగాలనూ

ముంచివేస్తాయి. ఆ మహాసముద్ర మధ్యంలో శ్రీమన్నారాయణుడు శయనించి వుంటాడు.

ఉ. చారు పటీర హీర ఘనసార తుషార మరాళ చంద్రికా
పూర మృణాళ హార పరిపూర్ణసుధాకర కాశ మల్లికా
సార నిభాంగ శోభిత భుజంగమ తల్పమునందు యోగ ని
ద్రారతిఁ జెంది యుండు జఠరస్థితభూర్భువరాదిలోకుఁడై. 356

* అందమైన మంచి గంధంలాగా. వజ్రంలాగా, కర్పూరంలాగా హిమపూరంలాగా, రాయంచలాగా, వెన్నెల వెల్లువలాగా, మృణాలవల్లరిలాగా, ముత్యాలహారంలాగా, పున్నమ చందమామలాగా, రెల్లుపూవులాగా, మల్లె మొగ్గలాగా తెల్లని కాంతులు వెల్లివిరిసే శేషశయ్యమీద యోగ నిద్రాముద్రితుడై చల్లగా శయనించివున్న ఆ నల్లనయ్య ఉదరంలో ఎల్లలోకాలూ విలసిల్లుతుంటాయి.

క. జనలోక నివాసకు ల
ర్థిని వినుతింపంగ నతుల దివ్యప్రభచేఁ
దనరుచు మీలిత నిజ లో
చనుఁడై వసియించు నతఁడు సముచితలీలన్. 357

* జనలోక నివాసులైన పుణ్యాత్ములు ఎన్నో విధాల సన్నుతులు చేస్తుండగా సాటిలేని మేటి వెలుగులు వెదజల్లుతూ పన్నగరాజ తల్పం మీద కన్నులుమోడ్చి స్వామి చక్కగా శయనించి వుంటాడు.

వ. ఇవ్విధంబున. 358

సీ. కైకొని బహువిధ కాలగ త్యుపలక్షి
తములై యహోరాత్ర తతులు జరుగ
శతవత్సరంబులు జనులకుఁ బరమాయు
వైనరీతిని బంకజాసనునకుఁ

బరమాయు వగు శతాబ్దంబుః అందుల సగ
మరిగిన నదియ పరార్థ మంద్రుః
గాన పూర్వార్థంబు గడచుటఁ జేసి ద్వి
తీయ పరార్థంబు దీనిపేరుః

తే. గడఁగి పూర్వపరార్ధాదికాలమందు
బ్రహ్మకల్పాఖ్య నెంతయు బరగుఁః నందు
బ్రహ్మ యుదయించుటం జేసి బ్రహ్మకల్ప
మనియు శబ్దాత్మక బ్రహ్మ మనియు నెగడు. 359

* ఈ విధంగా అనేక విధాలైన కాలగమనంతోకూడిన అహోరాత్రాలు గడిచి పోతుంటాయి. మానవుల ఆయుఃప్రమాణం నూరు సంవత్సరా లయినట్లే బ్రహ్మదేవుని పరమాయువుకూడా నూరు సంవత్సరాలే. ఆ నూరు సంవత్సరాల మొదటి సగాన్ని "పూర్వపరార్థం" అనీ, రెండవ సగాన్ని "ద్వితీయపరార్థ"మనీ అంటారు. ఈ విధమైన పూర్వపరార్థ కాలం బ్రహ్మకల్పం అవుతుంది. ఆ కల్పం మొదట్లో బ్రహ్మ పుట్టడం వల్లనే దానిని "బ్రహ్మకల్పం" అన్నారు. దీనినే "శబ్ద బ్రహ్మం" అని కూడా అంటారు.

క. విను మెన్నఁడు పంకజనా
భుని నాభీసరసియందు భువనాశ్రయమై
తనరిన పద్మము వొడమును
ననఘా! యది "పద్మకల్ప"మన విలసిల్లున్. 360

* వినవయ్యా విదురా: అఖిల లోకాలకూ ఆశ్రయమై ఉండే పద్మం నళిననాభుని "నాభి" అనే సరస్సునుంచి ఉద్భవించిన కాలం "పద్మకల్పం"గా ప్రసిద్ధికెక్కింది.

వ. పూర్వపరార్ధాదినిం గలిగిన బ్రహ్మకల్పంబుఁ జెప్పితిః నింక ద్వితీయ పరార్థంబు మొదల నెన్నఁడేని హరి సూకరాకారంబు దాల్చు నది వరాహకల్పం బనందగు. నట్టి వరాహకల్పం బిపుడు వర్తమానం బగుచున్నదిః వెండియు 361

* పూర్వపరార్థం ఆదిలోనిదైన బ్రహ్మకల్పాన్నిగూర్చి చెప్పగా విన్నావుగదా! ద్వితీయపరార్థం సంగతి విను. ఈ పరార్థం మొదట్లో హరి వరాహరూపాన్ని ఎప్పుడు ధరిస్తాడో అది "వరాహకల్పం" అనబడుతుంది. అటువంటి "వరాహకల్పం" ఇప్పుడు జరుగుతూ ఉంది.

సీ. దీపింపఁ గాలస్వరూపుఁడై నట్టి ప
ద్మాక్షుఁ డనంతుఁ డనాదిపురుషుఁ
డఖిలవిశ్వాత్మకుఁ డగు నీశునకుఁ బర.
మాణ్వాది యుగ పరార్థాంత మగుచు
జరుగు నీ కాలంబు చర్చింప నొక్క ని
మేషకాలం బయి మెలఁగుచుండుఁ
గాని యీశ్వరునకుఁ గర్తగాఁజాలః ది
క్కాలంబు విను మదిగాక దేహ

తే. మంది రార్థాది కర్మాభిమాన శీలు
రైనవారికి నాశ్రయం బగుటఁ జేసి
యరయ హరి తద్గుణవ్యతికరుఁడు గానఁ
కాల మమ్మేటి కెన్నఁడు గర్త గాదు. 362

* కాలస్వరూపుడై దీపించే కమలాక్షుడు ఆద్యంతాలు లేని మహాపురుషుడు. అఖిల లోకాలకూ ఆత్మ అయినవాడు. అటువంటి పరమేశ్వరునకు పరమాణువు మొదలుకొని పరార్థం పర్యంతం గల కాలం ఒక్క నిమేషంతో సమానం అవుతుంది. కనుకనే భగవంతుడే కాలానికి కర్త గాని కాలం భగవంతునికి కర్త కాదు. అంతేకాక దేహాలూ, గేహాలూ, సంపదలూ మొదలైన వాటియందు అభిమానం కలవారికి ఆశ్రయమైనది కాలం. భగవంతుడు ఆ గుణాలకు అతీతుడు. అందుకనే ఆయన కర్తయై కాలాన్ని నడిపించుతాడు; కాని ఆయన్ని కాలం నడిపించదు.

వ. మఱియు షోడశ వికారయుక్తంబై, పృథివ్యాది పంచభూత పరివృతంబయి, దశావరణంబులు గలిగి పంచాశత్కోటి విస్తీర్ణంబై బ్రహ్మాండకోశంబు దనరుచుండు. 363

* బ్రహ్మాండకోశం పదహారు వికారాలతో కూడి, పృథ్వి మొదలైన పంచభూతాలతో ఆవరింపబడి, పది విధాలైన ఆవరణాలు కలిగి, ఏభై కోట్ల యోజనాల విస్తీర్ణమై విరాజిల్లుతుంది.

చ. హరి పరమాణురూపమున నందు వసించి విరాజమానుఁడై
సరి వెలుఁగొందు, నిమ్ముల నసంఖ్యములైన మహాండకోశముల్
నెఱిఁ దనయందు డింద, నవనీరజనేత్రుఁ డనంతుఁ డాద్యుఁ డ
క్షరుఁడు పరాపరుం డఖిలకారణకారణుఁ డప్రమేయుఁడై. 364

* లెక్కలేనన్ని మహాండకోశాలు తన ఉదరంలో పదిలపరచుకొని పరమేశ్వరుడైన హరి పరమాణురూపంతో ఆ బ్రహ్మాండకోశంలో ప్రకాశిస్తూ ఉంటాడు. అప్పుడే వికసించిన కమలాలవంటి కన్నులు కలవాడూ, అంతంలేనివాడూ, ఆదిదేవుడూ, అక్షర పరబ్రహ్మమూ అయిన ఆ పరమాత్మ సమస్త కారణాలకూ కారణమైన వాడే అయినప్పటికీ వాటితో ఎటువంటి సంబంధం లేనివాడై ఉంటాడు.

క. నిరతిశయోజ్జ్వల తేజః
స్ఫురణం దనరారు పరమపురుషుని విష్ణుం
బురుషోత్తము వర్ణింపను
సరసిజభవ భవులకైన శక్యమె చెపుమా! 365

* అనుపమానమూ అఖండమూ అయిన అద్భుత తేజస్సుతో విరాజిల్లే ఆ పరమపురుషుణ్ణి, ఆ పరాత్పరుణ్ణి, ఆ మహావిష్ణువును అభివర్ణించటానికి పద్మభవునకూ పరమశివునకూ కూడా సాధ్యం కాదు.

క. అని మైత్రేయుఁడు విదురుం
గనుఁగొని వెండియును బలికెఁ గాలాహ్వయుఁడై
తనరిన హరి మహిమల నే
వినిపించితి సృష్టిమహిమ విను మెఱిఁగింతున్. 366

* అని మైత్రేయుడు, విదురుణ్ణి చూచి మళ్లీ ఇట్లా అన్నాడు. కాలస్వరూపుడైన శ్రీహరి మహిమలను నీకు వినిపించాను. ఇంక సృష్టి విశేషాలను వినిపిస్తాను, విను.

వ. పరమేష్ఠి యీా సృష్ట్యాది నహమ్మను దేహాభిమానబుద్ధిగల
మోహంబును, నంగనాసంగమ స్రక్చందనాది గ్రామ్య భోగేచ్ఛలు
గల మహామోహంబును, దత్ప్రతిఘాతజాతంబైన క్రోధంబునందుఁ
గలుగు తామిస్రంబును, దన్నాశంబునం "దహ మేవ మృతోఽస్మి"
యను నంధతామిస్రంబును, జిత్తవిభ్రమంబును, నను నవిద్యా
పంచకమిశ్రంబుగా సర్వభూతావలిం బుట్టించి యాత్మీయ చిత్తం
బునం బాపసృష్టిఁ గల్పించుటకుఁ బశ్చాత్తాపంబు నొంది భగవద్ధ్యా
నామృత పూతమానసుండై యూర్ధ్వరేతస్కులును, బరమ పవి
త్రులును నైన సనక సనందన సనత్కుమార సనత్సుజాతు లను
మునుల నతిసత్త్వగరిష్ఠుల ధీరజనోత్తముల నార్యుల హరిప్రస
న్నులనుంగా దివ్యదృష్టిం గల్పించి వారలం జూచి మీ మీ యంశం
బులం బ్రజలం బుట్టించి ప్రపంచంబు వృద్ధిఁ బొందింపుం డనినః
వారలు తద్వచనంబు లపహసించుచుఁ బద్మజుం గని మోక్షధర్మ
లును నారాయణపరాయణులునై ప్రపంచ నిర్మాణంబునకుఁ బ్రతి
కూల వాక్యంబులు పలికిన నుదయించిన క్రోధంబు బుద్ధిచే నిగ్ర
హింపఁబడినను నరవింద సంభవుని భ్రూమధ్యంబువలనం గ్రోధ
స్వరూపంబున నీలలోహితుండు నిఖిలసురాగ్రజుండై యుదయిం
చుచు నాక్రందనం బొనరించె నంత. 367

* బ్రహ్మదేవుడు సృష్టికి అరంభించి, "నేను సృష్టిస్తాను" అని
సంకల్పించగానే అహంకారపూరితమైన దేహాభిమానంగల "మోహం"
పుట్టింది. దేహాభిమానంవల్ల స్త్రీసంభోగం, చందనం, పూలదండలు, మొద
లైన భోగాలపై ఆసక్తిగల "మహామోహం" ఉద్భవించింది. ఈ కోరి
కలకు విఘ్నం కలుగగా కనులు కనుపింపని గ్రుడ్డితనం ఏర్పడింది. అది
"అంధతామిస్రం". శరీర మోహం వలన, శరీరనాశన భయం, మృత్యు
భీతి ఏర్పడింది. ఇది "తామిస్రం". పై అన్నింటితో మనస్సుకు సంచ
లనం ఏర్పడింది. ఇది "చిత్త విభ్రమం". ఈ అయిదింటికి "అవిద్యా
పంచకం" అని పేరు. అవిద్యాపంచకంతో కలిసిన భూతకోటిని పుట్టిం

చటం తాను చేసిన "పాపకార్య" మని బ్రహ్మ గుర్తించి మనస్సులో పశ్చాత్తాపం చెందాడు.

బ్రహ్మదేవుడు భగవంతుణ్ణి ధ్యానించాడు. భగద్ధ్యాన మనే అమృతంవల్ల ఆయన మనస్సు పావన మయింది. పవిత్రుడైన విధాత తన దివ్య దృష్టితో అస్ఖలిత బ్రహ్మచారులూ, వరమపావనులూ, సత్త్వగుణ సంపన్నులూ, ధీరవరేణ్యులూ, మాన్యులూ అయిన సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు అనే మునులను సృష్టించాడు. భగవదనురక్తులైన వారిని చూచి "మీ మీ అంశలతో ప్రజల్ని పుట్టించి ప్రపంచాన్ని వృద్ధి చేయుండి" అని ఆజ్ఞాపించాడు.

చతుర్ముఖుని పలుకులు విన్నంతనే సనకసనందనాదులకు నవ్వు వచ్చింది. మోక్షాసక్తులూ, శ్రీమన్నారాయణుని పరమ భక్తులూ అయిన వారు చతురాస్యుని అపహాస్యం చేస్తూ ప్రపంచ నిర్మాణానికి ప్రతికూల వచనాలు పలికారు. వారు తన ఆజ్ఞను ఉల్లంఘించినందుకు బ్రహ్మకు ఆగ్రహం వచ్చింది. బుద్ధిబలంతో ఆ ఆగ్రహాన్ని ఎంత నిగ్రహించుకున్నా ఆయన కనుబొమల నడుమ నుంచి క్రోధస్వరూపుడై సమస్త దేవతలకూ అగ్రేసరుడై నీలలోహితుడు ఉద్భవించాడు. అతడు జన్మిస్తూనే పెద్దగా రోదనం చేశాడు.

మ. జననం బందిన నీలలోహితుఁడు గంజాతాసనుం జూచి యి
ట్లను "నో దేవ! మదాఖ్య లెట్టివి? మదీయావాసముల్ వీఁక నా
కనయంబున్నెఱిఁగింపవే" యనుడు నయ్యంభోజగర్భుండు లా
లనముం దోఁపఁ గుమార! నీజననవేళన్ రోదనం బిచ్చుటన్. 368

తే. రుద్రనామంబు నీకు నిరూఢ మయ్యెఁ
జంద్రసూర్యానలానిల సలిల గగన
పృథివి ప్రాణ తపో హృదింద్రియము లనఁగఁ
గలుగు నేకాదశస్థానములు వసింప. 369

• ఆ విధంగా నీలం, ఎరుపు రంగుతో పుట్టిన నీలలోహితుడు బ్రహ్మను చూచి "ఓ దేవా! నేనెవరిని? నా పేరేమి? నా నివాస స్థలం ఏది?"

అంటూ వెంట వెంటనే ప్రశ్నించాడు. అప్పుడు బ్రహ్మదేవుడు మంచి మాటలతో అతనిని లాలిస్తూ "కుమారా! నీవు రుద్రుడవు. పుట్టినప్పుడు ఏడ్వడంవల్ల "రుద్రుడు" అను పేరు నీకు రూఢ మయింది. చంద్రుడు, సూర్యుడు, అగ్ని, వాయువు, జలం, ఆకాశం, భూమి, ప్రాణం, తపస్సు, హృదయం, ఇంద్రియాలు అనే పదకొండూ నీకు నివాస స్థానాలు.

వ. అని వెండియు మన్యు మను మహాకాల మహచ్ఛివ ఋతధ్వజోరురేతో భవ కాల వామదేవ ధృతవ్రతు లను నేకాదశనామంబులు గలిగి ధీ వృత్త్యశనోమా నియు త్సర్పి రిలాంబి కేలావతీ సుధా దీక్షా నామ పత్నీసమేతుండవై పూర్వ నియుక్తంబు లయిన నామంబులం దత్తన్నివాసంబుల వసియించి ప్రజలం గల్పింపుమని నిర్దేశించిన భగవంతుఁడగు నీలలోహితుండు విశ్వగురుండైన పితామహునిచే నియుక్తుండై సత్త్వాకృతి స్వభావంబుల నాత్మసములైన ప్రజలం గల్పించె. 370

* అంతేకాదు నాయనా! మన్యువు, మనువు, మహాకాలుడు, మహత్, శివుడు, ఋతధ్వజుడు, ఊరురేతస్కుడు, భవుడు, కాలుడు, వామదేవుడు, ధృతవ్రతుడు అని నీకు పదకొండు నామాలు ఉంటాయి. ధీ, వృత్తి, ఉశన, ఉమ, నియుత్, సర్పి, ఇల, అంబిక, ఇరావతి, సుధ, దీక్ష అను పదకొండు మంది స్త్రీలు నీకు భార్యలు. పూర్వం నిర్ణయింపబడిన పేర్లతో ఆ యా స్థలాలలో ఉంటూ ప్రజల్ని సృష్టించు" అని విశ్వగురువైన బ్రహ్మ ఆదేశింపగా ఆ నియమం మేరకు రుద్రుడు బలంలోనూ, ఆకారంలోనూ, స్వభావంలోనూ తనతో సమానులైన ప్రజలను సృష్టించాడు.

ఉ. రుద్రునిచేత నీ గతి నిరూఢమతిన్ సృజియింపఁబడ్డ యా
రుద్రగణంబు లోలి నవరుద్ధత విశ్వము ద్రింగెః నమ్మహో
పద్రవ శాంతికై యజుఁడు భర్గులఁ జూచి కుమారులార! మీ
రౌద్ర విలోకనానల భరంబునఁ గ్రాఁగె సమస్తలోకముల్. 371

• ఈ విధంగా రుద్రుడు సృష్టించిన రుద్రగణాలు ఈ విశ్వాన్నంతా అనాయాసంగా అమాంతంగా మ్రింగేశాయి. ఆ మహాప్రమాదాన్ని శాంతింపచేయడానికై బ్రహ్మ రుద్రగణాలను చేరబిలిచి "కుమారులారా, చూచారా! మీ తీక్ష్ణవీక్షణాగ్ని జ్వాలలలో సమస్త లోకాలూ మండి పోయాయి."

క. మీ సృష్టి చాలుః నింకన్
ధీసత్తములారః వినుఁడు. ధృతి మీరు తపో
వ్యాసంగచిత్తులై చనుఁ
డా సన్మంగళము లగు దృఢంబుగ మీకున్. 372

• "నాయనలారా! చాలు! ఇక మీ సృష్టి చాలించండి. మీరు బుద్ధిమంతులు. ధైర్యవంతులు. నా మాట వినండి. చక్కగా అరణ్యాలకు వెళ్ళి ఏకాగ్రచిత్తులై తపస్సు చేసుకొండి. మీకు నిశ్చయంగా శుభం కలుగుతుంది."

మ. భగవంతుం బురుషోత్తమున్ హరిఁ గృపాపాథోధి లక్ష్మీశ్వరున్
సుగుణభ్రాజితు నచ్యుతుం బరుఁ బరంజ్యోతిం బ్రభున్ సర్వభూ
తగుహావాసు నధోక్షజున్ శ్రితజనత్రాణైక పారీణు నా
జగదాత్ముం గనుచుందు రార్యులు దపశ్శక్తిన్ స్ఫుటజ్ఞానులై. 373

• "భగవంతుడు, పురుషోత్తముడు, కరుణాసముద్రుడు, లక్ష్మీవల్లభుడు, సద్గుణసంపన్నుడు, అచ్యుతుడు, పరమాత్ముడు, పరంజ్యోతి, సర్వేశ్వరుడు, సర్వాంతర్యామి, అధోక్షజుడు, జగన్నాథుడు, ఆర్తజనరక్షా పరాయణుడు అయిన శ్రీమన్నారాయణుని సజ్జనులైనవారు తమ తపశ్శక్తివల్ల దర్శింప గలుగుతారు. మీరుకూడా తపస్సు చేసి ఆయనను దర్శించండి" అన్నాడు బ్రహ్మదేవుడు.

వ. అనిన విని 374

ఉ. కై కొని యిట్లు పంకరుహగర్భ నియంత్రితు లైన రుద్రు ల
ద్రేకము దక్కి కానలకు ధీయుతులై తపమాచరింప న
స్తోకచరిత్రు లేఁగిరిః చతుర్ముఖుఁ డంతఁ బ్రపంచకల్పనా
లోకనుఁడై సృజించె జనలోకశరణ్యుల ధీవరేణ్యులన్. 375

* రుద్రులు బ్రహ్మమాటలు విన్నారు. తమ రౌద్రావేశాన్ని అణచుకున్నారు. ఉద్రేకాన్ని తగ్గించుకున్నారు. ఆ సచ్చరిత్రులు చతుర్ముఖుని ఆజ్ఞానుసారం అరణ్యాలకు వెళ్ళి తపోనిమగ్ను లైనారు. అనంతరం బ్రహ్మ ప్రపంచాన్ని సృష్టించాలనే దృష్టికలవాడై ఈ సారి మానవలోకానికి శరణ్యులూ మతిమంతులలో అగ్రగణ్యులూ అయినవారిని సృజించాడు.

తే. వినుముః భగవద్బలాన్వితవినుతగుణులు
భువనసంతాన హేతు విస్ఫురణకరులు
పద్మసంభవ తుల్య ప్రభావయుతులు
పదురు గొడుకులు పుట్టిరి భవ్యయశులు. 376

* భగవంతుని బలంతోకూడిన సద్గుణాలు కలవారు, జీవుల అభివృద్ధికి కారణమైనవారు, బ్రహ్మతో సమానమైన ప్రభావంకలవారు, విశాలమైన యశస్సుకలవారు - అయిన పదిమంది కొడుకులు ఉదయించారు.

సీ. అరవిందసంభవు నంగుష్ఠమున దక్షుఁ
డూరువు వలనను నారదుండు
నాభిఁ బులహుఁడు గర్ణముల బులస్త్యుండు
త్వక్కున భృగువు హస్తమునఁ గ్రతువు
నాస్యంబువలన నయ్యంగిరసుఁడు ప్రాణ
మున వసిష్ఠుఁడు మనమున మరీచి
గన్నుల నత్రియుఁ గాఁ బుత్త్రిదశకంబు
గలిగిరిః వెండియు నలినగర్భు

తే. దక్షిణ స్తనమువలన ధర్మ మొదవె
వెన్ను వలనను/ నుదయించె విశ్వభయద
మైన మృత్యు వధర్మంబు నంద కలిగె
నాత్మఁ గాముండు జననము నందెః మఱియు. 377

* బ్రహ్మ బొటనవ్రేలు నుండి దక్షుడు, తొడ నుండి నారదుడు, నాభి నుండి పులహుడు, చెవుల నుండి పులస్త్యుడు, చర్మం నుండి భృగువు, చేతి నుండి క్రతువు, ముఖం నుండి అంగిరసుడు, ప్రాణం నుండి వసిష్ఠుడు, మనస్సు నుండి మరీచి, కన్నుల నుండి అత్రి ఆవిర్భవించారు. ఈ విధంగా పదిమంది కుమారులు పుట్టారు. ఇంకా బ్రహ్మదేవుని కుడివైపు స్తనం నుండి ధర్మం జనించింది. వెన్ను నుండి లోకభయంకరమైన మృత్యువూ అధర్మమూ జనించాయి. ఆత్మనుండి మన్మథుడు పుట్టాడు.

సీ. భ్రూయుగళంబునఁ గ్రోధంబు, నధరంబు
నందు లోభంబు, నాస్యమున వాణి
యును, మేఢ్రమందుఁ బయోధు, లపానంబు
నందు నఘాశ్రయుఁడై న నిరృతి,
లాలితచ్ఛాయవలన దేవహూతి వి
భుండు గర్దముఁడును, బుట్టి రంత
నబ్జజుఁ డాత్మ దేహమున జనించిన
భారతిఁ జూచి విభ్రాంతిఁ బొరసి

తే. పంచశర బాణ నిర్భిన్న భావుఁ డగుచుఁ
గూఁతు రని పాపమునకు సంకోచపడక
కవయఁగోరిన జనకునిఁ గని మరీచి
మొదలుగాఁ గల యమ్మునిముఖ్యు లెఱఁగి. 378

వ. ఇట్లనిరి. 379

* బ్రహ్మదేవుని కనుబొమ్మల నుండి క్రోధం జనించింది. పెదవుల నుండి లోభం పుట్టింది. ముఖము నుండి సరస్వతి ప్రభవించింది. పురుషాంగం నుండి సముద్రాలు, అపానం నుండి పాపాశ్రయుడైన నిరృతి, నీడనుండి దేవహూతి, ఆమె భర్తయగు కర్దముడు ఉదయించారు. అంత బ్రహ్మ తన దేహం నుండి పుట్టిన సరస్వతిని చూచి ఆమె సౌందర్యానికి మోహపరవశుడైనాడు. మన్మథుని పుష్పబాణాలు ఆయన హృదయాన్ని భేదించాయి. కన్నకూతురనే సంకోచం లేకుండా పాపానికి వెనుకాడక వ్యామోహంతో ఆమె వెంటపడ్డాడు. తమ తండ్రి దుశ్చర్యను మరీచి మొదలుగా గల మునివర్యులు తెలుసుకొని ఇలా అన్నారు.

ఉ. చాలుఁ! బురే! సరోజభవ! సత్పథవృత్తిఁ దొఱంగి కూఁతు ని
ట్లాలరివై రమింప హృదయంబునఁ గోరుట ధర్మరీతియే?
ఖేలరివైతి, నీ తగవుఁ, బెద్దతనంబును, నేలపాలుగా
శీలము వోవఁదట్టి యిటు సేసినవారలు మున్ను గల్గిరే? 380

* ఓ బ్రహ్మదేవా! చాలు చాలు! సన్మార్గాన్ని కాలదన్ని కన్నకుమార్తెపై కన్నువేసి రమింపదలచావు. మేలు మేలు! ఇదెక్కడి ధర్మమయ్యా? ఇంతటి పాపానికి ఒడిగట్టి నీ న్యాయం, పెద్దరికం మట్టిపాలు చేశావు. నీ శీలం నేలపాలయింది. ఈ విధంగా చేసిన ఘనులు ఇంతకుముం దెప్పుడైనా ఉన్నారా?

ఉ. నీవు మహానుభావుఁడ వనింద్యచరిత్రుఁడ: విట్టిచోట "రా
జీవభవుండు దా విధినిషేధము లాత్మ నెఱుంగఁ డయ్యె: నీ
భావభవప్రసూనశర బాధితుఁడై తన కూఁతుఁ బొందెఁ బో
వావి దలంప లే" కనుచు వారక లోకులు ప్రువ్వఁ దిట్టరే!
381

* నీవు మహానుభావుడవే! నిర్మలమైన చరిత్రకలవాడవే! లోకులు వింటే ఏమంటారు? విధాత విధినిషేధాలు తెలియకుండా ప్రవర్తించాడనుకోరా! బ్రహ్మదేవుడు వావివరుసలు వదలిపెట్టి పూవిల్తుని పూవుటమ్ములకు లొంగిపోయి కన్నబిడ్డనే కామించాడని చెడతిట్టరా!

క. పాపము దలఁపక, నిమిషము
లోపలఁ జెడు సౌఖ్యమునకు లోనైతివె? యిం
తే పో ధారుణిఁ 'గామా
న్ధోఽపి న పశ్యతి' యనంగఁ దొల్లియు వినమే. 382

* పాపకృత్యమని భావించకుండా క్షణికమైన సౌఖ్యానికి ఆశించి ఈ అల్పానికి పాల్పడ్డావు. ''కామాంధుడికి కళ్లు కన్పించవు'' అన్న లోకోక్తి ఉండనే ఉన్నది.

మ. అని యిబ్భంగి మునీంద్రు లాడిన కఠోరాలాపముల్ వీనుల
న్విని లజ్జావనతాననుం డగుచు నా నీరేజగర్భుండు స
య్యన దేహంబు విసర్జనీయముగ జేయన్ దిక్కులేతెంచి త
త్తనువుం గైకొనఁ బుట్టె దిక్కలితమై తామిస్ర నీహారముల్. 383

* అని ఈవిధంగా మునీంద్రులు పలికిన ములుకులవంటి పలుకులు విని బ్రహ్మ సిగ్గుతో తలవంచుకొన్నాడు. వెగువెంటనే తన శరీరాన్ని పరిత్యజించాడు. దిక్కులు వచ్చి ఆ శరీరాన్ని ఆక్రమించాయి. వెంటనే ఆ దిక్కులలోనుంచి చీకటీ, మంచూ ఉద్భవించాయి.

వ. అంత. 384

చ. ఉడుగక పంకజాతభవుఁ డొండొక దేహముఁ దాల్చి ధైర్యమున్
విడువక సృష్టిపూర్వసమవేతముగన్ సృజియించునేర్పు దాఁ
బొడమమి కాత్మలోనఁ దలపోయుచు నుండఁ జతుర్ముఖంబులన్
వెడలె ననూనరూపముల వేదము లంచిత ధర్మయుక్తితోన్. 385

* అటుమీద బ్రహ్మ ధైర్యం వదలక మరొక దేహాన్ని ధరించాడు. సృష్టికి పూర్వం సంప్రాప్తమయిన సృజనశక్తి తనకు అప్పుడు లేకపోవ డంతో అంతరంగంలో ఎంతగానో చింతిస్తూ ఉండిపోయాడు. అంతలో

పంచమ వేదంబగు నితిహాస పురాణంబులు సర్వముఖంబు లం గలిగె. మఱియుఁ గర్మ తంత్రంబు లయిన షోడశ్యుక్థ్య ములును, జయనాగ్నిష్టోమంబులును, నాప్తోర్యామాతిరాత్రంబు లును, వాజపేయగోసవంబులును, ధర్మపాదంబులైన విద్యాదాన తపస్సత్యంబులును, బ్రహ్మచర్య గృహస్థ వానప్రస్థ, యత్యా శ్రమంబులును గలిగె. వీనికి నొక్కొక్కటికిం జతుర్విధంబులైన వృత్తులును గలిగియుండు, నందు సావిత్రంబను బ్రహ్మచర్యం బును, ఉపనయనం బాదిగా దివసత్రయంబు గాయత్రి జపించుట యను ప్రాజాపత్యంబును, వేదవ్రతచతుష్టయంబందు బ్రతి వ్రతంబును వ్రతులు సంవత్సరపర్యంతంబుగా నాచరింప నగు బ్రాహ్మంబును, వేదగ్రహణాంతంబు నాచరింపఁదగు నైష్ఠికంబును నను బ్రహ్మచారి వృత్తిచతుష్టయంబును: ననిషిద్ధకృష్యాది వృత్తియగు వార్తయు, యజనాదికర్మోపయుక్తంబైన యాజ్ఞాది రూపధన సంచయంబును, బరుల యాచింపకుండు నయాచితం బను శాలీనంబును, క్షేత్రపతిత కణిశ కణ సంగ్రహణ రూపంబగు శిలోంఛంబును, నను గృహస్థవృత్తులు నాలుగును, నకృష్ట పచ్యా హారులగు వైఖానసులును, నూతనఫలంబు లబ్ధంబైనఁ బూర్వ సంచిత పదార్థత్యాగంబు గల వాలఖిల్యులును, బ్రాతఃకాలంబున నే దిక్కు విలోకింతు రద్దిక్కునకుం జని యచ్చట లభించు పదా ర్థంబుల భుజించి జీవించు నౌదుంబరులును, దమంత ఫలించి తరు పతితంబు లగు ఫలంబులఁ దినుచుండు ఫేనపులును నను చతుర్విధ వృత్తులు గల వానప్రస్థులును, స్వాశ్రమ విహిత కర్మంబులం బ్రధానుం డగు కుటీచకుండును, గర్మం బుపసర్జ నంబు సేసి జ్ఞానప్రధానుం డయిన బహూదుండును, గేవలజ్ఞానా భ్యాసనిష్ఠుం డగు హంసుండును, బ్రాప్తంబైన పరబ్రహ్మ తత్త్వంబుగల నిష్క్రియుండును నను సన్న్యాసిచతుర్విధ వృత్తు

లును, మోక్షఫలప్రదంబై యాత్మానాత్మ వివేక విద్యారూపంబగు నాన్వీక్షకియు, స్వర్గాది ఫలప్రదంబై కర్మవిద్యారూప మగు త్రయియు, జీవనఫలప్రధానంబై కృష్యాదిరూపంబగు వార్తయు, నర్థసంపాదనైక ప్రయోజనంబగు దండనీతియు నను మోక్షధర్మ కామార్థంబులైన న్యాయవిద్యా చతుష్టయంబును, "భూర్భువస్సువ" యను వ్యాహృతులును, బూర్వాది ముఖంబులవలన నుదయించె:

మఱియు నతని హృదయాకాశంబువలనం బ్రణవంబును, రోమంబులవలన నుష్ణిక్ఛందంబును, ద్వగింద్రియము వలన గాయత్త్రీ ఛందంబును, మాంసంబువ లనం ద్రిష్టుప్ఛందంబును, స్నాయువువలన ననుష్టుప్ఛందంబును, నస్థివలన జగతీఛందంబును, మజ్జవలన పంక్తిచ్ఛందంబును, బ్రాణంబువలన బృహతీ ఛందంబును, కకారాది పంచవర్గాత్మకంబులయిన స్పర్శంబుల వలన జీవుండును, అకారాదిస్వరాత్మకంబైన దేహంబును, నూష్మంబులను శషసహవర్ణ చతుష్టయ రూపంబులగు నింద్రియంబులును, నంతస్థంబులగు యరలవ లను వర్ణంబులును, షడ్జాదిసప్త స్వరూపంబు నాత్మబలంబయిన శబ్దబ్రహ్మంబును, చతుర్ముఖుని లీలా విశేషంబున నుత్పన్నంబయ్యె:

వ్యక్తావ్యక్తంబై వైఖరీ ప్రణవాత్మకంబైన శబ్దబ్రహ్మంబు వలనం బరమాత్మ యవ్యక్తాత్మకుం డగుటంజేసి పరిపూర్ణుండును, వ్యక్తాత్మకుం డగుటంజేసి యింద్రాదిశక్త్యుప బృంహితుండునునై కానంబడు: బదంపడి యజుండు భూరివీర్యవంతు లయిన ఋషి గణంబుల సంతతి యవిస్తృతంబని తలంచి పూర్వతను పరిగ్రహంబు సాలించి యనిషిద్ధకామాసక్తంబైన దేహాంతర పరిగ్రహంబు సేసి నిత్యంబుఁ బ్రజాసృష్టియందు వ్యాసక్తుండనైనను బ్రజ లభి

వృద్ధి నొందక యుండుట కేమి కారణం బగునని యచ్చెరువొంది తద్వృద్ధి యగు విధం బాలోచించుచు దైవం బిచ్చుట విఘాతుకంబు గాన తదానుకూల్యం బావశ్యకం బని దాని నెదురు చూచుచు యథోచితకృత్య కరణదక్షుం డగుచుండ చతుర్ముఖుని దేహంబు ద్వివిధం బయిన నట్టి రూపద్వయవిభాగంబు స్వరాట్టగు "స్వాయంభువ" మనువును దన్మహిషియగు "శతరూప" యను కన్యక యుంగా మిథునంబయి జనియించె, నమ్మిథునంబు వలనం బ్రియవ్రతోత్తానపాదులను పుత్త్రద్వయంబు, నాకూతి దేవహూతి ప్రసూతులను కన్యకాత్రయంబును గలిగి; రందు నాకూతిని రుచికునకును, దేవహూతిం గర్దమునకును, బ్రసూతిని దక్షునకును నిచ్చెః వీరలవలనఁ గలుగు ప్రజాసంతతులచేత జగంబులు పరిపూర్ణంబు లయ్యె. 388

* ఈ విధంగా విదురుడు అడుగగా మైత్రేయుడు అతనితో ఇట్లా అన్నాడు. బ్రహ్మదేవుని తూర్పువైపు ముఖం నుండి ఋగ్వేదమూ, దక్షిణముఖం నుండి యజుర్వేదమూ, పశ్చిమముఖం నుండి సామవేదమూ, ఉత్తరముఖం నుండి అథర్వ వేదమూ ఉద్భవించాయి.

యజ్ఞానికి "హోత, అధ్వర్యుడు, ఉద్గాత, బ్రహ్మ" అని నల్గురు ఋత్విక్కు లుంటారు. హోత అనే ఋత్విక్కుకు సంబంధించినవీ, గానం చేయబడనివీ, అయిన ప్రశంసాత్మక మంత్ర స్తోత్రాలు తూర్పుముఖం నుండి వెలువడ్డాయి.

అధ్వర్యునికి సంబంధించిన విధిరూపమైన ఇజ్య, గానయోగ్యాలైన మంత్రస్తోత్రాలూ దక్షిణముఖం నుంచి ఉదయించాయి.

ఉద్గాత ప్రయోగించే స్తోమాలు అనే ఋగ్వేద మంత్రాలు పశ్చిమ ముఖం నుంచి ప్రాదుర్భవించాయి.

బ్రహ్మ అనబడే నాల్గవ ఋత్విక్కు ఆచరించే ప్రాయశ్చిత్తకాండ ఉత్తరముఖం నుంచి ఉద్భవించింది.

ఉపవేదాలలో ఆయుర్వేదం ప్రాఙ్ముఖం నుంచీ, ధనుర్వేదం దక్షిణ ముఖం నుంచీ, గాంధర్వ వేదం పశ్చిమ ముఖం నుంచీ, విశ్వకర్మకు సంబంధించిన స్థాపత్యమనే శిల్పవేదం ఉత్తర ముఖం నుంచీ ఉత్పన్న మయినాయి.

పంచమవేదమయిన ఇతిహాస పురాణ సముచ్చయం బ్రహ్మదేవుని అన్ని ముఖాలనుంచి ఆవిర్భవించింది. ఇవిగాక కర్మతంత్రాలయిన షోడశి - ఉక్థ్యము, చయనం - అగ్నిష్టోమం, ఆప్తోర్యామం - అతిరాత్రం, వాజపేయం - గోసవం అనే నాలుగు జంటలూ, ధర్మపాదాలైన విద్య - ధనం - దానం - తపస్సు అనేవీ క్రమంగా నలువ నాలుగు ముఖాలనుంచి వెలువడినాయి.

బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్న్యాసం అనే ఆశ్రమ చతుష్టయంకూడా చతుర్ముఖుని చతుర్ముఖాల నుంచి క్రమంగా జనించాయి. పై నాలుగు ఆశ్రమాలలో ఒక్కొక్కటి నాలుగు విధాలైన విధానాలతో అలరారుతుంటుంది.

బ్రహ్మచర్యానికి "సావిత్రం" అని కూడా పేరు. సవిత అంటే సూర్యుడు. ఆయన్ని ఆరాధించే గాయత్రి ఇందు ప్రధానం కనుక దీనికి ఈ పేరు వచ్చింది. ఉపనయనం మొదలుకొని మూడు దినాల పర్యంతం గాయత్రీ మంత్రం జపించటం "ప్రాజాపత్యం" అంటారు. వేద వ్రతాలు నాల్గింటిలో ఒక్కొక్కటీ ఒక్కొక్క సంవత్సర పర్యంతం ఆచరించేది "బ్రాహ్మం". వేదం పూర్తిగా నేర్చుకొన్న అనంతరం ఆచరించేది "నైష్ఠిక వ్రతం". ఇవి నాలుగూ బ్రహ్మచారి వృత్తులు.

గృహస్థ వృత్తులు నాలుగు. పొలం దున్ని పండించుకోవటమే జీవనోపాధిగా పెట్టుకోవటం "వార్త" అంటారు. యజ్ఞయాగాది కర్మలకు ఉపయోగించే సాధనాలను కూడబెట్టుకోవడం "సంచయం" అంటారు. పరులను యాచించకుండా వుండటం "శాలీనం"; పొలాలలో రాలిన ధాన్యం కంకులు ఏరుకొని వానిని శిలలపై నూర్చుకొని జీవించటం "శిలోంఛం".

వానప్రస్థ వృత్తులు నాలుగు. దుంపలు త్రవ్వుకొని భుజించే వారు "వైఖానసులు". క్రొత్త పంట లభించగానే పూర్వం దాచిపెట్టిన పదార్థాలను మిగలకుండా ఇతరులకు పంచిపెట్టేవారు "వాలఖిల్యులు". ప్రొద్దున లేవగానే ఏ దిక్కు కన్పిస్తుందో ఆ దిక్కుకు పోయి అక్కడ అయాచితంగా లభించిన పదార్థాలను భుజించేవారు "ఔదుంబరులు". చెట్టున పండి రాలిన ఫలాలనూ, పత్రాలనూ తిని జీవించేవారు "ఫేనపులు".

సన్యాసులలోకూడా నాలుగు విధా లున్నారు. సొంత కుటీరం ఉండి చేయదగిన కర్మలు చేసేవాడు "కుటీచకుడు"; కుటీరం లేకుండా కర్మలు అప్రధానంగా జ్ఞానియై సంచరిస్తుండేవాడు "బహూదుడు"; కేవలం జ్ఞానాభ్యాసం మాత్రం చేసేవాడు "హంసుడు"; జ్ఞానాభ్యాసం కూడా లేకుండా పరబ్రహ్మతత్త్వం అలవడినవాడు "నిష్క్రియుడు".

అన్వీక్షకీ, త్రయీ, వార్తా, దండనీతి అనే నాలుగు న్యాయ విద్యలూ బ్రహ్మదేవుని నాలుగు ముఖాలనుండి వరుసగా పుట్టాయి. "అన్వీక్షకి" అంటే ఆత్మానాత్మ వివేకం కలిగి మోక్షాన్ని ప్రసాదించే విద్య. "త్రయి" అంటే స్వర్గాదిఫలాలను అందించే వేదకర్మానుష్ఠానం. 'వార్త' అంటే జీవనోపాధికోసం చేసే కృషి మొదలైన విద్య. "దండనీతి" అంటే అర్థ సంపాదనమే ప్రయోజనంగా గల విద్య. ఈ నాలుగు విద్యలలో అన్వీక్షకి మోక్షానికీ, త్రయి కామానికీ, వార్త ధర్మానికీ, దండనీతి అర్థానికీ సాధనాలు. "భూః, భువః, సువః" అనే వ్యాహృతులు బ్రహ్మదేవుని ముఖాలనుండి క్రమంగా ఉదయించాయి. అతని హృదయం లోని ఆకాశం నుండి ఓంకారం పుట్టింది. రోమాలనుండి ఉష్ణిక్ ఛందస్సు, చర్మం నుండి గాయత్రీ ఛందస్సు, మాంసం నుండి త్రిష్టుప్ ఛందస్సు, స్నాయువువల్ల అనుష్టుప్ ఛందస్సు, ఎముక నుండి జగతీ ఛందస్సు, మజ్జవల్ల పంక్తిచ్ఛందస్సు, ప్రాణంవల్ల బృహతీ ఛందస్సు పుట్టాయి.

హల్లులలో క వర్గం మొదలు ప వర్గం వరకూ అయిదు వర్గాలతో స్పర్శాత్మకుడైన జీవుడూ, అకారాది అచ్చులతో స్వరాత్మకమైన దేహమూ, శ-ష-స-హ-లతో ఊష్మవర్ణాత్మకాలైన ఇంద్రియాలూ ఏర్పడ్డాయి.

య - ర - ల - వ - అనే అంతస్థాలూ, షడ్జం, ఋషభం, గాంధారం, మధ్యమం, పంచమం, దైవతం, నిషాదం అనే సప్త స్వరాలూ, ఆత్మబలమైన శబ్ద బ్రహ్మమూ—ఇవన్నీ చతుర్ముఖుని లీలా విశేషాలవల్ల పుట్టినాయి.

పరమేశ్వరునకు వ్యక్తమూ అవ్యక్తమూ అని రెండు రూపాలు. వ్యక్తరూపం ''వైఖరీ వాక్కు''; ''పరా'', ''పశ్యంతీ'' ''మధ్యమా''. అనే వాక్కులు అవ్యక్తరూపం. ఈ వ్యక్తావ్యక్తరూపాలు రెండింటికీ ప్రణవమే ఆత్మ. భగవంతుడు అవ్యక్తాత్ముడు కావటంవల్ల పరిపూర్ణుడు. వ్యక్తాత్ముడు కావడంచేత ఇంద్రాది శక్తిసంయుక్తుడై కనిపిస్తాడు.

అనంతరం అనంత వీర్యవంతులైన ఋషుల సంతానం సవిస్తారమై వృద్ధి కాలేదని తలంచాడు బ్రహ్మ. ఆయన తన మొదటి శరీరాన్ని వదలుకొన్నాడు. నిషిద్ధంకాని కామంపై ఆసక్తిగల మరొక్క దేహాన్ని ధరించాడు. నిత్యం ప్రజాసృష్టియందు ఆసక్తుడైనాడు. అయినా ప్రజాభివృద్ధి జరుగలేదు. కారణం తెలియక ఆశ్చర్యపడ్డాడు. అది వృద్ధి అయ్యే విధానాన్నిగూర్చి ఆలోచించాడు. దైవం ఇచట ప్రతికూలం. కొబట్టి దైవానుకూల్యం అవసరం అనుకుంటూ దైవాన్ని ధ్యానించాడు. సందర్భోచిత కర్తవ్యాలు నిర్వర్తింపసాగాడు.

వెంటనే బ్రహ్మదేవుని దేహం రెండు భాగాలయింది. అందొకటి 'స్వరాట్టు' అయిన ''స్వాయంభువ'' మనువుగా, మరొక్కటి అతని భార్య ''శతరూప'' అనే అంగనగా రూపొందాయి. ఆదిమిథునమైన, ఆ దంపతులకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు పుత్రులూ, ఆకూతి, దేవహూతి, ప్రసూతి అనే ముగ్గురు పుత్రికలూ పుట్టారు. వారిలో ఆకూతిని రుచిప్రజాపతికీ, దేవహూతిని కర్దమ ప్రజాపతికీ, ప్రసూతిని దక్ష ప్రజాపతికీ ఇచ్చి వివాహం చేశారు. ఈ దంపతులవల్ల కలిగిన అనంతప్రజాసంతతులవల్ల జగత్తంతా నిండి నిబిడీకృత మయింది.

*

స్వాయంభువమనువు ప్రజావృద్ధి సేయుట

క. అని మైత్రేయుఁడు పలికిన
విని మనమున హర్ష మొదవ విదురుఁడు మునినా
థునిఁ జూచి పలికెఁ గ్రమ్మఱ
వనజోదర పాదభక్తి వశమానసుఁడై. 389

* అని మైత్రేయుడు చెప్పగా విదురుడు విన్నాడు. సంతోషం పొందినవాడై, హరిపాద భక్తిపరవశుడై, ముని ముఖ్యుడైన మైత్రేయుణ్ణి చూచి మళ్ళా ఇట్లా అన్నాడు.

క. ఘనుఁడు స్వయంభువునకుఁ బ్రియ
తనయుఁడు స్వాయంభువుండు దైతేయవిభే
దన సేవాచతురుండును
జనవినుతుం డాదిరాజ సత్తముఁ డౌటన్. 390

* స్వయంభువుడైన బ్రహ్మదేవుని కుమారుడు స్వాయంభువుడు హరిచరణ సేవా పరాయణుడు. ఆదిరాజవరేణ్యులలో అగ్రగణ్యుడై జనుల మన్ననలు అందుకొన్న వాడు.

క. అతని చరిత్రం బవ్యా
హతసుఖదము, నిఖిలమంగళావహము, సమం
చితముం గావున బుధసే
విత! నాకెఱుఁగంగఁ బలుకవే మునితిలకా! 391

* కోవిదులచే సేవింపబడు ఓ మునికుల తిలకా! ఆ స్వాయంభువుని చరిత్ర అఖండమైన ఆనందాన్ని అందించేది. సమస్త సౌభాగ్యాలను సమకూర్చేది. మిక్కిలి యోగ్యమైంది. అందువల్ల ఆయన వృత్తాంతం నాకు అర్థమయ్యేటట్లు దయచేసి చెప్పు.

క. అదియును గాక ముకుందుని
పదకమల మరందపాన పరవశులై పెం
పొదవినవారి చరిత్రము
సదమలమతి వినిన భవము సఫలము గాదే? 392

* అంతేకాదు శ్రీహరి పాదపద్మాల మకరందాన్ని త్రాగి, మై మరచి మహాత్ములైనవారి మహనీయ చరిత్రను పరిశుద్ధమైన బుద్ధితో విన్నవారి జన్మం సార్థకం అవుతుంది.

చ. అని విదురుండు పల్కిన దయాన్వితుఁడై మునినాథచంద్రుఁడి
ట్లను శ్రుతిశాస్త్రపార కలితాత్మకుఁడైన నరుండు పద్మలో
చన చరణారవిందయుగసంగము గల్గిన సజ్జనుండు వొం
దిన ఫల మొందు భాగవతదివ్యకథాశ్రవణానురక్తి చేన్. 393

* ఇలా పలుకుతున్న విదురునితో సదయ హృదయుడైన మైత్రేయ మహాముని ఇలా అన్నాడు. నాయనా! వేదశాస్త్రపఠనం చేసే మానవుడూ, శ్రీహరి చరణ కమలాల మీద అనురాగంగల సజ్జనుడూ — ఏ ఫలాన్ని పొందుతారో భగవద్భక్తుల దివ్యమైన కథలను ఆసక్తితో ఆకర్ణించడంవల్ల అటువంటి ఫలమే సంప్రాప్తమవుతుంది.

క. అనిచెప్పి మునికులాగ్రణి
దనుజారికథాసుధాప్లుత స్వాంతుండై
తనువునఁ బులకాంకురములు
మొనయఁగ నానందబాష్పములు జడి గురియన్. 394

* ఇలా చెబుతున్న మైత్రేయ మహాముని హృదయం శ్రీహరి కథాసుధాలహరితో పెల్లుబికింది. ఆయన శరీరం సంతోషంతో పొంగి పులకించింది. ఆయన నయనాలు ఆనందబాష్పాలు వర్షించాయి.

సీ. వినిపింపఁదొడఁగె నా ఘనుఁడు స్వాయంభువుఁ
డంగనాయుక్తుఁడై యబ్జగర్భు

నకు మ్రొక్కి వినయవినమితోత్తమాంగుఁడై
హస్తముల్ మొగిచి యిట్లనియెఁ బ్రీతి
జీవరాసులకు రాజీవసంభవ! నీవ
జననరక్షణ వినాశముల కరయ
హేతుభూతుఁడవు; మా కెద్ది యాచరణీయ
మైన కర్మము దాని నానతిమ్ము!

తే. ఎట్టి కర్మంబు సేసిన? నెసఁగు నీకు
నవహితంబైన సంతోష మాత్మజుండు
జనకునకు భక్తిఁ బరిచర్య సలిపి కీర్తి
నంది నుతి కెక్కి వర్తించు నందు నిందు. 395

* మైత్రేయుడు విదురునితో ఇట్లా చెప్పసాగాడు. స్వాయంభువుడు తన భార్య అయిన శతరూపతోకూడా బ్రహ్మదేవునకు నమస్కారం చేశాడు. వినయంతో తలవంచుకొని, చేతులు జోడించి ప్రీతిపూర్వకంగా ఇలా అన్నాడు. – ఓ కమలగర్భా! ఈ విశ్వంలోని సర్వప్రాణులనూ పుట్టించుటకూ, పోషించుటకూ, సంహరించుటకూ, కారణభూతమైన వాడవు నీవే! మేము చేయవలసిన పని యేమో మాకు ఆజ్ఞాపించు. ఎలాంటి పని చేస్తే నీకు అత్యంతమైన సంతోషం కలుగుతుందో అది చేస్తాము. తండ్రికి భక్తితో సేవచేసిన తనయుడు ఈ లోకంలో ఆ లోకంలో అఖండమైన యశస్సు ఆర్జిస్తాడు. అందరి అభిమానానికీ పాత్రుడౌతాడు.

వ. కాన యొఱింగింపు మట్టి సత్కర్మంబు. 396

* కాబట్టి అట్టి మంచి పనియేదో నాకు ఆనతివ్వు.

క. అని పలికిన స్వాయంభువ
మను మృదుభాషలకు నలరి మనమునఁ గమలా
సనుఁ డనురాగము ముప్పిరి
గొనఁ బ్రియతముఁడైన సుతునకును నిట్లనియెన్. 397

* అని పలికిన స్వాయంభువుని మృదుమధుర వాక్యాలకు చతుర్ముఖుడు చాలా సంతోషించాడు. అంతరంగంలో అనురాగం పొంగిపొరలగా అనుగునందనునితో అరవిందభవుడు ఇలా అన్నాడు.

చ. మునుకొని తండ్రియాజ్ఞఁ దలమోచి నిజోచితకృత్య మేమి వం
చినఁ దనశక్తియుక్తి నెడసేయక చేయుట పుండరీకలో
చన పదసేవ సేయుట ప్రజాపరిపాలనశాలి యౌటయున్
జనకునకున్ సుతుండు పరిచర్య లొనర్చుట సువ్వె పుత్త్రకా! 398

* నాయనా! కన్నతండ్రి ఆజ్ఞను శిరసావహించి, తనకు తగిన పని యని ఏ పని చెప్పితే దానిని దక్షతతో తత్క్షణం చేయడం శ్రీహరి పాదసేవ చేయడమే అవుతుంది. తండ్రి ఆజ్ఞానుసారం ప్రజలను పాలించడంకూడా తనయుడు తన తండ్రికి సేవ చేయుటం క్రిందకే వస్తుంది.

వ. కావున 399

మ. వివరింపన్ హరి యజ్ఞమూర్తిఁ బరమున్ విష్ణున్ హృషీకేశుఁ గే
శవుఁ బద్మాక్షుగుఱించి జన్మమును శశ్వద్భక్తిఁ గావింప మా
ధవుఁ డాత్మం బరితోషమొందుః నతఁ డుద్యత్ప్రీతిఁ గైకొన్న లో
క వితానంబులు దుష్టినొందు ననఘా! కావింపుమా యజ్ఞముల్. 400

* అందుకని పుణ్యమూర్తివైన స్వాయంభువా! యజ్ఞపురుషుడూ, పరమపురుషుడూ, హృషీకేశుడూ, కేశవుడూ, పద్మాక్షుడూ అయిన మహావిష్ణువునుగూర్చి అపారమైన భక్తితో యజ్ఞాలు చెయ్యి. అలా చేస్తే ఆ కమలాకాంతుడు ఎంతగానో సంతోషిస్తాడు. ఆ దేవుడు సంతోషిస్తే లోకాలన్నీ సంతృప్తి చెందుతాయి. అందుకని నీవు యజ్ఞాలు ఆచరించు.

చ. అకుటిలభక్తిఁ గేశవసమర్పణబుద్ధిఁ గ్రతుక్రియల్ వొన
ర్పక విపరీతులై యుముకరాసులు దంచి ఫలంబు నందఁగా

[illegible] గారక ధనవ్యయ మౌటయు కాని మోక్ష దా
[illegible] తత్ఫలము నందరు విష్ణుపరాఙ్ముఖక్రియుల్. 401

[illegible] చిత్తశుద్ధితో పరమేశ్వరార్పణ బుద్ధితో యజ్ఞ [illegible]. అలాకాక స్వార్థబుద్ధితో కాని పనులు చేసేవారు వట్టి [illegible] రాలేదని ఖేదమందేవారే అవుతారు. అందు [illegible] లాభం ఉండదు. హరి పరాఙ్ముఖులు [illegible] ఫలాన్ని అందుకోలేరు.

[illegible] హం వికారవిదూరు గుతించి చేయు నీ
[illegible] శుభస్థితిఁ జెందెడు, నీకుమారులున్
[illegible] నెమ్మి వహింపుముః సజ్జనావలిం
[illegible] బుత్రకః దోషలతాలవిత్రకాః 402

[illegible] తీగలకు కొడవలివంటి వాడవైన నీవు [illegible] యజ్ఞం చేయాలని భావించు. నీ [illegible] తుంది. నీవూ, నీ కుమారులూ [illegible]. నిర్మలమైన ధర్మమార్గంలో సజ్జ [illegible] ఉండండి.

[illegible]
[illegible] యైన యానతి యెట్ల
[illegible] నాకును నా
[illegible] యుండఁదగు నెల వెందున్. 403

[illegible] పుడు సరోజభవునితో ఇట్లా అన్నాడు. [illegible] నీవు చెప్పినట్లే చేస్తాను. అయితే నాకూ [illegible] తగిన చోటు ఎక్కడా కానరావటంలేదు.

తే. అరయ లేదు విధాత! యీయఖిల జంతు
జాతములకెల్ల నాధారభూతమైన
ధరణి యిప్పుడు ఘనజలాంతర్నిమగ్న
మైన కతమునఁ జోటు లేదంటిఁ దండ్రి! 404

* జగద్విధాతవైన ఓ జనకా! ఈ సృష్టిలోని అఖిల జంతుజాలానికీ ఆధారభూతమైన భూమి ఇప్పుడు మహాసముద్ర మధ్యంలో మునిగి ఉంది. అందువల్ల మాకు ఉంటానికి చోటు కన్పించటం లేదు.

క. కావున భూమ్యుద్ధరణము
గావించు నుపాయ మిపుడు గైకొని నాకున్
దేవా! నీ వెఱిఁగింపుము
నావుడుఁ బద్మజుఁడు దన మనంబునఁ దలఁచెన్. 405

* అందుకని ఓ దేవా! ఇప్పుడు భూమిని ఉద్ధరించే ఉపాయం ఆలోచించి నన్ను అనుగ్రహించు అని స్వాయంభువుడు పలుకగా బ్రహ్మ దేవుడు తన మనస్సులో ఇట్లా భావించాడు.

మ. జలమధ్యంబున లీనమైన ధరణీచక్రంబు నే నేర్పునన్
నిలుపన్ వచ్చును! బూర్వమందు జగముల్ నిర్మించునాఁ డాదిన
ప్పులఁ బుట్టించిన మీఁద నవ్వసుమతిం బుట్టించితి న్నట్టి య
ప్పులలోఁ గ్రుంకి రసాతలాంతరమునం బొందెం గదాపృథ్వియున్
406

* నీళ్ల నడుమ మునిగిపోయి ఉన్న భూమండలాన్ని పైకి తీసుకొని రావటం ఎలాగా? లోకాలను సృష్టించేటప్పుడు మొదట నీళ్లను పుట్టించాను. తర్వాత భూమిని సృష్టించాను. ఆ భూమి ఇపుడు జల మధ్యంలో మునిగి పాతాళమధ్యం చేరింది. దానిని ఏ విధంగా యథా స్థితికి తీసుకొని వచ్చేది?

*

నక చెడురీతి నూరక ధనవ్యయ మౌటయ కాని మోక్ష దా
యక మగుచున్న తత్ఫలము నందరు విష్ణుపరాఙ్ముఖక్రియుల్. 401

* పవిత్రమైన చిత్తశుద్ధితో పరమేశ్వరార్పణ బుద్ధితో యజ్ఞ కార్యాలు చేయాలి. అలాకాక స్వార్థబుద్ధితో కాని పనులు చేసేవారు వట్టి వరిపొట్టును దంచి బియ్యం రాలేదని ఖేదమందేవారే అవుతారు. అందు వల్ల ధననాశమేగాని లవలేశమూ లాభం ఉండదు. హరి పరాఙ్ముఖులు తాము ఆశించిన మోక్షఫలాన్ని అందుకోలేరు.

ఉ. కావున యజ్ఞముల్ హరి వికారవిదూరు గుఱించి చేయు నీ
భావము సూనృతవ్రత శుభస్థితిఁ జెందెడు, నీకుమారులున్
నీవును నీధరాభరము నెమ్మి వహింపుము; సజ్జనావలిం
బ్రోవుము ధర్మమార్గమునఁ బుత్రక! దోషలతాలవిత్రకా! 402

* కుమారా! పాపములనే తీగలకు కొడవలివంటి వాడవైన నీవు నిర్వికారుడైన సర్వేశ్వరుణ్ణిగూర్చి యజ్ఞం చేయాలని భావించు. నీ భావన సత్యస్వరూపమై శుభప్రదమౌతుంది. నీవూ, నీ కుమారులూ సంతోషంతో భూభారం వహించండి. నిర్మలమైన ధర్మమార్గంలో సజ్జనులైన ప్రజలను పరిపాలించుతూ ఉండండి.

క. అనవుడు నతనికి నతఁడి
ట్లనియెన్ భవదీయమైన యానతి యెట్ల
ట్లొనరించెద నాకును నా
తనయులకు వసించి యుండఁదగు నెల వెందున్. 403

* ఆ మాటలు విని స్వాయంభువుడు సరోజభవునితో ఇట్లా అన్నాడు. తండ్రీ! నీ ఆజ్ఞ శిరసావహించి నీవు చెప్పినట్లే చేస్తాను. అయితే నాకూ నా కుమారులకూ నివసించడానికి తగిన చోటు ఎక్కడా కానరావటంలేదు.

తే. అరయ లేదు విధాత! యీయఖిల జంతు
జాతములకెల్ల నాధారభూతమైన
ధరణి యిప్పుడు ఘనజలాంతర్నిమగ్న
మైన కతమునఁ జోటు లేదంటిఁ దండ్రి! 404

* జగద్విధాతవైన ఓ జనకా! ఈ సృష్టిలోని అఖిల జంతుజాలానికీ ఆధారభూతమైన భూమి ఇప్పుడు మహాసముద్ర మధ్యంలో మునిగి ఉంది. అందువల్ల మాకు ఉంటానికి చోటు కన్పించటం లేదు.

క. కావున భూమ్యుద్ధరణము
గావించు నుపాయ మిపుడు గైకొని నాకున్
దేవా! నీ వెఱిఁగింపుము
నావుడుఁ బద్మజుఁడు దన మనంబునఁ దలఁచెన్. 405

* అందుకని ఓ దేవా! ఇప్పుడు భూమిని ఉద్ధరించే ఉపాయం ఆలోచించి నన్ను అనుగ్రహించు అని స్వాయంభువుడు పలుకగా బ్రహ్మ దేవుడు తన మనస్సులో ఇట్లా భావించాడు.

మ. జలమధ్యంబున లీనమైన ధరణీచక్రంబు నే నేర్పునన్
నిలుపన్ వచ్చును? బూర్వమందు జగముల్ నిర్మించునాఁడాదిన
ప్పులఁ బుట్టించిన మీఁద నవ్వసుమతిం బుట్టించితి న్నట్టి య
ప్పులలోఁ గ్రుంకి రసాతలాంతరమునం బొందెం గదాపృథ్వియున్
406

* నీళ్ళనడుమ మునిగిపోయి ఉన్న భూమండలాన్ని పైకి తీసుకొని రావటం ఎలాగా? లోకాలను సృష్టించేటప్పుడు మొదట నీళ్లను పుట్టించాను. తర్వాత భూమిని సృష్టించాను. ఆ భూమి ఇపుడు జల మధ్యంలో మునిగి పాతాళమధ్యం చేరింది. దానిని ఏ విధంగా యథా స్థితికి తీసుకొని వచ్చేది?

*

నక చెడురీతి నూరక ధనవ్యయ మౌటయ కాని మోక్ష దా
యక మగుచున్న తత్ఫలము నందరు విష్ణుపరాఙ్ముఖక్రియుల్. 401

• పవిత్రమైన చిత్తశుద్ధితో పరమేశ్వరార్పణ బుద్ధితో యజ్ఞ కార్యాలు చేయాలి. అలాకాక స్వార్థబుద్ధితో కాని పనులు చేసేవారు వట్టి వరిపొట్టును దంచి బియ్యం రాలేదని ఖేదమందేవారే అవుతారు. అందు వల్ల ధననాశమేగాని లవలేశమూ లాభం ఉండదు. హరి పరాఙ్ముఖులు తాము ఆశించిన మోక్షఫలాన్ని అందుకోలేరు.

ఉ. కావున యజ్ఞముల్ హరి వికారవిదూరు గుఱించి చేయు నీ
భావము సూనృతవ్రత శుభస్థితిఁ జెందెడు, నీకుమారులున్
నీవును నీధరాభరము నెమ్మి వహింపుము: సజ్జనావళిం
బ్రోవుము ధర్మమార్గమునఁ బుత్రక! దోషలతాలవిత్రకా! 402

• కుమారా! పాపములనే తీగలకు కొడవలివంటి వాడవైన నీవు నిర్వికారుడైన సర్వేశ్వరుణ్ణిగూర్చి యజ్ఞం చేయాలని భావించు. నీ భావన సత్యస్వరూపమై శుభప్రదమౌతుంది. నీవూ, నీ కుమారులూ సంతోషంతో భూభారం వహించండి. నిర్మలమైన ధర్మమార్గంలో సజ్జనులైన ప్రజలను పరిపాలించుతూ ఉండండి.

క. అనవుడు నతనికి నతఁ డి
ట్లనియెన్ భవదీయమైన యానతి యె ట్ల
ట్లొనరించెద నాకును నా
తనయులకు వసించి యుండఁదగు నెల వెందున్. 403

• ఆ మాటలు విని స్వాయంభువుడు సరోజభవునితో ఇట్లా అన్నాడు. తండ్రీ! నీ ఆజ్ఞ శిరసావహించి నీవు చెప్పినట్లే చేస్తాను. అయితే నాకూ నా కుమారులకూ నివసించడానికి తగిన చోటు ఎక్కడా కానరావటంలేదు.

తే. అరయ లేదు విధాత! యీయఖిల జంతు
జాతములకెల్ల నాధారభూతమైన
ధరణి యిప్పుడు ఘనజలాంతర్నిమగ్న
మైన కతమునఁ జోటు లేదంటిఁ దండ్రి! 404

* జగద్విధాతవైన ఓ జనకా! ఈ సృష్టిలోని అఖిల జంతుజాలానికీ ఆధారభూతమైన భూమి ఇప్పుడు మహాసముద్ర మధ్యంలో మునిగి ఉంది. అందువల్ల మాకు ఉంటానికి చోటు కన్పించటం లేదు.

క. కావున భూమ్యుద్ధరణము
గావించు నుపాయ మిపుడు గైకొని నాకున్
దేవా! నీ వెఱిఁగింపుము
నావుడుఁ బద్మజుఁడు దన మనంబునఁ దలఁచెన్. 405

* అందుకని ఓ దేవా! ఇప్పుడు భూమిని ఉద్ధరించే ఉపాయం ఆలోచించి నన్ను అనుగ్రహించు అని స్వాయంభువుడు పలుకగా బ్రహ్మ దేవుడు తన మనస్సులో ఇట్లా భావించాడు.

మ. జలమధ్యంబున లీనమైన ధరణీచక్రంబు నే నేర్పునన్
నిలుపన్ వచ్చును? బూర్వమందు జగముల్ నిర్మించునాఁ డాదిన
ప్పులఁ బుట్టించిన మీఁద నవ్వసుమతిం బుట్టించితి న్నట్టి య
ప్పులలోఁ గ్రుంకి రసాతలాంతరమునం బొందెం గదాపృథ్వియున్ 406

* నీళ్లనడుమ మునిగిపోయి ఉన్న భూమండలాన్ని పైకి తీసుకొని రావటం ఎలాగా? లోకాలను సృష్టించేటప్పుడు మొదట నీళ్లను పుట్టించాను. తర్వాత భూమిని సృష్టించాను. ఆ భూమి ఇపుడు జలమధ్యంలో మునిగి పాతాళమధ్యం చేరింది. దానిని ఏ విధంగా యథాస్థితికి తీసుకొని వచ్చేది?

*

శ్రీ యజ్ఞ వరాహావతార వర్ణనము

సీ. అఖిలజగత్కల్ప నాటోపమునకుఁ బా
ల్పడిన నాచేత నెబ్బంగి నిపుడు
దగిలి విశ్వంభరోద్ధరణంబు గావింప
నగు నని సర్వభూతాంతరాత్ముఁ
బురుషోత్తముని నవపుండరీకాక్షు ల
క్ష్మీపతిఁ దన మనస్థితునిఁ జేసి
తలపోయుచున్నఁ బద్మజు నాసికా వివ
రమ్మున యజ్ఞవరాహమూర్తి

తే. యర్థి నంగుష్ఠమాత్రదేహంబుతోడ
జననమంది వియత్తలస్థాయి యగుచు
క్షణములోపల భూరి గజ ప్రమాణ
మయ్యె నచ్చటి జనముల కద్భుతముగ. 407

"లోకాలన్నీ సృష్టించాలనే భావంతో పటాటోపంతో ఎంతో ప్రయాసపడుతున్నాను. కాని నేను ఈ భూమిని ఉద్ధరింపగలనా! ఈ మహాకార్యం నాకు సాధ్యమౌతుందా?" అని బ్రహ్మ తన మనస్సులో తలపోసి సర్వాంతర్యామీ పురుషోత్తముడూ పుండరీకలోచనుడూ అయిన లక్ష్మీవల్లభుణ్ణి భావించాడు. వెంటనే అతని ముక్కునుండి యజ్ఞవరాహమూర్తి బొటన వ్రేలంత పరిమాణంతో జన్మించి, ఆకాశానికి ఎగిరి, ఒక్క క్షణంలోపలనే, అక్కడి జనులంతా ఆశ్చర్యచకితు లయ్యేటట్లుగా పెద్ద ఏనుగంత అయ్యాడు.

సీ. అంతఁ బ్రజాసర్గమందు నియుక్తులై
నట్టి మరీచ్యాదులైన మునులు
మనుకుమారకులు న మ్మనుసహితంబుగ
యజ్ఞవరాహంబు నర్థిఁ జూచి

"యిట్టి యాశ్చర్య మె ట్లెందేనిఁ గలదె. నా
సారంధ్ర నిర్గత స్తబ్ధరోమ
తోకంబు మనము విలోకింప నంగుష్ఠ
మాత్రమై యీక్షణమాత్రలోన

తే. మహిమ దీపింప దంతి ప్రమాణమును మ
హోన్నతంబైన గండశైలోపమంబు
నయ్యె" ననుచు వితర్కించిః రబ్జభవుఁడు
హర్ష మిగురొత్త నిట్లని యపుడు దలఁచె. 408

* అప్పుడు ప్రజల్ని సృష్టించడానికై నియమింపబడిన మరీచి మొదలైన మునులూ, మనువూ, మనువుకుమారులూ, యజ్ఞవరాహాన్ని చూచారు. "ఎంత అశ్చర్యం! నాసికారంధ్రం నుండి వెలువడ్డ వ్రేలెడు బాలవరాహం క్షణంలోనే పెద్ద ఏనుగంతయై మహాపర్వతం అంత అయింది. ఇలాంటి విచిత్రం ఎక్కడైనా ఉంటుందా!" అని తమలో తాము తర్కించుకొన్నారు. బ్రహ్మదేవుడు ఎంతో సంతోషంతో ఇట్లా అనుకున్నాడు.

క. నా మనమునఁ గల దుఃఖ వి
రామముఁ గావించుకొఱకు రాజీవాక్షుం
డీ మేర "యజ్ఞపోత్రి
శ్రీమూర్తి" వహించె నిది విచిత్రము దలఁపన్. 409

* నా మనస్సులోగల దుఃఖభారాన్ని దూరం చేయడానికై దేవాది దేవుడైన రాజీవాక్షుడు ఈ విధంగా యజ్ఞవరాహరూపం ధరించాడు. ఇదెంత వింత అయిన విషయం.

వ. అని వితర్కించు సమయంబున సూకరాకారుండయిన భగవంతుండు. 410

తే. ప్రళయజీమూత సంఘాతభయదభూరి
గర్జనాటోప భిన్నదిగ్ఘన గభీర
రావ మడరింప నపుడు రాజీవభవుఁడు
మునులు నానందమును బొంది రనఘచరిత! 411

* బ్రహ్మదేవుడు ఈ విధంగా భావిస్తూ ఉండగా యజ్ఞవరాహ మూర్తి అయిన దేవతాచక్రవర్తి ప్రళయకాలంలోని మేఘ సమూహాలు భయంకరంగా గర్జించినట్లు విజృంభించి దిక్కులు పిక్కటిల్లే విధంగా గంభీరంగా గర్జించాడు. నాయనా విదురా! ఆ ఘన గంభీరధ్వని విని బ్రహ్మదేవుడూ, మునులూ అపారమైన ఆనందాన్ని పొందారు.

వ. అంత మాయామయవరాహ ఘుర్ఘురారావంబు బ్రహ్మాండ కోటర పరిస్ఫోటనంబుఁ గావింప విని జనస్తపస్సత్యలోక నివాసు లయిన మునులు ఋగ్యజుస్సామ మంత్రంబుల వినుతించిరి: యజ్ఞవరాహరూపధరుండయిన సర్వేశ్వరుండు సత్పురుష పాలన దయాపరుండు గావున దిగ్గజేంద్రలీలావిలోలుండై. 412

* అప్పుడు ఆ కుహనా వరాహమూర్తి కావించిన ఘుర్ఘురారావానికి బ్రహ్మాండభాండ మంతా దద్దరిల్లి పోయింది. ఆ శబ్దాన్ని విని జన లోకంలో, తపోలోకంలో, సత్యలోకంలో ఉండే మునులు, ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలలోని మంత్రాలతో ఆ యజ్ఞవరాహమూర్తిని కీర్తించారు. యజ్ఞవరాహరూపాన్ని ధరించిన పరాత్పరుడు సజ్జనులను చక్కగా పరిపాలించే పరమదయాపరుడు కాబట్టి ఒక మహా దిగ్గజంలా క్రీడించాలని వేడుకపడ్డాడు.

సీ. కఠిన సటా చ్ఛటోత్కట జాత వాత ని
ర్ధూత జీమూత సంఘాత మగుచు
ఖురనిభ సునిశిత ఖుర పుటాహత చల
త్ఫణిరాజ దిగ్గజ ప్రచయ మగుచుఁ

జండ దంష్ట్రోత్థ వైశ్వాన రార్చిస్స్రవ
ద్రజత హేమాద్రి విస్రంభ మగుచు
ఘోర గంభీర ఘుర్ఘుర భూరి నిస్వన
పంకిలాఖిల వార్ధి సంకులముగఁ

తే. బొరలుఁ గెరలు నటించు నంబరము దెరల
రొప్పు నుప్పర మెగయును గొప్పరించు
ముట్టె బిగియించు మునమున మూరుకొనుచు
నడరు సంరక్షితక్షోణి యజ్ఞఘోణి. 413

• భూమిని రక్షించనున్న ఆ యజ్ఞవరాహం కర్కశమైన తన మెడమీది జూలు విదిల్చింది. దానివల్ల పుట్టిన వాయువేగానికి మేఘ మండలమంతా చెల్లాచెదరై పోయింది. చురకత్తివలె మిక్కిలి వాడి యైన ఆ వరాహమూర్తి గిట్టల కొనల తాకిడులకు అడుగునఉన్న ఆది శేషుడూ, దిగ్గజాలూ తల్లడిల్లి పోయారు. ఆ యజ్ఞవరాహం కఠోరాలైన కరకు కోరల రాపిడివల్ల పుట్టిన అగ్నిజ్వాలలకు వెండికొండ కైలాసమూ, బంగారుకొండ మేరువూ, కరగి ద్రవించి పోతాయేమో అనిపించింది. ఆ ఆదివరాహం భయంకరమూ గంభీరమూ అయిన తన ఘుర్ఘురారావంవల్ల సముద్రాలన్నీ అల్లకల్లోలం అయ్యేటట్లు చేస్తున్నది. ఈ విధంగా ఆ మహావరాహం పొరలుతూ, పొంగుతూ, సంతోషంతో గంతులువేస్తూ రొప్పుతూ, ఆకాశానికి ఎగురుతూ, విజృంభిస్తూ, మూతి బిగిస్తూ, నేలను మూచూస్తూ—ఇలా అనేక విధాలుగా ఊగుతూ చెలరేగుతూ ఉంది.

వ. మఱియు నయ్యజ్ఞవరాహంబు. 414

సీ. తివిరి చతుర్దశభువనంబులను దొంతు
లొరగఁ గొమ్ములఁ జిమ్ము నొక్కమాటు
పుత్తడికొండ మూఁపురమను నొరగంట
నొరకు రా రాపాడు నొక్కమాటు
ఖురముల సప్తసాగరముల రొంపిగా
నుక్కించి మట్టాడు నొక్కమాటు

నాభీలవాలవాతాహతిచే మింటి
నొరసి బ్రద్దలు సేయు నొక్కమాటు

తే. కన్నుఁగొనలను విస్ఫులింగములు సెదర
నురుభయంకరగతిఁదోఁచు నొక్కమాటు
పరమ యోగీంద్రజన సేవ్య భవ్య విభవ
యోగ్యమై కానఁగా నగు నొక్కమాటు. 415

* మరిన్నీ ఆ యజ్ఞవరాహం ఒకసారి పదునాల్గు భువనాలూ దొంతులు దొంతులుగా దొర్లిపడిపోయేటట్లు కొమ్ములతో చిమ్ముతుంది. మరోసారి తన మూపురమనే ఒరగల్లుతో పసిడికాంతులు ప్రసరించేటట్లు మేరుపర్వతాన్ని రుద్దుకొంటుంది. ఇంకోసారి సప్త సముద్రాల జలాలు బురదలై పోయేటట్లు ఎగిరి గంతులువేస్తూ తిరుగుతుంది. వేరొక్కసారి మిక్కిలి భయంకరంగా తోకను త్రిప్పడంవల్ల పుట్టిన గాలితాకిడికి ఆకాశం దద్దరిల్లి బ్రద్దలయ్యేటట్లు చేస్తుంది. ఒక్కొక్కమాటు కనుగొనల్లో అగ్ని కణాలు కురిపిస్తూ మహాభయంకరంగా కన్పిస్తుంది. ఇంకొక్కమాటు మహాయోగులకు సేవ్యమైన భవ్యదివ్యమై భవంతో శోభిల్లుతుంది.

వ. ఇట్లు విహరించుచుఁ బ్రాతర్మధ్యందినతృతీయ సవన రూపుం డయిన యజ్ఞవరాహమూర్తి యగు సర్వేశ్వరుండు మహా ప్రళయంబునందు యోగ నిద్రావశుండై యుండు నవసరంబున నుదకస్థంబైన భూమి రసాతలగతంబైన దాని నుద్ధరించుటకు సముద్రోదరంబుఁ దఱియంజొచ్చు వేగంబు సైరింపంజాలక సముద్రుండు దూర్మ్యులను భుజంబు లెత్తి విశీర్ణ హృదయుండై యార్తుని పగిది యజ్ఞవరాహః నన్ను రక్షింపు రక్షింపు" మని యాక్రోశింప నిశిత కరాళ క్షుర తీక్ష్ణంబులైన ఖురాగ్రంబుల జలంబులు విచ్ఛిన్నంబులు గావించి యపారంబయిన రసాతలంబుం బ్రవేశించి భూమిం బొడగను నవసరంబున. 416

* ఇలా విహరిస్తూ ఉదయమూ మధ్యాహ్నమూ సాయంకాలమూ యజ్ఞస్వరూపుడై యజ్ఞవరాహరూపం ధరించిన ఆ మహావిష్ణువు మహా

ప్రళయ కాలంలో తాను నిద్రలో ఉన్నప్పుడు జలంలోనున్న భూమి రసాతలంలోకి చేరినందువల్ల దానిని ఉద్ధరించడానికై సముద్రంలో ప్రవేశించాడు. ఆ వేగానికి సముద్రుడు తట్టుకోలేక అల్లకల్లోలమైన మనస్సుతో అలలు అనే చేతులు పైకెత్తి "యజ్ఞవరాహా! నన్ను రక్షించు, రక్షించు" అని వేడుకొన్నాడు. ఆ వరాహమూర్తి తన వాడియై వంకరలు తిరిగిన కత్తులవంటి గిట్టల కొనలతో సముద్రజలాలను చెల్లాచెదరు చేస్తూ పాతాళం లోపలికి దూసుకొనిపోయి అక్కడ భూమిని చూచాడు.

క. శరనిధిలోని మహోగ్రా
మరకంటకుఁ డెదురుఁ గాంచె మఖమయగాత్రిన్
ఖురవిదళితకులగోత్రిన్
ధరణీ కళత్రిన్ గవేష ధాత్రిన్ బోత్రిన్. 417

* ఆ సమయంలో ఆ సముద్రంలో దాగివున్న ఒక భయంకర రాక్షసుడు ఎదురయ్యాడు. ఆ క్రూరదానవుడు కులపర్వతాలను గిట్టలతో పగుల గొట్టేదీ, భూమిని ప్రియురాలుగా గ్రహించినదీ, భూమండలాన్ని వెదుకుతూ ఉన్నదీ యజ్ఞమయమైన శరీరం కలదీ అయిన ఆ వరాహాన్ని తన యెదుట దర్శించాడు.

వ. ఇట్లు పొడగని దైత్యుండు రోషభీషణాకారుండై. 418

* అట్లా చూచీచూడగానే వాడికి ఆగ్రహం వచ్చింది. రోషంచే భీకరమైన ఆకారంకలవాడైనాడు.

మ. గద సారించి యసహ్యవిక్రమసమగ్ర స్ఫూర్తితో వ్రేయఁగా
నది దప్పించి వరాహమూర్తి నిజదంష్ట్రాగ్రాహతిం ద్రుంచెఁ బెం
పొదవం గ్రోధమదాతిరేకబలశౌర్యోదారవిస్తార సం
పదఁ బంచాస్యము సామజేంద్రుఁ జలమొప్పం ద్రుంచు చందంబు
నన్. 419

* ఆ రాక్షసుడు అనివార్యమైన మహాశౌర్యంతో గిరగిరా గద త్రిప్పి వేశాడు. వరాహమూర్తి అది తప్పించుకొన్నాడు. క్రోధంతో గర్వంతో

అపారమైన పరాక్రమంతో విజృంభించిన మృగరాజు గజరాజును మట్టు పెట్టినట్లు ఆ వరాహమూర్తి తన వాడికోరల అంచులతో వాడిని విదలించి తుదముట్టించాడు.

మ. దితిజాధీశుని నీ గతిం దునిమి యుద్వృత్తిం దదీయాంగ శో
ణితపంకాంకితగండభాగుఁ డగుచు న్విష్ణుండు దా నొప్పె వి
స్తృత సంధ్యాంబుద ధాతు చిత్రిత సముద్దీప్తక్షమాభృద్గతిన్
క్షితి దంష్ట్రాగ్రమునన్ ధరించి జలరాశిం బాసి యే తెరఁగన్. 420

* ఆ రాక్షసుడిని ఈ విధంగా వధించి వాడి వేడి వేడి నెత్తురు ధారలతో నిండిన చెక్కిళ్లుగలవాడైన వరాహమూర్తి సాయం సమయాన ఎర్రబడిన మేఘాలతో గైరికాది ధాతువులతో జాజువారిన మహాపర్వతం వలె ఒప్పుతూ భూమిని తన కోరచివర ధరించి సముద్రంలోనుండి బయటికి వచ్చాడు.

తే. బాల శీతాంశు రేఖా విభాసమాన
ధవళ దంష్ట్రాగ్రమున నున్న ధరణి యొప్పె
హరికి నిత్యానపాయిని యైన లక్ష్మి
నెరయఁ బూసిన కస్తూరి నికర మనఁగ. 421

* విదియనాటి చంద్రరేఖలా విరాజిల్లుతున్న తెల్లని కోరకొనపై నున్న ఆ భూమి, స్వామిని ఎప్పుడూ ఎడబాయని శ్రీ మహాలక్ష్మి - ఆయనకు పూసిన కస్తూరీ పంకం లాగా కన్పించింది.

శ్రీ యజ్ఞవరాహమూర్తిని బ్రహ్మాదులు స్తుతియించుట

వ. అట్టి యజ్ఞపోత్రిమూర్తిం జూచి కమలాసన ప్రముఖు లిట్లని స్తుతియించిరి. 422

* అటువంటి యజ్ఞవరాహమూర్తిని చూచి బ్రహ్మాది దేవతలు ఇలా కీర్తించారు.

సీ. "దేవ! జితం జితం తే పరమేశ్వర!
జితయజ్ఞభావన! శ్రుతిశరీర!"
యనుచుఁ గారణసూకరాకారుఁ డగు నీకు
నతిభక్తి మ్రొక్కెదమయ్య వరద!
భవదీయ రోమకూపములందు లీనంబు
లై యుండు నంబుధు లట్టి యధ్వ
రాత్మకమై తనరారు నీ రూపంబు
గానంగరాదు దుష్కర్మపరుల

తే. కట్టి నీకుఁ బ్రణామంబు లాచరింతు
మఖిలజగదేకకీర్తి! దయానువర్తి!
భవ్యచారిత్ర! పంకజపత్రనేత్ర!
చిరశుభాకార! యిందిరాచిత్త చోర! 423

* దేవదేవా! జయం! జయం! ఓ పరమేశ్వరా! జయం! జయం! నీవు యజ్ఞాధిపతివి! వేదమూర్తివి! దుష్టశిక్షణ శిష్టరక్షణార్థం వరాహావతారం ధరించిన నీకు పరమ భక్తితో ప్రణమిల్లుతున్నాము. నీవు వరదుడవు! ఈ మహాసముద్రా లన్నీ నీ రోమకూపాలలో ఇమిడి ఉన్నాయి. అటువంటి నీ యజ్ఞవరాహ స్వరూపాన్ని అజ్ఞులు దర్శించలేరు. విశాల విశ్వ విఖ్యాత కీర్తివీ, పరమ కరుణామూర్తివీ, పరమ పవిత్ర చరిత్రుడవూ, పద్మదళాయత నేత్రుడవూ, చిర మంగళాకారుడవూ శ్రీరమా చిత్త చోరుడవూ అయిన నీ కివే మా కైమోడ్పులు.

వ. అని వెండియు నిట్లు స్తుతియించిరి. 424

సీ. త్వక్కున నఖిలవేదములు, రోమంబుల
యందును బర్హిస్సు, లక్షులందు
నాజ్యంబు, పాదంబులందుఁ జాతుర్హోత్ర
కలితంబులగు యజ్ఞకర్మములును,

స్రుక్కు తుండంబున, స్రువము నాసికను, ని
డా పాత్ర ముదరకోటరమునందు,
శ్రవణాస్యబిలములఁ జమసప్రాశిత్రముల్,
గళమున నిష్టిత్రికంబు, జిహ్వఁ

తే. దగుఁ బ్రవర్గ్యము, నగ్నిహోత్రమును నీదు
చర్వణంబును, సభ్యావసథ్య లుత్త
మాంగ మసువులు చయనము లగుఁ గిటీశ!
యనుచు నుతియించి రత్తఱి యజ్ఞవిభుని. 425

* అని ఇంకా ఈ విధంగా దేవతలు దేవాదిదేవుణ్ణి స్తుతించారు. "ఓ స్వామీ! నీ చర్మం నుండి సమస్త వేదాలూ జనించాయి. నీ రోమ కూపాల నుండి అగ్నులు ఆవిర్భవించాయి. నీ కన్నులనుండి హోమ ద్రవ్యమైన నెయ్యీ, నీ నాలుగు పాదాలనుండి నాలుగు హోత్రాలతో కూడిన యజ్ఞకర్మలూ, ముట్టె నుండి స్రుక్కూ, ముక్కునుండి స్రువమూ, ఉదరమునుండి ఇడాపాత్రమూ, చెవులనుండీ, ముఖం నుండీ చమసం, ప్రాశిత్రం అనే పాత్రలూ, కంఠం నుండి ఇష్టులు అనే మూడు యజ్ఞాలూ, నాలుక నుండి ప్రవర్గ్యం అనే యజ్ఞమూ పుట్టాయి. నీ చర్వణమే అగ్ని హోత్రం. సభ్యంఅంటే హోమరహితాగ్ని, అవసథ్యం అంటే ఔపాసనాగ్ని నీ శిరస్సునుంచి జనించాయి. చయనాలు నీ ప్రాణ స్వరూపాలు. నీవు యజ్ఞాధినాథుడవు! యజ్ఞవరాహమూర్తివి!

వ. వెండియు ముహుర్ముహుర్భగవదావిర్భావంబు దీక్షణీయేష్టి యగు. నీదు దంష్ట్రలు ప్రాయణీయంబను దీక్షానంతరేష్టియు, నుదయనీయం బను సమాప్తేష్టియు, యుష్మద్రేతంబు సోమం బును, ద్వదీయావస్థానంబు ప్రాత స్సవనాదులు, నీదు త్వఙ్మాం సాది సప్తధాతువు లగ్నిష్టోమోక్థ్యషోడశీ వాజపే యాతిరాత్రా ప్తోర్యామంబు లను సంస్థాభేదంబులును ద్వాదశాహాదిరూపంబు లైన బహు యాగసంఘాతరూపంబులు నగు: సర్వ సత్త్రంబులు

భవదీయశరీర సంధులు; సనోమాసోమంబులగు యజ్ఞక్రతువులు నీవ; మఱియును నీవు యజనబంధనంబులచే నొప్పుచుందు వది యునుం గాక. 426

* అంతేకాక భగవంతుడవైన నీవు మాటిమాటికి ఆవిర్భవించటం "దీక్షణీయ" మనే యజ్ఞము. "ప్రాయణీయ" మనే దీక్షానంతరం జరిపే ఇష్టి, "ఉదయనీయము" అనే సమాప్తేష్టి నీ కోరలు. సోమ రసం నీ రేతస్సు. నీ ఉనికియే ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయం సమయం అనే మూడు యజ్ఞాంశాలు. నీ చర్మం మాంసం మొదలైన సప్తధాతువులూ, అగ్నిష్టోమం, ఉక్థ్యం, షోడశి, వాజపేయం, అతి రాత్రం, అప్తోర్యామం, ద్వాదశాహం మొదలైన యజ్ఞభేదాలు. సమస్త యజ్ఞాలు నీ శరీరసంధులు. సోమంతో కూడినవీ, కూడనివీ అయిన క్రతువు లన్నీ నీవే. నీవే యజ్ఞబంధాలతో అలరారుతూ ఉంటావు.

క. హవరూపివి; హవనేతవు;
హవభోక్తవు; నిఖిలహవఫలాధారుఁడవున్;
హవరక్షకుఁడవు నగు నీ
కవితథముగ నుతు లొనర్తుమయ్య ముకుందా! 427

* అంతేగాక నీవు యజ్ఞ స్వరూపుడవు. యజ్ఞ కర్తవు. యజ్ఞ భోక్తవు. యజ్ఞ ఫలప్రదాతవు. యజ్ఞ రక్షకుడవు. సమస్తము నీవే! ఓ ముకుందా! నీకు మా హృదయపూర్వకమైన అభివందనాలు.

తే. సత్త్వగుణమున సద్భక్తి సంభవించు
భక్తియుతముగఁ జిత్తంబు భవ్య మగును
హృదయపద్మంబునం దోలి నెఱుగఁబడిన
యట్టి నీకు నమస్కారమయ్య వరద! 428

* సత్త్వగుణంవల్ల మంచి భక్తి ప్రాప్తిస్తుంది. భక్తితోకూడిన మనస్సు పవిత్రం అవుతుంది. అటువంటి భక్తియుక్తమైన పవిత్ర హృదయ పద్మంతో భావించి సేవింపదగిన ఓ దేవదేవా! నీకు నమస్కారం.

మ. అరవిందోదర! తావకీన సిత దంష్ట్రాగ్రావలగ్న క్షమా
ధర నద్యబ్ధి నదాటవీ యుత సమిద్ధక్ష్మాతలం బొప్పె భా
సుర కాసార జలావతీర్ణ మదవచ్ఛుండాలరాడ్దంత శే
ఖర సంసక్త సపత్ర పంకజము రేఖం బొల్పు దీపింపఁగన్. 429

* పద్మనాభా! పర్వతాలతో, నదీనదాలతో, సముద్రాలతో, అరణ్యాలతో నిండిన ఈ భూమండలం నీ తెల్లనికోర చివర ప్రకాశిస్తున్నది. ఆ భూదేవి మనోహరమైన సరోవర జలాలలో దిగిన మదగజేంద్రుని దంతాగ్రాన తగుల్కొని ఉన్న ఆకుతోకూడిన తామర పువ్వులాగా చూడ ముచ్చటగా ఉంది.

వ. మఱియును. 430

మ. చతురామ్నాయ వపుర్విశేష ధర! చంచత్సూకరాకార! నీ
సితదంష్ట్రాగ్రవిలగ్నమైన ధర రాజిల్లెం గులాద్రీంద్ర రా
జిత శృంగోపరిలగ్న మేఘము గతిం జెల్వారి, విద్వజ్జనాం
చిత హృత్పల్వలలోల! భూరమణ! లక్ష్మీనాథ! దేవోత్తమా!
431

* అంతేకాదు, చతుర్వేద స్వరూపమైన శరీరాన్ని ధరించి ఉన్న ఓ యజ్ఞవరాహస్వామీ! నీవు జ్ఞానవంతుల అంతరంగా లనే నీటిమడుగులలో క్రీడిస్తుంటావు. భూదేవికి శ్రీదేవికి మనోహరుడవు. దేవతలందరికీ అగ్రేసరుడవు. స్వామీ! ని తెల్లని దంష్ట్రించలాన తగులుకొన్న భూమి కొండల చక్రవర్తి వెండి శిఖరాగ్రాన విరాజిల్లుతుండే నీలమేఘంలా అందాలు చిందుతూ ఉంది.

సీ. సమధిక స్థావరజంగమాత్మక మైన
వసుమతీచక్ర మవక్రలీల
నుద్ధరింపుము; కరుణోపేత చిత్తుండ
వగుచు నస్మన్మాత యయ్యె ధరణి;
మాత యౌ టెట్లని మదిఁ దలంచెదవేని,
జర్చింప మాకు విశ్వమున కీవు
జనకుండ వగుట యుష్మత్పత్ని భూదేవి
యగుట మాకును దల్లి యయ్యె; నిపుడు

తే. ధరకు నీతోడఁ గూడ వందన మొనర్తు
మరణియందును యాజ్ఞికుఁ డగ్ని నిలుపు
కరణి మీ తేజ మీ ధరాకాంతయందు
నిలుప ధరణి పవిత్రయై నెగడుఁ గాన. 432

* కరుణారసం నిండిన హృదయం కలవాడవై సకల చరాచర సమూహంతో నిండిన ఈ భూమండలాన్ని సముద్రజలాల్లో మునిగి పోకుండా ఉద్ధరించు. ఈ భూమి మాకు తల్లి. ఎలాగంటావేమో! మాకూ ఈ లోకానికి నీవు తండ్రివి. నీవు ధరించుటచే భూదేవి నీ భార్య అయింది. అందుకని ఆమె మాకు తల్లియే అవుతుంది. నీతో పాటు ఈ భూమికి నమస్కారం చేస్తాము. యజ్ఞకర్త అరణియందు అగ్నిని నిల్పిన విధంగా నీవు నీ తేజస్సును ఈ భూమియందు నిల్పడంవల్ల ఈ ధరిత్రి పవిత్రమై ఒప్పుతూ ఉంది.

చ. తలఁప రసాతలాంతర గతక్షితిఁ గ్రమ్మఱ నిల్పినట్టి నీ
కలితన మెన్న విస్మయము గాదు; సమస్తజగత్తు లోలిమైఁ
గలుఁగఁగ జేయు టద్భుతము గాక, మహోన్నతి నీ వొనర్చు పెం
పలరిన కార్యముల్ నడప నన్యులకుం దరమే రమేశ్వరా? 433

* లక్ష్మీవల్లభా! వాస్తవంగా ఆలోచిస్తే సమస్తలోకాలను క్రమానుసారంగా సృష్టించడమన్నది అత్యద్భుతమైన విషయం. అటువంటి నీ

శక్తి ముందు పాతాళంలో ఉన్న భూమిని యథాస్థితికి తెచ్చినిల్పిన ఈ నీ సామర్థ్యం ఏమంత ఆశ్చర్యాన్ని కలిగించేదిగా లేదు. ఇటువంటి మహాకార్యాలు నిర్వహించటానికి నీవే సమర్థుడవు. ఇతరులకు ఈ కృత్యాలు అసాధ్యాలు.

చ. సకల జగన్నియామక విచక్షణలీలఁ దనర్చునట్టి నం
దకధర! తావక స్ఫురదుదారత మంత్రసమర్థుఁ డైన యా
జ్ఞికుఁ డరణిన్ హుతాశనుని నిల్పినకైవడి మున్నివాస మౌ
టకుఁ దలపోసి యీ క్షితి దృఢంబుగ నిల్పితివయ్య యీశ్వరా! 434

* "నందకము" అనే ఖడ్గాన్ని ధరించిన ముకుందా! నేర్పుతో సకలలోకాలను ఒక నియమబద్ధంగా ఏర్పాటుచేసిన నేర్పరివి. మంత్రసిద్ధుడైన యాజ్ఞికుడు అరణియందు అగ్నిని నిల్పినట్లు నీవు దయపూని మేము నిలబడి మనుగడ సాగించటానికి ఈ భూమిని ఈ విధంగా సుస్థిరంగా నిలబెట్టావు! ఎంతటి ఔదార్యం ప్రకటించావు స్వామీ!

చ. సలలిత వేదశాస్త్రమయ సౌకరమూర్తి దనర్చుచున్ రసా
తలముననుండి వెల్వడు నుదారత మేను విదుర్పఁ దత్సటో
చ్ఛలితములైన బిందువుల సాధు తపో జన సత్యలోక వా
సులమగు మేము దోఁగి పరిశుద్ధి వహించితిమయ్య మాధవా! 435

* ఓ మాధవా! ఆహ్లాదంతో వేదశాస్త్ర స్వరూపమైన ఆదివరాహమూర్తివైన నీవు పాతాళం నుండి బయటికి వస్తూ సముద్రజలాలతో తడిసిన నీశరీరాన్ని విదిలించావు. ఆ సమయంలో నీ మెడమీది జూలు నుండి నీటి చుక్కలు నలుదెసలా ఎగిరిపడ్డాయి. పరమ పవిత్రాలయిన ఆ జలబిందువులలో తడిసి తపోలోకంలో, జనలోకంలో, సత్యలోకంలో నివసించే మేమంతా ఎంతగానో పరిశుద్ధులం అయినాము స్వామీ!

ఉ. విశ్వభవస్థితి ప్రళయవేళలయందు వికారసత్త్వమున్
విశ్వము నీవ యీ నిఖిలవిశ్వము లోలి సృజింతు విందిరా

ధీశ్వర ! యీశ ! కేశవ ! త్రయీమయ ! దివ్యశరీర ! దేవ ! నీ
శాశ్వతలీల లిట్టి వని సన్నుతి సేయఁగ మాకు శక్యమే ? 436

* ఓ లక్ష్మీవల్లభా ! ఈ ప్రపంచం సృష్టించేది, రక్షించేది, లయం చేసేది నీవే ! సమస్తమూ నీవై ఈ సమస్త లోకాలనూ మళ్లీ మళ్లీ సృష్టిస్తున్నావు. ఈశ్వరా ! కేశవా ! వేదమయా ! దివ్యస్వరూపా ! దేవ దేవా ! అంతులేని నీ వింత లీలలు "ఇంతటివి ఇటువంటివి" అని వర్ణించడానికి మాకు చేతనవుతుందా ?

సీ. పంకజోదర నీ వపార కర్ముండవు
భవదీయకర్మాబ్ధిపార మిద
నెఱిఁగెద నని మది నిచ్చగించినవాఁడు
పరికింపఁగా మతిభ్రష్టు గాక
విజ్ఞానియే ? చూడ విశ్వంబు నీ యోగ
మాయాపయోనిధి మగ్నమౌటఁ
దెలిసియుఁ దమబుద్ధిఁ దెలియని మూఢుల
నే మన నఖిలలోకేశ్వరేశ !

తే. దాసజనకోటి కతి సౌఖ్యదాయకములు
వితతకరుణా సుధా తరంగితము లైన
నీకటాక్షేక్షణములచే నెఱయ మమ్ముఁ
జూచి సుఖులను జేయవే సుభగ చరిత ! 437

* దామోదరా ! లోకకల్యాణార్థం నీవు చేసే కార్యాలు అనంతాలు. "మహాసముద్రంవంటి వాటి అంతు తెలుసుకుంటాను" అని నిశ్చయించుకునే వాడు మతిభ్రష్టుడూ, అజ్ఞానీ అవుతాడేగాని విజ్ఞాని కాదు. ఈ సమస్త ప్రపంచం నీ యోగమాయా సముద్రంలో విలీనం అయివున్నదన్న సంగతి తెలిసికూడా నీ ప్రభావాన్ని తెలయని ఆ మందబుద్ధులను ఏమనాలి ? అఖిలలోకాధీశ్వరా ! నీ చరణదాసులకు సర్వదా సమధిక సౌఖ్యాన్ని కలిగించేవీ, అపారమైన కరుణ అనే అమృతతరంగాలు పొంగి

పొరలేవీ అయిన నీ కడగంటి చూపులతో మమ్మలను చక్కగా చూచి సుచరిత్రా! మాకు సుఖసంతోషాలను అనుగ్రహించు.

క. అని బ్రహ్మవాదు లగు స
న్మని వర్యులు భక్తియోగమున వినమితులై
మనమున మోదము ముప్పిరి
గొనఁ బొగడిరి ఖుర విదళిత గోత్రిం బోత్రిన్. 438

* అని బ్రహ్మజ్ఞాన సంపన్నులైన మునివరేణ్యులు భక్తిప్రపత్తులతో వినయ విన్రములై తమ అంతరంగాలలో ఆనందతరంగాలు పొంగులెత్తగా గిట్టలచే కొండలను సైతం పగులగొట్టినట్టి జగజెట్టియైన వరాహ స్వామిని ప్రస్తుతించారు.

ఉ. అంతట లీలఁబోలె జగదాత్ముఁడు యజ్ఞవరాహమూర్తి య
త్యంత గభీర భీషణ మహార్ణవ తోయసమూహమున్ ఖురా
క్రాంతముఁ జేసి క్రమ్మఱ ధరాతల మంబులమీఁద నిల్పి వి
శ్రాంతివహింపఁజేసి గుణశాలి తిరోహితుఁడయ్యెనయ్యెడన్. 439

* అనంతరం పరమాత్మ స్వరూపుడైన ఆ యజ్ఞవరాహమూర్తి మహాభయంకరమూ, అత్యంత గంభీరమూ ఐన ఆ సముద్ర జలాన్నంతా తన గిట్టలతో ఆక్రమించి, మళ్లీ భూమిని ఎప్పటిలాగా సుస్థిరంగా, సుఖంగా నీళ్ల మీద నిల్పాడు. అనంతరం అనంతగుణసంపన్నుడైన ఆ స్వామి అదృశ్యమయ్యాడు.

ఉ. మంగళమైన యీ కథ సమంచితభక్తిఁ బఠింప విన్న వా
రిం గరుణార్ద్ర దృష్టిఁ గని శ్రీహరి సొలఁ బ్రసన్నుఁడౌను, స
త్సంగతుఁడైన విష్ణుఁడు ప్రసన్నుఁడు దా నగునేని వారికిన్
మంగళముల్ లభించు; ననుమానములేదదిగాకవెండియున్. 440

* ఈ కథ శుభప్రదమైనది. ఈ కథను ఎవ్వరు భక్తితో చదువు తారో, ఎవ్వరు వింటారో వారిని కమలాక్షుడు కటాక్షిస్తాడు. అటువంటి వారి విషయంలో శ్రీహరి ప్రసన్నుడౌతాడు. ఆ విధంగా శ్రీహరి ప్రస న్నుడైన వారికి సమస్త సన్మంగళాలూ సంప్రాప్తిస్తాయి. ఇందుకు సందేహం లేదు.

చ. హరి నిజదాసకోటికి గుహాశయుఁడై రమియించుః నట్టి స
త్పురుషుల కిష్టవస్తుపరిపూర్ణ మనోరథసిద్ధి గల్గుః సు
స్థిరమగుచున్న మోక్ష మరచేతిదియై చెలువారు నన్న న
స్థిరతరతుచ్ఛ సౌఖ్యములు సేకుఱుటల్ మఱి చెప్ప నేటికిన్. 441

* తన చరణదాసుల హృదయాంతరాలలో భగవంతుడు విలా సంగా విహరిస్తూ ఉంటాడు. అటువంటి సజ్జనులకు కోరిన వస్తువులన్నీ సమృద్ధిగా సిద్ధిస్తాయి. అక్షయమైన మోక్షం అరచేతిలోనిదై అలరారు తుంది. అటువంటప్పుడు అస్థిరమైన సామాన్య వస్తువుల విషయం వేరే చెప్పాలా!

ఉ. కాన సరోజలోచను జగత్ స్తవనీయకథాసుధారసం
బానినయట్టి జిహ్వ యసదన్య కథాలవణోదకంబులం
బానము సేయఁ జూచునెః సుపర్వమహీజ మరందపాన లా
భానుభవంబు నొందు మధుపప్రభు వేఁగునె వేఁపచెట్లకున్? 442

* అందువల్ల సమస్త లోకాలకూ సంస్తవనీయాలైన విష్ణుదేవుని కథా సుధారసాలు కమ్మగా త్రాగిన నాలుక, హితంకాని ఇతర కథలు అనే ఉప్పునీళ్లను త్రాగడానికి ఇష్టపడుతుందా! నందనవనంలోని మందార మకరందాన్ని త్రాగటం అలవాటైన మేటి తుమ్మెద వేపచెట్ల వైపు వెళ్ళా లనుకుంటుందా!

క. అని మైత్రేయ మునీంద్రుం
డనఘుఁడు విదురునకుఁ జెప్పినట్టి తెఱంగ
ర్జున పౌత్రునకున్ వ్యాసుని
తనయుఁడు వినిపించి మఱియుఁ దగ నిట్లనియెన్. 443

* అని మైత్రేయ మహర్షి వికార విదూరుడైన విదురునకు వినిపించిన ఈ కథా విధానాన్ని వ్యాసమునీంద్రులవారి పుత్రుడైన శుక మహర్షి అర్జునుని పౌత్రుడైన పరీక్షిన్నరేంద్రునికి వినిపించి ఇంకా ఇలా అన్నాడు.

క. అని చెప్పిన మైత్రేయునిఁ
గనుఁగొని విదురుండు వల్కు ఘనతరమగు నా
దనుజకులాంతకు చరితము
విని తనియదు నా మనంబు విమలచరిత్రా! 444

* ఈ విధంగా మైత్రేయుడు చెప్పగా విదురుడు విని ఇలా అన్నాడు. "సచ్చరిత్రా! పరమ పవిత్రమైన విష్ణుదేవుని చరిత్రం ఎంత విన్నా నా మనస్సుకు తనివితీరకుండా ఉంది.

చ. సవనవరాహమూర్తి కథ సర్వము నీ దయ వింటిః వెండియున్
వివరముగా వినం బలుకవే గుణసాంద్ర! మునీంద్ర చంద్ర! మా
ధవ గుణకీర్తనామృత వితానముఁ గర్ణపుటాంజలిన్ వెసం
జవిఁగొన కేల మాను జనసంతతికిన్ భవతాపవేదనల్. 445

* మునీంద్రా! సుగుణసాంద్రా! యజ్ఞవరాహమూర్తి కథ నీ దయవల్ల విన్నాను. కానీ, ఇంకా విశదంగా వివరించి చెప్పు. మానవులు మధురాతి మధురమైన మాధవ కథా సుధారసాన్ని చెవులనే దోసిళ్లతో ఆస్వాదించకపోతే వారి సంసారతాపాలు ఎలా తీరుతాయి?

వ. కావున 446

సీ. శ్రీహరి యజ్ఞవరాహ రూపముఁ దాల్చి
మించి హిరణ్యాక్షుఁ ద్రుంచె ననుచు
నప్పుడు మునినాథ చెప్పితి నాతోడ
నవ్వరాహంబు దంష్ట్రాగ్రమునను

ధరణి నెబ్భంగిని ధరియించె? హరికి హి
రణ్యాక్షుతోడ వైరమున కేమి
కారణ? మసుర నే గతి సంహరించె దా?
నింతయు నెఱిఁగింపు మిద్ధచరిత!

తే. యనిన మైత్రేయముని విదురునకు ననియె
హరికథాకర్ణనమునఁ బెంపారు నీకు
జన్మఫల సిద్ధి యగుటకు సందియంబు
వలదు; హరిమాయ విధికైన వశమె తెలియ? 447

* అందుకని అడుగుతున్నాను. శ్రీమహావిష్ణువు యజ్ఞవరాహ రూపం ధరించి విజృంభించి హిరణ్యాక్షుడనే రాక్షసుణ్ణి సంహరించాడని చెప్పావు కదా! ఓ మునివరా! ఆ వరాహం తన కోరచివర ఈ ధరణీ మండలాన్ని ఎలా ధరించింది? హిరణ్యాక్షునకూ విష్ణువునకూ విరోధం రావటానికి కారణం ఏమిటి? ఆ రాక్షసుణ్ణి శ్రీహరి ఏ విధంగా వధించాడు? ఓపవిత్ర చరిత్రా! సవిస్తరంగా ఇదంతా నాకు చెప్పు — అనగా మైత్రేయుడు విదురునితో ఇట్లా అన్నాడు. 'నాయనా! ఆ శ్రీహరి కథలు ఆకర్ణించాలి అనే ఆసక్తిగల నీకు జన్మసాఫల్యం సిద్ధించింది. ఇందుకు సందేహం లేదు. ఆ శ్రీమన్నారాయణుని మాయ తెలిసికోవడానికి బ్రహ్మకైనా తరంకాదు.

క. అనఘాత్మ నన్ను నీ వడి
గిన యీ కథ ధ్రువుఁడు విష్ణుకీర్తన పరతం
దనరిన నారదు నడుగ న
తని కతఁ డెఱిఁగింప హరికథాశ్రవణమునన్. 448

* పుణ్యాత్ముడా! నీవు అడిగిన ఈ కథను పూర్వం ధ్రువుడు విష్ణుభక్తి విశారదుడైన నారదుణ్ణి అడిగి తెలుసుకొన్నాడు. హరికథా శ్రవణంవల్ల అత డెంతో మహిమాన్వితుడైనాడు.

తే. దండధరుఁ బెల్చ డాకాలఁ దన్ని ధ్రువుఁడు
నిందు నందును వాసికి నెక్కెఁ; నట్టి
విష్ణుసంకీర్తనం బరవిందభవుఁడు
దివిజులకుఁ జెప్పె నది నీకుఁ దేటపఱుతు. 449

వ. అవధరింపుము. 450

* అటువంటి ప్రభావాన్ని సంపాదించిన ధ్రువుడు యమధర్మ రాజును ఎడమకాలితో తన్ని ఈ లోకంలోనూ పరలోకంలోనూ కూడా ప్రసిద్ధికెక్కి ఉత్తమపదాన్ని అందుకున్నాడు.

అటువంటి వాసుదేవుని లీలావిశేషాలను బ్రహ్మదేవుడు దేవతలకు చెప్పాడు. అదంతా నీకు విశదంగా చెబుతాను; విను.

మైత్రేయ మహాముని విదురునకు హిరణ్యాక్ష హిరణ్యకశిపుల వృత్తాంతం బెఱింగించుట

సీ. బలిసి దక్షప్రజాపతి తనూభవ దితి
సంతానరుచి మానసమునఁ బొడము
నొకనాఁడు పుష్పసాయక శర నిర్భిన్న
భావయై విరహతాపమున వచ్చి
పతి సమాగమవాంఛ ప్రభవింప నిజనాథు
సన్నిధి నిలిచి యస్ఖలిత నియతి
నగ్నిజిహ్వుండును యజురధీశుండును
నగు విష్ణుఁ దన చిత్తమందు నిలిపి

తే. తగఁ బయస్సున నగ్నిహోత్రంబు సేసి
కమలహితుఁ డస్తశైల సంగతుఁడు గాఁగ
హోమశాలాంగణమునఁ గూర్చున్న విభునిఁ
గశ్యపునిఁ గాంచి వినయవాక్యముల ననియె. 451

* దక్షప్రజాపతి పుత్రిక దితి. ఆమె మనస్సులో సంతానకాంక్ష పెల్లుబికింది. మన్మథుని పుష్పబాణాలు ఆమె హృదయాన్ని అల్లకల్లోలం చేశాయి. విరహవేదన భరించలేక భోగవాంఛతో తన పతి అయిన కశ్యపప్రజాపతి దగ్గరకు వెళ్ళింది. ఆయన అప్పుడే నిశ్చల నియమంతో వేదవేద్యుడూ జ్యోతిర్మయుడూ అయిన మహావిష్ణువును ఉద్దేశించి యథావిధిగా అగ్నికార్యం నెరవేర్చి సూర్యాస్తమయ సమయంలో హోమశాల ముందర కూర్చొని ఉన్నాడు. ఆయనతో ఆమె వినయంగా ఇట్లా అంది.

చ. గజవిభుఁ డుద్ధతి న్నఁటికంబములన్ విదళించు లీలఁ జి
త్తజుఁడు ప్రసూనసాయక వితానముచేత మదీయచిత్తమున్
గజిబిజిసేసి పెన్వగలఁ గాఁతియ పెట్టఁగ నాథ! నీ పదాం
బుజములఁ గాన వచ్చితిఁ, బ్రభుత్వ మెలర్పఁగ నన్నుఁ గావవే! 452

* ప్రాణేశా! గజరాజు అరటి చెట్టును గజిబిజి చేసినట్లు, రతిరాజు తన పదునైన పూలబాణాలతో నా హృదయాన్ని కదలించి విదలించి వేస్తున్నాడు. ఆ బాధ భరింపలేక నీ పాదపద్మాల దాపుకు పరుగెత్తుకొని వచ్చాను. నీ ఆధిపత్యం పటుత్వం ప్రదర్శించి నన్ను కాపాడు.

వ. అదియునుం గాక నాతోడి సవతు లెల్లను భవత్కృపా విశేషంబున గర్భాధానంబులు వడసి నిర్భరానందంబున నుండం జూచి శోకవ్యాకులితచిత్తనై యున్న నన్ను రక్షించుట పరమ ధర్మంబు; నీవు విద్వాంసుండవు; నీ యెఱుంగని యర్థంబు గలదే? నీ వంటి మహానుభావు లయిన సత్పురుషు లార్తులైనవారి కోర్కులు వ్యర్థంబులు గాకుండా దీర్చుట ధర్మం బని వెండియు నిట్లనియె. 453

* అంతేకాక, నాతోడి సవతులు అందరు నీ కృపవల్ల గర్భవతులై ఎంతో సంతోషంతో ఉన్నారు. నేనే శోకంతో వ్యాకులమైన మనస్సుతో అలమటిస్తున్నాను. ఆర్తురాలనైన నన్ను రక్షించటం నీకు పరమ ధర్మము. నీవు విద్వాంసుడవు; నీకు తెలియని విషయం ఏముంది? నీ

వంటి సత్పురుషులైన మహానుభావులకు నా వంటి ఆర్తులను రక్షించి వారి కోరికలు సఫలం చేయుటంకంటే ధర్మం మరేముంది - అని మళ్లీ ఇట్లా అన్నది.

క. పతి సమ్మానము వడసిన
సతులకు నభిమత పదార్థ సంసిద్ధియు నూ
ర్జిత యశముఁ గలిగి లోక
స్తుతమై చెలువారుచుండుఁ జువ్వె మహాత్మా! 454

* మహానుభావా! పతి గౌరవం సంపాదించిన సతులకు కోరిన కోరికలు తీరుతాయి. గొప్పకీర్తి కలుగుతుంది. అటువంటివారు లోకుల పొగడ్తలను అందుకుంటారు.

క. తన ధర్మపత్ని వలనను
మునుకొని తాఁ బుత్త్రరూపమున నుదయించున్
విను దీపమందు ముట్టిం
చిన దీపము రెండు గావె? శిఖి యొక టయ్యున్. 455

* మహాత్మా! అగ్నిశిఖ ఒకటే అయినప్పటికీ, దీపముతో ముట్టించిన దీపము రెండు దీపములు అయినట్లు, పురుషుడు తన భార్యయందు పుత్రరూపంలో జన్మిస్తాడు.

క. కావున నీ యర్థము "యా
త్మా వై పుత్త్ర" యని వేదతతులం దోలిన్
వావిరిఁ బలుకఁగ వినవే
ధీవర! ననుఁ గావు మధికదీనం గరుణన్. 456

* ఈ విషయాన్నే "ఆత్మస్వరూపుడైన తానే కుమారుడై జన్మిస్తాడు" అని వేదాలు చెబుతున్నాయి. ఇది నీకు తెలియని విషయం కాదు. మతిమంతుడా! అతి దీనచిత్తనైన నన్ను కరుణతో కాపాడు.

చ. వరకరుణామతిన్ దుహితృవత్సలతం దనరారు నట్టి మ
ద్గురుఁ డొకనాఁడు మమ్ముఁ దన కూఁతుల నందఱఁ బిల్చి మీ మనో
హరు నెఱిఁగింపుఁ డిత్తుఁ గమలాననలార! య టన్న నందులోఁ
బురుషవరేణ్య! యేము పదుమువ్వుర మర్మిలి నిన్ వరింపమే! 457

* ఓ పురుషపుంగవా! దయాదాక్షిణ్యవంతుడైన మా తండ్రి దక్ష ప్రజాపతికి ఆడపిల్లలంటే ఎంతో అభిమానం. ఆయన ఒకనాడు కూతుళ్ల నందరిని పిల్చి "అమ్మలారా! మీ మనస్సుకు ఇష్టమైన భర్తలను కోరు కొనండి. ఇచ్చి పెండ్లి చేస్తాను" అని అడిగాడు. అప్పుడు మేము పదమూడుమందిమీ నీ పేరు చెప్పి నిన్నే వరించాము కదా!

క దితి యీ గతిఁ గామవిమో
హితమతి బహువచనముల హృదీశునిఁ బలుకన్
ధృతిఁ గృపణఁ బతివ్రత నిజ
సతిఁ గని కశ్యపుఁడు పలికె సల్లాపమునన్. 458

* అంటూ, కామసమ్మోహితమతి అయిన దితి దీనంగా పలు మారులు ప్రార్థించింది. అప్పుడు ధృతిమంతుడైన కశ్యపుడు ఆర్తురాలు, పతివ్రత, ఆత్మసతి అయిన దితిని అనునయిస్తూ ఈ విధంగా అన్నాడు.

వ. నీవు సెప్పినయట్లు పురుషులకు నంగనల వలన ధర్మార్థ కామంబులు సిద్ధించుఁ; గర్ణధారుండు నావచేతం బయోధిఁ గడచు చందంబున గృహమేధి సర్వాశ్రమవాసుల నరసి రక్షించుచు నిజాశ్రమంబున వ్యసనార్ణవంబుఁ దరియించు; భార్య పురుషు నందు నర్ధంబు; భార్యయందు సకల గృహకార్య భారంబునుం జేర్చి పురుషుండు నిశ్చింతుండై సుఖియించుచుండు; మఱియు నితరాశ్రమదుర్జయంబులైన యింద్రియశత్రు వర్గంబుల భార్యా సమేతుండైన గృహస్థుండు దుర్గాధిపతియైన రాజు శత్రు సంఘం

బుల జయించు చందంబున లీలామాత్రంబునం జయించుః నిట్టి కళత్రంబునకుం బ్రత్యుపకారంబు సేయ సకల గుణాభిరాములగు సత్పురుషులు నూఱేండ్లకును జన్మాంతరంబులకునైన సమర్థులు గా రనిన మము బోఁటివారలు సేయనోపుదురే? అయిన నీ మనంబునం గల దుఃఖంబు దక్కు మని యిట్లనియె. 459

* నీవు చెప్పినట్లే పురుషులకు స్త్రీలవల్లనే ధర్మార్థ కామ మోక్షాలు సిద్ధిస్తాయి. నావికుడు తన నావతో సముద్రాన్ని తాను దాటటమే కాకుండా ఇతర ప్రయాణికులనుకూడా దాటించినట్లు గృహస్థుడు తన గృహస్థాశ్రమం ద్వారా తాను తరిస్తూ ఇతర ఆశ్రమవాసులను కూడ తరింపజేస్తూ ఉంటాడు. అటువంటి గృహస్థునిలో భార్య అర్ధభాగం; అటువంటి అర్ధాంగియందు తన గృహకృత్యాల భారమంతా ఉంచి పురుషుడు నిర్విచారంగా తక్కిన సుఖం అనుభవిస్తాడు.

ఇంతేకాక ఆశ్రమవాసులు జయింపలేని ఇంద్రియా లనే శత్రువులను సతీసమేతుడైన గృహస్థుడు దుర్గాధిపతియైన భూపతి శత్రుసమూహాలను జయించినట్లు అవలీలగా జయిస్తాడు. అటువంటి భార్యకు ప్రత్యుపకారం చేసి ఋణం తీర్చుకోడానికి సమస్త సుగుణవంతులైన సత్పురుషులకు సైతం నూరేండ్లకుగానీ, జన్మజన్మాలకుగానీ సాధ్యంకాదు. అటువంటప్పుడు మావంటివాళ్లకు ఎట్లా సాధ్యమవుతుంది? ఇక నీ మనస్సులోని దుఃఖాన్ని విడిచిపెట్టు. అని కశ్యపుడు ఇంకా ఇట్లా అన్నాడు.

తే. తరళలోచన! నీవు సంతానవాంఛఁ
జేసి వచ్చితి, వౌఁ గులశీలవర్త
నములు గల భార్య మనమున నమరు కోర్కిఁ
దవిలి తీర్చుట పతికిఁ గర్తవ్య మరయ. 460

* కాంతామణీ! నీవు సంతానవాంఛతో నా చెంతకు వచ్చావు. గుణవంతురాలూ, శీలవంతురాలూ అయిన ఇల్లాలి మనస్సులోని కోర్కె తీర్చడం భర్తకు అవశ్యకర్తవ్యం.

మ. తరుణీ: యొక్క ముహూర్తముండు: మిది సంధ్యాకాల: మిక్కాలమం
దరయన్ భూతగణావృతుం డగుచుఁ గామారాతి లీలన్ వృషే
శ్వరయానంబున సంచరించుట: నభావ్యంబయ్యె: నీ యుగ్రవే
ళ రమింపంగ నిషిద్ధకర్మ మగు: నేలా ధర్మమున్ వీడఁగన్. 461

* తరుణీమణీ! ముహూర్తకాలం ఆగు. ఇది సంధ్యాసమయం. ఇప్పుడు కామునికి శత్రువైన త్రినేత్రుడు వృషభేంద్ర వాహనంపై భూత గణాలతోకూడి విహరిస్తూ ఉంటాడు. కాబట్టి ఈ సమయం మంచిది కాదు. ఈ ఉగ్రవేళలో కలయిక నిషేధింపబడింది. ఎందుకు ధర్మాన్ని అతిక్రమించాలి? ఒక్క ముహూర్తకాలం ఆగు.

మ. అరవిందానన: వీఁడె నీ మఱఁది: లీలాటోప రుద్రక్షమా
చర ఝుంఝూనిల ధూతపాంసు పటలచ్ఛన్నుండు, ధూమ్రైకదు
ర్భర విద్యోతిత కీర్ణ భీషణ జటా బద్ధుండు, భస్మావలి
ప్త రుచిస్ఫార సువర్ణ వర్ణుఁ డగుచున్ భాసిల్లు నత్యుగ్రుఁడై. 462

* కమలాక్షీ! అడుగో అటు చూడు! నీ మరది రుద్రుడు రుద్రభూమినుండి సుడిగాలులవల్ల చెలరేగిన ధూళితో నిండిన నెమ్మేను కలవాడై కావిరంగుచే ప్రకాశిస్తూ భయంకరంగా చెదరి కదలుతున్న జటాజూటంతో, తెల్లని విభూతి పూతలతో బంగారుకాంతులతో వెలిగిపోతున్నాడు.

క. అనల సుధాకర రవి లో
చనముల వికసింపఁజేసి సమధికరోషం
బునఁ జూచుచున్న వాఁ డదె
వనితా: బంధుత్వ మరయ వలవదు సుమ్మీ: 463

* అగ్ని, చంద్రుడు, సూర్యుడు ఆ రుద్రుని నేత్రాలు. ఆ త్రినేత్రుడు ఆ కన్నులు పెద్దవిచేసి మనవైపు అధిక రోషంతో చూస్తున్నాడు. ఆయన మన బంధువేకదా అని భావించవద్దు సుమా!

క. అతనికిఁ దలపోయ హితా
హితులును సన్మాన్యులును విహీనులు నతిగ
ర్హితులును లేఁ రీశుఁడు సమ
మతియును నిఖిలైక భూతమయుఁడై యుండన్. 464

* ఆయనకు మిత్రులూ, శత్రులూ, మాన్యులూ, సామాన్యులూ, నచ్చినవారూ, నచ్చనివారూ అనే భేదం లేదు. రుద్రుడు సమబుద్ధి కల వాడు, సర్వప్రాణుల్లోనూ తానే అంతర్యామిగా ఉండేవాడు.

క. కావున మద్భ్రాత భవ
దేవరుఁ డని తరుణి! నీ మదిం జూడకు; మా
దేవాదిదేవుఁ డ్రిజగ
త్పావను నిఖిలైకనేత భగవంతు హరున్. 465

* తరుణీ! మా సోదరుడైన ఆ దేవదేవుని మరదిగదా అని మన స్సులో భావించకు. ఆయన సర్వేశ్వరుడు. పరాత్పరుడు. త్రిలోక పావనుడు. పాపహరుడు.

వ. ఏమును సత్పురుషులైన విజ్ఞానవంతులును భుక్తభోగంబై దూరతోన్యస్తంబైన పుష్పమాలికయుంబోలె నమ్మహాత్ముని చరణారవింద వందనాభిలాషిణియైన యవిద్యాదేవి ననుసరించి వర్తింతుము. అదియునుంగాక. 466

* మేముగాని, సత్పురుషులైన ఎటువంటి విద్వాంసులుగాని - ఆ మహాత్ముని అవిద్యారూపమైన మాయకు లోబడి ప్రవర్తిస్తుంటాము. ఆ మాయకూడా అనుభవించి విడిచిన పుష్పమాలికవలె దూరంగా ఉండి కూడా ఆ మహాత్ముని పాదపద్మాలను సేవించాలనే ఆసక్తి కలిగిఉంటుంది. అటువంటి మాయాదేవిని అనుసరిస్తూ మేము ఉంటాము. ఇంతేకాదు; ఇంకా విను.

సీ. ఎవ్వని కరుణ బ్రహ్మేంద్రాది దిక్పాల
వరు లాత్మ పద వై భవములఁ దనరి
రెవ్వని యాజ్ఞ వహించి వర్తించును
విశ్వనేత్రి యగు నవిద్య యెపుడు
నెవ్వని మహిమంబు లిట్టి వట్టివి యని
తర్కింపలేవు వేదంబు లయిన
నెవ్వని సేవింతు రెల్లవారును సమా
నాధికరహితుఁడై యలరు నెవ్వఁ

తే. డట్టి దేవునిఁ ద్రిపురసంహారకరుని
నస్థిమాలాధరుండు భిక్షాశనుండు
భూతిలిప్తాంగుఁ డుగ్రపరేతభూమి
వాసుఁడని హాస్య మొనరించువారు మఱియు. 467

* ఎవని అనుగ్రహంవల్ల బ్రహ్మ, ఇంద్రాది దిక్పాలకులు, తమ తమ పదవులను అధిష్ఠించి అతివై భవంగా ఉంటున్నారో, ఎవని ఆజ్ఞకు లోబడి ఈ సమస్త ప్రపంచానికి రాణి అనదగిన మాయ ఎల్లప్పుడూ ప్రవర్తిస్తూఉంటుందో, ఎవని గొప్పదనాన్ని "ఇటువంటిది అటువంటిది" అని వేదాలుకూడా నిరూపించలేవో, ఎవనిని అందరూ సేవిస్తారో ఎవడు తనతో సాటివారూ, తనకంటె మేటివారూ లేనివాడో అటువంటి దేవదేవుని, త్రిపు రాసుర సంహరుని, హరుని, అస్థిమాలాధరుడనీ, అది భిక్షువనీ, బూడిద పూసుకొనేవాడనీ, శ్మశానవాసి అనీ అపహాస్యం చేసేవారు పరమ నిర్భా గ్యులు.

క. ధర శునకభోగ్యమును నిహ
పర దూరము నైన తనువు పాథేయముగా
నెఱి నమ్మి వస్త్రమాల్యా
భరణంబు లలంకరించు పామరజనులున్. 468

క. ఘననిర్భాగ్యులుగా మదిఁ
గను మని యీ రీతిఁ బ్రియకుఁ గశ్యపుఁ డెఱిఁగిం
చిన దితి గ్రమ్మఱఁ బలికెను
మనసిజసాయక విభిన్న మానస యగుచున్. 469

* కుక్కలకూ నక్కలకూ ఆహారం కాదగినదీ, ఇహపరాలకు దూరం అయినట్టిదీ అయిన శరీరాన్ని శాశ్వతమని నమ్ముకొని, దానిని వస్త్రాల తోనూ, పూలదండలతోనూ, ఆభరణాలతోనూ అలంకరించుకొనే మూర్ఖులు పరమ దౌర్భాగ్యులని తెలుసుకో" అని తన ప్రియసతి అయిన దితికి కశ్య ప్రజాపతి తెలిపాడు. కాని ఆమె మన్మథుని బాణాలచే దెబ్బతిన్న మనస్సు కలదై మళ్ళీ కశ్యపునితో ఏమేమో అన్నది.

క. మునుకొని లజ్జావనత వ
దనయై ప్రాణేశు కొంగుఁ దాలిమి దూలం
బెనఁగొనియె వారకామిని
యనువున వినిషిద్ధకర్మమం దభిముఖియై. 470

* దితి తన పట్టు వదలకుండా సిగ్గుతో తలవంచుకొని, ఇది తగని పని అనికూడా అనుకోకుండా సహనం కోల్పోయి వారకాంతలాగా కామో త్కంఠతో పతివస్త్రం పట్టుకొని లాగింది.

వ. ఇట్లుచేసిన భార్యానిర్బంధంబునకుం దొలంగ నేరక యీశ్వరునకు నమస్కారం బొనరించి యేకాంతంబున నిజకాంతా సంగమంబును జేసి విరజంబును సనాతనంబునునైన బ్రహ్మ గాయత్రి జపియించె నంత. 471

* ఇట్లు ఇల్లాలు నిర్బంధింపగా వదలించుకోలేక, కశ్యపప్రజాపతి ఈశ్వరునకు నమస్కారం చేసి ఏకాంతంగా తన కాంత కోరిక తీర్చాడు. వెంటనే కాళ్లుచేతులు కడుగుకొని స్నానంచేసి ప్రాణాయామ పూర్వకంగా, శాశ్వతమూ పరమ పవిత్రమూ అయిన బ్రహ్మగాయత్రీ మంత్రాన్ని జపించాడు.

క. దితియును నిషిద్ధకర్మ
స్థితికై మదిలోన సిగ్గు చిట్టాడఁగ నా
నతవదన యగుచు నా పశు
పతివలని భయంబు గల్గి పరమప్రీతిన్. 472

వ. కశ్యపుం గనుఁగొని యిట్లనియెః సమస్తభూతపతియైన పరమేశ్వరుండు నా చేసిన యపరాధంబు సహించి మద్గర్భపరిపాలనంబు సేయుంగాక! రుద్రుండును మహాత్ముండును స్వయంప్రకాశుండును నలంఘ్యుండును సకామజన ఫల ప్రాపకుండును నిష్కామజన మోక్షప్రదుండును న్యస్తదండుండును ధృతదండుండును దుష్టశిక్షకుండును బరమాత్ముండును జగదంతర్యామియు నిర్గుణుండును నిష్కాముండును భక్తసులభుండును భగవంతుడును నగు నప్పరమేశ్వరునకు నమస్కరించెద మఱియు షడ్గుణైశ్వర్య సంపన్నుండును జగద్భర్తయు మహానుగ్రహశీలుండును నిర్దయ పరిపాల్య వధూరక్షకుండును సతీదేవీపతియు నైన యా సర్వేశ్వరుండు నన్ను రక్షించుంగాత మని సన్నుతించి. 473

* దితికూడ కూడనిపని చేసినందుకు మనస్సులో సిగ్గు అగ్గలించగా తల వంచుకొన్నది. పశుపతియైన రుద్రుడు ఏమి చేస్తాడో అనే సంశయంతో భయంతో కశ్యపుణ్ణి చూచి ఎంతో ప్రియంగా ఇట్లా అన్నది. సర్వభూత సంరక్షకుడైన పరమేశ్వరుడు నేను చేసిన అపరాధాన్ని క్షమించి నా గర్భాన్ని రక్షించుగాక! రుద్రుడు దయాసముద్రుడు. మహానుభావుడు, స్వయంప్రకాశుడు. ఆయన అనుజ్ఞ దాటరానిది. ఆయన కోరికలు కల వారికి కోరికలు తీరుస్తాడు. కోరికలు లేనివారికి మోక్షాన్ని అనుగ్రహిస్తాడు. దుండగులను దండిస్తాడు. ధర్మదండాన్ని ధరిస్తాడు. దుర్జన శిక్షకుడూ, పరమాత్ముడూ, సర్వవ్యాపకుడూ, నిర్గుణుడూ, నిష్కాముడూ, భక్తసులభుడూ, భగవంతుడూ ఐన పరమేశ్వరునికి నమస్కరిస్తున్నాను. షడ్గుణైశ్వర్య సంపన్నుడూ జగన్నాథుడూ, అపార కృపామయ హృదయుడూ, అత్యంత చింతాక్రాంతలైన కాంతలను కటాక్షించేవాడూ, సతీదేవి వల్లభుడూ అయిన సర్వేశ్వరుడు నన్ను మన్నించుగాక అని సన్నుతించింది.

క. అర్భకులు లేని దగుటను
గర్భము నిజనాథువలనఁ గమలానన కా
విర్భూతమైనఁ గర్మ వి
నిర్భరపరితోష మాత్మ నెలకొని యుండెన్. 474

* ఆ దితి సంతానము లేనిది కాబట్టి తన వల్లభునివల్ల తనకు గర్భం నిలిచినందుకు మనస్సులో ఎంతగానో సంతోషించింది.

వ. అంతఁ గశ్యపుండు దత్కాలసముచిత సంధ్యావందనంబులు దీర్చి. 475

క. ఆ చెలికి గర్భచిహ్నము
లేచినఁ బరితోష మాత్మ నేపారక మా
రీచుండు నిజతలోదరిఁ
జూచి యకర్మమున కాత్మ స్రుక్కుచుఁ బలికెన్. 476

* కశ్యప ప్రజాపతి ఆ సమయానికి చేయవలసిన సంధ్యావందనం ముగించుకున్నాడు.

తన భార్యకు గర్భం నిలిచినందుకు ఆయన ఆనందింపలేదు. చేయరానిపని చేసినందుకు మనస్సులో ఎంతగానో చింతిస్తూ తన కాంతను చూచి ఇలా అన్నాడు.

మ. సతి! నీ వే గతి నింద కోడక మనోజాతేక్షు కోదండని
ర్గత నారాచ పరంపరాహత విశీర్ణ స్వాంతవై పాప సం
గతి లజ్జాభయ ధర్మముల్ విడిచి దుష్కాలంబునందే రమిం
చితి బల్మిన్ వెలయాలికైవడిని దుశ్శీల క్రియాలోలతన్. 477

* సతీ! నీవు మన్మథుని చెరుకువింటి నుంచి వెలువడిన పదునైన బాణపరంపరల ధాటికి తట్టుకోలేక చెదరిన హృదయం కలదానివై లోక నిందకు జంకక సిగ్గూ భయమూ విడిచిపెట్టి, అకాలంలో బలవంతంగా వెల యాలివలె వ్యామోహానికి లొంగిపోయి సంగమించావు.

వ. అట్లగుటం జేసి. 478

క. సతి! విను భూతగణ ప్రే
రితులై రుద్రానుచరులు పృథుశక్తి సమ
న్వితు లుగ్రకర్ము లతిశౌ
ర్యతములు భద్రానుభద్రు లను నామములన్. 479

క. పరఁగిన దర్పోద్ధతు లి
ద్దఱు కొడుకులు నీకుఁ బుట్టి ధరణికి ౹వేఁగై
నిరతము బుధజనపీడా
పరులై వర్తింతు రాత్మబలగర్వమునన్. 480

* అందువల్ల సుందరీ! విను. భూతగణాలచే ౹పేరేపింపబడిన వారై రుద్రుని అనుచరులు భద్రుడు-అనుభద్రుడు అనే వారిద్దరూ నీకు కుమారులై జన్మిస్తారు. మిక్కిలి శక్తిసంపన్నులూ భయంకరమైన కార్యాలు చేసేవారూ మహాబలవంతులూ అతి గర్విష్ఠులూ అయిన వారిద్దరూ తమ పరాక్రమాటోపంతో నిరంతరమూ సజ్జనులను బాధించుతూ భూమికి భారభూతు లౌతారు.

తే. అట్టి దుష్కర్ములకును మహాత్ము లలిగి
విశ్వవిదుఁ డైన హరికిని విన్నవింప
నతఁడు కోపించి హరి కులిశాయుధమున
గిరుల నఱకిన గతి వారి ధరణిఁ గూల్చు. 481

* అటువంటి దుష్కర్ముల దుండగాలకు మహాత్ములు సహించలేక పోతారు. వారు సర్వజ్ఞుడైన హరికి వీరి ౹కూరకృత్యాలు విన్నవించుకుంటారు. ఆయన ఆ౹గహించి ఇంద్రుడు వజ్రాయుధంతో కొండలను ఖండించినట్లు ఆ దుర్మార్గులను హతమారుస్తాడు.

క. అని కశ్యపుఁ డెఱిఁగించిన
విని దితి భయమంది చాల విహ్వలమతియై
తన హృదయేశు ముఖాబ్జముఁ
గనుఁగొని యిట్లనియె విగతకౌతుక యగుచున్. 482

* ఈ విధంగా తన పతి అయిన కశ్యపప్రజాపతి చెప్పగా విని దితి ఎంతో భయపడింది. చాల ఆందోళన చెందింది. వెలవెలపోతున్న ముఖంతో భర్త ముఖపద్మం వైపు చూస్తూ ఇట్లా అన్నది.

చ. ధర సుజనాపరాధు లగు తామసచిత్తుల కెందు నాయువున్
సిరియు నశించిపోవుఁ మృతి సేకుఱు శత్రులచేతఁ నింతయా
నరయఁగ నిక్కువంబు భవదాత్మజు లార్యుల కెగ్గుసేయ భూ
సురుల క్రుధాగ్ని పాల్పడక శోభనమౌ హరిచేతి పంచతన్. 483

* స్వామీ! సజ్జనులకు అపకారం చేసే తమోగుణ ప్రవృత్తులైన మదోన్మత్తులకు తప్పకుండా ఆయువూ, సంపదలూ నశిస్తాయి. శత్రువులు చేతులలో వారికి మృత్యువు తప్పదు. ఇది ముమ్మాటికీ వాస్తవం. మన కుమారులు ఆర్యులకు అపరాధం చేసినందువల్ల ఆ బ్రాహ్మణుల కోపాగ్నికి బలికాకుండా, భగవంతుడైన శ్రీహరి చేతులలో మరణించడ మనేది మహా భాగ్యం.

చ. అనవుడుఁ గశ్యపుండు గమలానన కిట్లను నింతిఁ నీవు చే
సిన విపరీత కర్మమునఁ జేకుఱె నిట్టి యవస్థఁ దీనికిన్
మనమునఁ దాప మొందకుముఁ మాధవు పాదసరోజయుగ్మ చిం
తనమునఁ జేసియున్ నను ముదంబునఁ గొల్చుటఁ జేసియుం దగన్. 484

* దితి మాటలు విని కశ్యపుడు ఆ కమలముఖితో ఇట్లా అన్నాడు. ఇంతీ! నీవు చేసిన విపరీతకార్యం వల్ల ఇటువంటి దురవస్థ వచ్చింది. దీని కోసం నీ మనస్సులో పరితపించవద్దు. శ్రీపతి పాదపద్మాలను భావించు. నన్ను సంతోషంతో సేవించు.

తే. రమణిఁ నీ సుతులందు హిరణ్యకశిపు
వలన నుదయించువారిలోపల ముకుంద
పదసరోజాత విన్యస్త భావుఁ డైన
తనయుఁ డుదయింపఁ గలఁ డతిధార్మికుండు. 485

* రమణీ! విను. నీ కొడుకులలో హిరణ్యకశిపుడు అనే వానికి పుట్టే సంతానంలో నుంచి ధర్మబుద్ధిగలవాడూ, హరిచరణ సరోజాలమీద సంసక్తమైన భావం కలవాడూ అయిన ఒక కొడుకు జన్మిస్తాడు.

వ. మఱియును 486

క. ఘనపుణ్యుం డన్వయ పా
వనుఁ డగు నప్పుణ్యతముని వరకీర్తి లతల్
వనజభవాండోదర మె
ల్లను నిండఁగఁ బర్వు బుధలలాముం డగుటన్. 487

* అంతేకాదు, మహాపుణ్యాత్ముడూ, వంశపావనుడూ, బుధజన శ్రేష్ఠుడూ అగుటవల్ల ఆ మహామహుని కీర్తిలతలు బ్రహ్మాండ భాండ మంతటా వ్యాపిస్తాయి.

తే. వామలోచన ! వినుము దుర్వర్ణ హేమ
మగ్ని పుటమునఁ బరిశుద్ధ మై వెలుంగు
నట్లు, దుష్టాత్మ సంభవుఁడయ్యు వంశ
పావనుం డగు హరిపాదభక్తుఁ డగుట. 488

* వాల్గంటీ ! అతడు దుర్మార్గుడైన హిరణ్యకశిపుని పుత్రుడే అయి నప్పటికీ శ్రీ హరి పాద భక్తుడు కావటం వల్ల మలినవర్ణం గల బంగారు అగ్నిలో పరిశుద్ధమై సువర్ణమైనట్లు, వంశాని కంతా వరమపవిత్రు డౌతాడు.

తే. అంచితాష్టాంగయోగ క్రియాకలాపు
లైన యోగీశ్వరులు నమ్మహానుభావు
నతులశీల స్వభావ విజ్ఞాన సరణిఁ
దాముఁ జరియింప నాత్మలఁ దలఁతు రెపుడు. 489

* శ్రేష్ఠమైన అష్టాంగ యోగక్రియా ప్రయోగాలలో ఆరితేరిన మహా యోగీశ్వరులు సైతం ఆ మహానుభావుని సత్ప్రవర్తనకూ, సాధు శీలానికీ మురిసిపోయి ఆయన అడుగు జాడలలో తాము కూడా నిత్యము నడవాలని మనస్సులలో కోరుకుంటారు.

ఉ. ఆ మహితాత్మకుండు సుగుణాంబుధి భాగవతోత్తముండు, ల
క్ష్మి మహిళాధినాథుఁ దులసీదళదాముఁ బరేశు నాత్మ హృ
త్తామరసంబునందుఁ బ్రమదంబున నిల్పి తదన్య వస్తువుం
దా మదిలో హసించు హరిదాస్య విహార వినిశ్చి తాత్ముఁడై. 490

* భగవద్భక్తులలో అగ్రగణ్యుడూ, సద్గుణాలకు సముద్రం వంటి వాడూ, మహితాత్ముడూ అయిన ఆ మహానుభావుడు తన హృదయ కమలంలో లక్ష్మిమనోహరుని, తులసీదామధరుని, పరాత్పరుని సంతోషంగా నిరంతరం నిలుపుకొని ఆ శ్రీహరి సేవామార్గంలోనే జీవితమంతా నడవాలని నిశ్చయించుకొన్నవాడై లౌకికములైన వస్తువులను చులకనగా చూస్తుంటాడు.

వ. అట్టి నీ పౌత్రుండు. 491

సీ. మహిత దేహాద్యభిమానంబు దిగనాడి
చిరతరాలంపట శీలుఁడగుచుఁ
బరసమృద్ధికి నాత్మఁ బరితోష మందుచుఁ
బరదుఃఖమునకుఁ దాపమునుబొందు
నీ విశ్వ మంతయు నే విభుమయ మని
యెవ్వని కరుణచే నెఱుఁగనయ్యె
నట్టి యీశ్వరునిఁ దా నాత్మసాక్షిగ మోద
మడరంగఁ జూచు ననన్యదృష్టి

నతినిదాఘోగ్ర సమయంబునందు నిఖిల
జంతు సంతాప మడఁగించు చంద్రుమాడ్కి
నఖిలజగముల దుఃఖంబు లపనయించు
రూఢి నాతఁ డజాతవిరోధి యగుచు. 492

* అటువంటి నీ మనుమడు శరీరాదులపై అభిమానం లేనివాడై వైరాగ్యంతో కూడినస్వభావం కలవాడై ఇతరుల అభివృద్ధికి సంతోషిస్తూ,

అట్లే ఇతరుల దుఃఖానికి సంతాపం చెందుతూ ఉంటాడు. ఈ విశ్వం సమస్తమూ భగవన్మయ మని భావిస్తాడు. అటువంటి భావన భగవంతుని దయవల్లనే కలిగిందని విశ్వసిస్తాడు. అటువంటి భగవంతుణ్ణి సంతోషంతో తదేక దృష్టితో, ఆత్మసాక్షిగా దర్శిస్తాడు. భయంకరమైన ఎండాకాలంలో సర్వజీవులకు తాపాన్ని పోగొట్టే చంద్రునిలా సమస్త జీవుల సంతాపాన్ని పోగొడతాడు. ఆయనకు శత్రువు అనే వాడు ఉండనే ఉండడు.

వ. మఱియు హరిధ్యాన నిష్ఠాగరిష్ఠుం డగు నమ్మహాభాగవతాగ్రగణ్యుండు. 493

క. విమలాంతరంగ బహిరం
గములను స్వేచ్ఛానురూప కలితుండగు నా
కమలాధీశ్వరు కుండల
రమణీయ ముఖంబుఁ జూచుఁ బ్రమదం బెసఁగన్. 494

* ఇంతేకాదు; శ్రీహరి ధ్యానంలో అత్యంతమైన నిష్ఠకలవాడై భగవద్భక్తులలో అగ్రగణ్యుడై లోపలా వెలుపలా సృష్టి అంతటా తాను భావించిన భగవంతుని రూపాన్ని స్వేచ్ఛగా చూడగలుగుతాడు. మకర కుండలాలతో మనోహరమైన ఆ లక్ష్మీవల్లభుని ముఖాన్ని సంతోషంగా సందర్శిస్తాడు.

తే. మఱియు నీ విశ్వ మా హరిమయముగాఁగ
మనము లోపలఁ దలఁచు నమ్మునినిభుండు
మను మహాత్ములలోన నీ మనుమఁ డధికుఁ
డనఁగ నుతికెక్కు నంచుఁ గశ్యపుఁడు వలుక. 495

* మనువుతో సమానుడైన ఆ మహానుభావుడు తన మనస్సులో ఈ ప్రపంచమంతా హరిమయంగా తలంచుతాడు. మరియూ మహాత్ములందరిలో నీ మనుమడు మహనీయుడై కీర్తి పొందుతాడు అని కశ్యపుడు పలికాడు.

క. విని తన తనయులు మధుసూ
దనుచే హతు లగుదు రనుచుఁ దన మనుమఁడు స
జ్జననుత భాగవతుం డగు
ననుచు మదిం జాల దుఃఖహర్షము లొదవన్. 496

* కశ్యపప్రజాపతి పలుకులు విన్న దితి తన కొడుకులు విష్ణువు చేతిలో మరణిస్తారన్న మాటకు విచారించింది. తన మనుమడు పరమ భాగవతుడై సజ్జనులకు సంస్తవనీయు డౌతాడన్న మాటకు ఎంతో సంతోషించింది.

వ. ఉండునంత నా దితియుఁ గశ్యపవీర్య సంభృతంబైన గర్భంబు దుర్భర తేజోభిరామంబును నన్యతేజోవిరామంబును దినదినప్రవర్ధమానంబును నై నివ్వటిల్ల నిజోదరస్థితులైన కుమారు లమరదమనులై వర్తింపఁగల రని చింతించుచు గర్భంబు శత వర్షంబులు ధరియించి యున్న యనంతరంబ. 497

* ఈ విధంగా కశ్యపుని వీర్యంతో నిండిన దితి గర్భం భరింపరాని తేజస్సుతో దేదీప్యమానంగా ప్రకాశించుతూ అన్యతేజస్సులను అతిశయించుతూ దినదినమూ అభివృద్ధి పొందుతూ ఉంది. దితి తన కడుపులోని కుమారులు దేవతలను తిరస్కరించగలరని తలపోస్తూ నూరేండ్ల పర్యంతం ఆమె తన గర్భాన్ని ధరించి ఉన్నది.

*

TIRUPATI
36198